మహాభారతము

విరాటపర్వము

(వేదవ్యాసకృతికి యథామూల గద్యాంధ్రానువాదము)
(VERBATIM TRANSLATION)

అనువాదకులు :

కప్పగంతుల లక్ష్మణశాస్త్రి

సంపాదకురాలు :

శ్రీమతి డా॥ కె. కమల
రీడర్, సంస్కృత విభాగము,
ఉస్మానియా విశ్వవిద్యాలయము,
హైదరాబాదు.

మొదటి ముద్రణ : సెప్టెంబర్ - 1991

కవరు డిజైను : శ్రీ శీలా వీర్రాజు

వెల: రూ. 35/-

పబ్లిషర్ :
శ్రీమతి కప్పగంతుల అన్నపూర్ణమ్మ
16, తుల్జాగుడా
మోజంజాహీమార్కెటు
హైదరాబాదు - 500001
ఫోను - 557212

ముద్రణ :
పద్మావతీ ఆర్ట్ ప్రింటర్స్,
1-1-517/B/1, న్యూ బాకారం,
గాంధీనగర్, హైదరాబాద్-500 380.
ఫోన్ : 68413



అనువాదకులు
కీ॥ శే॥ కప్పగంతుల లక్ష్మణశాస్త్రి



శ్రీమతి కప్పగంతుల అన్నపూర్ణమ్మ
(శాస్త్రిగారి సతీమణి)

ముందు మాట

పరమ పావని భారతీ కృపా విశేషము వలన కీర్తిశేషులు మా నాయనగారు బ్రహ్మశ్రీ కప్పగంతుల లక్ష్మణ శాస్త్రిగారు తెలుగు వచనములోని కనువదించిన వ్యాస భారతము యొక్క ఆది - సభాపర్వములు సెప్టెంబర్ 1990 లో ముద్రణ నొందినవి. అనువాదము యథామూలము, మధురము, సులభ గ్రాంథిక మార్గములో సాగినందుకు పండిత పామరులను, పాత్రికేయులను సమముగా ఆకట్టుకొన్నది. ప్రజలు చూపించిన ఈ ఆదరణ ఫలమే ఇప్పుడు మేము అందించు విరాటపర్వ రూపములో మీ ముందున్నది. ఈ పర్వత్రయము ఇప్పుడు మహాభారత కథ అంటే చెవి కోసుకునే ఆంధ్రుల సొత్తు.

భారత కథ అంతటిలోనూ విరాటపర్వము మంగళకరము. ఇందు ప్రధాన కథ పాండవుల అజ్ఞాతవాసము. ఆ సమయములో జరిగిన కీచకవధ, దక్షిణ గోగ్రహణము, ఉత్తర గోగ్రహణము. ఉత్తరాకళ్యాణము వరకే పరిమితమై మంగళాంతమగుచున్నది. ఉపాఖ్యానములు, ఉపదేశములు, చర్చలు, ఇందులో లేనందున రసవత్తరమైన ఈ పర్వమునకు ఉత్తమ కావ్య లక్షణాలు అమరును ఇంతేకాక ఈ కథలో నాటకమున కనువయిన ధర్మములెన్నో ఉన్నవి. ఆంధ్రులలోనయితే ఆంధ్ర మహాభారతములోని విరాటపర్వమును పఠించిన వర్షము తప్పక కురుస్తుందని పదుమూడేండ్ల గడువు "నిండె, నిండె"నని అవితథవచనుడైన ధర్మరాజు పలుకులను పఠించిన, మేఘములు నీటితో నిండునని నమ్మకమున్నది. విరాటపర్వము అంత పుణ్యప్రదము.

ఇంత చక్కని కథను నాటక రూపములో మలచిన వారిలో ప్రాచీనుడు భాస మహాకవి ఒక్కడే. "పంచ రాత్రమ్" అనే మూడంకముల నాటిక ఈ కథను దృశ్య కావ్యంగా రూపొందించింది. ఆ నాటికలో దుర్యోధనుడొక యజ్ఞము చేసి దక్షిణను స్వీకరించమని ద్రోణాచార్యుని అభ్యర్థించగా పాండవులకు వారి రాజ్యభాగ్యా న్నిచ్చివేయమని ద్రోణుడు అడుగు. శకుని మంత్రాంగ ఫలితముగా, అయిదురాత్రుల కాలములో అజ్ఞాత వాసము చేయుచున్న పాండవుల జాడ తెలిసిన రాజ్యభాగము వారికిచ్చి వేతునని దుర్యోధనుడు ప్రతిజ్ఞ చేయును.

పాండవులను వెదకే ప్రయత్నములో ఉత్తర గోగ్రహణము జరుగుతుంది. (దక్షిణ గోగ్రహణ ప్రసక్తి ఇక్కడలేదు) అర్జునుని పరాక్రమమే అతనికి ఆన వాలు అవుతుంది. కౌరవ పక్షములో యుద్ధము చేయుచున్న అభిమన్యువును మహాకాయుడగు భీముడు భుజములపై మోసుకొని విరాటనగరమును ప్రవేశించును. కుమారుడు శత్రువులచేత చిక్కెనని కౌరవులు దుఃఖించెదరు. భీమార్జునుల వలన అభిమన్యువున కెట్టి ఆపద వాటిల్లదని భీష్మద్రోణులు చెప్తుతారు. మాటమేరకు దుర్యోధనుడు పాండవులకు రాజ్యభాగాన్ని ఇచ్చివేస్తాడు. ఉత్తరా కళ్యాణముతో కథ కంచికిపోతుంది.

మహాభారత కథకు భాసుడు చూపించిన ఒక ముగింపు ఇది. ఇందులో కవి చమత్కారమే హర్షదాయకము భాసుడు యుద్ధ పర్వాలు అక్కరలేదని చెప్పలేదు. దూత వాక్యము, దూత ఘటోత్కచము, కర్ణభారము, ఊరుభంగము మొదలైన నాటకాలన్నీ భాసుడు యుద్ధవర్ణనకు వినియోగించినవే గదా!

ఈ గ్రంథ ప్రచురణ ప్రయత్నమున కంతటికిని మూలము మా అమ్మగారు శ్రీమతి కప్పగంతుల అన్నపూర్ణమ్మగారి సంకల్ప బలము. వారు వ్యాస భాగవతాన్ని నిత్యము పారాయణము చేస్తున్నందు వలన కరుణించిన శ్రీకృష్ణ పరమాత్మ, నారాయణ కథాత్మకమయిన భారత సంహితను తెలుగు వారికొరకు వెలయింప జేయుచున్నారు. సందేహము లేదు.

మహాభారతము ఆదిపర్వము ఉపోద్ఘాతములో మా నాయనగారి సాహిత్య వ్యవసాయాన్ని, వ్యక్తిత్వాన్ని, ప్రతిభను సంగ్రహంగా తెలియజేసినాము - సభాపర్వ ప్రతిలో మహాభారతానికి ప్రామాణికమయిన ఉపోద్ఘాతాన్ని వ్రాసిన శ్రీ తిరుమల రామచంద్రగారు, తమకు మా నాయనగారితో గల మైత్రీ బంధానికి మరియొక ముడిని వేసినారు.

ఆది సభాపర్వముల తరువాత రావలసిన అరణ్యపర్వ ముద్రణను కొద్దిగా ముందుకు జరుపుట సంప్రదాయబద్ధమే యగును. అనతికాలములో అది గూడ ప్రకాశము నొందగలదని పాఠకులకు మనవి చేయుచున్నాము.

విరాటోద్యోగ పర్వములను జతగా ముద్రించగోరి మా నాయనగారు తమ అవతారికా పద్యములో "విరాటోద్యోగ యుగము" అని చెప్పినారు. ద్రవ్యము తగినంత సమకూడగనే అదిగూడ ముద్రించగలమని, సంస్కృత

మూలములో విస్తృతమయిన ఉద్యోగపర్వము యథాతథముగా పాఠకులకు లభించగలదని మనవి చేయుచున్నాము.

త్రికాలవేత్త, చిరంజీవియగు వేదవ్యాసుడు భారత సంహితను వెల యించిన పుణ్యమూర్తి. తెలుగు దేశములో ఆ గ్రంథమునకు జరుగుచున్న ఈ ప్రచారము వ్యాస భాస్కరున కొక నీరాజనమగు గాక!

గ్రంథ ప్రచురణకు అన్ని విధముల సహకరించిన పద్మావతీ ఆర్ట్ ప్రింటింగ్ ప్రెస్సువారు మూడు పువ్వులు ఆరుకాయలుగా సాహిత్య సేవలో పురోగతిని పొందవలెనని ఆశిస్తున్నాము. వారికి మా కృతజ్ఞతలు.

ఇదిగో అవధరించండి రసజ్ఞులీ కథను; "హృదయాహ్లాది చతుర్థమూర్జిత కథోపేతంబు నానారసాభ్యుదయోల్లాసి విరాటపర్వమట."

ఇట్లు
భారత భారతీ సేవకులు

శ్రీమతి కె. శారద — డా॥ కప్పగంతుల ప్రభాకరశాస్త్రి
శ్రీమతి కె. సత్యకుమారి — శ్రీ కప్పగంతుల కృష్ణమూర్తి
11-9-91 — డా॥ కమల

ప్రజోత్పత్తి వినాయక చతుర్థి

విషయసూచిక

శ్రీ

శ్రీ మహాగణపతయే నమః

శ్రీ శారదాయై నమః

శ్రీ వేదవ్యాసకృత మహాభారతము

యథా మూలాంధ్ర గద్యానువాదము

(విరాట పర్వము)

కం॥ ఇపు డేను విరాటోద్యో
గ పర్వయుగ మాంధ్రవచన కావ్యము వ్రాయన్
గృప గల వేంకటపతిపా
దపద్మములఁ దలచి పూనెదన్ భక్తిమెయిన్

శ్లో॥ నారాయణం నమస్కృత్య నరంచైవ నరోత్తమం ।
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయముదీరయేత్॥

భగవంతుడైన నారాయణుని, అనగా శ్రీకృష్ణమూర్తిని, ఆయనకు యెల్లప్పుడు మిత్రుడిగా ఉండి, మానవులలో శ్రేష్ఠుడగు 'నర' స్వరూపుని, అనగా అర్జునుని, ఆ యిరువురి లీలలను ప్రకటించు సరస్వతీ దేవిని, అనగా వాగ్దేవిని, ఆ వాక్కులను ఒకచో కూర్చిన వ్యాస మహామునిని నమస్కరించి ఆ తరువాత 'జయము'ను, అనగా మహాభారతమును పఠించవలెను.

జనమేజయ మహారాజు వైశంపాయన మహామునితో నిట్లనెను:-

మహాత్మా! మా తాతలైన పాండవులు దుర్యోధనుని వలన భయముచేత, విరాటరాజు పట్టణమునందు, అజ్ఞాతవాసమును ఎట్లు గడపిరి? పరబ్రహ్మ స్వరూపుడైన శ్రీకృష్ణుని నామ సంకీర్తనము చేయుచు దుఃఖితురాలైయున్న పతివ్రత ద్రౌపదీదేవి అజ్ఞాతురాలుగా అక్కడ ఎట్లు ఉండెను?

ఆ మాటకు వైశంపాయను డిట్లనెను:-

రాజా! వినుము. యుధిష్ఠిరుడు యక్ష రూపములోనున్న యమధర్మరాజు వలన వరములను పొంది తన ఆశ్రమమునకుపోయి ఆ సమాచారమును అక్కడి బ్రాహ్మణులకు చెప్పెను.

అరణితో గూడిన మంథన కాష్ఠమును (అగ్నిని చిలుకుటకు ఉపయోగించు రోలు - రోకలివంటి కొయ్య సాధనములు) బ్రాహ్మణునకు ఇచ్చి ధర్మరాజు తన తమ్ములను ఒకచోట చేర్చి వారితో నిట్లనెను:-

పాండవుల రహస్యాలోచనము

"మనము మన రాజ్యమును విడిచి అడవికి వచ్చి నేటికి పన్నెండు సంవత్సరము లాయెను. నేటినుండి పదమూడవ యేడు ఆరంభించినది. ఈ యేడు, గడచినయేండ్లు అన్నిటికంటే మిక్కిలి కఠినముగా మనము గడప వలెను. మనము ఎవ్వరుగూడ గుర్తించజాలనట్లు అతి రహస్యముగా నుండ వలెను. కనుక అర్జునా! ఈ యేడు మనము గుప్తముగా నివసించుటకు యోగ్యమైన స్థానము కనిపెట్టి చెప్పుము."

ఆ మాటకు అర్జునుడిట్లనెను:-

"రాజా! యమధర్మరాజు మనకిచ్చిన వరదాన మహిమచేత మన మీయేడు ఎవ్వరికిని తెలియకుండ ఉండగలము. మనకు నివాసయోగ్యములైన కొన్ని రాష్ట్రములను చెప్పెదను. అందు మనము గుప్తముగా నుండవచ్చును. వాటిలో నీకు ఏ రాష్ట్రము ఇష్టమైనదో చెప్పుము.

కురుదేశమునకు నాలుగు వైపులను "పాంచాల-చేది-మత్స్య-శూరసేన-పటచ్చర - దశార్ణ - నవరాష్ట్ర - మల్ల - శాల్వ - యుగంధర-విశాల-కుంతిరాష్ట్ర-సౌరాష్ట్ర-అవంతి" అనెడు రమ్యములైన జానపదములున్నవి. అందు పుష్కలముగా ఆహారము లభించును. రాజా! ఈ దేశములో మనము ఎక్కడ ఉండుటకు నీకు ఇష్టమో తెలుపుము. ఈ అజ్ఞాతవాస సంవత్సరమంతయు మనము సుఖముగాను, రహస్యముగాను ఉండవచ్చును."

ఆ మాటకు ధర్మరాజు ఇట్లనెను:-

"అర్జునా! యమధర్మరాజు చెప్పినట్లు మనకు ఏ యిబ్బందులు లేక ఈ యేడు గడపవచ్చును.

ఆయన మాట పొల్లుపోదు. మనమందరము ఆలోచించి, మనకు భయము రాకుండునట్టి ఒక రమణీయ దేశమును - మనకు శుభము-సుఖము కలుగునదిగా చూచి యచట నివసింతము.

నీవు చెప్పిన దేశములలో మత్స్య దేశము మంచిది. ఆ దేశపు రాజు విరాటుడు అతడు బలవంతుడు. విశేషించి పాండవుల యెడ అభిమానము గలవాడు. ధర్మాత్ముడు, దాత, వృద్ధుడు. ఎల్లప్పుడు ప్రియము చేయువాడు. కనుక మన మీయేడు అతని పనులు నెరవేర్చుచు ఆ రాజువద్ద ఉండవచ్చును. మనలో మత్స్య రాజువద్ద ఏయే పనులు ఎవరు చేయుచుండవలెనో చెప్పుడు."

దానికి అర్జునుడిట్లనెను:-

"మహాత్మా! విరాట నగరమునందు నీవు ఏ పని చేయుచు ఉండగలవు? ఏ పనివలన నీకు సంతుష్టి కలుగును? రాజా! నీవు చాల మృదుస్వభావము, ధర్మము, సత్యపరాక్రమము గలవాడవు. ఆపదలకు లోనై కష్టములు అనుభవించుచున్నావు. సామాన్యులవలె నీకు దుఃఖము రాకూడదు, నీవు ఈ ఆపదను ఎట్లు దాటెదవు? నీకు యోగ్యమైనపని విరాట నగరమునందు ఏదియో చెప్పుము."

ఆ మాటకు ధర్మరాజు యిట్లనెను:-

ధర్మరాజు కార్యము

"తమ్ములారా! నేను విరాటరాజు కడకు పోయి 'కంక' నామముతో బ్రాహ్మణుడనుగా ఉండెదను. నాకు జూదము ప్రియమైన క్రీడ. విరాటరాజుతో పాచికలు ఆడుచు ఆయనకు వినోదము కలిగించుచు ఆ రాజ సభలో ఒక సభ్యుడుగా నుండెదను.

(ఇక్కడ ధర్మరాజునకు అసత్యదోషము అంటకుండుటకుగాను సమర్థించవచ్చును 'నా పేరు కంకుడు' అని చెప్పుట అసత్యము కదా! దానికి ఇట్లు సమాధానము చెప్పవచ్చును:-

'కంక' శబ్దమునకు 'యమధర్మరాజు' అని అర్థము గూడ నున్నది. యుధిష్ఠిరుడు యముని కొడుకు గాబట్టి 'ఆత్మా వై జాయతే పుత్రః' అను శ్రుతి ప్రమాణము ననుసరించి తండ్రియే కొడుకు రూపమున పుట్టును గనుక, తండ్రి పేరు 'కంకుడు' అని కూడ నున్నది కనుక కంక నామము కలవాడనని చెప్పుట అసత్యము కాదు. ఈ విధముగా చెప్పినచో ధర్మరాజును అసత్య దోషము అంటదు.)

విరాటరాజును, అతని మంత్రులను, బంధువులను వినోదపరచుచు సుప్తముగా ఉండెదను.

అంతేకాక, 'నేను పూర్వము యుధిష్ఠిరునకు ప్రియమిత్రుడనుగా నుంటిని' అని కూడ విరాటరాజుతో ఆయన ప్రశ్నించినప్పుడు చెప్పెదను.

(ఇక్కడ 'యుధిష్ఠిరునకు ప్రియ మిత్రుడనుగా నుండిని' అని చెప్పుట అసత్యము. దానిని ఇట్లు సమర్థించవచ్చును:-

'యుధిష్ఠిర' నామముగల శరీరమే యిక్కడ 'యుధిష్ఠిరుడు' అనుకొనవలెను. ఆత్మయొక్క సత్త చేతనే శరీరము చలించుచుండును. అందుచేత ఆత్మ శరీరముతో బాటు ఉండును గనుక అది శరీరమునకు ప్రియమిత్రము అని చెప్పుట సమంజసము. శరీరమునకు అన్నిటికంటె ప్రియమైనది ఆత్మ. కనుక ఇక్కడ యుధిష్ఠిరుని ఆత్మ యుధిష్ఠిర నామక శరీరమునకు ప్రియమిత్రుడు అని ధర్మరాజు చెప్పినట్లగును. దీనిచేత ఆతనిని అసత్యదోషము అంటదని భావము).

ఇట్లు ధర్మరాజు, విరాటనగరమునందు తన ప్రవర్తనను తెలిపి భీమసేనునితో నిట్లనెను:-

ధర్మజుడు భీముని ప్రశంసించుట

"భీమసేనా! నీవు మత్స్య దేశమునందు ఏ విధముగ మెలగుచు ఎట్టి కార్యమును చేసెదవు?

గంధమాదన పర్వతమునందు 'క్రోధవశ' నామకులైన యక్షులను, మహాపరాక్రమశాలురైన రాక్షసులను వధించి ద్రౌపదికి కమల పుష్పములను

తెచ్చియిచ్చితివి. మనుష్య మాంస భక్షణము చేయు 'బక' రాక్షసుని చంపి, ఏకచక్రపురమునందు మనము నివసించుచుండిన యింటి యజమాని బ్రాహ్మణుని కుటుంబమునకే కాక, ఏకచక్రపురమున కంతటికిని క్షేమమును, అభయమును చేకూర్చితివి. హిడింబుని, కిమ్మీరుని సంహరించి వనమును నిష్కంటకము చేసితివి. జటాసురుని వధించి అతని వశములో ఆపదకు లోనైన ద్రౌపదిని విడిపించి మనకందరకు ఆనందము చేకూర్చితివి.

అత్యంత బలశాలివి, క్రోధివియగు నీవు విరాటరాజు కొలువులో ఏ పని చేసి ప్రసన్నుడవుగా నుండగలవు?

ఆ మాటలకు భీమసేను డిట్లనెను:

వంటలవాడుగా భీముడు

"మహారాజా! నేను 'పౌరోగవ' కార్యమును చేయుచు విరాట నగరమునందు 'బల్లవ' అను పేరుతో నుండెదను. 'పౌరోగవ' అనగా పాకశాలకు అధ్యక్ష పదవి అని పేరు. బల్లవ శబ్దమునకు 'వంటవాడు' అని యర్థము.

(విరాట నగరమునందు ఉన్నప్పుడు భీముని మారుపేరుగూడ 'బల్లవుడు' అని వ్యాసభారతమునందు ఉన్నది. మన తెలుగు కవి తిక్కన 'వలలుడు' అని పేరు భీమునికి వాడినాడు.)

(ఇక్కడ ఒక విశేషమేమనగా:- 'పురోగు' శబ్దమునుండి 'పౌరోగవ' శబ్దము పుట్టినది. 'పురోగు' శబ్దమునకు 'వాయువు' అని అర్థము. 'పురోగు' (వాయువు)యొక్క పుత్రుడు 'పౌరోగవుడు' అను వ్యుత్పత్తిచేత 'భీముడు' అని అర్థముగూడ నగును. దీనినిబట్టి 'నేను పౌరోగవుడనుగా ఉండెదను' అని చెప్పిన భీమునకు గూడ అసత్యదోషము అంటదు. పౌరోగవ శబ్దమునకు 'పాకశాలాధ్యక్షుడు-వాయుపుత్రుడు' అని రెండు అర్థములు ఉన్నవి. ఇంతేకాక, 'నేను బల్లవ' అను పేరుతో నుండెదను అని భీముడు అనినాడు. 'బల్లవ' శబ్దము ఇతనికి పేరుగానేకాక, 'వంటలవాడు' అను నర్థమునుగూడ కలిగియుండుటచే భీముడు విరాట నగరమునందు పెట్టుకొనిన 'బల్లవ' అను పేరు అతడు చేయు పనిని, అనగా వంటను గూడ సూచించుచున్నది గనుక ఈ నామ మాతనికి సార్థకమై యున్నది.)

"రాజా! నేను విరాటరాజు ఇంటిలో వివిధములైన వంటకములను రుచిగా చేసి ఆయన మెప్పు వడసెదను. ఇదివరకు మంచి వంటకములను వండి రాజును తృప్తిపరచుచున్న వంటవారికన్న రుచిగా చేసి, 'వారు చేసిన వస్తువుల కన్న మిన్నగా నున్నవి' అని అనిపించెదను. రాజునకు ప్రీతి కలిగించెదను.

ఇంతేకాక, నేను పెద్ద పెద్ద వంటచెరుకుల మోపులను గూడ ఒక్కడనే మోసికొని వంటకు తెచ్చుకొనెదను. నా శక్తిని చూచి రాజు తప్పక పనిలో ఉంచగలడు. సామాన్య మానవులకు అసాధ్యములైన పనులను చేసెదను. దాని చేత రాజు యొక్క యితర సేవకులు రాజును చూచినట్లే గౌరవభావముతో నన్ను గూడ చూచెదరు.

వివిధములైన తిను బండారములను యథేచ్ఛముగా ఉపయోగించెదను.

రాజా! బలముగల యేనుగులనుగాని, యెద్దులనుగాని అణచవలసి వచ్చినప్పుడు అణచెదను. మల్ల యుద్ధమునందు నిపుణులైన జెట్టీలు వచ్చినప్పుడు వారితో నియుద్ధము (కుస్తీ) చేసి వారిని ఓడించి రాజుకు సంతోషము కలిగించెదను.

విరాటరాజు నన్ను గూర్చి అడిగినప్పుడు 'నేను పూర్వము యుధిష్ఠిరుని వద్ద గజ శిక్షకుడనుగాను, వృషభ శిక్షకుడనుగాను, పాచకుడనుగాను, మల్ల యుద్ధ కుశలుడనుగాను నుంటిని' అని చెప్పెదను.

రాజా! నన్ను నేను కాపాడుకొనుచు విరాటనగరమునందు జాగ్రత్తగా మెలగుచు సుఖముగా నుండెదను.

అది విని ధర్మరాజు అర్జునునివైపు చూచి భీమునితో నిట్లనెను:

ధర్మజుడు అర్జునుని ప్రశంసించుట

"నరశ్రేష్ఠుడు, మహా బలవంతుడు ఖాండవ వనమును బ్రాహ్మణ రూప ధారియైన అగ్ని దేవుని కోరికపై దహించినవాడు, ఎవరిచేత గూడ ఓడిపోని వాడు, కురు కులానంద వర్ధనుడునగు అర్జునుడు విరాటనగరము నందు ఏ పని చేయుచు సుఖముగా నుండునో?

ఇతడు సామాన్యుడు కాడు. ఖాండవ వన దహన కాలమునందు ఇంద్రు నితో ఏకాకిగా పోరాడి అతనిని జయించెను పన్నగులను. రాక్షసులను సంహ రించి సర్పరాజైన వాసుకి చెల్లెలు ఉలూపిని హరించెను. అట్టి అసమాన శౌర్య శాలి అర్జునుడు విరాటనగరమునందు ఎట్లు మెలుగునో కదా?

"భీమసేనా! తపింపజేయు వారిలో సూర్యుడు. మానవులలో బ్రాహ్మ ణుడు, సర్పములలో ఆశీ విషము, తేజస్వులలో అగ్ని, ఆయుధములలో వజ్రా యుధము, గోవులలో మంచి మూపురముగల కోడె, జలాశయములలో సముద్రము, వర్షించు మేఘములలో పర్జన్యుడు, మృగములలో శార్దూలము, సర్పములలో ధృతరాష్ట్రిడను సర్పరాజు, పక్షులలో గరుత్మంతుడు, గజములలో ఐరావతము, ప్రియులైన వారిలో పుత్రుడు, మిత్రులలో భార్య, పర్వతములలో మేరు పర్వ తము, దేవతలలో విష్ణువు, గ్రహములలో చంద్రుడు, సరస్సులలో మానస సరస్సు ఏలాగు అత్యుత్తమములుగా నున్నవో అలాగే, అర్జునుడు సమస్త ధను ర్ధారులలోను శ్రేష్ఠుడు. అతడు ఇంద్రుని కంటెను, వాసుదేవుని కంటెను తక్కువ వాడు కాడు. అట్టి గాండీవధారియగు బీభత్సుడు విరాటనగరమునందు ఏ కార్యము చేయగలడు?

"ఇంద్రుని యింటిలో ఐదు సంవత్సరములు నివసించి అస్త్ర విద్యను నేర్చుకొనిన అద్భుత వీర్యముగల మానవోత్తముడుగదా అర్జునుడు! ఇతడు దేవ రూపమునే ధరించి యీ అస్త్ర విద్యను సంపాదించెను.

ఇతనిని పన్నెండవ రుద్రునిగాను, పదుమూడవ సూర్యునిగాను, తొమ్మి దవ వసువుగాను, పదవ గ్రహమునుగాను తలచెను.

ఇతని కుడి యెడమ బాహువులు రెండు గూడ అల్లెత్రాటి ఒరవడి చేత నేర్పడిన కిణములు (మొద్దుబారిన గుర్తులు) బండికాడి మ్రాకు ఒరవడిచేత ఎద్దుల మెడపైన ఏర్పడిన కిణములవలె నున్నవి. ఇట్టి మహావీరుడు మత్స్యరాజువద్ద ఏ పని చేయగలడు?"

ఆ మాటలకు అర్జును డిట్లనెను:-

బృహన్నలగా అర్జునుడు

"మహారాజా! నేను ఈనాటి నుండి నపుంసకుడనైనాను. నా బాహువుల కున్న అల్లెత్రాడు ఒరచుకొనుటచే నేర్పడిన కిణములను నేను కంకణములను తొడిగికొని అవి కనపడకుండ దాచుకొనెదను. చెవులకు కుండలములు, చేతులకు శంఖముల గాజులు, తలపైన జెడ ధరించి మూడవ ప్రకృతి (నపుంసకత్వము)తో 'బృహన్నల' అను పేరుతో నుండెదను. స్త్రీ భావముతో మాటి మాటికి పూర్వ రాజుల చరిత్రలను పఠించుచు నా నిజరూపము మరుగుపరచుకొని, రాజును, అంతఃపుర కాంతలను వినోదపరచుచుండెదను.

నాకు ఈ షండత్వము దేవలోకమునందు ఊర్వశి శాపము వలన నేర్పడి నది. అది యజ్ఞాత వాసమునందు నాకు వరముగా నింద్రుడు ప్రసాదించినాడు. నేను విచిత్రములైన నృత్య గీత వాద్యములను, విరాటపుర స్త్రీలకు నేర్పెదను.

(ఇక్కడ 'బృహన్నల' అను పదములోని లకారమున్నది. 'ర-ల' అను అక్షరములకు అభేదము సంస్కృత వ్యాకరణము ప్రకారము ఏర్పడును గనుక, 'బృహన్నర' అని కూడ చెప్పవచ్చును. దీని యర్థము- 'పెద్దనరుడు - మహా పురుషుడు' అని యర్థము. నరనారాయణులే యిప్పుడు కృష్ణార్జునులు - ఇట్లు అర్థము చెప్పుట చేత అర్జుననకు గూడ అసత్యదోషము అంటలేదు)

రాజా! ప్రజల యొక్క ఉత్తమములైన ఆచారములను, వారి అనేక సత్కర్మములను గూర్చి వర్ణించెదను. ఈ విధముగా నన్ను నేను యుక్తితో మరుగుపరచుకొనెదను. రాజు నన్ను అడిగినప్పుడు 'నేను యుధిష్ఠిరుని యింటిలో ద్రౌపదికి పరిచారికగా ఉంటిని' అని చెప్పెదను.

(పరిచారికా శబ్దమునకు సేవకురాలు అను అర్థమేకాక అంతట సంచ రించునది అని కూడ అర్థము గలదు అందుచేత తాను సర్వత్ర సంచరించు వాడు అని గూఢముగా చెప్పి తన అసత్యమును మాన్చుకొనెను.) మాయావేష ముతో నేను నివురుగప్పిన నిప్పువలె గుప్తముగా విరాట గృహమునందు విహ రించగలను "

ఈ మాట విని ధర్మరాజు నకులునితో 'నీవు మిక్కిలి సుకుమారుడవు. విరాట రాజు వద్ద ఏమి పని చేయుచుండెదవు? అని యడుగగా, నకులు డిట్లు చెప్పెను.

అశ్వరక్షకుడుగా నకులుడు

"మహారాజా! నేను విరాట నగరమునందు 'అశ్వబంధ' కార్యము (అశ్వములను వశపరుచుకొనునట్టి 'అశ్వహృదయము' అను విద్య) నెరవేర్చుచుండెదను. నేను అశ్వరక్షణము నందు మిక్కిలి నేర్పుగలవాడను. 'గ్రంథిక' నామముతో మెలగు చుండెదను.

అశ్వ శిక్షణము నాకు ప్రియమైనది. అశ్వముల శిక్షణమునందును చికిత్స యందును నేను కుశలుడను. రాజా! నీకు వలెనే నాకు గూడ అశ్వములు ప్రియములు

(ఆయుర్వేదము - అథర్వ విద్యలకు సంబంధించిన గ్రంథములను పఠించిన వాని పేరు 'గ్రంథికుడు' అని చెప్పబడినది. వేదములందు 'అశ్వినీ కుమారులు వైద్యులు-అధ్వర్యులు' అని చెప్పబడినది. నకులుడు అశ్వినీకుమారుల కొడుకు గనుక తాను 'గ్రంథికుడు' అని చెప్పుటచేత అతనికి గూడ అసత్య దోషము రాలేదు. ఇందేగాక 'అశ్వ' శబ్దమునకు రేపటివరకు జీవించియుండు ఆశలేనివాడు - వీరుడు - అని యర్థము. జీవితముపైన ఆశ విడిచి యుద్ధమును చేయు వీరునికి అశ్వనామము కలదు. అనగా. 'శ్వ. అనగా 'రేపు' 'అశ్వ' అనగా 'రేపు అనునది నిశ్చయముగాలేని యుద్ధవీరుడు' అని యర్థము. అట్టి అశ్వశబ్ద వాచ్యులకు నకులుడు అధికారి గాబట్టి అట్లు తాను చెప్పికొనుట యథార్థమే.)

"రాజా! విరాట నగరమునందు ఎవరైనను నన్ను అడిగినప్పుడు 'నేను పూర్వము ధర్మరాజువద్ద అశ్వ శిక్షకుడనుగా నుంటిని' అని చెప్పి ప్రచ్ఛన్నముగా సంచరించెదను."

ఆది విని యుధిష్ఠిరుడు సహదేవుని గూడ అడుగగా, అతడు విరాటనగరమునందు తన కార్యమును గూర్చి యిట్లు చెప్పెను:

గోశాలాధ్యక్షుడు : సహదేవుడు

"రాజా! నేను గోశాలాధ్యక్షుడనుగా నుండెదను. గోవులను వశములో నుంచుకొనుటలోను, పాలుపిదుకుటలోను, వాటి మంచి చెడ్డలను కనుగొనుటలోను, లెక్క పెట్టుటలోను సమర్థుడను. 'తంతిపాల' అను పేరు పెట్టుకొని యుండెదను.

(తంతిపాలుడనగా, 'గోవుల మెడకు గట్టు తలుగులను పలుపులను జాగ్రత్త పరచువాడు' అని అర్థము మరి యొక అర్థమేమనగా, 'తంతి' అనగా వాక్కు. రాజా, నీ యాజ్ఞను (వాక్కును) పరిపాలించెదను. అని అర్థము. ఈ విధముగా సహదేవుడు గూడ తన అసత్యవచన దోషమును పోగొట్టుకొనెను.)

"రాజా! నేను గోవులను పాలించినచో నవి యేలాటి రోగములుగానీ, క్రూరమృగముల భయముగానీ లేకుండ సుఖముగా నుండగలవు

ఇంతకు పూర్వము గూడ గోపాలనమును నాకు ఒప్పజెప్పి యుంటివి నా సామర్థ్యమును నీ వెరుగుదువు.

గోవుల లక్షణములను, నడవడికలను, 'ఏ గోవు మంగళకరమైనది' అను విషయమును నేను బాగుగా ఎరుగుదును

ఇంతేకాక, మంచి లక్షణములు గల వృషభములను గూడ నేనెరుగుదును. ఎట్లనగా, అటువంటి యెద్దుల మూత్రమును వాసన చూచినంత మాత్రమున గొడ్డు టావులు గూడ గర్భము ధరించి యీనగలవు

గోవుల రక్షణము నాకు ప్రీతికరము. ఈ విధముగా నేను విరాట నగర మునందు ప్రచ్ఛన్నముగా నుండగలను."

ఆ మాటలు విని యుధిష్ఠిరుడు ద్రౌపది విషయమై యిట్లనెను:

ద్రౌపదిని ధర్మరాజు ప్రశంసించుట

"ఈమె మనకు ప్రియ భార్య. మన ప్రాణములకన్న ఎక్కువైనది. ఈమె మాత (భూమి) వలెను, అక్క (ధేనువు) వలెను మనచేత కాపాడబడదగినది. సామాన్య స్త్రీలవలె ఈమె పనులు చేయ నేర్వలేదు. ఇట్టి యీమె విరాటనగరము నందు ఏమి పని చేయుచు నుండగలదు? ఈమె అతిసుకుమారి ఇంకను బాలికయే కీర్తిమంతురాలు, రాజపుత్రియైన యీమె యేమి పని చేయగలదు? ఈమె స్త్రీ గనుక, పూలమాలలను కట్టుట, గంధమును తీయుట, అలంకారములను, వస్త్రములను ధరింప జేయుట, ఈ మొదలైన పనులు మాత్రమే యెరుగును."

అది విని ద్రౌపది ధర్మరాజుతో నిట్లనెను:-

"రాజా! లోకములో తన మానమును గౌరవమును కాపాడుకొనుచు ఇతరుల యిండ్లలో పరిచారికలుగా చాలమంది స్త్రీలు ఉండెదరు. వారు గౌరవ దాయకములైన పనులనే చేసెదరు. అట్లు ఉండు స్త్రీకి 'సైరంధ్రి' అని పేరు. ఆ విధముగ నున్నవారిని ఎవరును శంకించరు.

'నేను పూర్వము ద్రౌపది వద్ద సైరంధ్రిగా నుంటిని' అని రాజు అడిగినప్పుడు చెప్పెదను. రాజా! ఈ విధముగా నన్ను నేను కాపాడుకొనుచు రహస్యముగా విరాట రాజు ఇంటిలో అంతఃపుర పరిచారికగా నుండెదను. నన్ను గూర్చి మీరు ఏమాత్రము దుఃఖపడవలసిన అవసరము లేదు."

ఆ మాటలు విని యుధిష్ఠిరుడామెతో నిట్లనెను:-

ధర్మజుడు ద్రౌపదిని మరల ప్రశంసించుట

"కల్యాణీ! నీవు మంచి మాట చెప్పితివి. ఇందులో మనకు మంగళమే కలుగును. నీవు ఉత్తమ కులమునందు జన్మించినావు. పాపమనగా నేమియో గూడ నీకు తెలియదు. నీవు పాతివ్రత్యము, మంచి నియమనిష్ఠలు గలదానవు. మన శత్రువులు నిన్ను కనిపెట్టి తిరిగి మనను దుఃఖము పాలు చేయకుండునట్లుగా నీవు అతిజాగ్రత్తతో మెలగుచుండుము."

ధర్మజుడు తన పరివారమును ఆదేశించుట

ఈ విధముగా ధర్మరాజు అందరికిని ఆయా పనులను నియోగించి "ఈ మన పురోహితుడు మన అగ్నులను ద్రుపదుని ఇంటిలో రక్షించుచుండుగాక. మన వెంటఉన్న వంటవారు మొదలైన పరిచారకులు ద్రుపద పురమునకు పోయి యుందురుగాక. ఇంద్రసేనుడు మొదలగు సేవకులు మన రథములను తోలుకొని ద్వారకా నగరమునకు పోవుదురుగాక.

మీరందరు గూడ అక్కడికిపోయి, వారు అడిగిన యెడల పాండవుల సంగతి మాకేమియు తెలియదు. ద్వైతవనమునందు మమ్ములను విడిచి యెక్కడికి పోయిన సంగతి మాకు తెలియదు' అని చెప్పవలెననెను.

"జనమేజయ మహారాజా! ఈ విధముగా పాండవులు పరస్పరము కూడ బలుకుకొని తమ విధానమును ధౌమ్యాచార్యులకు తెలిపి ఆయన సమ్మతిని అడుగగా, ధౌమ్యుడు ఈ విధముగా వారికి ఉపదేశించెను:-

ధౌమ్యుని ఉపదేశము

"పాండవులారా! మీకు బ్రాహ్మణులు, మిత్రులు, వాహనములు, యుద్ధ యాత్ర, ఆయుధములు. శాస్త్రోక్తముగా నగ్నిని పూజించుట ఈ యన్నిటిని గూర్చి బాగుగా తెలియును వాటికి అనుకూలముగా మీరు చేసిన యేర్పాట్లు చాల బాగుగ నున్నవి ఇప్పుడు మీరు, విశేషించి అర్జునుడు ద్రౌపదిని జాగ్రత్తతో రక్షించవలెను. లోక వ్యవహారములను గూర్చి మీకు బాగుగా తెలియును. మీకు అన్నియు తెలిసినప్పటికిని హితమును బోధించుట మీ మేలుకోరు మిత్రుల కర్తవ్యము. దీనివలననే అర్థకామములు లభించును. కాబట్టి నేను మీకు కొన్ని యుక్తియుక్తములగు మాటలను చెప్పెదను. వాటిని సావధానముగా వినుడు:-

రాజగృహము నందు ఉండవలసిన పద్ధతులు

"నా యీ ఉపదేశము ప్రకారము మీరు నడచుకొనినచో రాజుల యింటిలో నివసించుచుండియు మీకు ఆ దోషములు అంటవు. ఎంత వివేకవంతులకైనను రాజగృహమునందు నివసించుట చాల కఠినము. అక్కడ మీకు జరుగు మానావమానములను లెక్కపెట్టకుండ ఏలాగో ఒక సంవత్సరము గడపుట అవసరము.

ఆ తరువాత పదునాల్గవ యేట మీ యిచ్చానుసారముగా సుఖముతో నుండ వచ్చును. మీరు రాజును చూడవలసి వచ్చినప్పుడు ద్వారాపాలకుని ద్వారా సమాచారము తెలిపి రాజానుమతిని పొంది లోపలికి పోవలెను.

రాజులను పూర్తిగా నమ్మగూడదు ఏ యాసనము నందును ఎవ్వడును కూర్చొనువాడు ఉండడో అట్టి ఆసనమునందే కూర్చొనవలెను 'నేను రాజునకు ప్రియుడను కదా' యని యెప్పుడును రాజు ఉపయోగించు వాహనము, మంచము, పాదుకలు, ఏనుగు, రథము మొదలైన వస్తువులు వాడకుండ ఉండువాడే రాజ గృహమునందు క్షేమముతో నుండగలడు.

"ఏ యే చోట్ల కూర్చొనినచో తనను శంకింతురో అట్టి చోట్లలో నెప్పుడును కూర్చొననివాడే రాజభవనము నందు ఉండగలుగును. తనను అడుగకుండ ఎప్పుడును రాజుకు అతని కర్తవ్యమును గూర్చి ఉపదేశించగూడదు. మౌనముతోనే రాజును సేవించుచుండవలెను. అవసరము వచ్చినప్పుడు రాజును ప్రశంసించుచుండవలెను.

అసత్యము పలుకువానిని రాజు దోషదృష్టితో చూచును. అసత్యవాదియైన మంత్రిని గూడ రాజు అవమాన పరచును. బుద్ధిమంతుడు ఎప్పుడును రాజు భార్యలతో కలియుచు నుండగూడదు. ఇంతేగాక, అంతఃపురములోకి సర్వదా రాకపోకలు చేయు వారితో, రాజు ద్వేషించు వారితో, రాజునకు అహితమును కోరువారితో ఎప్పుడును మైత్రి చేయగూడదు.

"ఎంతటి చిన్న కార్యములైనను రాజునకు తెలిపియే చేయవలెను. రాజు దర్బారులో ఈ విధముగా నడుచుకొను వ్యక్తికి ఎప్పుడును హాని కలుగదు. రాజసభలో తాను కూర్చొనుటకు ఉన్నత స్థానము రిక్తముగా నున్నప్పటికిని, దానిని అంధునివలె చూడకుండ తలవంచుకుని ఉండి రాజాజ్ఞ యైన పిదపనే ఆ యాసనమునందు కూర్చొనవలెను.

ఎందుకనగా, పీరులైన రాజులు, పుత్ర - పౌత్ర - ప్రపౌత్ర - భ్రాతృ జనమును గూడ హద్దుమీరినచో అవమానపరతురు 'రాజులు అగ్నివలె దహించువా'రని వారి దగ్గరకు పోకూడదు.

దేవతలవలె రాజులు విగ్రహానుగ్రహ సమర్థులు కాబట్టి వారిని పరిహసించగూడదు. ఎవడు అసత్యముగాను, కపటముగాను రాజును సేవించుచుండునో, అతడొకనాడు తప్పక రాజు చేతిలో మరణించును.

రాజు ఆజ్ఞ యిచ్చిన పనులనే చేయవలెను. నిర్లక్ష్యము, గర్వము, కోపము విడువవలెను. కర్తవ్యా కర్తవ్యములను నిర్ణయించు సందర్భములందు రాజునకు హితములు, మరియు ప్రియములు నైన మాటలనే చెప్పవలెను. అట్లు చెప్పుటకు వీలుకానప్పుడు ప్రియవచనమును విడిచి హితమునే రాజునకు ఉపదేశించవలెను. హితకరము కానట్టి ప్రియమును ఎప్పుడును చెప్పగూడదు.

అన్ని విషయములలోను రాజుకు అనుకూలుడుగా నుండవలెను. అతనికి కథలు చెప్పునప్పుడు గూడ అప్రియములు, అహితములునగు మాటలు మాటి మాటికి చెప్పగూడదు.

"పండితుడైనవాడు నేను రాజునకు ప్రియుడను గాను, అని తలచి అప్రమత్తతతో కొలుచుచు అతనికి హితము - ప్రియమునైన పనిని చేయుచుండవలెను. రాజునకు ఇష్టములుగాని వస్తువులను తాను అనుభవించగూడదు. అతని శత్రువులతో మాట్లాడగూడదు. తన స్థానము నుండి తాను కదలగూడదు. ఇట్లుండు వాడే రాజ గృహమునందు క్షేమముగా నివసించగలడు.

బుద్ధిమంతుడైన వాడు రాజునకు కుడి వైపుగాని ఎడమ వైపుగాని కూర్చొనవలెను. అందుకనగా, రాజుకు వెనుక పార్శ్వమునందు శస్త్రాస్త్రములను ధరించిన అంగరక్షకులు ఉందురు.

రాజుకు ఎదురుగా ఉన్నతాసనమునందు ఎప్పుడును కూర్చొనుట నిషిద్ధము. అతనికి ఎదురుగా ఏదైన విశేష కార్యము జరుగుచున్నప్పుడు దానిలో పిలువబడక జోక్యము కలిగించు కొనగూడదు. ఇటువంటి ప్రవర్తన సామాన్య దరిద్రులు గూడ సహించరనగా రాజుల మాట చెప్పనవసరము లేదు.

రాజులు మాట్లాడిన అబద్ధములను బయలు పరచగూడదు. 'తాను పండితుడను' అని గర్వించువారిని రాజు తిరస్కరించును. 'నేను శూరుడను, బుద్ధిశాలిని' అను రాజువద్ద గర్వించగూడదు. అతనికి ప్రియమునే ఆచరించుచు అతని ప్రేమను సంపాదించి తద్వారా ఐశ్వర్యమును పొందవలెను. అట్లు సంపాదించిన పిదప గూడ జాగరూకుడై యుండి అతని హితుల యెడలను, ప్రియుల యెడలను జాగ్రత్తతో వ్యవహరించు చుండవలెను. అసత్యవాదులను రాజు ద్వేషించును.

"ఎవని కోపము బాధాకరమో, ఎవని అనుగ్రహము ఫలప్రదమో అట్టి రాజునకు ఇష్టములుకాని పనులను బుద్ధిమంతుడెవడు చేయును? మనస్సులో గూడ అది తలంచడు.

రాజునకు ఎదురుగా నున్నప్పుడు, తన భుజములను, పెదవులను, మోకాళ్ళను వ్యర్థముగా ఆడించుచుండగూడదు. అతని సమక్షమునందు సర్వదా అతి మిక్కిలి మెల్లిగా మాట్లాడవలెను. మెల్లిగా ఉమ్మి వేయవలెను ఇతరులకు తెలియకుండ చాల చిన్నగా అపానవాయువును విడువవలెను. ఇతరులవద్ద ఉన్న పరిహాస జనకములైన వస్తువులను చూచి రాజు సమక్షమునందు పిచ్చివానివలె బిగ్గరగా నవ్వగూడదు. అతని యెదుట ధైర్యముగా సంచరించగూడదు నిశ్చేష్టుడై మూఢునివలె గూడ ఉండగూడదు. తన మనస్సుకు సంతోషము గలిగినప్పుడు రాజు వద్ద మెల్లగానే నవ్వవలెను. తనకు లాభము గలిగినప్పుడు హర్షించుటగాని, నష్టము, అవమానము గలిగినప్పుడు దుఃఖించుట కాని రాజువద్ద చేయగూడదు. ఎల్లప్పుడు పరాకుతో రాజ భవనమునందు వసించవలెను.

బుద్ధి శాలియైన మంత్రి సర్వదా రాజును, రాజపుత్రుని పొగడుచు ఉండినప్పుడే చాలాకాలము రాజాశ్రయమునందు ఉండగలడు. రాజునకు కృపా పాత్రుడైన మంత్రి అకారణముగా దండింపబడినప్పుడు రాజును నిందించక చలించకుండఉండు మంత్రి తిరిగి తన పదవిని, సంపదను పొందగలడు. రాజ్యమునందున్న వ్యక్తి యెవడైనను వివేకముగలవాడై రాజ పరోక్షమునందుగాని ప్రత్యక్షమునందుగాని రాజు వర్ణనములనే చేయుచుండినచో అతనికి రాజాశ్రయము స్థిరముగా కలిగియుండును.

ఏ మంత్రి రాజును బలాత్కారముగా తనకు అధీనుని చేయ జూచునో అతడు చాల కాలము తన పదవిలో నుండజాలడు. అతనికి ప్రాణహాని గూడ కలుగును.

తన శ్రేయస్సు కోరువాడు రాజుతో ఎక్కువ మాట్లాడగూడదు తగు స్థానములందు రాజును గూర్చిన గుణములనే సర్వదా చెప్పుచుండవలెను. ఎల్లప్పుడు ఉత్సాహవంతుడై, శూరుడై యుండుచు రాజును నీడవలె ఆశ్రయించుచు సత్యము పలుకుచు, మృదువుగా వ్యవహరించుచు ఇంద్రియ నిగ్రహముగలవాడై రాజ గృహమునందు నివసించు చుండవలెను.

రాజు ఇతరునికి పని చెప్పునప్పుడు, తాను స్వయముగా ముందుకు పోయి 'నాకు ఏమి ఆజ్ఞ' అని వినయ పూర్వకముగా పని చేయువాడే రాజ భవనము

నందు నివసించగలడు. రాజు తనను ఆజ్ఞాపించినప్పుడు, తన మనస్సు నందు గాని, బాహ్యముగా గాని చలించనివాడే రాజ గృహమునందు ఉండగలడు.

ఎవడు రాజ కార్యముపై తన యిల్లువిడిచి దేశాంతరమునందు ఉండి తన వారిని మిత్రులను ఎప్పుడు గూడ స్మరించక దుఃఖములను సహించుచు రాజ కార్యములను నిర్వహించుచుండునో, అట్టివాడు సుఖమును పొందగలడు. అతడే రాజ గృహము నందు ఉండగలడు.

"రాజ వేషముతో సమానమైన వేషమును ధరించరాదు. రాజుకు అతి సన్నిహితుడుగా నుండగూడదు రాజుతో అతిగా రహస్యాలోచనలు చేయగూడదు. అట్లు మెలగువాడే రాజునకు ప్రియుడగును.

ఒక అధికారము నందు నియుక్తుడైన వాడు రాజ ధనమును ఏ మాత్రము తాక గూడదు. రాజ ధనమును హరించిన వాడు బంధనమును గాని, వధను గాని పొందును. రాజు తన కిచ్చిన వస్త్ర వాహనాలంకారాదులనే సర్వదా ధరించు చుండవలెను. అప్పుడే రాజుకు ప్రియుడగును." ఇట్లు ఉపదేశించి ధౌమ్యాచార్యుడు మరల నిట్లనెను:-

"పాండు నందనులారా! పైన చెప్పిన విధముగా నడచు కొనుచు మనో నిగ్రహముతో ఈ అజ్ఞాత వాసమును గడపినచో పదునాల్గవ సంవత్సరమునందు మీ రాజ్యమునకు పోయి మీరు సుఖముగా యథేచ్ఛగా నుండవచ్చును."

ధౌమ్యుని ఉపదేశ వాక్యములను విని యుధిష్ఠిరుడు ఇట్లనెను:-

"మహాత్మా! మాకు మంచి ఉపదేశమును చేసితివి. నీవలె మాకు హిత మును చెప్పువారు, మా తల్లి కుంతీదేవిని, మహా బుద్ధిమంతుడైన విదురుని విడిచి మరియొకరు లేరు. ఈ దుఃఖ సాగరమును తరించుటకు ఇక్కడి నుండి ప్రయా ణము చేయుటకు, మేము విజయమును సాధించుటకును, అవసరమైన కర్తవ్య మును నీవే పూర్తి చేయుము" అని చెప్పెను.

ఇట్లు వేడుకొనబడిన ధౌమ్యాచార్యుడు పాండవుల ప్రయాణము కొరకు విధి పూర్వకముగా కార్యములను జరిపెను. పాండవుల అభివృద్ధి, ఐశ్వర్యము, విజయముల కొరకు పాండవుల గృహ్యాగ్ని యందు మంత్ర పూర్వకముగా హోమాదులు చేసెను. అప్పుడు పాండవులు ద్రౌపదిని ముందిడుకొని అగ్నికి, బ్రాహ్మణులకు, తపోధనులకు ప్రదక్షిణము చేసి ప్రయాణమును సాగించిరి.

వారు వెడలిన తరువాత ధౌమ్యాచార్యుడు ఆ యగ్నులను తీసుకొని పాంచాల దేశములకు పోయెను. ఇంద్ర సేనాదులైన పరివార జనము గూడ, పూర్వము ధర్మరాజు ఆదేశించిన విధముగా ద్వారకాపురికి పోయి రథాశ్వాదులను రక్షించుకొనుచు సుఖముగా నుండిరి.

పాండవుల విరాటనగర ప్రయాణము

పాండవులు తమ శస్త్రాస్త్రములతో పాదచారులై యమునా నది దక్షిణ తీరమునకు బయలుదేరిపోయిరి. 'ఇక మనకు వనవాసక్లేశము పోయినది. రాజ్యమును సంపాదించుకొనగలము' అని వారు మనస్సులో తలచుకొనుచు ప్రయాణమును సాగించి అచ్చటచ్చట దారిలో విడియుచు, క్రూరమృగములను వేటాడుచు పోయిరి.

దశార్ణ దేశములకు ఉత్తరముగా, పాంచాల దేశములకు దక్షిణముగా, యకృల్లోమ-శూరసేన దేశములకు మధ్యగా ప్రయాణము సాగించిరి.

వారు చేతులలో ధనువులు, నడుములకు ఖడ్గములు ధరించియుండిరి. వివర్ణ వదనము గలవారై గడ్డములు, మీసములు పెంచుకొని నిరాశాపూరితులై యుండిరి. ఎవరైనను అడిగినప్పుడు 'మత్స్య దేశములో నివసించుటకు పోవుచున్నా'మని చెప్పుచు కొన్నాళ్ళకు మత్స్యదేశమును చేరుకొనిరి.

అప్పుడు ద్రౌపది యుధిష్ఠిరునితో నిట్లనెను:-

"రాజా! ఇక్కడ అనేక సస్యక్షేత్రములున్నవి. వాటిలో ఎన్నియో కాలిబాటలున్నవి. విరాటరాజు రాజధాని చాల దూరములో నున్నట్లు స్పష్టమగుచున్నది. నేను చాల అలసినాను. కనుక మనము మరియొక రాత్రి యిక్కడ నివసింతము."

ఆ మాటలు విని యుధిష్ఠిరుడు అర్జునునితో నిట్లనెను:-

"నాయనా! పాంచాలిని నీ భుజముపైన ఎత్తుకొని నడుపుము. ఈ యడవి గడచి రాజధానిని చేరి అక్కడ ఈ రాత్రి నివసింతము."

ఇట్లు చెప్పిన తోడనే అర్జునుడు ద్రౌపదిని ఎత్తుకొని గజరాజువలె నడచెను. విరాట రాజధాని సమీపమునందు అర్జునుడు ద్రౌపదిని క్రిందికి దించెను.

యుధిష్ఠిరుడు అప్పుడు అర్జునునితో నిట్లనెను:-

"మన ఆయుధములను ఎక్కడ నిక్షేపించి యీ పురములో ప్రవేశింతము? మనము ఆయుధములతో ప్రవేశించినచో పౌరులకు ఉద్వేగమును కలిగించిన వారమగుదుము.

నీ గాండీవము లోకములో అందరికి తెలియును. దానితో ఈ నగరము నందు మనము ప్రవేశించినచో నగర వాసులు మనను గుర్తుపట్టెదరు. తరువాత మనము తిరిగి పన్నెండేండ్లు వనవాసము చేయవలసియుండును మనలో నెవరినో యొకరిని తెలిసికొనినప్పటికిని, అందరము వనవాసము చేయవలెను. ఇది మన ప్రతిజ్ఞ."

ఆ మాటకు అర్జునుడు ఇట్లు చెప్పెను:-

"రాజా! ఇక్కడ శ్మశానములో నున్న ఒక పెద్ద దిబ్బపై గొప్ప శమీ వృక్షమున్నది. అది చాల గుబురుగాను, భయంకర శాఖలతో ఎక్కుటకు అసాధ్యముగాను నున్నది. మన మీ వృక్షముపైన ఆయుధములను కట్టియుంచుదము.

ఇక్కడ మనుష్యులెవరును లేరు. ఈ జమ్మిచెట్టు, త్రోవకు కడుదూరము దాక, అడవిలో వ్యాపించియున్నది. అక్కడ క్రూరమృగములున్నవి. విశేషించి యీ చెట్టు దుర్గమమైన శ్మశాన భూమిలో నున్నది. ఈ శమీ వృక్షమునందు ఆయుధములను ఉంచి మనము నగరమునందు ప్రవేశించి యథేచ్ఛగా తిరుగుదము."

శస్త్రాస్త్రములు శమీవృక్షముపై దాచుట

"దేనిచేత అర్జునుడు, అసహాయ వీరుడై, దేవ-మనుష్య వీరులను, అనేక దేశములను, దివ్యబల సంపనులైన రాక్షసాదులను జయించెనో, దేని టంకార ధ్వని చాల దూరముదాక వ్యాపించునో, అట్టి భయంకరమైన గాండీవ ధనుస్సు నుండి అర్జునుడు అల్లెత్రాడు సడలించి దించెను. దేనిచేత యుధిష్ఠిరుడు సమస్త కురు క్షేత్రమును రక్షించెనో అట్టి తన ధనుస్సు యొక్క నారిని దించెను. భీమసేనుడు దేనిచేత యుద్ధమునందు పాంచాల దేశములను జయించెనో, తాను ఏకాకియై అనేక శత్రువులను జయించెనో, దేని టంకార ధ్వని పర్వతము చీలినప్పుడు, పిడుగు పడినప్పుడు కలుగు ధ్వనివలె శత్రువులను యుద్ధ భూమినుండి

పలాయితులను చేసెనో, దేనిచేత సైంధవుని అతడు ఓడించెనో, అట్టి తన ధనుస్సుయొక్క నారిని దించెను.

తామ్రమువలె ఎఱ్ఱని ముఖము గలిగి, మితభాషియై ఇతనితో సమానుడైన వాడు ఆ కులమందు లేనందుచేత 'నకులుడు' అను పేరుతో నొప్పుచు, యుద్ధమునందు ఇంద్రుని శౌర్యముతో సమానమైన శౌర్యముగలవాడైన నకులుడు, దేని చేత పశ్చిమ దిక్కును జయించెనో అట్టి ధనుస్సు నారిని దించెను. సహదేవుడు గూడ దేని సహాయముతో దక్షిణ దేశమును జయించెనో అట్టి తన ధనుస్సు త్రాటిని దించెను. అతడు మహాశక్తి సంపన్నుడు, శాస్త్రానుకూలమైన నడవడిక గలవాడు, ఉదారుడు.

పాండవులు తళతళ మెఱయుచు అతిదీర్ఘములుగా నున్న ఖడ్గములను, అంబుల పొదులను, పదునైన చురకత్తులను "పాతములు" అను నాయుధములను గూడ తీసి ధనువులతో పాటు ఉంచిరి.

తరువాత యుధిష్ఠిరుడు నకులునితో నిట్లనెను:-

"వీరకుమారా! ఈ శమీ వృక్షముపైనెక్కి మన ఆయుధములను దానియందు ఉంచుము."

ఆ మాట విని నకులుడు, ఆ చెట్టు పైనెక్కి ఆక్కడ అవకాశము (ఖాళీ) ఉన్న చోట్లలో ఆయుధములను ఉంచెను. ఆ యవకాశ స్థలములు నకులునకు దివ్యరూపము గలవిగా కనపడెను

మేఘములు అడ్డముగా వర్షించి, నీరు పడనట్టి చోట్లలో, ఆయుధములను గట్టి త్రాళ్ళతో బిగ్గరగా బంధించియుంచెను. అ స్థలమునందొక మృత శరీరమును గూడ గట్టెను. దానిని చూచిన జనము 'ఇక్కడ శవము గట్టబడినది అని దుర్గంధమును ఆఘ్రాణించి దూరము నుండియే విడిచెదరు' అని వారు తలచిరి.

అక్కడ తిరుగుచున్న గొల్లవారు అడుగగా, "ఈమె మా తల్లి, ఎనుబది యేండ్ల వృద్ధురాలు ఈ విధముగా, శవ దహనము చేయకుండ ఇట్లు చెట్టుకు వ్రేలాడగట్టుట మా కుల ధర్మము, ఇది మా పూర్వుల ఆచారము" అని చెప్పు చుండిరి.

తరువాత వారు విరాటనగర సమీపమునకు పోయిరి. 'జయ-జయంత-విజయ-జయత్సేన - జయద్బల నామములను వరుసగా ఐదుగురికి రహస్య నామములను యుధిష్ఠిరుడు పెట్టెను.

తరువాత పాండవులు తమ ప్రతిజ్ఞననుసరించి అజ్ఞాతవాసము చేయుటకు విరాట నగరములో ప్రవేశించిరి.

(ఇక్కడ పాండవులు శవమును బంధించిన కొమ్మవైపు వేలుచూపుచు గోపాలురతో 'ఈమె మా తల్లి' అని అసత్యము చెప్పిరి. అసత్య పరిహార మెట్లనగా, 'మా శస్త్రాస్త్రములను రక్షించుచున్న ఈ శమీవృక్షము మాకు తల్లితో సమానము' అని చెప్పినట్లైనది వాస్తవముగా వారి సంకేతము శమీవృక్షమును గూర్చియే చేయబడినది. శవమును బంధించు నెపముచేత శస్త్రాస్త్రములను బంధించిరి. ఈ విధముగా శస్త్రాస్త్రములను కట్టియుంచుట, వారి పూర్వుల చేత అనుష్ఠించబడిన కులధర్మమును చెప్పిరి అని తాత్పర్యము).

దుర్గాస్తుతి

విరాట నగరమునకు పోవుచు యుధిష్ఠిరుడు మనస్సులో దుర్గాదేవిని యిట్లు స్తుతించెను: "దేవీ! నీవు త్రిభువనములకు ఈశ్వరివి యశోదా గర్భమునుండి జనించిన దేవివి, నారాయణమూర్తికి మిక్కిలి ప్రియురాలవు నందగోప కులము నందు పుట్టిన దేవివి, మంగళకరురాలవు, కులవర్ధనురాలవు, కంసుని పారద్రోలిన దేవివి, రాక్షసులను నశింపజేసిన కాళికా మూర్తివి. పూర్వము కంసుడు శిలపైన కొట్టినప్పుడు ఆకాశమునకు ఎగిరిపోయినట్టి దేవివి, వాసుదేవుని సోదరివి, దివ్య పుష్పమాలలను, దివ్యాస్త్రములను, ఖడ్గాద్యాయుధములను ధరించినట్టి దేవివియునగు దుర్గామాతా! భూభారావతరణమునకుగాను ఎవరు నిన్ను స్మరించెదరో అట్టివారిని నీవు పాపములనుండి విముక్తులనుచేసి, పంకమునందు చిక్కుకొనిన గోవును ఉద్ధరించినట్లు ఉద్ధరించెదవు."

దుర్గాదేవిని ఆహ్వానించి తన తమ్ములతో ఆ దేవిని దర్శించదలచి యుధిష్ఠిరుడు అనేక విధములుగా దుర్గాదేవి మహిమలను వర్ణించి యిట్లు స్తుతించెను:-

"దేవీ! ఆపన్నులు నిన్ను ధ్యానించగా వారి ఆపదలన్నియు పోగొట్టి సుఖము గలిగింతువు. నేను రాజ్యభ్రష్టుడనై నిన్ను శరణు జొచ్చితిని, నీకు నమస్కరించెదను. నన్ను రక్షింపుము."

ఇట్లు స్తోత్రము చేయుచున్న యుధిష్ఠిరునకు దర్శనమిచ్చి యా దేవి యిట్లనెను:—

దుర్గాదేవి వరమిచ్చుట

"రాజా! నా మాట వినుము. త్వరలోనే నీకు యుద్ధమునందు విజయము కలుగును. నా అనుగ్రహమువలన నీవు కౌరవ సైన్యమును సంహరించి శత్రు రహితమైన రాజ్యమును, నీ తమ్ములతో అనుభవించుచు ప్రీతిని పొందెదవు. నీకు సౌఖ్యము, ఆరోగ్యము కలుగ గలవు.

నన్ను భక్తితో కీర్తించిన వారలకు నేను సంతుష్టురాలనై రాజ్యమును, ఆయువును పుత్రపౌత్రాదులను ఇచ్చెదను.

ఎవరు నన్ను, ప్రవాసమునందు, నగరమునందు, యుద్ధమునందు, శత్రువులవలన సంకటము కలిగినప్పుడు అడవియందు, సముద్రమునందు, పర్వతమునందు నీవలెనే స్మరించెదరో, వారికి దుర్లభమైనదేదియు మూడు లోకములందు ఉండదు. విరాటనగరమునందు మిమ్ము ఎవ్వరుగూడ తెలిసికొన జాలరు. ఇది నా వరము."

ఇట్లు దుర్గాదేవి పాండవులను దీవించి అంతర్ధానము చెందెను.

ధర్మరాజు విరాటు సభకు పోవుట

"తరువాత పాండవులు పవిత్ర గంగానదికిపోయి స్నానము చేసి దేవ-ఋషి-పితృతర్పణములను చేసిరి. యుధిష్ఠిరుడు, అగ్నిహోత్ర-జప-పారాయణములను చేసి, యముడు తనకిచ్చిన వరములను స్మరించుకొనుచు తూర్పు దిక్కుగా పోవుచు యమధర్మరాజునకు నమస్కారము చేయుచు నిట్లు తలచెను:

"నా తండ్రి నాకు వరము నిచ్చెను. దప్పిగొని కొలనులో ప్రవేశించి పడి పోయిన నా తమ్ములను రక్షించెను తన ప్రశ్నలకు నేను చెప్పిన ఉత్తరములు విని సంతోషించెను.

నా బుద్ధి సర్వదా ధర్మమునందు ఆసక్తిగలిగి యుండునట్లును, ఈ పడి పోయిన నా తమ్ములు జీవించి యథాపూర్వముగా రూపమును ఆకృతియు పొందు నట్లును, ఓర్పు-కీర్తి-వ్రతనిష్ఠ, సత్యనిష్ఠ —నాకు గలుగునట్లును ఆయన నాకు

వరములను ప్రసాదించెను. ఆ యమధర్మరాజు మాటలు ఎప్పుడుగూడ అసత్యములు కావు."

ఈ విధముగా యమధర్మరాజును స్మరించుచు యుధిష్ఠిరుడు, అతని అనుగ్రహముచేత తాను కోరిన రూపమును ధరించెను.

ఎట్లనగా, అతడు తలచినంత మాత్రమున బ్రాహ్మణుడై, యువకుడై, త్రిదండధారియై, కమండలువును, తలపాగయు ధరించినవాడై, కాషాయ వస్త్రధారియై, శిఖను ధరించినవాడై, దర్భ పవిత్రమును చేత ధరించినవాడై సన్యాసి వేషమును ధరించెను.

ఆ విధముగానే భీమసేనాదులుగూడ యమధర్మరాజు వరప్రభావముచేత అజ్ఞాతవాసములో తాము కోరిన వేషములను ధరించిరి.

యుధిష్ఠిరుడు మొట్టమొదట విరాటరాజు కొలువులో ప్రవేశించెను. ఆయన కక్షము (చంక)నందు వైడూర్యమణి నిర్మితములైన పాచికలు ఒక వస్త్రములో కట్టబడియుండెను.

కురువంశ వర్ధనుడు, మహానుభావుడు, యశస్వి, రాజాధిరాజులచేత సత్కరింపబడినవాడు. తీక్ష్ణ విషముగల సర్పమువలె శత్రువులకు అక్రమణీయుడు కానివాడు, బల-రూపములయందు నరోత్తముడు, అపూర్వ రూపముచేత దేవతా సమానుడు, మహామేఘ సమూహముల చేత చుట్టబడిన సూర్యునివలె, నివురుగప్పిన నిప్పువలె, మేఘావృతుడైన చంద్రునివలె వచ్చుచున్నట్టియు, పూర్ణచంద్ర సమాన ముఖము గలిగినట్టియు మహానుభావుడైనట్టి పాండవాగ్రజుడు విరాట సభలో ప్రవేశించగనే విరాటరాజు దృష్టిని ఆకర్షించెను.

అప్పుడు విరాటుడు సభలోని అమాత్యాది సభాసదులను "ఎవడితడు? రాజువలెనున్నాడు. మొట్టమొదటిసారిగా ఈ సభకు వచ్చినాడు.

ఇతడు బ్రాహ్మణ వేషములోనున్నాడుగాని బ్రాహ్మణుడు కాడని తోచుచున్నది. ఇతడొక రాజు అని నా నిశ్చయము. ఇతనికి సేవకుడుగాని, రథముగాని, గజముగాని వెంటరాలేదు. ఇంద్రునివలె ప్రకాశించుచున్నాడు. ఈతని శరీరాకార చిహ్నములచేత నితడు మూర్ధాభిషిక్తుడైన చక్రవర్తియని నా నిశ్చయము. మదపుటేనుగు కమల సరస్సులో ప్రవేశించునట్లుగా నితడీ సభలో నవలీలగా ప్రవేశించుచున్నాడు" అని యనెను.

ఇట్లు విరాటరాజు అనుచుండగానే యుధిష్ఠిరుడు సభలో ప్రవేశించి విరాట రాజుతో నిట్లనెను:-

"రాజా! నేను సర్వస్వమును పోగొట్టుకొని జీవనార్థినై వచ్చిన బ్రాహ్మ డను. నేను నీ వద్ద యథేచ్ఛగా నుండగోరుచున్నాను."

ఆ మాటలు విని సంతోషించి విరాటరాజు అతనికి సమస్కరించి యిట్లె నెను:

"ద్విజోత్తమా! నీకు స్వాగతము. నీవు ఏ రాజు రాజ్యమునుండి వచ్చి తివి? నీ నామ గోత్రము లెవ్వి? నీవు ఏ విద్యలో పండితుడవు?"

ఇట్లు యడుగగా యుధిష్ఠిరు డిట్లనెను:-

"రాజా! నేను పూర్వము యుధిష్ఠిరునకు మిత్రుడనై యుంటిని, వైయా ఘ్రపద' గోత్రమునందు పుట్టిన బ్రాహ్మణుడను, 'కంక' నామముతో ప్రసిద్ధు డను. నేను పాచికల నాడుటయందు కుశలుడను."

ఆ మాటకు విరాటరాజు ఇట్లనెను:-

"ద్విజోత్తమా! నీవు కోరిన వరమిచ్చెదను. మత్స్య దేశములను ఏలు కొనుము. నీకు వశుడనై యుండెదను, నాకు అక్షవిద్యలో పూజ్యులైన జూద రులు ప్రియులు. దేవసమానుడవైన నీవు రాజ్యమేలుటకు అర్హుడవు."

అది విని యుధిష్ఠిరుడు ఇట్లనెను:-

"మత్స్యరాజా! నేను హీనజాతివానితో వివాదము చేయుటకు ఇష్టపడను. ఇది నా మొదటి వరము, జూదమున నాచే నోడినవాడు నాకు ఓడిన ధనమీయ వలెను. ఇది రెండవ వరము."

ఆ మాటకు విరాటుడు ఇట్లనెను:-

"నీకు ఎవడైన అప్రియము చేసినచో వారిని సంహరించెదను. ఒకవేళ బ్రాహ్మణులు నీకు అపరాధము చేసినచో వారిని దేశమునుండి వెడలగొట్టెను."

ఇట్లు యుధిష్ఠిరునితో చెప్పి యితర సభాసదుల దిక్కు మొగమై "నా రాజ్యము నంతటి ప్రజలెల్లరకు తెలియుగాక! నేను ఈ మత్స్య దేశమునకు రాజైనట్లే యా కంకుడుగూడ రాజ్యాధికారము గలవాడై యుండును" అని చెప్పి తిరిగి యుధిష్ఠిరునితో నిట్లనెను:-

"కంకభట్టా! నేటి నుండి నీవు నా మిత్రుడవు. నేనెక్కి తిరుగు వాహనము వంటిదే నీ వాహనము గూడ ఉండగలదు. నేను ధరించు వస్త్రముల వంటివే నీకు గూడ నుండును. అన్న పానాదులు గూడ సమృద్ధిగా నీకు లభించును. నా రాజ్యమునందు ఆంతరంగికములు - బహిరంగములునైన సర్వ వ్యవహారములందు నీకు అధికారము ఉండగలదు. నా వద్దకు వచ్చుటకు ఎప్పుడు గూడ నీకు ఏ యాటంకము ఉండబోదు.

వృత్తిహీనులై బాధపడుచు, తాము పోగొట్టుకొనిన గృహక్షేత్రాదులు తిరిగి పొందుటకై వచ్చిన వారిని గూర్చి నీవు నాకు తెలిపినచో వారికి అది యంతయు నిచ్చెదను నా దగ్గర నీకు ఏ మాత్రము భయముగాని, సంకోచము గాని లేదు."

ఈ విధముగా విరాట, యుధిష్ఠిరులకు మొదటి పరిచయము కలిగెను. విష్ణువుకు ఇంద్రునితో సమాగమము గలిగినట్లు. విరటునికి యుధిష్ఠిరునితో సంబంధ మేర్పడెను.

తన సభను విశేషముగా ప్రకాశింపజేయుచున్న యుధిష్ఠిరుని జూచి విరాటుడు మిక్కిలి తృప్తిచెందెను. యుధిష్ఠిరుడు విరాటరాజు చెలిమిని సంపాదించి అతనిచేత ఆదరింపబడుచు సుఖముగా నుండెను. అతని నిజ స్వరూపము ఎవరికిని తెలియకుండెను.

భీముడు విరాటుసభకు పోవుట

అటు తరువాత భీమపరాక్రముడైన భీముడు సింహగమనముతో విరాట సభకు, తన చేతిలో ముద్దగరిటె, గరిటె, కూరలు తరుగు కత్తి పట్టుకొని వచ్చెను. అతడు వర్చస్విగా ప్రకాశించుచు, నల్లని వస్త్రములు ధరించి, పర్వతమువంటి బలము గలవాడుగా ఒప్పుచు వంటలవాని రూపముతో మత్స్యరాజు కడకు వచ్చి నిలిచెను.

విరాటరాజు ప్రసన్నతతో చూచి పౌరులతో "ఇతడు సింహబలుడుగాను, రూపవంతుడుగాను కనబడుచున్నాడు సూర్యునివలె తేజరిల్లు ఇటువంటి పురుషుని మన మెప్పుడుగూడ చూడలేదు. ఇతడిక్కడికి వచ్చుటలో కారణమును ఊహించలేకున్నాను. ఇతడు గంధర్వరాజో, యింద్రుడో అయి యుండును. ఇతడు కోరిన వస్తువులను నానుండి పొందుగాక!" అనెను.

ఆ మాటలు వినిన విరాటరాజపురుషులు త్వరగా భీముని వద్దకు పోయి విరాటరాజు చెప్పిన విధానముగా అనిరి.

భీముడు విరాటరాజును చూచి నమస్కరించి యిట్లనెను:-

"రాజా! నేను వంటలవాడను నా పేరు 'బల్లవుడు'. ఉత్తమముగా వంట చేసెదను. నన్ను మీవద్ద పనిలోకి తీసుకొనుడు."

ఇట్లు గంభీరముగా చెప్పిన భీముని మాటకు విరాటుడు ఇట్లనెను:

''బల్లవా! నీ యాకార రూపములు చూడగా వంటల వానివలె కన్పడవు. ఇంద్రునితో సమానము శోభిల్లుచున్నావు. నరశ్రేష్ఠుడవుగా నున్నావు." అది విని భీముడు ఇట్లనెను:-

''రాజా! నేను వంటచేయుటకు వచ్చిన మీ సేవకుడను. వివిధములైన వంటకములను చేయుట నాకు తెలియును. నేను వండు పదార్థములు మేలురకములుగా నుండును.

రాజా! పూర్వము నేను యుధిష్ఠిర మహారాజువద్ద వంట చేయుచుంటిని. నా వంటను ఆ రాజు మెచ్చుకొనుచుండెను

బలములో నాకు సమానుడు మరియొకడు లేడు మల్లయుద్ధము (కుస్తీ పట్టుట)లో సమర్థుడను. గజములను, సింహములను ఎదుర్కొనగలను. ఎల్లప్పుడు నీకు ప్రియము చేకూర్చెదను."

ఆ మాటలు విని విరాటుడు ఇట్లనెను:-

"బల్లవా! నీవు కోరిన పనిలో నిన్ను చేర్చుకొనుటకు సంతోషముతో అంగీకరించెదను. వంట పనిలో నీవు కుశలుడవని చెప్పుచున్నావు నా పాకశాలలో నుండుము.

"కాని ఈపని నీకు యోగ్యమైనది కాదని నా నిశ్చయము. నీవు సముద్ర ముద్రితమైన సమస్త భూమండలమును ఏలుటకు తగిన వాడవుగా కనబడు చున్నావు".

"జనమేజయా! ఈ విధముగా భీమసేనుడు పాకశాలలో నియమింపబడి విరాట రాజుకు అత్యంత ప్రియుడుగా నుండెను. విరాట రాజ్యమునందుగాని, పాకశాలయందుగాని ఎవరుగూడ అతనిని గుర్తుపట్టకుండ మెలగెను."

అనిచెప్పి వైశంపాయనుడు తరువాతి వృత్తాంతము నిట్లు చెప్పదొడగెను:-

ద్రౌపది సుదేష్ణాదేవివద్దకు చేరుట

"జనమేజయా! ద్రౌపది సైరంధ్రి వేషముతో మృదులములైన తన కేశములను పైకిఎత్తి దక్షిణ పార్శ్వమునందు ముడుచుకొని, మలినమైన వస్త్రములను ధరించి, దీనురాలివలె విరాట నగరమునందు సంచరించుచుండెను.

అట్లు తిరుగుచున్న ద్రౌపది కడకు అనేకులు స్త్రీ పురుషులు వచ్చి 'నీవెవతెవు? ఏమి చేయగోరుచున్నావు?' అని అడుగదొడగిరి.

అప్పుడు ద్రౌపది వారితో నిట్లనెను:-

"నేను సైరంధ్రిగా నిక్కడకు వచ్చినాను."

(సైరంధ్రియనగా 'నితరుల యింటిలో తన గౌరవమునకు భంగము లేకుండా, నీచకార్యములు, ఊడిగములు చేయకుండ రాణివాసములో వస్త్ర మాల్యాభరణముల కార్యము చేయు స్త్రీ' యని యర్థము ఈ విధముగా ఇతరుల యింట తలదాచుకొనిన స్త్రీలు 'దమయంతి - ద్రౌపది' యిరువురే మనకు ప్రసిద్ధముగా తెలిసియున్నారు).

నన్నెవరైన కొలువులోకి తీసుకొనినచో వారి యింటిలో సైరంధ్రి కార్యములను (జడలు అల్లుట, గంధము తీయుట, పూవులు ముడుచుట మొదలగు పనులు) చేసెదను.

ఆమె ఆ యాకారరూపములు మాటలు విని పౌరులు 'ఆమె అన్నార్థియై ఒకరి యింట సేవచేయుటకు వచ్చినది' యని నమ్మజాలకుండిరి.

విరాటరాజు భార్య కేకయరాజు పుత్రియునైన సుదేష్ణ తన యంతఃపురపు పైభాగమున నిలిచి నగర శోభను తిలకించుచు ద్రౌపదిని చూచెను. సౌందర్యము గలిగి అనాథురాలై ఏకవస్త్రమును ధరించియున్న ద్రౌపదిని సుదేష్ణ పిలిచి యిట్లనెను :

"కల్యాణీ! నీవెవతెవు? ఏమి పని చేసెదవు?

ఆ మాటకు ద్రౌపది యిట్లనెను:-

"నన్ను సైరంధ్రినిగా కొలువులోనికి నియమించుకొనినయెడల మీరు చెప్పినపని చేసెదను."

ఆ మాటకు సుదేష్ణ యిట్లనెను:-

"భామినీ! నీ రూపసౌందర్యములు సైరంధ్రిగా నుండుటకు తగినట్లుగా లేవు. ఎందరినో దాసదాసీ జనమును అధీనములోనుంచుకొని వారితో ఊడిగము చేయించుకొనగలదానవుగా కనబడుచున్నావు.

నీ కాలి చీలమండలు ఎత్తుగాలేవు; ఊరువులు కలిసికొనిలేవు; నీ నాభి, వాణి, బుద్ధి ఈ మూడును గంభీరముగా నున్నవి (గంభీరము అనగా 'నాభి' యనునర్థమునందు 'లోతు' అనియు, వాక్కు-బుద్ధి అను నర్థముయందు 'మనో వికారమును ప్రకటించనివి' అనియు నర్థము). ముక్కు, చెవులు, కన్నులు, స్తనములు, నఖములు, గొంతు- ఈ యారు అంగములు ఉన్నతములుగా నున్నవి.

నీ హస్త పాద తలములు, కన్నుల కొనలు, పెదవులు, నాలుక, నఖములు- ఈ యైదును ఎఱ్ఱగా నున్నవి. హంసవలె మధుర-గద్గదముగా మాట్లాడుచున్నావు. నునుపైన కేశములు - ఉన్నతములైన స్తనములు - శ్యామసుందరమైన వర్ణము, వర్తులోన్నతమైన జఘన భాగము ఈ మొదలైన అంగసౌష్ఠవము చేత నీవు ఉత్తమజాతి స్త్రీ గానే కనబడుచున్నావు

కాశ్మీరదేశోద్భవమైన ఆడు గుఱ్ఱమువలె అనేక శుభలక్షణములు గలిగి యున్నావు. శరదృతువునందలి కలువల వంటి కన్నులు.కలువల సుగంధము గలిగి యున్నావు.

ఈ మొదలైన గుణములు ఉత్తమజాతి స్త్రీకే ఉండును నీవు దాసివిగావు. కనుక నీవెవతెవో చెప్పుము దేవతాస్త్రీవో, నాగకన్యకవో లేక ఈ నగరమునకు అదిదేవతవో, చంద్రుని పత్ని రోహిణివో, అప్సరస్త్రీవో, దిక్పాలకులలో నొకరి పత్నివో, లేక సాక్షాత్ బ్రహ్మదేవుని పత్ని సరస్వతివో అయియుందువు"

ఆ మాటలు విని ద్రౌపది యిట్లనెను:

"దేవీ! నేను దేవ-గంధర్వ-యక్ష-రాక్షస స్త్రీలలో నెవతగూడ కాను. నేను సైరంధ్రిని. సేవచేయుటకు వచ్చినాను. సత్యము చెప్పుచున్నాను

స్త్రీలకు జెడలు అల్లి, కొప్పులు ముడుచుట, సుగంధద్రవ్యములు నూరుట, విచిత్రములైన పుష్పమాలికలు కట్టుటకును నాకు బాగుగా తెలియును.

పూర్వము శ్రీకృష్ణుని పత్ని సత్యభామను, పాండవ పత్ని ద్రౌపదిని సేవించినాను. దేశమునందు సైరంధ్రీవృత్తితో జీవనము గడపికొనుచుందును. లభించిన వస్త్రములను ధరించుచుందును. నాకు ద్రౌపదీదేవి 'మాలిని' అని పేరు పెట్టినది."

ఆ మాటలు విని సుదేష్ణ యిట్లనెను:-

"సుందరీ! నిన్ను తలపైన పెట్టుకొని ఆదరించెదను. ఒకవేళ రాజు నిన్ను ఇచ్చట ఉంచుటకు ఇష్టపడకున్నను నేను తప్పక నాకడ ఉంచుకొనెదను.

ఈ రాజభవనము నందున్న స్త్రీలే అసక్తిగా నిన్ను చూడగా పురుషులు నీ యెడ మోహితులగుదురని చెప్పవలసిన యక్కరలేదు. నా భవనమునందున్న వృక్షములు గూడ నిన్ను చూచుటకై వంగినవా యన్నట్లు వంగియుండగా నిక పురుషుల మాట చెప్పనేల?

విరాటరాజు ఒకవేళ నిన్ను చూచినచో, మానవాతీతరూప సౌందర్యములు గల నీ శరీరమును చూచి నన్ను విడిచి నీ యందే ఆసక్తుడగును.

సుందరీ! నీవు ఏ పురుషుని చూచినను అతడు సంపూర్ణముగా నీ యెడల కామమోహితుడై నీకు వశుడు కాగలడు ఏ పురుషుడు సర్వదా నిన్ను చూచునో అతడు తప్పక కామవశుడగుననుటలో సందేహము లేదు.

నిన్ను నా యింటిలో నుంచుకొనిన నేను, ఆత్మహత్యకై చెట్టుపైకి ఎక్కిన వానిగతికి లోనగుదును. ఎండ్రకాయ తన మృత్యువు కొరకే గర్భధారణ చేసికొనుగతి, నిన్ను నా యింటిలో నుంచుకొనినందు వలన నాకు పట్టును."

ఆ మాటలు విని ద్రౌపది సుదేష్ణతో నిట్లనెను :-

"దేవీ! నన్ను విరాటరాజుగాని, లేక మరి యేయితర పురుషుడుగాని పొందజాలడు, యువకులైన గంధర్వులు నా పతులు ఐదుగురున్నారు. వారు మహా బలపరాక్రమవంతుడైన యొక గంధర్వరాజు యొక్క పుత్రులు. (పాండురాజు గంధర్వరాజుతో సమానుడు అని భావము.) వారు ఎల్లప్పుడు అదృశ్యముగా నుండి నన్ను రక్షించుచుందురు.

నేను కూడ స్వయముగా శక్తిమంతురాలను. ఇతరుల ఆక్రమణకు లోబడు దానను కాను. నన్ను ఎవ్వరుగూడ జెనకజాలరు,

నేను సేవచేయు నింటిలో, ఎవరు నాకు వారి యెంగిలి అన్నము పెట్టరో, తమ కాళ్ళను నాచేత కడిగించుకొనరో, అట్టి వారి యెడల గంధర్వులు ప్రసన్నులై యుండెదరు.

ఎవరు నన్ను సామాన్య స్త్రీలనువలె బలాత్కరించి పొందదలచెదరో, అట్టివారిని ఆ రాత్రియే పరలోకమునకు నా పతులు పంపెదరు.

ఎవరుగూడ నా పాతివ్రత్యమును భంగపరచజాలరు. నా పతులు బల వంతులు, తీవ్రస్వభావము గలవారు. గుప్తముగా నన్ను సర్వదా రక్షించుచు, నాపై కన్ను వేసిన వారిని కఠినముగా దండింతురు."

ఆ మాటలు విని సుదేష్ణాదేవి ద్రౌపదితో నిట్లనెను:-

"అలాగైనచో నిన్ను నా యింటిలో నుంచుకొనెదను. నీవు ఇతరుల ఎంగిలిగాని, పాదములనుగాని తాకవలసిన యవసరము లేదు."

"జనమేజయా! ఈ విధముగా సుదేష్ణచేత ఆదరింపబడి ద్రౌపదీదేవి ఆ నగరమునందు, తన పాతివ్రత్యమును కాపాడుకొనుచుండెను. ఆ నగరము నందు ఆమెను ఎవరుగూడ గుర్తుపట్టజాలనట్లుగా నుండెను."

అని చెప్పి వైశంపాయన మహాముని జనమేజయునితో తరువాతి వృత్తాంతమిట్లు చెప్పదొడగెను:

సహదేవుడు విరాటసభకు పోవుట

"సహదేవుడు గోపాల వేషభాషలతో విరాటరాజు వద్దకు పోయెను. అక్కడ రాజభవన సమీపముననే యున్న గోశాలకు పోయి నిలిచియుండెను.

అతనిని ప్రాసాదము నుండి విరాటరాజు చూచి సేవకులచేత పిలిపించెను. మహా ప్రతిభాశాలిగా వచ్చుచున్న సహదేవుని చూచి విరాటుడు విస్మయము చెంది యెదురేగి యాతనిని తోడ్కొనివచ్చెను.

"నీవెవడవు? ఎవని పుత్రుడవు? ఎక్కడినుండి వచ్చితివి? ఏ పని చేయ గోరి వచ్చితివి? నిన్నెప్పుడు నేను చూడలేదు. నిశ్చయముగా చెప్పుము" అని విరాటరాజు అడిగెను.

ఆ యిరువురికి నిట్లు సంభాషణము జరిగెను:

సహ :- "రాజా! నేను వైశ్యజాతివాడను. నా పేరు 'అరిష్టనేమి' యందురు. నేను పాండవుల వద్ద గోవుల రక్షణము-వాటి గణనము మొదలైన పనుల యందు నియుక్తుడనై యుంటిని. ఇప్పుడా పాండవు లెక్కడ నున్నారో తెలియక, నీకడ నివసించుటకు వచ్చినాను.

ఏ పనియు చేయకుండ జీవనము గడపుట శక్యము కాదు. నీవు దప్ప నితరులవద్ద వసించుటకు నాకు ఇష్టములేదు."

విరా :- "భద్రపురుషా! నీవు బ్రాహ్మణుడవో లేక క్షత్రియుడవో అయి యుందువు. సమస్త భూమండలములు నేలు చక్రవర్తి వంటి రూపముతో ప్రకాశించుచున్నావు.

వైశ్యకర్మ అనగా గోపాలనము. అది నీకు యోగ్యమైనది కాదు. ఏ దేశము నుండి వచ్చితివి? ఏ కళను నీవు నేర్చితివి? మా వద్ద నీవు సర్వదా ఏ పని చేయుచునుండగలవు? నీకు వేతన మెంతకావలెను?"

సహ :- రాజా! యుధిష్ఠిర మహారాజు వద్ద ఉత్తమ గోవర్గములు ఎనిమిది లక్షలు ఉండెను. ఒక్కొక్క వర్గమునందు నూరు నూరు గోవులుండెను. ఇవి గాక యితర విధములైన గోవుల వర్గములు ఒక లక్ష, అటువంటివే యితర వర్గములు రెండు లక్షలు ఉండెను. ఒక్కొక్క వర్గము నందు నూరు నూరు గోవులుండెను.

ఆ గోవుల పర్యవేక్షణము నందు, గణనము నందు నేను నియుక్తుడనై యుంటిని. వారు నన్ను 'తంతిపాలుడు' అను పేరుతో పిలుచుచుండిరి.

నాలుగు దిక్కుల యందు పది యోజనముల (ఆమడలు) విస్తీర్ణము వరకు ఉన్న గోవుల యొక్క భూత-భవిష్యత్-వర్తమాన సంఖ్యలు అన్నియు నాకు తెలిసియుండెను. ఈ మొత్తము గోవుల సమాచారమంతయు నాకు తెలిసి యుండెను.

ఈ నా గుణములన్నియు యుధిష్ఠిర మహారాజుకు బాగుగా తెలిసియుండెను. నా యెడల యుధిష్ఠిరుడు మిక్కిలి సంతుష్టితో నుండెను.

ఏయే ఉపాయముల చేత గోవుల సంఖ్య అభివృద్ధి చెందునో, వాటికి రోగములు రాకుండనుండునో ఆ ఉపాయములన్నియు నాకు తెలియును.

మహారాజా! ఈ కళ లన్నియు నేను బాగుగా నేర్చుకొన్నాను. ఇదియే గాక ఉత్తమ జాతి వృషభములను గూడ నేను ఎరుగుదును. అట్టివాని మూత్రమును మూర్కొనినంత మాత్రమున గొడ్డుటావులు గూడ గర్భధారణ పొంది సంతానోత్పత్తికి యోగ్యము లగును."

విరా :- తంతిపాలా! నావద్ద ఒక లక్ష గోవులున్నవి. వాటిలో కొన్ని ఒకటే రంగు కలవి. మరికొన్ని మిశ్రిత వర్ణములు గలిసియున్నవి.

ఈ విధముగా వివిధ వర్ణములతో నొప్పారుచున్న గోవుల నన్నింటిని ఈనాటినుండి నీ యధీనములో నుంచెదను.

"జనమేజయా! ఈ విధముగా సహదేవుడు విరాటరాజుచేత గాని, ఆ దేశ ప్రజలచేతగాని తెలియబడకుండ అక్కడనే నివసించుచుండెను. ఆతడు కోరిన వేతనమును విరాటరాజు అతని కిచ్చుచుండెను."

అని వైశంపాయన మహాముని చెప్పి, తరువాతి వృత్తాంతమును జనమేజయ మహారాజునకు ఇట్లు చెప్పదొడగెను:

అర్జునుడు విరాట సభకు పోవుట

"జనమేజయా! ఆ తరువాత విరాట రాజుకు ఆ సమీపము నందున్న యొక మట్టి దిబ్బపై నిలిచియున్న యొక పురుషుడు కనబడెను. ఆతడు అజానుబాహుడు. స్త్రీలు ధరించు వేషభూషణములను ధరించియుండెను. చెవులకు కుండలములు, చేతులకు శంఖముల గాజులు, వాటిపైన బంగారు కంకణములు తొడుగుకొని యుండెను. గంభీరమైన మదగజ గమనముతో నతడు విరాటు కడకు వచ్చి నిలిచెను.

కపట వేషములో తన స్వరూపమును దాచుకొని విరాజిల్లుచు వచ్చిన యర్జునుని చూచి విరాటరాజు సభాసదులతో నిట్లనెను :-

"ఇతడెక్కడినుండి వచ్చినవాడో! ఇంతకు పూర్వమెప్పుడు గూడ నేను ఇట్టి పురుషుని చూడలేదు."

ఆ మాటకు సభ్యులలో నెవడుగూడ బదులు చెప్పజాలకుండిరి.

అప్పుడు విరాటరాజు ఆశ్చర్యముతో నర్జునుని చూచెను.

వారిరువురికి నిట్లు సంభాషణము జరిగెను :-

విరా :- భద్రుడా! నీవు ధైర్యము బలము గలిగి దేవతలతో సమానుడవుగా నున్నావు. నీ శరీరకాంతి శ్యామముగా నున్నది గజయూథపతివలె గంభీరముగా తరుణరూపములో నున్నావు.

వెంట్రుకలు విరియబోసుకొని, స్త్రీల ఆభరణములను ధరించి యున్నావు. మెడలో పూలమాలికను ధరించినావు. స్త్రీజనోచిత వేషమున నున్నప్పటికి నీవు తద్విపతరీముగా ధనుర్బాణ కవచములను ధరించు వీర పురుషునివలె శోభిల్లుచున్నావు.

నీవు రథాది వాహనములపైన గూర్చుని యిచ్ఛానుసారముగా నా పుత్రునివలెగాని, నావలెగాని ఇక్కడ ఉండుము.

నేను వృద్ధుడనైనాను. రాజకార్యములను విడువదలచుచున్నాడు. ఈ మత్స్య దేశమును పాలింపుము. నీవంటి గంభీరోన్నత రూప సంపన్నుడు నపుంసకుడుగా నుండడు అని తలచుచున్నాను."

అర్జు :- రాజా! నేను జెడ అల్లెదను. కుండలములను, పుష్పమాలికలను నిర్మించగలను. కప్పికొను దుప్పట్లు (ఓణీల వంటివి) తయారు చేయగలను. స్నానము చేయించెదను. అద్దములను తుడుచుట, వివిధములైన చందన రేఖలను తీర్చుట మొదలైన అలంకార క్రియలను చేయుటలో నాకు నేర్పుగలదు.

నపుంసకులు, బాలకులు, సాధారణ జనుల యెదుట సంగీత-నృత్యకర్మలు చేయుటయందు నాకు మంచి యోగ్యత యున్నది. స్త్రీల కొప్పులలో పూలు ముడుచుట వంటి పనులు చేయగలను. ఈ పనులు చేయుటలో స్త్రీలు గూడా నన్ను మించజాలరు.

విరా :- నీవు నపుంసకుడనుటకు తగియుండలేవు. ఈ వేషములో నీవు శివునివలె మేఘావృతమైన సూర్యునివలె ప్రకాశించుచున్నావు. నీ ఆజాను బాహువులకు ధనుర్ధరత్వమే శోభిల్లును.

అర్జు:- రాజా! నేను పాడగలను ఆడగలను. వాద్యములు వాయించ గలను. నృత్య గీతములందు కుశలుడను. రాజా! ఉత్తరకు నృత్యగీతములు నేర్పెదను. నా రూపముతో నీకు అవసరమేమి?

నా పేరు బృహన్నల యందురు. తల్లిదండ్రులచేత విడువబడిన సుతుడు గానో, సుతగానో నన్నెరుగుము.

విరా:- 'బృహన్నలా!' నీ యిష్టము ప్రకారమే నీవిక్కడ ఉండి నా కూతునకు నృత్యగీతములు నేర్పుము. ఈ కార్యము నీకు తగనదికాదు. సముద్ర ముద్రితమైన భూమిని ఏలుటకు నీవు తగియున్నావు.

"జనమేజయా! తరువాత విరాటరాజు, బృహన్నలకు కళలలో, నృత్య-గాన-వాదిత్రములలో సామర్థ్యము ఉండుటను పరిశీలించి చూచెను.

విరాటుడు పిదప తన మంత్రులతో సంప్రదించి బృహన్నల యొక్క నపుంసకత్వమును స్త్రీలచేత పరీక్షింపజేసి, వారిద్వారా బృహన్నల నపుంసకుడే యని ధ్రువపరచుకొని కన్యాకాంతఃపురములోనికి పంపెను.

(ఈ సందర్భము నందు వేదవ్యాసముని

"సమ్మంత్ర్య రాజా వివిధైః స్వమంత్రిభిః పరీక్ష్య చైనం, ప్రమదాభి రాశువై" అని విరాటరాజు, తన మంత్రులతో సంప్రదించి బృహన్నల క్లీబత్వ మును స్త్రీలతో పరీక్ష చేయించినట్లు స్పష్టముగా వ్రాసినారు. తిక్కన యట్లుగాక-

"నైపుణ్యంబున నుచితంబు మైనరసి, పొచ్చెము లేమి దదీయసేవ గైకొనె" అని వ్రాసెను.

ఈ సందర్భమునందు కొందరు విమర్శకులు - 'స్త్రీలతో బృహన్నలను పరీక్షింపజేసి' అనుట అనుచితము. కాబట్టి వేదవ్యాసునిపై అనౌచిత్య దోషమును ఆరోపించెదరు. ఆ అనౌచిత్యము లేకుండ తిక్కన 'నైపుణ్యంబు ననుచితంబు మైనరసి' అని వ్రాసినాడని వ్యాసుని ఆక్షేపించెదరు.

విరాజరాజు వంటి మహారాజు తన కన్యకాంతఃపురము నందొక అపరిచిత వ్యక్తిని, అతడు తాను నపుంసకుడనని చెప్పగనే అతని మాట విశ్వసించి పంపుట అపాయకరమని తలచి అతని నపుంసకత్వమును స్త్రీలచే బాగుగా

పరీక్షింపజేయుట మిక్కిలి ఉచితము. ఇదిగాక వేదవ్యాస భగవానుడు ప్రత్యక్షముగా భారతేతిహాసమును చూచిన త్రికాలజ్ఞుడైన మహర్షి సత్తముడు. అట్టి మహానుభావుని, కావ్యశైలిలో వ్రాసిన తిక్కనను ప్రమాణముగా తీసుకొని ఆక్షేపించుట సరికాదు. ఇదిగాక, భారతము ఇతిహాసము. అనగా చరిత్ర. చరిత్ర ఉన్నదున్నట్లుగానే వ్రాయవలెను. అందులో ఔచిత్యానౌచిత్యములు చూడగూడదు. కవులు తమ ఇష్టమువచ్చినట్లు మార్చి, కాళిదాసు శాకుంతలమువలె వ్రాసెదరు. కనుక బ్రహ్మర్షి సత్తముని ఆక్షేపించుట ఏ మాత్రము సరికాదు.)

"తరువాత అర్జునుడు, విరాటకన్య ఉత్తరకు, ఆమె సఖీజనమునకు, ఇతర సేవకురాండ్రకును నృత్యగీత వాద్యములందు శిక్షణము నిచ్చుటకు ఆరంభించెను.

దీనిచేత అర్జునుడు వారికి అందరికి అభిమాన పాత్రుడయ్యెను. కపట వేషములో నున్నప్పటికిని అతడు కన్యకలతో మెలగునప్పుడు సర్వదా తన మనస్సును వశములో నుంచుకొని అందరికి ప్రియమయిన పనులు చేయుచుండెను.

రాజభవనమునందు గాని, యితరత్రగాని యెవరుగూడ నతని నిజ రూపమును కనుగొనజాలకుండిరి."

అని వైశంపాయన మహాముని చెప్పి తరువాతి కథ జనమేజయున కిట్లు చెప్పదొడగెను :

నకులుడు విరాట సభకు పోవుట

"జనమేజయా! నకులుడు విరాటరాజు కడకు వచ్చెను. అతడు వచ్చుచుండగా మేఘమునుండి వెలువడిన సూర్యునివలె నుండెను. అతడు ఇక్కడక్కడ తిరుగుచు గుర్రములను చూచుచుండెను. అప్పుడు విరాటుడు తన అనుచరులతో నిట్లనెను :

"దేవతా సమానుడయిన యీ పురుషుడెక్కడి నుండి వచ్చుచున్నాడు? మనకు తెలుపకయే మన అశ్వములను చూచుచున్నాడు. తప్పక యితడు అశ్వ విద్య లోపండితుడై యుండును. కనుక ఇతనిని శీఘ్రముగా నావద్దకు తోడ్కొని రండు."

రాజాజ్ఞచేత రాజసేవకులు తోడ్కొని వచ్చిన నకులునకు విరాటరాజునకు ఈ విధముగా సంభాషణము జరిగెను.

నకు :- "రాజా! నీకు జయమగుగాక! నేను అశ్వహృదయ విద్యలో నిపుణుడను. ఈ విద్యలో నన్ను అనేక రాజులు సన్మానించినారు. మీ గుఱ్ఱములకు నేను నేర్పుగల సారథిగా నుండెదను."

విరా :- "భద్రుడా! నీకు నేను వాహన-ధన-గృహము లిచ్చెదను. నీవు నా గుఱ్ఱములకు శిక్షణనిచ్చు సారథిగా నుండవచ్చును.

కాని, నీ వెక్కడినుండి వచ్చుచున్నావు? ఎవని పుత్రుడవు? ఎందుల కిచ్చటికి వచ్చినావు? నీకుగల కళా కౌశలమేమి? ఇవన్నియు మొదట నేను తెలిసికొనదలచుచున్నాను."

నకు :- "రాజా! పాండవ జ్యేష్ఠుడైన యుధిష్ఠిరునిచేత నేను అశ్వముల పరిరక్షణమునకై నియుక్తుడనయి యుంటిని. అశ్వముల జాతిని, వాటికి అన్ని విధములయిన శిక్షణముల నిచ్చుటను తెలిసినవాడను. దుష్టాశ్వములను సాధు మార్గములోనికి తెచ్చి వశపరచుకొను విద్యగూడ నాకు తెలియును.

గుఱ్ఱముల లోపములను కనిపెట్టి వాటికి చికిత్స చేయుట గూడ నాకు బాగుగా తెలియును. నా శిక్షణ పొందిన గుఱ్ఱములకు భయముండదు. నేను శిక్షణ యిచ్చిన గుర్రములకు ఏ విధమయిన దోషములుండవు.

నన్ను యుధిష్ఠిరుడు, అతని పురజనులు 'గ్రంథిక' నామముతో పిలుచుచుండిరి.

దేవేంద్రునికి మాతలివలె, దశరథునికి సుమంత్రుడువలె, పరశురామునికి సుమహుడువలె నేనుగూడ నీకు రథసారథిగా నుండి నీ యశ్వములకు మంచి శిక్షణ నిచ్చెదను.

యుధిష్ఠిరుని ఆజ్ఞచేత అతని లక్షకోట్ల గుఱ్ఱములకు సంరక్షకుడనుగా నుంటిని."

విరా :- "గ్రంథికా! నా వద్దనున్న సమస్త హయములు నీ యధీనములో నుండగలవు. నా గుఱ్ఱపు రౌతులు - సారథులుగూడ నీ వశములో నేటినుండి యుండగలరు. నీకు ఈ పని చేయుటయే యిష్టమైన యెడల, నీ వేతనముగా నీకు ఎంత ధనము గావలెనో చెప్పుము.

ఈ యశ్వ శిక్షణము నీకు తగిన పని కాదు. రాజువలె కనపడుచున్నావు. ఇప్పుడు నీ దర్శనము యుధిష్ఠిర దర్శనము వలెనే నాకు అత్యంత ప్రీతికరముగా నున్నది. యుధిష్ఠిరు డిప్పుడు అడవిలో సేవకులు, పరివారము లేకుండ ఎక్కడ ఎన్ని యిడుమలు పడుచున్నాడో కదా!"

"జనమేజయా! గంధర్వ సమానుడగు నకులుడు విరాటరాజుచేత గౌరవించబడిన వాడై అక్కడ ఉండెను. స్వేచ్ఛగా ఆ పట్టణములో తిరుగుచున్నప్పటికిని అతని నిజ స్వరూపమును రాజు గాని, ప్రజలుగాని కనుగొనజాలకుండిరి.

ఈ విధముగా పాండవులు మత్స్య దేశమునందు తమ ప్రతిజ్ఞప్రకారము ఉండుచు, అజ్ఞాతవాస కాలమును జాగ్రత్తగా గడపు చుండిరి. సమస్త భూమండలమును ఏలగల చక్రవర్తులైనను అతి కష్టముల ననుభవించు చుండిరి."

అని వైశంపాయన మహాముని చెప్పిన కథను జనమేజయ మహారాజు విని తిరిగి యిట్లు అడిగెను :-

"బ్రహ్మర్షీ! ఇట్లు పాండవులు ప్రచ్ఛన్నముగా మత్స్య నగరమునందు ఎట్లుండిరి?"

ఆ మాటకు వైశంపాయన ముని ఇట్లు చెప్పెను :-

"జనమేజయ మహారాజా! పాండవులు గుప్త వేషములో విరాటరాజును సేవించుచు, బిందుమహాముని యనుగ్రహము వలన, యమధర్మరాజు వరము చేతను విరాట నగరమునందు ఎవరికిని నెరుక పడకుండ నివసించుచుండిరి.

యుధిష్ఠిరుడు మత్స్య భూపతి సభలో సభ్యుడుగా నుండి, విరాటరాజునకు, అతని పుత్రులకు జూదమునందు వినోదము కలిగించుచుండెను. ఆ విద్యయందు పాచికలను, త్రాటితోగట్టి పక్షులను ఆడించినట్లు, తన యిష్టము వచ్చినట్లు ఆడించుచుండెను. అతడు ద్యూతమునందు గెలిచిన ధనమును రహస్యముగా తమ్ములకు, వారి వారికి తగినట్లు పంచి యిచ్చుచుండెను.

భీమసేనుడుగూడ అనేక విధములయిన భక్ష్య భోజ్యములను, అతనికి మత్స్యరాజు బహుమానముగా నిచ్చినవాటిని విక్రయించి, ఆ ధనమును యుధిష్ఠిరునకు అర్పించుచుండెను.

అంతఃపురమునందు లభించిన జీర్ణ వస్త్రములను అర్జునుడు గూడ విక్ర యించి పాండవులందరికి నిచ్చుచుండెను.

సహదేవుడు గూడ గోపాల వేషముతో పాలు పెరుగు అన్నలకు ఇచ్చు చుండెను.

అశ్వ శిక్షణ కార్యమునందు బహుమానముగా లభించిన ధనమును నకులుడుగూడ పాండవుల కిచ్చుచుండెను.

ద్రౌపది తన పతుల నందరిని జాగ్రత్తతో చూచుకొనుచు, ఇతరులకు ఎరుక పడకుండ సంచరించుచుండెను.

ఈ విధముగా పాండవులు పరస్పరము సహకరించుకొనుచు విరాట నగరమునందు గుప్తముగా మాతృగర్భము నందున్నట్లు సుఖముగా నుండిరి. దుర్యోధనుని వలన భయమును శంకించు చున్నవారై పాండవులు ద్రౌపదిని జాగ్రత్తతో కనిపెట్టుచు రహస్యముగా సంచరించుచుండిరి.

"ఇట్లుండగా, వారు అక్కడికి పోయిన తరువాత నాల్గవ మాసమునందు బ్రహ్మదేవుని ఉత్సవము అక్కడ జరిగెను. మత్స్య దేశ ప్రజలకీ యుత్సవము అతి ప్రియమయినది.

జనమేజయా ! ఆ యుత్సవ సమయమునందు విరాట నగరమునకు నలు దిక్కుల నుండి కుస్తీలు పట్టుటకు మల్లయుద్ధ విశారదులు వేలకొలదిగా వచ్చు చుండిరి. ఆ సమయమునందు, బ్రహ్మదేవుని సభవలె, శివుని సభవలె ఆ విరాట రాజధానిలో ప్రజలు గుంపులు గుంపులుగా సభదీర్చి సమావేశములు జరుపు చుండిరి.

"అక్కడికి మల్లయుద్ధము చేయుటకు వచ్చిన, మహాకాయులు, మహా బల వంతులు 'కాల ఖంజులు' అను పేరుగల రాక్షసులవలె శౌర్యోన్మత్తులై, సింహ బలము గలిగినవారలై, రాజుచేత సన్మానింపబడుచు నుండిరి. వారు అనేక పర్యాయములు విరాటరాజు సమక్షమునందు విజయమును పొందినవారుగా నుండిరి.

భీముడు జీమూతమల్లుని వధించుట

ఆ మల్లులలో నొకడు మహామల్లుడు ఉండెను. అతడు ఇతర మల్లుల నందరిని తనతో కుస్తీ పట్టుటకు ఆహ్వానించు చుండెను. మల్ల యుద్ధరంగము

నందు అతడు నిలువగానే యతనిని ఎదుర్కొని కుస్తీ పట్టుటకు ఏ మల్లుడుగూడ సాహసించి ముందుకు రాజాలకుండెను.

అప్పుడు విరాటరాజు తన వంటల వానిని (భీముని) పిలిపించి యా వీరునితో కుస్తీ పట్టింపదలచి యతనిని పిలిపించెను. రాజు పిలువగానే భీముడు తన స్వరూపము బయటపడునను భయముచేత, ముందుకు వచ్చుటకు జంకుచుండెను.

తుదకు రాజాజ్ఞచేత యుద్ధరంగమునకు శార్దూల గమనముతో గంభీరముగా వచ్చి విరాటునకు నమస్కరించి నిలిచెను. కక్షను (లంగోటీని) బిగించెను. 'జీమూత' నామము గల, పరాక్రమశాలియైన యా మల్లుని తొడగొట్టి పిలిచెను. అప్పుడు జనులు సంతసించిరి.

మల్ల యుద్ధక్రమము

"ఆ యిరువురికి పరమోత్సాహము, భయంకర పరాక్రమము, మహాకాయము ఉండెను. అరువదియేండ్ల యీడు గల మదపు టేనుగులవలె వారు ప్రకాశించుచుండిరి.

ఆ యిరువురు మల్లశ్రేష్ఠులు బాహు యుద్ధమునకు తలపడిరి. పరస్పర జయకాంక్షతో పోరాడుచుండిరి. ఒండొరులు కొట్టుకొను దెబ్బలధ్వని, పర్వతము - పిడుగు ఒండొంటిని కొట్టుకొని నప్పుడు వెడలు చటపట శబ్దములవలె భయంకరముగా నుండెను.

అతి బలులైన యిరువురు స్వీయబలగర్వముల చేత మిక్కిలి సంతోషించుచుండిరి. ఒకరిపైననొకరు దెబ్బతీయుటకు అవకాశమును కనిపెట్టుచు నిరువురు విజయాభిలాషతో పోరాడుచుండిరి.

మదగజములవలె దెబ్బకు మారుదెబ్బ తీయుచు, ఒకరిపట్టును మరియొకరు విడిపించుకొనుచు, ఒకని పిడికిలి మరియొకడు పట్టి బిగించుచు నొండొరులను వివశులను చేయుచుండిరి. విచిత్రముగా కొట్టుకొనుచుండిరి.

'ప్రమాథ - ఉన్మథనము' లతో పోరాడుచుండిరి. ('ప్రమాథ మనగా, భూమిపైన పడవేసి అదిమి నలగగొట్టుట-ఉన్మథనమనగా, లేచి నిలబడి అవయవములను గట్టిగా నలగగొట్టుట' అని యర్థము.) క్షేపణము (హఠాత్తుగా ఉన్న చోటునుండి దూరముగా విసరివేయుట) లతోను, ముష్టులతోను (ముష్టియనగా,

మల్లయుద్ధమునందు ఒండొరుల పిడికిలితో ఒండొరుల రొమ్ములను గ్రుద్దుటయని యర్థము), వరాహోద్ధూత నిస్వనముల చేతను (అనగా ఒండొరుల భుజములపై నున్న యొండొరులను క్రిందు ముఖముగా చేసి గిరగిర త్రిప్పుచు నేలపైన కొట్టినప్పటి ధ్వనియని అర్థము), 'వజ్రనిపాత తల'ములచేతను, (అనగా, బొటన వేలు చూపుడు వ్రేలు మధ్యభాగమునందు ఒండొరులు పట్టుకొని కరతలములను కొట్టుట యనియర్థము), ప్రసృష్టచేష్టల చేతను (అనగా చేతివ్రేళ్ళను విడివిడిగా దూరము చేసి యొండొరులు కొట్టుకొనుట యనియర్థము) పోరాడుచుండిరి. నఖములతో బరుకుకొనుచుండిరి. పాదముల చేత కొట్టుకొనుచు మోకాళ్ళలో తలను ఇరికించి కొట్టుకొనుచునుండిరి. ఆ దెబ్బలు రెండు పాషాణములు కొట్టుకొనుచున్నట్లుగా అతిభయంకరముగ నుండెను.

భీముడు జీమూతమల్లుని చంపుట

శస్త్ర ప్రయోగము లేకుండ బాహుబలము చేతనే చేయు ఆ మల్లయుద్ధము మిక్కిలి ఘోరముగ నుండెను. అక్కడ చూపరులుగా నున్న జనము ఆ నియుద్ధమును (కుస్తీ) మిక్కిలి ఆనందోత్సాహములతో చూచుచుండిరి. అది ఇంద్ర వృత్రా సురుల యుద్ధమువలె నుండెను.

భీమసేన జీమూతులు ఇరువురు కూడ ఒండొరులను ప్రకర్షణాకర్షణముల చేత) ప్రకర్షణ మనగా ముందుకు త్రోయుట. ఆకర్షణ మనగా దగ్గఱికి లాగుట) అభ్యాకర్షణముల చేత (అరచేతులతో ఒండొరులు రొమ్ములపై చఱచుట), వికర్షణముల చేతనూ (అడ్డముగా త్రోయుట, లేక భూమిపై ఈడ్చుట), వారిరువురు ఒండొరులను దగ్గఱకు లాగుకొని మోకాళ్ళచేత కొట్టుకొనిరి.

తరువాత ఆ ఇరువురు సింహనాదము చేయుచూ, భయపెట్టుకొనుచు, ఇనుప గుదియలవంటి తమ బాహువులతో కొట్టుకొనుచుండిరి.

అప్పుడు భీముడు జీమూతమల్లుని బాహువుల లాగుకొని సింహము గజమునువలె పైకిలేపి గిరగిర త్రిప్పి కొట్టెను.

అది చూచి అచటి మల్లులు, పౌరులు మిక్కిలి విస్మయము చెందిరి. అప్పుడు భీముడు జీమూతుని నూర్లకొలది సార్లు గిరగిర త్రిప్పి అతని బలమును అణచి, అచేతనుని చేసి నేలపైన పడవేసి చూర్ణము చేసెను.

జీమూతమల్లుడు చావగనే విరాటరాజు, అతని బంధువులు మిక్కిలి సంతోషించి ఆ యుద్ధరంగమునందే కుబేరునివలె అధిక ధనమును బల్లవునకు బహుమానముగ నిచ్చెను.

ఇట్లే భీముడు అనేక మల్లులను చంపి విరాటునకు ప్రీతి గూర్చెను.

భీమునితో సమానముగ మల్లయుద్ధము చేయు పురుషులెవ్వరు గూడ లేనప్పుడు విరాటరాజు పులులతో, సింహములతో, గజములతోను భీమునకు మల్లయుద్ధము జరిపించి వినోదించుచుండెను.

అట్లే భీముని చేత అంతఃపుర కాంతలు కూడ తమ రాణి వాసములందు సింహ వ్యాఘ్రాదుల చేత మల్ల యుద్ధములు జరిపించి వినోదించుచుండిరి. ఆ వినోదమును విరాటరాజు కూడ రాణివాసములో నుండి చూచుచు ఆనందించుచుండెను.

అట్లే బృహన్నల వేషములో నుండిన అర్జునుడు కూడ నృత్యగానముల చేత విరాటరాజును, అంతఃపురస్త్రీలను సంతోషపఱచుచు బహుమానములను పొందుచుండెను.

ఆ విధముగనే మంచి జవనాశ్వములను ప్రదర్శించి నకులుడు, మంచి వృషభములతో వినోదము చేయించి సహదేవుడును వారిని సంతోషపరచుచూ విరాటరాజు నుండి బహుమానములను పొందుచుండిరి.

ఆ విధముగ కష్టపడుచున్న మహారథికులైన తన భర్తలను చూచుచు ద్రౌపది మనస్సులోనే దుఃఖపడుచూ నిట్టూర్పులు విడుచుచుండెను.

జనమేజయ మహారాజా! అట్లు అజ్ఞాతవాసమందు పురుషోత్తములైన పాండవులు ప్రచ్ఛన్నముగా విరాట నగరమునందు నివసించుచు, విరాట రాజునకు ఊడిగములు చేయుచు ఇడుములు పడుచుండిరి

జనమేజయా! అట్లు మత్స్యనగరమునందు పాండవులు పదినెలలు అజ్ఞాతవాసము గడిపిరి. ఇట్లే ద్రౌపదికూడ సేవావృత్తికి అనర్హురాలైనను, సుదేష్ణకు శుశ్రూషచేయుచు దుఃఖము అనుభవించుచుండెను. ఆమె సుదేష్ణనేకాక, అంతఃపుర స్త్రీల నందఱిని సంతోషపరచుచూ నుండెను.

కీచకుడు ద్రౌపదిని చూచి మోహించుట

అజ్ఞాతవాస సంవత్సరము ముగియుచుండగా విరాటరాజు సేనాపతి, మహా బలశాలియైన కీచకుడు రాజాంతఃపురమునందు ద్రౌపదిని చూచెను. ఆమె అక్కడ దేవతాస్త్రీవలె సంచరించుచుండెను.

ఆమెను చూచిన వెంటనే కీచకుడు మన్మథబాణ పీడితుడై సుదేష్ణను ఇట్లడిగెను—

"సోదరీ! ఇక్కడ నేను ఈ శుభాంగిని ఎప్పుడు కూడ చూడలేదు. తన రూప సౌందర్యములతో ఈమె సుగంధము గల మద్యమువలె నన్ను మత్తిల్ల జేయుచున్నది. ఈమె ఎవరు? ఎవరి భార్య? ఎక్కడనుండి వచ్చినది? నా మనస్సును మథించి నను తన వశుని చేసికొనెను.

ఈ నా బాధ తీరుటకు ఈమెను పొందుట తప్ప వేరు ఔషధము నాకు లేదు. నిత్యనూతనమైన యౌవన సౌందర్యములుగల ఈ శుభాంగి నీకు పరిచారికగా నున్నది. ఆహా, ఎంత విచారము!

సోదరీ! ఇట్టి సుందరిని నీవు పరిచారికగా తీసుకొనుట యుక్తముగాదు. ఈమె నన్ను శాసించుగాక!

నాకుగల అనేక గజములు, అశ్వములు, రథములు, మహాజనులు అందఱినీ ఈమె వశము చేసెదను. బహు విధములైన పాన భోజనములను ఈమెకు తృప్తిగా సమకూర్చెదను.

మనోహరములైన చిత్రవిచిత్ర సువర్ణ భూషణములను రత్నాలంకారములను ధరించి ఈమె నా భవనమును శోభిల్లజేయుగాక"!

ఈ విధముగ కీచకుడు తన చెల్లెలైన సుదేష్ణకు చెప్పి అచటినుండి సైరంధ్రికడకు, సింహకన్యక దగ్గఱికి వనమునందు నక్కవలె వచ్చి ఆమెను అనునయించుచూ ఆమెతో ఇట్లనెను:-

కీచకుడు ద్రౌపది రూపసౌందర్యములను వర్ణించుట

"కల్యాణీ! నీవెవరు? ఎవరి స్త్రీవి? ఎక్కడినుండి వచ్చినావు? నీ రూపము-కాంతి-సౌకుమార్యము అనన్య సామాన్యములు నీ ముఖము చంద్రునివలె నిర్మల

మైన కాంతితో పిరాజిల్లుచున్నది. నీ నేత్రములు పద్మపత్ర విశాలములు. నీ మాట కోకిల కూజితమువలె మధురముగా నున్నది. నీవంటి అనిందిత రూప సౌందర్యవతిని నేను భూమండలమునందు చూడలేదు.

నీవు సాక్షాత్తు లక్ష్మీదేవివా? సాకారమైన ఐశ్వర్యమవా? హ్రీ - శ్రీ-కీర్తి దేవతలలో నొకతెవా? మన్మథునితో క్రీడించు రతీదేవివా? చంద్రికవలె భాసిల్లుచున్నావు నీ కనురెప్పల కాంతి వెన్నెలవలెనున్నది. దివ్యకాంతులచేత చుట్టబడి మనోహరముగా నున్న నీ ముఖచంద్రుని చూచి యీ సమస్త ప్రపంచము నందు ఎవడు కామవశుడు కాకుండ నుండగలడు?

హారాలంకార యోగ్యములు, పీనములు, కమలపు మొగ్గలవలెనున్న నీ స్తనములు మన్మథుని కొరడాలవలె నా మనస్సును తట్టి నన్ను బాధించుచున్నవి. నీ నడుము కరాగ్రముతో (అంగుష్ఠ - తర్జనీలతో) కొలుచుటకు వీలై యున్నది. నీ యుదరము త్రివళులతో సుందరముగా ఉండి స్తనభారము చేత వంగియున్నది. నదీపులినము (ఇసుకదిబ్బ) వలె అందముగా నున్న నీ జఘన స్థలమును చూచినతోడనే నాకు కలిగిన కామవ్యాధి అసాధ్యమై నావంటి వీరుని గూడ పరవశుని జేసివైచినది.

నాకు గలిగిన యీ మదనాగ్ని నిన్ను సంగమించవలెనను సంకల్పములతో, హెచ్చుగా మండి దావాగ్ని (కార్చిచ్చు) వలె వృద్ధిచెందుచున్నది. భామినీ! నీ సంగమ మనెడు మేఘముతో, నీ యాత్మ సమర్పణమనెడు వర్షముతోను మండుచున్న నా కామాగ్నిని చల్లార్చుము.

"నా చిత్తమును పిచ్చి యెత్తించుచున్న మన్మథ బాణ సమూహములు, నీ సంగమాశ చేత పదును చేయబడినవై అతి తీక్ష్ణములుగా నన్ను బాధించుచున్నవి. ఈ బాణములు నా హృదయమును చీల్చి లోపల ప్రవేశించి అతి ప్రచండముగా దారుణములై, అత్యంతోన్మాదకరములై, నీయందు ప్రీతియనెడు పిచ్చిని తీవ్రవేగముతో పెంచినవి. నీవు నాకు ఆత్మసమర్పణచేసి నీ సంభోగ ప్రదానముచేత నన్ను ఉద్ధరించుము.

విలాసినీ! నీవు చిత్రమాల్యాంబరములను, సర్వాభరణములను ధరించి నన్ను అతిశయ కామభోగములలో తేల్చి సేవించుము సుఖమునకు అర్హురాలవైన నీవు ఇక్కడ సుఖరహితముగా నివసించుటకు తగవు. నానుండి ఉత్తమ సౌఖ్యములను పొందుము.

రుచికరములు, అమృత కల్పములునైన మధువులను సేవించి సుఖముగా నాతో రమించుచుండుము వివిధములైన భోగోపచారములు, అత్యుత్తమ సౌభాగ్యము నాతో అనుభవించుచు ఉత్తమ మధుపానము చేయుచు నాతో సుఖింపుము.

భామినీ! ఈ నీ సర్వోత్తమ రూప సౌందర్యములు వ్యర్థములగుచున్నవి. ఉత్తమ పుష్పమాలికను ఆదరించి కంఠమునందు ధరించనియెడల సుందరీ! అవి శోభనముగా శోభిల్లదు నాకు ఇదివరకున్న భార్యలనందరిని నీయందలి ప్రేమ చేత విడిచెను. వారు నీకు దాస్యము చేయుదురుగాక! నేనుగూడ నీకు దాసుడనై సర్వదా వశుడనై యుండెదను."

జనమేజయా! ఆ మాటలు విని ద్రౌపది ఆతనితో నిట్లనెను :

ద్రౌపది హితబోధ

"సూతపుత్రా! కోరదగని నన్ను ప్రేమించుచున్నావు. ఛీ! నేను హీన జాతిదానను. సైరంధ్రిని. అసహ్య వేషముతో నున్నాను. రాణివాసములో తల దువ్వి జెడలువేయుట మొదలగు ఊడిగములు చేయు సేవకురాలను.

నీ వంటి బుద్ధిమంతుడు తనకు సమానురాలిని కోరుట యుక్తము. తన భార్యయందే ఆసక్తి గలవాడు అనేక శుభములను పొందగలడు. అట్టివానికి అధర్మము అపకీర్తి అంటదు తన భార్యయందు అనురాగము చూపుట మృత పురుషునికిగూడ ధర్మమే.

తనజాతి భార్య భర్తను ఈ లోకమునందు సుఖపెట్టుట మాత్రమే కాక, పరలోకమునందుగూడ ఆతనికి ప్రేత కార్యములు, తర్పణోదకములు నెరవేర్చి తృప్తిపరచును. స్వజాతి స్త్రీ రతి అక్షయము. అది నశించనిది. ధర్మసమ్మతము. స్వర్గప్రాప్తి హేతువునగునని బుద్ధిమంతులు చెప్పెదరు. స్వజాతి భార్య వలన గల్గిన పుత్రులు. స్వకులమునందు పూజింపబడుదురు. కులోద్ధారకులగుదురు ప్రాణులకు భార్యలే ప్రియమైన వస్తువులు. కనుక నీవు ధర్మవంతుడవు కమ్ము! పరస్త్రీ రతిని గోరువాడు అధర్మపరుడై శుభములను పొందజాలడు.

"కీచకా! నేను పర భార్యను, నన్నుకోరుట నీకు యుక్తము కాదు. నీకు మేలు కలుగు గాక. ధర్మమును చింతించి కార్యము చేయుము. పరస్త్రీయందు ఎప్పుడుకూడ బుద్ధి పోనీయకుము.

చెడ్డ పనులను విడుచుట మంచి పురుషుని లక్షణము. అసత్యములైన విషయవాసనలయందు ఆసక్తికలిగియుండు మనుష్యుడు పాపాత్ముడై మోహము చెందును. గొప్ప అపకీర్తిని, భయమును పొందగలడు."

జనమేజయ మహారాజా! ద్రౌపది యీ విధముగా హితబోధ చేసినప్పటికిని కీచకుడు కామ మోహితుడై పరస్త్రీని పొందుటవలన ప్రాణాపాయము, లోకనింద మొదలైన దోషములు కలుగునని తెలిసినప్పటికిని దుర్బుద్ధిగలవాడై యిట్లు పలికెను :

"సుముఖీ! ఈ విధముగా నీవు నన్ను నిరాకరించుట తగదు. నాపైన మన్మథుడు ఆవేశించినాడు. నీయెడల ప్రియములు పలుకుచు నీకు వశుడనైన నన్ను నిరాకరించి, ఆ తరువాత పశ్చాత్తాపము చెందెదవు. నేను ఈ సమస్త మత్స్య రాజ్యమునకు ప్రభువునే కాక, దీనిని స్థిరముగా రక్షించువాడను గూడనై యున్నాను. మహా బలపరాక్రమములు గలవాడను. ఉత్తమరూప - యౌవన-సౌభాగ్య-భోగములు అనుభవించు వారిలో నాతో సమానుడు మరియొకడీ పృథివి లోనే లేడు.

కల్యాణీ! నీవు పరిపూర్ణ మనోరథములను పూర్తిచేసికొనుటకు, అసమానములైన భోగములు నీకు లభించుచున్నప్పుడు దాస్యమునందు ఎందుకు ఇష్టము గలదానవై యున్నావు? ఇదుగో! నీకు ఈ మత్స్య రాజ్యమునంతయు నిచ్చితిని దీనికి నీవు యజమానురాలవు. నన్ను పొంది యీ రాజ్య భోగములను అనుభవించుము"

ఈ విధముగా అశుభవచనములను కీచకుడు చెప్పగానే ఆ మాటలను అసహ్యించుకొనుచు ద్రౌపది కీచకునితో నిట్లనెను:-

"సూతపుత్రా! ఇట్లు మోహము చెందకుము నీ జీవితమును నష్టము చేసికొనకుము అతిభయంకరులైన ఐదుగురు భర్తలచేత సర్వదా రక్షింపబడుచున్న దానను గానన్ను తెలిసికొనుము నీకు నేను లభ్యురాలను కాను. గంధర్వులు నా పతులు వారు కోపించినచో నిన్ను చంపుదురు జాగ్రత్త సుమా! వ్యర్థముగా నాశము చెందకుము.

పురుషులకు అసాధ్యమైన మార్గములో నడవగోరుచున్నావు. ఒక నదీ తీరమునందు కూర్చొనియున్న మంద బుద్ధిగల బాలకుడు తనకు అసాధ్యమైన

నదిని ఈది ఆవలియొడ్డుకు పోవజూచుచున్నట్లే నీవుగూడ అకార్యము చేయుచున్నావు అది ఆ బాలునికి వినాశహేతువైనట్లే నీకును నిది వినాశమునకు కారణమగును సుమా!

సూతపుత్రా! నా పతులు అసాధ్య శౌర్యవంతులు. నన్ను చెనకి నీవు పాతాళమున దూరినను, ఆకాశమున కెగిరినను, సముద్రము ఆవలిగట్టుకు దాటి పోయినను వారు నిన్ను విడువరు. పట్టి వధింతురు. వారు దేవపుత్రులు, ఆకాశగమనము గలవారు సుమా!"

"నన్ను అవమానపరచినచో సూతపుత్రా! ఇప్పుడే కాని, లేక కొంత కాలమునకేకానీ పుత్రబాంధవులతోగూడ తప్పక నశించగలవు. దుర్లభురాలనైన నన్ను కోరి నీవు వశము తప్పి, తొడిమనుండి తాటిపండు ఊడిపడినట్లు పడి పోయెదవు.

నన్ను వీరులు రక్షించుచున్నారు. నేనెవతినో నీకు తెలియదు గనుక కామార్తుడవై అసంబద్ధములైన మాటలు పలుకుచున్నావు. అసమర్థుడైన పురుషుడు ఎంత ప్రయత్నము చేసినను మహాపర్వతమును ఎగిరి దాటలేడు సుమా!

మహాత్ములు, తమ భార్యను అవమానపరచినవాడు దిక్కులను శరణు జొచ్చినను, పర్వత గుహలలోను, భూమిలోను దూరినను, జపహోమాదులు నిష్ఠతో చేయుచున్నను, కొండచరియనుండి క్రిందికి పడినను, అగ్నిని, సూర్యుని శరణు జొచ్చినను అతనిని విడువరు.

ఈ నీ మాటలన్నియు వ్యర్థములు. నన్ను నీవు పొందగోరుట ఒక మహాపర్వతమును త్రాసులో తూచుటకు ప్రయత్నించుటవంటిది. కనుక అది అసంభవము.

ఇంతేకాక నన్ను కోరుట గ్రీష్మకాల మధ్యాహ్నమునందు అడవిలో మండుచున్న దావాగ్నిలో దూరుటవంటిది. అది పుత్ర బాంధవ సహితముగా నీ కుల నాశనముకే కారణము కాగలదు.

ఇక్కడ ప్రచ్ఛన్న రూపములోనున్న నన్ను అవమానము చేసి నీవు బ్రతకదలచి దేవ-గంధర్వ-మహర్షి సన్నిధిలో గాని, నాగ-రాక్షస లోకములలో గాని శరణు పొందజాలవు. నీవెక్కడ నున్నను నా పతులు నిన్ను పట్టి వధింతురు. వ్యర్థముగా నీ వినాశమును ఎందుకు కోరెదవు?

"కీచకా! ఒకరోగి కాళరాత్రిని కోరినట్లుగా, నన్ను పొందుటకు ఇంతటి దురాగతమును నీవు ఏల చేయుచున్నావు? ఇది నీ వినాశమునకు హేతువగును. నీవెంత మూర్ఖుడవు? తల్లి యొడిలోనున్న శిశువు ఆకాశమునందలి చంద్రుని గ్రహింపదలచునట్లున్నది-నీవు నన్ను పరిగ్రహింపబూనుట. ఇది నీకు తగదు.

నన్ను పొందగోరి నీవు వ్యర్థముగా నా పతులగు గంధర్వులచేత చచ్చెదవు. ఎక్కడగూడ నీకు శరణు దొరకదు. నీ వెంతటి కామంధుడవైతివి? నీకు శుభములు కలిగించు మంచి దృష్టి, నీ జీవితము సురక్షితముగా నుంచుకొను సద్బుద్ధి కలుగుటలేదు."

ఈ విధముగా వైశంపాయనుడు జనమేజయునికి ద్రౌపదీ కీచకుల సంభాషణ క్రమమును చెప్పి తరువాతి వృత్తాంతమును ఇట్లు చెప్పదొడగెను:-

కీచకుడు సుదేష్ణ సహాయము కోరుట

"జయమేజయా! ద్రౌపదిచేత నిరాకరింపబడి కీచకుడు కామార్తుడై సదేష్ణతో నిట్లననెను:-

"కేకయ రాజపుత్రీ! సైరంధ్రి నన్ను కలియునట్లు ఏదైనా ఉపాయము వెదకుము. లేకున్న నేను మోహవశుడనై ప్రాణములు విడువవలసి వచ్చును. నా ప్రాణములను కాపాడుము."

ఇట్లు అనేకవిధములుగా విలపించుచు పలుకుచున్న కీచకునిపై దయతలచి సుదేష్ణ యిట్లనెను:-

"సోదరా! సైరంధ్రి నా శరణుజొచ్చినది. ఈమెకు అభయమిచ్చినాను. ఈమె సత్త్రవర్తనురాలు. కనుక నీ మనోభిప్రాయము నీమెకు చెప్పజాలను. ఎవడుగూడ ఈమెను పాపబుద్ధితో తాకజాలడు. ఈమె పతులు ఐదుగురు గంధర్వులు ఈమెను రక్షించుచు సుఖింపజేయుచున్నారు.

ఈమె మొదట నన్ను కలిసినప్పు డీమాటనే చెప్పెను. ఈమె మాట సత్యమే. ఈమెను అవమానపరచిన వారిని ఈమె పతులు క్రోధముతో నశింపజేయుదురు. విరాటరాజు గూడ ఈమెను చూచి తొలుత మోహపరవశుడయ్యెను. సర్వదా యీమె రూప సౌందర్యములను అభినందించుచుండెను. వాస్తవమును

నావలన విని, గంధర్వ భయముచేత ఇప్పుడు ఈమెను మనస్సులోగూడా తలచడు.

ఈ రహస్యమును నీయందలి స్నేహముచేత చెప్పుచున్నాను. నా మాటను నీవు పాటించిన యెడల దుర్గతి పాలు కావు. గంధర్వులు బలవంతులు, నీ కులమును, సంపదను నశింపజేసెదరు. కాబట్టి, నీకు ప్రాణములు ప్రియములైనచో సైరంధ్రిపై మనస్సు ఉంచకుము. నాకు ప్రియము చేయదలచినయెడల నీవు ఈమె వద్దకు పోవకుము. ఈమె తలంపునే విడుము.

"జనమేజయా! సుదేష్ణ చెప్పిన మాటలు విని కీచకుడు ఇట్లనెను :-

"గంధర్వులు నూరుగురు, వేవురు, పది వేవురు నాపైకి వచ్చినను నేనొక్కడనే వారిని చంపెదను. ఐదుగురి లెక్క యెంత?"

అతని మాటలు విని సుదేష్ణ మిగుల దుఃఖించి 'అయ్యో! వీడు అధఃపాతాళములో పడిపోవుచున్నాడే! బడబానలమునందు పడిపోవుచున్నాడే!' అని మనస్సులో చింతించి కీచకునితో నిట్లనియె :-

"సోదరా! నీ కారణముగా నా సోదరులు - మిత్రులు నశించ బోవుచున్నారు. నీవిట్లు అనుచితముగా ప్రవర్తించు చున్నావు. నేనేమి చేయగలను? నీ శ్రేయస్సు తెలిసికొనజాలకున్నావు, కామమునే అనుసరించుచున్నావు. నీవిట్లు కామమోహితుడవగుటచేత నిశ్చయముగా నీకు ఆయుస్సు తీరినదని తెలిసికొనుము.

నరాధమా! చేయ గూడని పాపకార్యమునందు నన్ను నీవు నియోగించుచున్నావు. 'ఒకడు పాపముచేసి తన జాతినే నశింపజేయును' అని పెద్దలమాట నిశ్చయమైనది. నీవు తప్పక యమధర్మరాజు దేశమునకు పోవుటయేకాక, ఏ పాపము నెరుగని నీ బంధు జనమునుగూడ చంపబోవుచున్నావు. ఈ వినాశమంతయు నేను తెలుసుకొనిగూడ నీ సంతోషము కొరకు భ్రాతృస్నేహముతో నీ కోర్కె నెరవేర్చెదను. పాపాత్మా! నీవు నీ కులమును నశింపజేసి సంతుష్టుడవు కమ్ము."

"జనమేజయా! తరువాత సుదేష్ణ తాను చేయవలసిన ఉపాయమును చింతించి, కీచకుని మనోభావమును కనిపెట్టి, అతనికి ద్రౌపదిని లభింపజేయుటకు తగిన ఉపాయమును నిశ్చయించుకొని కీచకునితో నిట్లనెను :-

"కీచకా! నీవొక పండుగ దినమునందు ఇంటిలో మద్యము - భోజన సామగ్రి సిద్ధము చేయించుము. దానిని నా కొరకు తీసికొనివచ్చు నెపముతో సైరంధ్రిని నీ కడకు పంపెదను. నీ యింటిలో ఏ విఘ్న బాధలేని విజన స్థలమునందు ఈమెను సమాధానపరచి చూడుము. ఒక వేళ నీ ప్రార్థనను ఈమె అంగీకరించినచో స్వేచ్ఛగా నీతో రమించునుగాక!"

"జనమేజయా! సోదరి చెప్పిన మాటలు విని కీచకుడు తన యింటికిబోయి రాజోచితమైన మద్యమును తెప్పించెను. వివిధములైన భోజన పదార్థములను సమర్థులైనవంటవారితో చేయించెను. తరువాత సుదేష్ణను భోజనమునకు ఆహ్వానించెను.

అతనికి త్వరయెక్కువ. యమపాశము అతని కంఠమునందు బంధింపబడినది.ఆ మూర్ఖుడు తనకు మరణమాసన్నమైన సంగతి తెలిసికొనలేక సుదేష్ణతో ఇట్లనెను :-

"మద్యము బహువిధ భోజన పదార్థములు సిద్ధము చేయించినాను. సైరంధ్రిని త్వరగా పంపుము. నేడు నాకు సైరంధ్రితో సమాగమమో లేక మరణమో యిమ్మని పరమశివుని వేడుకొనినాను."

ఆ మాటకు ఆమె అతనితో నిట్లనెను :-

"నీ యింటికి పొమ్ము. ఇదుగో యిప్పుడే మద్యము తెమ్మని సైరంధ్రికి చెప్పెను."

అది విని పాపాత్ముడైన కీచకుడు సైరంధ్రినే తలచుచు త్వరగా తన యింటికిపోయెను.

తరువాత సుదేష్ణ సైరంధ్రితో "లెమ్ము. త్వరగా కీచకుని యింటికిపోయి నా కొరకు పానయోగ్యమైన రసమును తెమ్ము. నాకు చాల దప్పియగుచున్నది" అని చెప్పెను.

ఆ మాటకు సైరంధ్రి యిట్లనెను :-

కీచకునింటికి పోవుటకు సైరంధ్రి నిరాకరించుట

"రాజపుత్రీ ! నేను కీచకుని యింటికి పోవను. అతడు ఎంత సిగ్గుమాలినవాడో నీకు తెలియునుగదా! కల్యాణీ! నా పతుల దృష్టిలో వ్యభిచారిణిగా స్వేచ్ఛాచారిణిగాను అగుచు నీ యింటిలో నుండజాలను.

భామినీ! నేను నీయింటికి వచ్చినప్పుడు చేసిన నా ప్రతిజ్ఞను నీవెరుగుదువు గదా?

కీచకుడు మూఢుడు, కామగర్వితుడు. అతడు నన్ను చూచి అవమానము చేయును. ఆ యింటికి నేను పోవను. నీకు ఎందరో సేవకురాండ్రు ఉన్నారు గదా! ఎవతెనైన అక్కడికి పంపుము. నన్నతడు అవమానపరచును."

ఆ మాటలకు సుదేష్ణ యిట్లనెను :-

"ఇక్కడ నుండి నాచే పంపబడిన నిన్ను కీచకుడు ఎప్పుడు గూడ హింసించి అవమానపరచడు."

ఇట్లు చెప్పి మూతతో గూడిన యొక బంగారు మద్యపాత్రను సుదేష్ణ సైరంధ్రికి ఇచ్చెను.

ఆమె శంకించుచు, ఏడ్చుచు, దైవమును శరణుపొందుచు మద్యము తెచ్చుటకు కీచకుని యింటికి బయలుదేరుచు, "భగవంతుడా! నా పతులుదప్ప ఇతర పురుషుని ఎవనినిగూడ ఎరుగను. నా యీ పాతివ్రత్య మహిమచేత నన్ను కీచకుడు తన వశములోకి తీసికొనకుండుగాక!"

అని వివశురాలై సూర్యుని ఒక క్షణకాలము ప్రార్థించెను.

సూర్యుడు ఈమె పరిస్థితి తెలిసికొని కరుణించి రక్షణకొరకు ప్రచ్ఛన్నముగా నొక రాక్షసుని సైరంధ్రివెంట పంపెను. అతడు ద్రౌపదిని ఏ పరిస్థితిలో గూడ ఒంటరిగా విడువకుండెను.

మృగాంగనవలె భయపడుచున్న ద్రౌపదిని చూచి కీచకుడు నదిలో ఆవలి గట్టుకు చేరదలచువానికి నావ దొరకినట్లు సంతసించి లేచి నిలబడెను.

కీచకుడు ద్రౌపదిని అవమానపరచుట

ద్రౌపది - కీచకులకు ఈ విధముగా సంభాషణ జరిగెను :-

కీచ :- "సుకేశీ! నీకు స్వాగతము. నేటి ప్రాతఃకాలము నాకు చాల శుభకరము (మంచివేళ నిద్ర మేలుకొనినాను అని భావము). ఇప్పుడిక నీవు నాకు స్వామినివై నాకడకు వచ్చితివి నాకు ప్రియము చేకూర్చుము.

నా దాసీ జనమునకు ఆజ్ఞ యిచ్చి నీ కొరకు సువర్ణమయ హారములు, శంఖ నిర్మితములైన గాజులు, అనేక నగరములలో నిర్మితములైన సువర్ణకుండలములు. మంగళకరమైన మణి రత్ననిర్మితాభరణ జాలము, పట్టుచీరెలు, మృగ చర్మము తెప్పించెదను. నీకొరకు ఏర్పరుప బడిన దివ్యమైన శయనము గలదు. రమ్ము, నాతోపాటు మధుర మద్యరసమును పానము చేయుము."

ద్రౌపది :- దుర్బుద్ధీ! కిరాతుడు బ్రాహ్మణస్త్రీని స్పృశింపజాలనట్లే నీవు నన్ను తాకజాలవు. ఇట్లు పాపకార్యమును తలపెట్టి నీవు మహా దుర్గతికి పాలు కాకుము.

తమ హద్దును మీరి పర స్త్రీగమనము చేయుచు పురుగులవలె గుహలలో పడియుండు ననేక మనుష్యులు పోవు దుర్గతికి నీవు పోవకుము.

రాజపుత్రి సుదేష్ణ మద్యము తెచ్చుటకు నన్ను నీ కడకు పంపెను.

'త్వరగా మద్య రసము తెమ్ము, నాకు చాల దప్పికగా నున్నది' అని ఆమె చెప్పెను."

కీచ :- "కల్యాణీ! సుదేష్ణ కోరిన మద్యరసమును ఇతర దాసజనము ఆమెవద్దకు తీసికొని పోయెదరు."

అని చెప్పి కీచకుడు ద్రౌపది కుడి చేతిని పట్టుకొనెను.

ద్రౌపది : "పాపీ! ఒకవేళ నేను నేటివరకు మనస్సులో గూడ నా పతులకు విరుద్ధముగా ఆచరించని దాననైనచో, ఈ నా సత్యప్రభావము చేతనే నీవు శత్రువులకు వశుడవై నేలపైన ఈడ్వబడుచుండగా కనులార చూచెదను."

"జనమేజయ మహారాజా! ఇట్లు తనను బెదరించి నీచముగా చూచుచున్న ద్రౌపదిని కీచకుడు పట్టుకొనబోయెను కాని ఆమె త్వరగా వెనకకు తప్పుకొనెను. అప్పుడు ద్రౌపది బుసకొట్టుచు ఆ పాపాత్ముని ఒక్క త్రోపుతో క్రిందపడ వేసెను. అతడు వేళ్ళు తెగిన వృక్షమువలె పడిపోయెను.

ఇట్లు ద్రౌపది కీచకునికి పట్టుపడక అతనిని క్రిందకు త్రోసి పరుగెత్తుచు యుధిష్ఠిరుడున్న రాజసభకు పోయెను. కీచకుడు ఆమెను తరుముచు జుట్టు పట్టుకొని రాజసభలో రాజు చూచుచుండగనే క్రిందపడద్రోసి కాలితో తన్నెను.

"రాజా! అప్పుడు సూర్యభగవానుడు ద్రౌపది రక్షణ కొరకు పంపిన రాక్షసుడు కీచకుని పట్టుకొని సుడిగాలి వలె దూరముగా విసరి పారవేసెను. ఆ రాక్షసుని దెబ్బచేత కీచకుడు నేలపైన తిరుగుచు వేళ్ళు తెగిన చెట్టువలె నిశ్చేష్టుడై పడిపోయెను.

ఆ సభలోనున్న విరాటరాజు, బ్రాహ్మణులు, వృద్ధులు, రాజ బంధువులు చూచుచుండగనే కీచకుడు తన్ని పడవేసిన ద్రౌపది నోటి నుంచి నెత్తురు కారుచుండెను. ఆమెను చూచి సభా సదులందరు హాహాకారము చేయుచు 'కీచకా ! నీకిది యుక్తము గాదు. దీనురాలైన ఈ అబలను చంపెదవా యేమి?' అనిరి.

"సభలో నున్న భీమసేనుడు. యుధిష్ఠిరుడు ద్రౌపదికి కీచకునిచేత జరిగిన యవమానము చూచి సహించక లేకపోయిరి. భీమసేనుడు దురాత్ముడైన కీచకుని అక్కడే చంపదలచి క్రోధముచేత పండ్లు పట పట కొరికెను. అతని కను రెప్పలు తెరువబడి స్థిరముగా నిలిచిపోయెను, కన్నులకు పొగ గ్రమ్మినట్ల య్యెను. నొసట చెమట పట్టెను. కనుబొమలు వంకరగా ముడివడి అతి భయంకరముగా నతడు తోచుచుండెను. లలాటమును చేతితో తుడుచుకొనుచు అతి క్రోధముచేత త్రుళ్ళిపడుచు హఠాత్తుగా లేవబోయెను.

అప్పుడు యుధిష్ఠిరుడు తమ రహస్యము బయటపడునను భయముచేత, తన బొటన వ్రేలితో భీముని బొటన వ్రేలిని ఆదిమి నొక్కి, అతడు లేవకుండ ఆపెను.

"మదపుటేనుగువలె క్రోధముతో నొక చెట్టువైపు భీమసేనుడు చూచుచుండెను. అతనిని ఆపుచు యుధిష్ఠిరుడు ఇట్లనెను :-

"బల్లవా! నీవు ఇంధనముల కొరకు వృక్షమువైపు చూచుచున్నావా ? నీకొక వేళ వంటకుగాను ఎండు కట్టెలు కావలసి యుండిన యెడల, బయటకు పోయి అక్కడి చెట్టు నుండి తీసికొనుము. పచ్చగా నుండి శీతల చ్ఛాయనిచ్చుచున్న చెట్టును ఆశ్రయించి యుండవలెను. అది చేయుచున్న ఉపకారమును స్మరించుచు ఒక్క ఆకును గూడి త్రుంచకుండ ఆ వృక్షమును సర్వదా కాపాడవలెను".

"ఇట్లు అన్యాపదేశముగా చెప్పిన అన్నగారి మనోభిప్రాయమును కనుగొని భీమసేనుడు ఊరకుండెను.

భీముని సంరంభము, దానిని అణచుచు ధర్మరాజు శాంతి పూర్వకముగా నపిన మాటలు విని ద్రౌపది అతిక్రుద్ధురాలై, కీచకుడు తరుమగా దుఃఖముచే ఎఱ్ఱబడిన కన్నుల నుండి అశ్రువులు రాలగా ఏడ్చుచు రాజసభా ద్వారము వద్దకు పోయి దీనులైయున్న పతులను చూచుచు అప్పుడు తమ అజ్ఞాతవాస ప్రతిజ్ఞా ధర్మము చేత కట్టుబడి, తన స్వరూపమును బయలుపడకుండ రక్షించుకొనుచు క్రోధము చేత దహింపబడుచు, విరాటరాజుతో నిట్లనెను :-

"ప్రజా రక్షణ శీలురై, అమిత పరాక్రమసంపన్నులై, సర్వదా సత్య - ధర్మరతులై, తన బిడ్డలయందు - ప్రజలయందు భేదభావము లేక అందరిని సమానముగా చూచుకొనుచు ఆశ్రిత జనులను కాపాడుట రాజుల కర్తవ్యము.

ఒక వివాదము కలిగినప్పుడు, మిత్రులయందు, శత్రువులయందు సమ బుద్ధితో ధర్మాసనమునందు కూర్చున్న రాజు తీర్పు చెప్పవలెను అట్టి రాజునకు ఐహికము, ఆముష్మికమునైన ఉభయఫలములున్ను సిద్ధించును.

రాజా! ధర్మాసనము నందుండి కూడ నీవు ఇప్పుడు ఊరకుండుట న్యాయముకాదు. నిరపరాధురాలనగు నన్ను రక్షింపుము ఏ యపరాధముగూడ చేయని నన్ను దురాత్ముడైన కీచకుడు నీవు చూచుచుండగనే నిర్లక్ష్యముచేసి క్రీత దాసినివలె గాల దన్నెను.

"మత్స్యరాజా! ఔరసపుత్రులను వలె ప్రజలను రక్షింపుము. మోహము చేత ఏ రాజు అధర్మపరుడై రాజకార్యములను చేయునో అట్టి దురాత్ముడైన రాజును శత్రువులు వశపరచుకొనెదరు.

నీవు మత్స్యరాజుల కులమునందు పుట్టితివి. మీ వంశపు రాజులు సత్యమునే ఆశ్రయించి రాజ్యము నేలిరి. అట్టి ధార్మిక కులమునందు అధర్మపరుడై జనించిన నిన్నే మనవలెను?

"నాకు శరణమును ఇమ్మని మొరపెట్టుకొనుచున్నాను. పాపిష్ఠుడైన కీచకునినుండి నన్ను రక్షింపుము. ఇక్కడ నేను అనాథనని, పురుషాధముడు కీచకుడు నన్ను కొట్టుచున్నాడు. అతనికి ధర్మముపైన దృష్టిలేదు.

చేయగూడని పనులను చేయక, చేయదగిన పనులను చేయుచు, ప్రజల యెడల సర్వదా మంచిగా వ్యవహరించుచుండు రాజులు స్వర్గసుఖమును పొందె

దరు. కాని, యే రాజులు కర్తవ్యా కర్తవ్యముల భేదమును తెలిసియు స్వేచ్ఛా చారులై ప్రజల యెడల పాపకార్యములు చేసెదరో అట్టి రాజులు అధోముఖులై నరకమునకు పోయెదరు. చేయదగిన మంచి పనులను చేయువారు యజ్ఞముల చేత, దానములచేత, గురుసేవచేతను గూడ పొందఙాలని ధర్మము పొందెను.

"పూర్వ కాలము నందు ప్రపంచ సృష్టి చేయునప్పుడు బ్రహ్మదేవుడు, కర్మలు చేయుటలోను, చేయకుండుటలోను, పుణ్య పాపములను పొందుటలోను ఇంద్రునకు ఇట్లు చెప్పెను:-

"ప్రపంచమునందు ధర్మము-అధర్మము అను ద్వంద్వమును బాగుగా గుర్తించి కర్మలు చేయవలెను. ఎందుకనగా, మంచి నీతితో చేసిన పనికి సత్ఫల మును పొంది స్వర్గమునకు, దుర్గతితో చేసిన కర్మకు దుష్ఫలము పొంది నరక మునకు పోయెదరు. వారివారి కర్మలను అనుసరించియే ఫలములు లభించును.

మానవులు మోహ పరవశులై సుకృతమునో దుష్కృతమునో ఆచరించి మరణించిన తరువాత పశ్చాత్తాప పడుచుందురు."

ఇట్లు బ్రహ్మదేవుడు మంచి మాటలు చెప్పి యింద్రుని పంపెను.

ఇంద్రుడు గూడ ఆ దేవుని సెలవు గైకొని పోయి దేవరాజ్యమును పాలించెను.

కనుక విరాటరాజా! బ్రహ్మ దేవుడు చెప్పిన విధమున నీవు గూడ కర్తవ్యా కర్తవ్యములను స్థిర చిత్తముతో ననుష్ఠించుము."

అని వైశంపాయనుడు చెప్పి తరువాతి వృత్తాంతమును జనమేజయునకు ఇట్లు చెప్పదొడగెను:-

"జనమేజయా! ఇట్లు ద్రౌపది దుఃఖించుచుండగా, విరాటరాజు బలగర్వి తుడైన కీచకుని అక్కడ దండించుటకు సామర్థ్యము లేనివాడై యతనిని శాంత వచనములతోనే వారించెను.

కీచకుని అపరాధమునకు తగిన దండము విధించకున్న విరాటునిచూచి వ్యవహార ధర్మములను తెలిసిన ద్రౌపది, ఉత్తమ ధర్మమును స్మరించుకొనుచు విరాటరాజ సభలో నున్నవారిని చూచుచు దుఃఖితురాలై రాజుతో నిట్లనెను:-

"ఏనా పతులు శత్రులను ఓడించి యైదు దేశములకు అవల పారద్రోలగా, ఆ శత్రువులు ఆరవ దేశమునందు ఉండియు నా పతులవలన భయముచేత నిద్ర పోకుండ ఉండెదరో, ఏనా పతులు ఇతరులకు దానము చేయుదురు గాని, ఇతరులను ఏదియు యాచింపరో, ఎవరు బ్రహ్మజ్ఞులో, సత్యవాదులో ఎవరి ధనుష్టంకారధ్వని దుందుభి ధ్వనివలె గంభీరముగా నుండునో. ఎవరు పరాక్రమవంతులో, జితేంద్రియులో, బలవంతులో, ఆత్మాభిమానము గలవారో, ఎవరు ఈ సమస్త లోకమును వధింపగలవారై యుండియు యిప్పుడు ధర్మ పాశముచేత కట్టబడియున్నారో, ఎవరు శరణార్థులైన ప్రపన్నులకు శరణము నీయగల వారయ్యు లోకమునందు ప్రచ్ఛన్నముగా తిరుగుచున్నారో, మహారథికులైన ఆ నా పతులు ఇప్పుడెక్కడ నున్నారు? నా పతులు బలవంతులయ్యు, అమిత పరాక్రమవంతులయ్యు కీచకునిచేత అవమానపరచబడుచున్న తమ ప్రియ సతిని చూచుచు నపుంసకులవలె ఎట్లు ఓర్చుకొని యున్నారు?

నా పతులకోపము, పరాక్రమము, వీర్యము ఎక్కడ పోయెను? దురాత్ముడు నన్ను కొట్టుచున్నను రక్షింపజూడకున్నారే!

నిరపరాధురాలనైన నన్ను ఒక దుష్టుడు తనకు యెదుట కొట్టుచున్నను చూచుచు సహించి యున్న యీ విరాటరాజే ధర్మదూషకుడుగా నున్నప్పుడు, నేనేమి చేయగలను? ఈ నా యవమానమునకు ప్రతిక్రియ యెట్లు చేయగలను? ఇతడు రాజై యుండికూడ, రాజోచితమైన న్యాయమును చేయకున్నాడు.

మత్స్యరాజా! నీ యీ చోర ధర్మము ఈ సభకు కీర్తి తెచ్చునదికాదు. నీ యెదుట కీచకుడు నన్ను కొట్టెను. ఇది యెప్పుడు గూడ యుక్తము కాదు. ఇక్కడ కూర్చున్న సభాసదులు గూడ కీచకుని అత్యాచారమును చూచుచునే యున్నారు. కీచకుడుగాని ఈ విరాటరాజుగాని ధర్మజ్ఞులు కాని మాట నిజమే. కాని యిట్టి రాజును సేవించుచున్న సభాసదులు గూడ ధర్మజ్ఞులు కారు!"

"జనమేజయా! ఈ విధముగా దుఃఖించుచు ద్రౌపది విరాటరాజును నిందించెను.

ఆ మాటలు విని విరాటుడు "సైరంధ్రీ! మా పరోక్షమునందు మీ యిరువురకు జరిగిన కలహమును గూర్చి నాకు తెలియని వాస్తవమును తెలిసికొనకుండ న్యాయ నిర్ణయము చేసినచో నా నేర్పు ఏమి తెలియగలదు?" అని ద్రౌపదితో ననెను.

"జనమేజయరాజా! తరువాత సభా సదులు, జరిగిన సమాచారమంతయు తెలిసికొని కీచకుని నిందించుచు, ద్రౌపదిని సాధువాదములతో అభినందించుచు నిట్లనిరి:-

"ఇట్టి సర్వాంగ సౌందర్యవతిని భార్యగా పడసినవాడు ధన్యుడు. అట్టి వాడు ఎట్టి శోకమును గూడ పొందడు.

ఏ సైరంధ్రి శరీరము మంగళకరమై, పుష్టిగలదై, ముఖము కమలమును తిరస్కరించుచున్నదో, ఏ శోభనాంగి ముప్పదిరెండు దంతములు తళతళ మెరయుచున్నవో, కేశములు మృదువుగా నున్నవో, శంఖ-చక్ర-పద్మ-ధ్వజ-మందిర-మకరరేఖలు కరతలమునందు ఉన్నవో, ఏ సాధ్వి శరీరమునందు ప్రదక్షిణముగా తిరిగిన సుళ్ళు నాలుగు ఉన్నవో, సమమై, నును పై శుభమైన శరీరమో ఏ కాంత యొక్క హస్త-పాద-దంతములందు ఛిద్రములు లేకున్నవో, పద్మ పత్రములవంటి కన్నులు గలవో, ఏ సర్వశుభ లక్షణ సంపన్నురాలి ముఖము పూర్ణచంద్ర సమమో, ఏ శుభాంగి దేవతా స్త్రీవలె, ఇంద్రవత్నివలెను విరాజిల్లు చున్నదో, అప్సరసవలె రూపవతియో అటువంటి యీ సైరంధ్రి, కాలితో తన్న బడుటకు ఎంతమాత్రము తగదు. మనుష్య స్త్రీలలో ఇంతటి సౌభాగ్యవతి లేదు. ఈమెను దేవతగానే తలచుచున్నాము."

జనమేజయ మహారాజా! ఈ విధముగా సభాసదులు ద్రౌపదిని పొగడిరి.

అని వైశంపాయనుడు చెప్పి తరువాతి కథను జనమేజయునకు ఇట్లు చెప్పెను :

"రాజా! అప్పుడు కోపముచేత యుధిష్ఠిరుని లలాటమునందు చెమట పట్టెను. అతడేమో చెప్పబోవుచున్నాడని ద్రౌపది క్రిందకు చూచుచు నూరకుండెను. అప్పుడు యుధిష్ఠిరుడు ద్రౌపదితో నిట్లనెను:-

"సైరంధ్రీ! ఇప్పుడిక్కడ నీవు నిలువకుము. సుదేష్ణాంతఃపురమునకు పొమ్ము. భర్తను అనుసరించుచున్న వీర పత్నులకు ఇట్టి కష్టములు వచ్చుచునే యుండును. లేక పతి శుశ్రూషాక్లేశమునైనను వారు అనుభవించక తప్పదు. రెండు విధముల గూడ అట్టి స్త్రీలు పతిపోవు పుణ్యలోకమునకే పోయెదరు.

సూర్య తేజస్కులైన నీ గంధర్వ పతులు ఇప్పుడే తమ క్రోధమును చూపించు సమయ మాసన్నము కాలేదని ఊరకున్నారని తలంచెదను. ఆ కారణముచేతనే వారిప్పుడు నీకు ఆశ్రయమిచ్చుటకు నీ వద్దకు ఉరుకుచు రాలేదు.

"సైరంధ్రీ! మోక్షధర్మ సంబంధములగు కథలను, ధర్మమును అనుసరించు కులస్త్రీల ధర్మమును వినుము:-

పతి శుశ్రూషచేయు కులస్త్రీకి దానికి మించిన ధర్మము యజ్ఞ-శ్రాద్ధోపవాసాదుల వలన లభించదు. స్త్రీని బాల్యమునందు తండ్రి, యౌవనమునందు పతి, వార్ధక్యమునందు పుత్రుడు రక్షింతురు. కనుక స్త్రీకి స్వాతంత్ర్యము లేదు.

పతివ్రతలకు శత్రువులవలన అవమానము కలిగినప్పటికిని, అనేక విధ క్లేశములను సహించుచునైనను, పతుల యెడల ఎప్పుడు గూడ కోపించగూడదు. పతి శుశ్రూష చేయువారలు పుణ్యలోకమునకు పోయెదరు.

నీ పతులు సామాన్యులు కారు, వారు కోపించినచో నింద్రుడు గూడ వారి నెదుర్కొనజాలడు.

సైరంధ్రీ! పతులతో నీకేదైన ఒడంబడిక జరిగియుండినచో దానిని జ్ఞప్తికి తెచ్చుకొని ఓర్పుతో నుండుము. ఓర్పుకన్న మించిన ధర్మము మరి యొకటి లేదు. క్షమయే (ఓర్పు) సత్యము, దానము, ధర్మము. తపస్సుగా భావించుము. క్షమాశీలము గలవారికే ఇహలోక సుఖము లభించును.

ఒక సంవత్సరమునకు రెండు భాగములు (ఉత్తరాయణ-దక్షిణాయనములు), పన్నెండు (మాసములు) అవయవములు, ఇరువదినాలుగు పర్వములు (పక్షములు). మూడు వందల అరువది అరములు (బండి చక్రపు ఆకులు) అనగా దినములు ఉన్నవి. అట్టి కాలచక్రము ముగియుటకు, ఒకవేళ ఒక మాసము మాత్రమే మిగిలియున్న యెడల ఆ ఒక్క నెల వేచియుండక కొద్ది కాలమునకే యెంత పిచ్చివాడైనను ఓర్పు విడుచునా?"

జనమేజయా! ఇట్లు చెప్పినను, ఇంకను అచ్చటనే నిలిచియున్న ద్రౌపదితో ధర్మరాజిట్లనెను:-

"సైరంధ్రీ! సమయము నెరుగక మెలగుచున్నావు. నర్తకివలె రాజ సభలో నేడ్చుచున్నావు. రాజ్యసభాభవనమునందు జూదము ఆడుచు వినోదించు చున్న మత్స్య రాజకుమారులకు ఆటలో విఘ్నము చేయుచున్నావు.

సైరంధ్రీ! వెడలిపొమ్ము. గంధర్వులు నీకు ప్రియము చేసెదరు. నీకు అపకారము చేసిన వారిని వధించి నీ దుఃఖము పోగొట్టెదరు."

ఆ మాటలు విని ద్రౌపది "దయాళువులైన గంధర్వుల యెడ నేను మిక్కిలి ధర్మపరాయణురాలుగా నుండెదను. ఏ గంధర్వుల జ్యేష్ఠ భ్రాత జూదరియో, అట్టి గంధర్వులందరకు గూడ నా కపకారము చేసిన దురాత్ములు వధార్హులే యగుదురు.''

అని చెప్పి ద్రౌపది సుదేష్ణ యింటికి త్వరగా పోయెను."

అని చెప్పి వైశంపాయనుడు తరువాతి కథ నిట్లు చెప్పదొడంగెను:-

"జనమేజయా! యుధిష్ఠిరుని మాటవిని యేడ్చుచున్న ద్రౌపది ముఖము, ఆకాశమునందు మేఘమాలచే కప్పబడిన చంద్రమండలమువలె నుండెను. ధూళి గప్పిన యవయవములుగల గజరాజ వధువువలె ద్రౌపది పతియాజ్ఞను తెలిసి కొని అక్కడినుండి వెడలిపోయెను.

నిబిడ స్తనములుగల అమృతలోచన కీచకునిచే విముక్తురాలై నీల మేఘముచేత చుట్టబడిన చంద్రుని ప్రభవలె నుండెను.

ద్రౌపది కొరకు తమ జీవితమునుగూడ విడుచుటకు వెనుకాడని పాండ వులు అట్లు దురవస్థపాలైన ద్రౌపదిని చూచియు ధర్మమునకు కట్టుబడి ఓర్పుతో నుండి మహాసాగరము ఒడ్డును దాటనట్లుగా, తమ ప్రతిజ్ఞను దాటకుండిరి.

''జనమేజయా! సుదేష్ణ యింటికి దుఃఖించుచు పోయిన ద్రౌపదితో సుదేష్ణ యిట్లనెను:-

"సైరంధ్రీ! నిన్ను ఎవరు కొట్టిరి? ఎందుకు ఏడ్చుచున్నావు? నేడు ఎవనికి మృత్యువాసన్నమైనది? అట్లు ఎవడు నీయెడల అపరాధము చేసెను? కమలమువలె సుందరము, చంద్రునివలె ఆహ్లాదకరమైన నీ ముఖము ఈ విధ ముగా మలిన మెందుకయ్యెను? ఏడ్చుచు నీవు అశ్రువులను తుడుచుకొనుచున్నావు. ఎందుకీస్థితి ఏర్పడెను?"

జనమేజయా! ఆ మాటలు విని ద్రౌపది సుదేష్ణతో నిట్లనెను:-

"రాజపుత్రీ! అన్ని విషయములు తెలిసికూడ నన్ను అడుగుచున్నావా? నీవే కదా నీ సోదరుని వద్దకు నన్ను పంపినది? ఇప్పుడు ఏమియు నెరుగనట్లు మాట్లాడుచున్నావే! నేను నీకొరకు మద్యము తెచ్చుటకు కీచకుని యింటికి పోయితిని గదా! అప్పుడతడు నన్ను పట్టుకొనెను. అతని పట్టు విడిపించుకొని రాజసభకు పరుగెత్తుచున్న నన్ను తరిమి జుట్టుపట్టుకొని సభలో పడవేసి కాలితో తన్నెను. నిర్జన స్థలమునందు నిర్భయముగా కొట్టినట్లు సభాసదులు, రాజు చూచుచుండగనే నన్ను కొట్టెను."

ఆ మాటలు విని సుదేష్ణ యిట్లనెను:-

"కామమదాంధుడై అసమాన సౌందర్య శోభితవైన నిన్ను అవమానపరచిన కీచకుని, సుందరీ! నీవు సమ్మతించిన యెడల, చంపించెదను."

ఆ మాటకు సైరంధ్రి యిట్లనెను:-

"రాజపుత్రీ! ఎవరికి కీచకుడు అపరాధము చేసెనో వారే అతనిని చంపెదరు. నేడే అతడు తప్పక యమలోకమునకు పోగలడని నేను తలచెదను. నేడే నీవు నీ సోదరునికి సజీవశ్రాద్ధము (బ్రతికియుండగానే చేయు శ్రాద్ధము) చేయుము. తృప్తిదీర కనులార చూచుకొనుము. ఇకపైన అతని ప్రాణములు నిలువవు.

నా యైదుగురు గంధర్వపతులలో నొకడు అతిబలపరాక్రమశాలి, భూమండలమునందు బలములో నతనికి సమానులు మరియెవ్వరు గూడ లేరు. అతనికి కోపము వచ్చినచో నొకరాత్రిలోనే ఈ ప్రపంచము నిర్మానుష్యము చేయగలడు కాని ఇచ్ఛానుసారముగా రూపములను ధరించి, ధర్మాత్ములై మెలగుచున్న నా పతులకు కోపము రాకున్నది."

"జనమేజయా! సైరంధ్రి సుదేష్ణకు ఇట్లు చెప్పి, దుఃఖ మోహితురాలై కీచకుని వధకొరకు దీక్షపూనెను. అంతఃపుర స్త్రీలు, సుదేష్ణాదేవి ఎంత ప్రార్థించినను ద్రౌపది స్నానముగాని భోజనముగాని చేయలేదు తుదకు ఒడలికి అంటిన దుమ్ము గూడ దులుపలేదు. ఆమె ముఖము నెత్తుట దడిసియుండెను. కన్నుల అశ్రులు కాలుచుండెను. అట్లు దీక్ష పట్టిన సైరంధ్రిని అంతఃపుర స్త్రీలు చూచి

తమ మనస్సులలో ఆనాడు కీచక వధ తప్పదని తలచి, కీచకవధను ప్రశంసించిరి."

ఆ కథ విని జనమేజయుడు వైశంపాయనునితో నిట్లనెను:

"మునివరా? లోకోత్తర పతివ్రతయైన ద్రౌపదిని కీచకాధముడు కాలితో తన్నెను. ఆమె దుఃఖముతో నెంత కష్టముననుభవించెను!

అయ్యో! సైంధవుడు తనను బలాత్కరించినను ఆమె తన భర్తలకు సోదరియైన దుశ్శలకు వైధవ్యము రాగూడదని సైంధవుని శపించలేదు.

అదిసరియే కాని, దురాత్ముడైన కీచకుడు తన్నినను నతనినేల శపించలేదు? అంతటి తేజోరాశి, ధర్మజ్ఞురాలు, సత్యవాదినియునైన ద్రౌపది, తన కేశములు పట్టి యీడ్చిన కీచకాధముని అసమర్థురాలు వలె ఎందుకు సహించి యూరకుండెను? ఇందుకు సామాన్య కారణము ఉండదు. ఆ కారణమును తెలుపుము. ద్రౌపదికి కలిగిన క్లేశమును విని నా మనస్సు పరితపించుచున్నది.

విరాటరాజునకు మరదియైన యీ దుష్ట కీచకు డెవరి వంశము నందు పుట్టెను? బలోన్మత్తుడెట్లయ్యెను?"

ఆ మాటలకు వైశంపాయను డిట్లనెను :

కీచకుని జన్మవృత్తాంతము

"రాజా! బ్రాహ్మణ స్త్రీ యందు క్షత్రియునకు పుట్టినవాడు 'సూతుడు' అనబడును. ప్రతిలోమ సంకర జాతిలో పుట్టిన వారిలో ఈ సూత జాతి యొక్కటి మాత్రమే 'ద్విజ' జాతి యనబడును.

రాజా! పూర్వ రాజులు కొందరు ఈ సూతజాతితో వైవాహిక సంబంధము కలిగి యున్నారు. కాని వారికి 'రాజ' బిరుదము రాదు. ద్విజోచితములైన కర్మలు గల ఆ సూతునే 'రథకార' నామముతో పిలిచిరి. సూతుడు, జాతిలో క్షత్రియుని కన్న తక్కువ, వైశ్యుని కన్న ఎక్కువ యని తలచబడుచుండెను. వారి కొరకు 'సూతరాజ్యము' అను పేరుతో నొక రాజ్యమే యేర్పరుపబడెను. ఆ రాజ్యము నొక సూత జాతివాడు ఒక క్షత్రియుని సేవ చేసి సంపాదించెను,

"సూతజాతి వారికి రాజుగా 'కేకయుడు' అను రాజు ఉండెను. అతడొక క్షత్రియ స్త్రీ గర్భము నుండి పుట్టెను. రథ సారథ్య కార్యమునందతడు కుశలుడై యుండెను. అతనికి 'మాలవి' గర్భమునుండి అనేక పుత్రులు పుట్టిరి.

రాజా! ఆ పుత్రులలో కీచకుడు జ్యేష్ఠుడు. అతడు అతిబలవంతుడు. అందరిని జయించువాడు. కేకయ రాజు రెండవ భార్య గూడ మాలవ పుత్రి 'మాలవి'యే.

ఆమె గర్భము నుండి 'చిత్ర' అను కన్యక పుట్టెను. ఆమెయే 'సుదేష్ణ' యని పిలువబడుచుండెను. ఆమె విరాటరాజు పట్టపుదేవి.

విరాటరాజు మొదటి భార్య కోసలరాజ పుత్రి 'సురథ' యను నామె 'శ్వేతుడు' అను కొడుకును కని మరణించిన తరువాత కేకయుడు సుదేష్ణను విరాటున కిచ్చి పెండ్లి చేసెను. సుదేష్ణను పెండ్లాడిన తరువాత విరాటరాజు భార్యా దుఃఖమును పోగొట్టుకొనెను. సుదేష్ణకు 'ఉత్తరుడు' అను కొడుకు 'ఉత్తర' అను కూతురు జనించిరి.

కీచకుడు తన పినతల్లి కూతురగు సుదేష్ణను సేవించుచు సర్వదా విరాట నగరమునందే సుఖముగా నుండెను. పరాక్రమశాలురైన కీచకుని తమ్ములు గూడ కీచకుని సేవించుచు, విరాటరాజు సైన్యమును, ధనాగారమును పెంచుచు సంతోషముతో విరాట నగరము నందే యుండిరి.

"రాజా! ప్రపంచ విఖ్యాతులైన 'కాలేయులు' అను రాక్షసులే కీచకులుగా పుట్టిరి. వారిలో 'బాణుడు' జ్యేష్ఠుడు. అతడే సర్వాస్త్ర సంపన్నుడై, బలశాలియై, భయంకర పరాక్రమ సంపన్నుడై, మనుష్యులకు భయావహుడై, ధర్మము యొక్క హద్దును మీరి నడచుచున్న కీచకుడని తెలిసికొనుము.

బలోన్మత్తుడైన ఆ కీచకుని సహాయముతోనే విరాటరాజు, ఇంద్రుడు రాక్షసులనువలె, సమస్త శత్రువులను జయించెను. మేఖల-త్రిగర్త-దశార్ణ-కశేరుక-మాలవ-యవన-పులింద-కాశి-కోసల-అంగ-వంగ-కళింగ-తంగణ-పర తంగణ-మలద-నిషధ-తుండికేర-కోంకణ-నిషిద్ధ-శివ-దుశ్చిల్లిక దేశాధిపతులే కాక, శూరులైన ఇతర దేశ రాజులు ననేకులు కీచకునికి ఓడి పారిపోయిరి.

"జనమేజయా! పదివేల యేనుగుల బలము గలిగి పరాక్రమవంతుడైన కీచకుని విరాటరాజు తనకు సేనాధిపతిగా నియమించెను విరాటరాజు యొక్క సోదరులు పదుగురు దశరథరామునితో సమానమైన బలపరాక్రమములు గలవారుగూడ, తమకంటె అధిక బలసంపదగల కీచకులనే అనుసరించి నడచుకొనుచుండిరి.

"ఇటువంటి అసమాన బలపరాక్రమ సంపన్నులు, రాజునకు శ్యాలకులునైన కీచకులు విరాటుని హితముకోరువారుగా నుండిరి. జనమేజయా! కీచకుని పరాక్రమమును గూర్చి నీకు చెప్పితిని.

ద్రౌపది యాతని నెందుకు శపించలేదనగా, సాధారణముగా లోకమునందు ఋషులు, తమ తపస్సు కోపమువలన నశించునని శపించరు. ఆ వాస్తవమును తెలిసినది కనుక ద్రౌపది కీచకుని శపించలేదు. 'ఓర్పు గలవారికి అన్నియు సిద్ధించును. ఇహపర సౌఖ్యములు లభించునని తెలిసినదికనుక ద్రౌపది అప్పుడు ఓర్పు వహించి కీచకుని శపించలేదు.

ఇదిగాక, తన భర్తలు ధర్మపరులు, క్షమావంతులు గనుక వారి యభిప్రాయము ననుసరించి తాను శపించుటకు సమర్థురాలై యుండియు కీచకుని శపించలేదు.

"పాండవులు గూడ ద్రౌపదిని చూచి దుఃఖితులై యుండియు, కాలమునకై యెదురు చూచుచు, మనస్సు లోపలచే క్రోధాగ్నిచేత దహింపబడు చుండిరి. భీముడు కీచకుని వధించుటకు ఉద్యుక్తుడయ్యె, మహోదధి పొంగును తీరము వారించినట్లు ధర్మపుత్రుడు వారించగా నప్పటికి ఊరకొనెను. కాని, ఆ రోషమును మనస్సులో అణచుకొని రాత్రింబవళ్ళు నిట్టూర్చుచు, అతి కష్టముతో ఆ రాత్రి వంటయింటిలో నిద్రించెను."

ఇట్లు చెప్పి వైశంపాయనుడు తరువాతి కథ చెప్పుటకు ఉపక్రమించెను:-

ద్రౌపది భీమునివద్దకు పోయి దుఃఖించుట

"జనమేజయా! కీచకునితో దెబ్బ తినినది మొదలు ద్రౌపది కీచకుని వధించు విషయమునే సర్వదా యోచించుచుండెను. రాజ సభనుండి తన నివాసస్థానమునకు పోయి వస్త్రములు ఉదుకుకొని, స్నానాదులుచేసి పరిశుభ్రురాలయి

తనకు సంభవించిన దుఃఖమునకు ప్రతీకారమును యోచించుచు దుఃఖముతో నుండెను.

'నేనెక్కడికి పోవుదును? ఏమి చేయుదును? నా పని యెట్లు నెరవేర గలదు?' అని మనస్సులో భీముని స్మరించుకొని, 'భీముడు తప్ప మరియొక డిప్పుడు మనస్సుకు ప్రీతి గలిగించువాడు లేడు' అని నిశ్చయించుకొని, లేచి అక్కడినుండి నేరుగా భీముని కడకు త్వరగా పోయి, భీమునితో 'నా శత్రువైన ఆ సేనాపతి, పాపిష్ఠుడు నన్ను అంతగా అవమానపరచిన గూడ నేను జీవించి యుండగా, నీవు సుఖముగా ఎట్లు నిద్రపోవుచున్నావు?' అని యనుచు భీముని నివాసమునందు ప్రవేశించెను. అప్పుడతడు సింహమువలె నిట్టూర్చుచు సుఖముగా నిద్రించుచుండెను.

"జనమేజయా! ద్రౌపదియొక్క దివ్య రూపముతో భీమ సేనుని పాకశాల ప్రకాశించెను. శ్వేతవర్ణముగలిగి నీటియందు పుట్టిన పెంటికొంగ పోతు కొంగ వద్దకు పోయినట్లును, తోటయందు పుట్టిన తెల్లనిగోవు కోడెవద్దకు పోయినట్లును, అడవిలో పుట్టిన కరిణి గజము వద్దకు పోయినట్లును ద్రౌపది భీమసేనుని వద్దకు పోయెను.

ఆమె గోమతీ తీరమునందు పుట్టి వికసించిన పెద్ద మద్దిచెట్టును లతవలె మధ్యమ పాండవుడైన భీముని, (ఇక్కడ భీముని మధ్యమ పాండవుడని పేర్కొనినాడు కవి. దీనికి కారరణము, విరాట నగరమునందు మధ్యమ పాండవుడైన అర్జునుడు వ్యక్తిత్వము లేని బృహన్నలనగా నున్నందుచేత, అతనిని పంచ పాండవుల లెక్కలోనికి తీసుకొనక భీముడు రెండవ పాండవుడైనను అతనికే మధ్యమ పాండవుడని పేరు పెట్టినాడు మహాకవి వ్యాసభగవానుడు) దుర్గమమైన అడవియందు నిద్రించియున్న సింహమును సింహివలెను, గజమును కరిణివలెను ఆలింగనము చేసికొని, వీణానాదము వంటి మధురమైన కంఠధ్వనితో, "భీమసేనా! లెమ్ము! లెమ్ము! మృత్యువువలె ఎందుకు నిద్రించుచున్నావు? నీవంటి వీరుడు జీవించియుండగా అతని భార్యను తాకిన పాపిష్ఠుడు జీవించియుండ జాలడు" అని యనెను.

అప్పుడు మేలుకొని నీల మేఘచ్ఛాయగల భీమ సేనుడు శయనము నుండి లేచి ద్రౌపదితో నిట్లనెను:-

"రాజపుత్రీ! ఏమి పనియుండి యింత తొందరపాటుతో నాకడకు వచ్చితివి? నీ శరీరకాంతి అస్వాభావికముగా నున్నది. పూర్తిగా నాకు తెలియునట్లు సమాచార మంతయు చెప్పుము. నేను తెలిసికొని తగిన ఉపాయమును యోచింతెదను.

ద్రౌపదీ! అన్ని పనులు నీకు నెరవేర్చుటయందు నేనే కదా విశ్వాస పాత్రుడను. నీకు ఆపద కలిగినప్పుడు నేనే కదా మాటిమాటికి నిన్ను కాపాడుచున్నాను. నీవు చెప్పదలచిన పనియేదో స్వేచ్ఛగా, త్వరగా చెప్పి, ఇతరులు నిన్ను కనిపెట్ట కుండునట్లుగా నీ శయనా గారమునకు పొమ్ము."

"జనమేజయా! ద్రౌపది భీముని మాటలు విని సిగ్గు చెందుచు భయపడి అధోముఖియైన అశ్రువులు రాల్చుచు నిలుచుండెనే కాని యే మాటయు బదులు చెప్పజాలక పోయెను.

అది చూచి భీముడు, "సుందరీ! నీకు ఏమి ప్రియము చేయవలయునో సందేహించక చెప్పుము" అని మరల అడిగెను.

అప్పుడు ద్రౌపది యతనితో నిట్లనెను:-

"ఏ స్త్రీ యొక్క భర్త యుధిష్ఠిరుడో, ఆ స్త్రీ శోకింపకుండ ఎట్లుండ గలదు? నాకు గలిగిన అన్ని దుఃఖములను ఎరిగిన వాడవై కూడ నీవు నన్నెందుకు అడుగుచున్నావు?

ఆనాడు దుశ్శాసనుడు నన్ను 'దాసీ!' యని యనుచు కౌరవ సభలోకి మహా పురుషుల సమాజములో యీడ్చుకొని వచ్చునప్పటి అవమానము ఈనాటి వరకు నన్ను దహించుచున్నది. క్షత్రియులు, కర్ణాదులు, దుర్యోధనుడు, అత్త మామలైన గాంధారీ ధృతరాష్ట్రులు, భీష్మ ద్రోణ కృప విదురాదులు చూచు చుండగా సభలో దుశ్శాసనుడు అత్తమామల మధ్య కొప్పుపట్టుకొని, నీవు బ్రతికి యుండగానే, సభలోనికి నన్ను ఈడ్చి అవమానపరిచెను గదా! అటువంటి దుఃఖమును అనుభవించిన నా వంటి రాజపుత్రి మరియొకతె యెట్లు సహించును? ఆ యవమానము ఈ ద్రౌపదికి మాత్రమే ఆనాడు సహించి యుండవలసిన దుర్గతి పట్టినది.

వనవాసమునందు గూడ దురాత్ముడైన సైంధవుడు నన్ను ఆక్రమించి స్పృశించెనుగదా! అది నాకు గలిగిన రెండవ అవమానము. దానిని ఎవతె సంహించును?

"పాండవోత్తమా! నీవు జీవించియుండగనే, నేను దుర్గమారణ్య ప్రాంతములలో కాలినడకన నడువలసివచ్చెనే! వనమునందు పన్నెండేండ్లు కష్టము లనుభవించి పదుమూడవయేట ఈ పట్టణమునకు వచ్చి, పర స్త్రీయైన సుదేష్ణకు పరిచారికగా ఉన్నాను. సత్య - ధర్మ మార్గములందు నడుచుచున్న నేను పర స్త్రీకి ఊడిగము చేయుచున్నానే! ప్రతిదినము విరాటరాజు కొరకు, హరిచందనము,పద్మకము, హరిశ్యామము అను నోషధులనుండి గంధము నూరుచున్నాను.

పాండునందనా! నీవు జీవించియుండగానే యీ కష్టము లన్నియు అనుభవించవలసిన దుర్గతి నాకు పట్టినది. ఎన్ని కష్టములని లెక్కపెట్టి చెప్పుదును? అన్నియు నీవు ఎరిగినవేకదా!

ద్రుపదుని కూతురనై ధృష్టద్యుమ్నుని చెల్లెలనై, యజ్ఞమునందు అగ్నికుండము నుండి పుట్టిన దాననై, మిక్కిలి గారాబముతో, నేలపైన కాలూనకుండ పెరిగిన నాకు ఈ కష్టములు సంప్రాప్తించినవి.

"విరాటరాజు సభలో, ఆ దుష్టరాజు చూచుండగనే కీచకుడు నన్ను స్పృశించెను. నా వంటిది మరియొకతె ఆ యవమానమునకు జీవించునా? ఈ నా కష్టములు నీకు తెలియకున్నవా? ఇక నేను జీవించుటచేత ఫలమేమి?

ఆ దుష్టకీచకుడు 'నాకు భార్యవు కమ్ము' అని ప్రతిదినము బాధించుచున్నాడు. శత్రుదమనా! ఇట్టి అవమాన వాక్యములు ప్రతిదినము వినుచు, పంటకాలమునందు పరిపక్వమైన పండువలె నా హృదయము చీలుచున్నది.

వీరుడా! నీ క్రోధము, బలము, వీర్యము నాకు బాగుగా తెలియును గాబట్టి నీ యెదుట మొరపెట్టు కొనుచున్నాను.

పురుషసింహమా! అరువదియేండ్ల యీడు గల మదపుటేనుగు, నేలపైన బడిన బిల్వ (మారేడు) ఫలమును కాలితో అదిమి నలిపివేసినట్లే నీవుగూడ, ఆ నీచకీచకుని శిరస్సు భూమిపై పడవేసి యెడమకాలితో త్రొక్కుము. ఆ దురాత్ముడు రేపు తెల్లవారి సూర్యోదయము వరకు జీవించియుండినచో నేను జీవించియుండజాలను

దుష్టద్యూతమును ఆడుచున్న నీ యన్నను నిందించుము. అతని వల్లననే కదా ఎడతెగని దుఃఖములు సంప్రాప్తించినవి. ద్యూత వ్యసనము గలవాడు తప్ప మరియెవడు జూదమునందు రాజ్యమును, సర్వస్వమును, తుదకు తనను కూడా ఓడిపోయి వనవాసమును పందెముగా బెట్టి యీ దుర్గతికి పాల్పడును?

ప్రతి దినము, ప్రాతఃకాల సాయంకాలములందు వేయి వేయి బంగారు నాణెములను పందెము పెట్టి అనేక సంవత్సరములు ధర్మరాజు జూదమాడి నప్పటికిని ఒక్కసారిగా అంతయు పోగొట్టికొని యుండడు. జూదపు వ్యసనముచేతనే ఆతడు రాజ్యసింహాసనము నుండి భ్రష్టుడయ్యెను. అన్నియు పోగొట్టుకొని యిప్పుడు మూర్ఖుడై తన కర్మమును గూర్చి చింతించుచు ఊరకున్నాడు.

ద్రౌపది ధర్మరాజు వైభవమును తలచి వాపోవుట

"ఏ మహారాజు బయలు వెడలినప్పుడు పదివేల యేనుగులు, సువర్ణహారములచే నలంకరింప బడిన వేలకొలది అశ్వములు వెనుకనడుచుచుండెనో, అట్టి యుధిష్ఠిరుడు జూదముచేత తన జీవికను గడపికొనుచున్నాడు.

ఇంద్రప్రస్థ నగరమునందు ఏ రాజు బయలు వెడలినప్పుడు లక్ష రథములు, అధిక పరాక్రమ వంతులైన అనేక రాజులు ఉపాసించుచు వెనుక వెడలుచుండిరో, మహారాజు యొక్క లక్షదాసీజనము బంగారు పాత్రములతో రాత్రింబగళ్ళు అతిరథులకు భోజనము వడ్డించుచుండిరో, ఏ రాజు ప్రతి దినము వేలకొలది బంగారు నాణెములను దానముగ నిచ్చుచుండెనో, అట్టి మహారాజు యుధిష్ఠిరుడు నేడు జూదమునందు సంపాదించినట్టిదియు, అనర్థములను కలిగించునట్టిదియునగు ధనముతో జీవనమును గడపి కొనుచున్నాడు.

"ఆ మహారాజును ప్రతిదినము సాయం ప్రాతఃకాలములందు మధుర గానములతో వంది మాగధులు స్తుతించుచుండిరి. ప్రతిదినము, తపస్సంపన్నులైన మునులు వేలకొలది యీ మహారాజు సభను అలంకరించి యుండిరి. ఎనుబది యెనిమిది వేల గృహస్థులను, ఒక్కొక్కరికి ముప్పదేసిమంది దాసీజనమును ఇచ్చి పోషించుచుండెను. దానము పట్టకుండ, ఊర్ధ్వరేతస్కులై యున్న సన్యాసులను పదివేలమందిని ఈ రాజు పోషించుచుండెను

ఏ రాజునందు 'అక్రౌర్యము-దయ-అన్న వస్త్ర దానము' మొదలైన సద్గుణములు ఉండెనో, ఆ మహారాజే యిప్పుడు ఈ దురవస్థకు లోనైనాడు. అంధులను, వృద్ధులను, అనాథులను, బాలకులను, దర్గతికి లోనైన వారిని ఎందరినో పోషించుచుండెను. అట్టి ధైర్య-సత్య-దయా-దాక్షిణ్యాది సద్గుణ భూషితుడైన యుధిష్ఠిరుడు నేడు ఈ దుర్గతికి పాలైనాడు. జూదపు వ్యవసనములో పడి మత్స్య రాజువద్ద సేవకుడై పరతంత్రతా రూపనరకమునందు పడి మ్రగ్గుచున్నాడు.

"ఇంద్రప్రస్థము నందున్నప్పు డెందరో రాజు లీతనికి కానుకలు బహుమానముగా నిచ్చుచుండిరి. ఇప్పు డితరుల నుండి తన బ్రతుకు దెరువుకు ఇతడు ధనము పొందగోరుచున్నాడు. ఎందరో రాజులితని వశములో నుండిరి. ఇప్పు డితడు ఒకని వశములో నున్నాడు సూర్యుడువలె సమస్త భూమండలమును తన ప్రతాపము చేత తపింప జేసిన మహారాజు ఇపుడు విరాటరాజు సభలో నొక సామాన్యుడుగా మెలగుచున్నాడు.

అనేక ఋషులు, రాజులు ఏ రాజును ఉపాసించుచుండిరో అతడిప్పు డితరుని ఉపాసించుచు అతని వద్ద ఇచ్చకము లాడుచునున్న యుధిష్ఠిరుని జూచి నాకు కోపము మితిమీరుచున్నది.

జీవికా నిర్వహణము కొరకు పాటు పడవలసిన దుర్గతి పొందుటకు అర్హుడు కాని ధర్మాత్ముడైన యుధిష్ఠిరునిచూచి యెవనికి దుఃఖము కలుగకుండును?

వీరోత్తమా! సమస్త వీరలోకము, సభలో, ఏ రాజును సేవించుచుండెనో, అట్టి రాజు నేడు సామాన్యుడైన ఇతర నరపతిని సేవించుచున్నాడు, చూడుము.

ఇట్లు అనేక విధములైన దుఃఖములచేత అనాథవలె పీడింప బడుచు శోక సాగరమునందు మునిగియున్న నన్ను భీమసేనా! ఏల చూడకున్నావు?"

జనమేజయా! యిట్లు అనేక విధముల వాపోవుచు ద్రౌపది భీమునితో మొరపెట్టుకొనుచు మరల నిట్లనెను:-

"భీమసేనా! ఇప్పుడు నేను నీకు చెప్పబోవు నా దుఃఖవార్త యింకను ఘోరమైనది. అట్టి విషయము చెప్పి నీ మనస్సుకు కష్టము కలిగించుచున్నానని నాపై దోషము మోపకుము. దుఃఖముచే బాధపడుచు నేను అదియంతయు నీకు తెల్పుచున్నాను.

నీవు సర్వదా అనర్హమైన వంటపని చేయుచున్నావు. అది చాల నీచము. నీవు 'బల్లవ' జాతిలో పుట్టినవాడవని చెప్పుకొనుట ఎవరికి శోకము కలిగించదు? నీ వంటి వీరునికి సేవకత్వము వచ్చుటకంటె దుఃఖకరమైనది మరియేముండును? వంట సిద్ధమైన తరువాత నీవు విరాటరాజు వద్దకుపోయి, 'మహారాజా! బల్లవుడు వంటవాడు మిమ్ము భోజనమునకు పిలుచుచున్నాడు' అని నీవు చెప్పునప్పుడు నా మనస్సు అతి దుఃఖితమగుచుండును.

విరాటరాజు నిన్ను గజములతో పోరాడజేయుచున్నప్పుడు అంతఃపుర స్త్రీలు నవ్వుచుండగా జూచి నా మనస్సు వ్యాకులమగుచుండును. సుదేష్ణ వినోదార్థమై శార్దూలములతోను, సింహములతోను నీవు పోరాడుచున్నప్పుడు చాల బాధ పడుచుందును.

నన్నుచూచి సుదేష్ణ తన దాసీ జనముతో నిట్లనెను:-

"సైరంధ్రి! బల్లవుడు పూర్వము యుధిష్ఠిరునివద్ద ఒకచోట ఉండిన కారణముచేత కలిగిన స్నేహము వలన, మృగములతో యుద్ధము చేయుచున్న యా వంటలవానిని చూచి మనస్సులో మాటిమాటికీ ఈమె దుఃఖించుచుండెను. ఈ సైరంధ్రియు అందమైనదే, బల్లవుడు సుందరుడే. స్త్రీల చిత్తము తెలిసికొనుట కఠినము. ఈ యిరువురకు ఈడు జోడు బాగున్న దనుకొనెదను.

ఈ వంటవానికి సింహగజాదులతో పోరాడవలసి వచ్చినపుడు ఈమె అత్యంత దీనురాలై దుఃఖపూర్వకముగా మాట్లాడుచుండును. ఈ రాజగృహము నందు వీరిరువురూ ఒకేసారివచ్చి కొలువులో చేరినారు. కాబట్టి నా ఊహ దృఢమగుచున్నది."

ఇట్లు చెప్పి నన్ను సర్వదా గద్దించుచుండెను. నీకును నాకును సంబంధమున్నట్లు శంకించి నన్ను కోపించుచుండెను.

"నాథా! భీమ పరాక్రమముగల నీవు నరకతుల్యమైన యీ కష్టము లనుభవించుచుండగా చూచి యుధిష్ఠిరుడును శోకించుచుండెను. మీ యిరువురను చూచి నేను శోకమగ్నురాలనగుచుందును. నాకు జీవించుటకు యిచ్ఛలేదు.

ఏ వీరుడు దేవ మనుష్య లోకముతో ఏకరథుడై అసమాన విజయమును సాధించెనో అట్టి అర్జునుడు నేడు విరాట కన్యలకు నాట్యాచార్యుడుగా నున్నాడు.

అతడు సామాన్య వీరుడా? ఖాండవ దహనము చేయించి అగ్నిదేవుని తృప్తి పరచెను ఇప్పుడు అంతఃపురమునందు పడి నూతిలోని అగ్నివలె తేజోహీనుడయి క్రుగ్గుచున్నాడు.

ఎవరినిచూచి శత్రువులు భయపడుచుందురో, ఆ ధనంజయుడు లోకులకు అసహ్యకరమైన వేషములో నున్నాడు. ధనుస్సు నారి లాగుటచేత ఏర్పడిన కిణములతో ప్రకాశించుచు, గడియ మ్రానులవలె బలిష్ఠములుగానున్న అర్జునుని బాహువులు శంఖముల గాజులతో నిండియుండుటజూచి దుఃఖమగుచున్నది.

ఎవని ధనుష్టంకార ధ్వని విని శత్రువులు వణకుచుండిరో అట్టి విజయుని గీత ధ్వని విని యిప్పుడు స్త్రీలు వినోదించుచున్నారు. ఎవని శిరస్సుపైన సూర్యునివంటి కిరీటము శోభిల్లుచుండెనో అట్టి కిరీటి యిప్పుడు జడ వేసికొని వికార వేషములో నున్నాడు. భయంకర ధనుర్ధారియైన అర్జునుని ఇప్పుడు కన్యకలు జుట్టియుండగా చూచి నా మనస్సు విషణ్ణమగుచున్నది.

ఏ వీరునకు సమస్త దివ్యాస్త్రములు అలంకారములై యుండునో, ఎవడు సర్వ విద్యలకు ఆధారభూతుడో, అతడిప్పుడు పేడిరూపములో కుండలములు ధరించియున్నాడు.

పొంగిన సముద్రము తీరమును లంఘించజాలనట్లే, యే వీరుని, అసమాన పరాక్రమశాలురు గూడ ఆక్రమించుటకు ముందుకు రాజాలకుండిరో, అట్టి అర్జునుడిప్పుడు విరాట రాజు కన్యలకు నృత్యమును నేర్పుచు ప్రచ్ఛన్న వేషములోనుండ కన్యలకు పరిచారకుడుగా నుండుటనుజూచి నా మనస్సు బాధపడుచున్నది.

"ఎవని రథఘోషచేత సమస్త భూమండలము కంపించెనో, ఎవడు పుట్టినప్పుడు కుంతీదేవి దుఃఖము నశించెనో అట్టి నీ తమ్ముడు అర్జునుని దుర్గతికి శోకించుచున్నాను. అతడు స్త్రీ జనోచితాభరణములు ధరించియుండగా జూచి నా హృదయము దుఃఖితమగుచుండును.

అనేక దివ్యాస్త్రముల సంపదగలవాడై, నివాత కవచ కాలకేయాది రాక్షసులను సంహరించినవాడిపు డంతఃపురమునందు మరుగుపడియుండుట జూచి చాలా విచారపడుచున్నాను. గొప్ప కోడె గోశాలలో బంధింపబడినట్లు కన్యాంతఃపురములో స్త్రీ వేషమున నున్నాడే.

కొడుకులు ఇట్లు దురవస్థపాలైనారని తెలిసినచో కుంతీదేవి యెంతగా దుఃఖించునో కదా!

"భీమసేనా! గోవులలో గోపాలుని వేషములో తిరుగుచున్న సహదేవుని చూచి నా శరీరము నెత్తురు ఎండిపోయి పీలగానగును. అతని అవస్థ తలచుకొనుచున్న నాకు నిద్ర పట్టదు. ఇక సుఖ మెక్కడిది? సహదేవుడు చేసిన పాప మేమి? ఎందులకీ దురవస్థకు లోనైనాడు?

రక్త వస్త్రములను ధరించి బానిసవలె చేతులు కట్టుకొని విరాటరాజువద్ద అతడు మాట్లాడుటచూచి, నాకు జ్వరము వచ్చినట్లు వేడి యెక్కను. పూజ్యురాలైన కుంతీదేవి సర్వదా నావద్ద సహదేవుని విషయమై ప్రస్తావించుచు, అతడు శీలవంతుడు, సత్ప్రవర్తనుడు అని మెచ్చుకొనుచుండెను.

మనము అరణ్యవాసమునకు బయలుదేరినప్పుడు కుంతీదేవి సహదేవుని ఆలింగనము చేసికొని యేడ్చుచు నాతో నిట్లనెను:—

"ద్రౌపదీ! సహదేవుడు లజ్జాశీలుడు, మధుర భాషణుడు, ధార్మికుడు, నాకు అత్యంత ప్రియుడు, అన్నలకు పరమ భక్తుడు, కష్టము సహించజాలడు, అడవిలో నడచు నప్పు డతనిచేయి పట్టుకొని తీసికొనిపొమ్ము. స్వయముగా నీవు భోజనము తినిపించుము."

"భీమసేనా! ఆమె మాటలు నాకు ఇప్పటికి గూడ జ్ఞప్తియందున్నవి. అట్టి సుకుమారుడు ఇప్పుడు గోసేవలో తత్పరుడై రాత్రివేళల దూడల చర్మము పైన శయనించు చుండుట చూచుచు ఎట్లు జీవించి యుండగలను?

"ఎవడు రూపము, శస్త్రాస్త్ర సంపద - బుద్ధి కౌశలము ఈ మూడింటి చేత సర్వదా పరిపూర్ణుడో, అట్టి నకులుడు నేడు విరాట రాజుకడ అశ్వసేవా కార్యమునందున్నాడు. కాల విపర్యాసము చూడుము. ఆ వీరుడిప్పుడు 'దామ గ్రంథి' యను పేరుతో విరాటరాజు కొలువులో ఉండి అశ్వములకు శిక్షణము నిచ్చుచున్నాడు. విరాటునికడ వినయముతో గుఱ్ఱములను చూపించుచున్న నకులుని చూచి చాల బాధపడుచుందును ఇక నాకు సుఖమెక్కడిది? యుధిష్ఠిరుని మూలముగా అనేక దుఃఖము లనుభవించు చున్నాను.

కుంతీపుత్రా! ఇంతకన్న పెద్ద దుఃఖమేమనగా, మీరు బ్రతికి యుండగానే నాకు వివిధములైన దుఃఖములు కలిగినవి. అవి నా శరీరమును శుష్కింపచేయుచున్నవి ఇంతకన్న వేరు దుఃఖమేమున్నది?'

ఇట్లు చెప్పి ద్రౌపది తనకు కలిగిన యితర దుఃఖములను గూడ నిట్లు చెప్పదొడగెను:-

'భీమసేనా! నేను సైరంధ్రిగా నుండి సుదేష్ణకు ప్రతిదినము స్నాన సామాగ్రిని సిద్ధముచేసి యిచ్చుచుందును. ఈ దుర్గతి నాకు జూదములో ధూర్తుడైన మీయన్నవలన కలిగినది ఇట్టి దురవస్థను సహించుచు నేను దాని అంతమునకై యెదురు చూచుచుందును. ఎందుకనగా, ప్రతి దుఃఖమునకు అంతముండును గదా!

మనుష్యులకు ధనాగమము, జయాపజయములు అనిత్యములు గదా యని తలచుచు నా భర్తల అభ్యుదయమునకై యెదురు చూచుచున్నాను. అర్థములు దుఃఖములు చక్రమువలె తిరుగుచుండును గదా!

పురుషుని అపజయమునకు ఏది హేతువో, అదియే అతని జయమునకు గూడ హేతువగునని ప్రతీక్షించుచున్నాను ఈ దుఃఖముల తాకిడిచేత భీమసేనా, నేను మృతప్రాయురాలనుగా నుండుటను నీవు గమనించుటలేదా?

'పురుషుడు లోకములో, ఒకప్పుడు దానము చేసినవాడే యాచించు దుర్గతికి లోనగును. అనేకులను చంపినవాడే ఒకప్పుడు తాను చంపబడును. ఇతరులను క్రింద పడగొట్టినవాడే ఒకప్పుడు ఇతరులచేత పడగొట్టబడును' అని నేను వినినాను. కాబట్టి దైవమునకు దుష్కర కార్యమేదియు లేదు. దైవ విధిని లంఘించుట అసంభవము కనుక, దైవ విధికి ప్రాధాన్యము నిచ్చు శాస్త్ర వాక్యములు విశ్వసించి నడచెదను.

పూర్వము జలము నిండుగా ఉండి యెండిపోయిన చోటికే తిరిగి జలము చేరుచుండుట చూచుచున్నాముగదా! నీతిపూర్వకముగా రక్షింపబడిన వస్తువును గూడ, దైవము ప్రతికూలమైనప్పుడు, ఆ దైవమే నశింప జేయును. అందుచేత విజ్ఞుడు, దైవమును అనుకూలపరచుకొనుటకు ప్రయత్నించవలెను.

'ఈ మాటలు చెప్పుటచేత యిప్పుడు ప్రయోజన మేమి?' అని నీవు నన్ను అడుగవచ్చును. దానికి బదులు చెప్పెదను వినుము:-

"ద్రుపదరాజు పుత్రి, పాండవుల పట్టపు దేవియునైన నేను ఇట్టి దురవస్థ పాలైనాను. ఈ కష్టమునందు నేను గాబట్టి జీవించియున్నాను. మరియొకతె జీవించగోరునా?

"భీమసేనా! నాకు గలిగిన యీ క్లేశము, సమస్త కౌరవులకు, పాంచాలురకు, పాండవులకు అవమానకరము గాదా?

సోదరులు, అత్తమామలు, పుత్రులు మొదలైన పరివారము గలిగి అన్ని అభ్యుదయములను పొందిన స్త్రీ, నేను దప్ప మరి యెవతె యింత దుఃఖము ననుభవించును? నేను బాల్యమునందు దైవము నెడల తప్పక అపరాధ మేదో చేసియుందును. దాని చేతచే ఈ కష్టములు అనుభవించు చున్నాను.

చూడుము, నా శరీరకాంతి ఎట్లు తగ్గిపోయి, శరీరము ఎట్లు పీలగా అయిపోయినదో! ఈ దుర్గతి నాకు వనవాస సమయము నందు గూడ కలుగ లేదు. నేను పూర్వము అనుభవించిన సుఖమును నీ వెరుగుదువుగదా? అట్టి నేను ఇప్పుడు దాసీత్వమును పొంది శాంతిలేక బాధ పడుచున్నాను. ఇది దైవలీలగా నేను భావించుచున్నాను. లేకున్న మహా సమర్థుడైన అర్జునుడు గూడ నివురు గప్పిన నిప్పువలె నున్నాడు.

ప్రాణులగతి తెలసికొనుటకు శక్యము గాదు. మీకు గలిగిన యీ యవమానమును చూచి యీ నిశ్చయమునకు వచ్చినాను.

ఇంద్ర సమానులైన మీరు ఏ నా ముఖమును గొప్పగా చూచుచుండిరో, అట్టి నేను ఇప్పుడు నాకంటె నీచురాండ్ర ముఖమును దైన్యముతో చూడవలసిన దుర్గతి పట్టినది. పాండవోత్తమా! మీరు బ్రతికి యుండగా నాకీ అనర్హమైన గతి పట్టినది.ఎంతటి కాలవిపర్యయమిది? ఏ నాకు చతుస్సముద్ర ముద్రితమైన సమస్త భూమండలము వశవర్తియైయుండెనో అట్టి నేను నేడు, సుదేష్ణకు భయపడుచు ఆమెకు వశవర్తినియై యున్నాను.

"కౌంతేయా! ఏ నేను సుగంధ ద్రవ్యములను కుంతీదేవి కొరకు దప్ప నాకొరకు గూడ నూరుకొనకుంటినో, అట్టి నేను దాసినై యితర స్త్రీల కొరకు చందనమును నూరుచున్నాను. నా చేతులు చూడుము. పూర్వమువలె నున్నవా? కాయలు కాసినవి."

అని భీమసేనునికి రెండు చేతులు చూపి యిట్లనెను :

"నాథా! పూర్వమెప్పుడు గూడ కుంతీదేవికిగాని, మీకుగాని భయపడ కుంటిని. అట్టి నేనిప్పుడు విరాటుని యెదుట భయపడుచు దాసివలె నిలుచు కోవలసి వచ్చినది. విరాటరాజు నేను నూరిన చందనము బాగుగ నున్నదనునో లేదో అని భయముతో నిలిచియుందును. నేను నూరిన చందనమే అతనికి నచ్చియుండును గనుక నన్నే సర్వదా చందనము నూరు మనుచుండును."

"జనమేజయా! ద్రౌపది తన దుఃఖములన్నియు ఈ విధముగా భీమ సేనునకు చెప్పి అతని ముఖమును చూచుచు దుఃఖించుచుండెను కన్నీరు రాల్చుచు డగ్గుత్తుకతో మాట్లాడుచు భీమసేనుని హృదయము కంపింప జేసెను.

"నేను పూర్వము దేవతల యెడల చిన్న అపరాధము చేయలేదు. పెద్దదే చేసినాను. ఎందుకనగా, చావవలసియుండగా, ఇంకను జీవించియున్నాను" అని చెప్పెను.

ఆ మాటలు విని భీమసేనుడు, జనమేజయ మహారాజా! కాయలు కాసిన ద్రౌపది రెండు చేతులను తన ముఖముపై నుంచుకొని యేడ్చెను. ఆమె చేతులను పట్టుకొని కన్నీరు రాల్చుచు భీముడు ద్రౌపదితో నిట్లు చెప్పదొడగెను :

"దేవీ! నా బాహుబలము, అర్జునుని గాండీవము వ్యర్థము. చేతులు చూడుము. పూర్వము ఎట్లుగా కోమలముగా నుండినవి, ఇప్పుడు కాయలుకాసి యున్నవి".

ఆనాడు విరాట సభలో నేను యుద్ధము చేయకపోవుటకు యుధిష్ఠిరుడు కారణము. మనము బయటపడిపోయెదమను భయము నతడు నాకు సూచించెను. ఆయన అడ్డుపెట్టకుండినచో ఐశ్వర్యమదత్తుడైన కీచకుని శిరమును సభలో మద గజమువలె త్రొక్కి నలిపి యుందును.

దేవి! నిన్ను కీచకుడు తన్నినపుడే మత్స్యదేశ వాసులందరను సంహ రించవలెనను నిచ్ఛకలిగెను. ధర్మరాజు సైగచేసి నన్ను వారించెను.

మనకు రాజ్యభ్రష్టత్వము, కౌరవులను చంపకపోవుట, దుర్యోధన-కర్ణ-శకుని-దుశ్శాసనుల శిరస్సులను ఛేదించకపోవుట, ఇవి నా శరీరమును దహించు చున్నవి. అవి నా హృదయశల్యములుగా బాధించుచున్నవి. నీవు బుద్ధిమంతు రాలవు. ధర్మమును విడువకుము. క్రోధమును విడువుము.

"ద్రౌపదీ! నీకు కలిగిన యీ కష్టములన్నియు నీవు నా కిప్పుడు చెప్పినట్లు ధర్మపుత్రునికి చెప్పినచో నతడు తన జీవితమునే విడుచును. అర్జున-నకుల-సహదేవులు కూడ నీ యీ కష్టములు వినినచో బ్రతుకజాలరు. వీరందరు పోయిన పిదప నేను మాత్రము జీవించెదనా?

"పూర్వము భృగు పుత్రుడైన చ్యవనుడు తపస్సు చేయుచు చేయుచు నొక వల్మీకము (పుట్ట) గా నయ్యెను. అతని ప్రాణముపోవు సమయమునగూడ అతని పత్ని సుకన్య అతనిని సేవించుచునే యుండెను.

'నారాయణి' యను ఇంద్రసేననుగూర్చి నీవు వినియేయుందువు. ఆమె మహా సౌందర్యవతిగా నుండెను. ఆమె తన వేయియేండ్ల వయస్సుగల పతి 'ముద్గల' ఋషిని నిరంతరము సేవించుచుండెను.

"జనకుని కూతును జానకిని నీ వెరిగియే యుందువు మహారణ్యావాసము చేయుచున్న పతిని అనుసరించెను. రావణునిచేత బాధింపబడియు సీత, పాతివ్రత్య ధర్మమును వీడక, తన పతి శ్రీరామునే ఆశ్రయించెను.

నవయౌవనరూప సౌందర్యవతి లోపాముద్ర మహారాజ కన్యకగా నుండియు, లోకోత్తర సౌఖ్యములన్నియు విడిచి అగస్త్య మహామునిని అనుసరించెను.

ద్యుమత్సేన పుత్రియైన సావిత్రి తన పతిని యమలోకమువరకు అనుసరించెను.

ఈ పతివ్రతల వలెనే నీవుగూడ సర్వగుణ సంపన్నురాలవు. చాల కాలము వేచియుండవలసిన అవసరము నీకు లేదు. మన అజ్ఞాతవాసపు గడువు ముగియుటకు ఒకటిన్నర నెల మాత్రమే మిగిలియున్నది. ఈ గడువు తీరిన తరువాత తప్పక నీవుకోరినట్లే చేసెదనని సత్యముగా శపథము చేయుచున్నాను. ఈ కొద్దికాలము నీవు ఉత్తమ స్త్రీలలో ఆదర్శప్రాయురాలవుగా నుండుము. నీకు గల పతిశక్తి, సత్ప్రవర్తనచేత నీవు సమస్త రాజుల తలలపైన మకుటాయమానముగా నిలవగలవు".

ఆ మాటలకు ద్రౌపది భీమసేనునితో నిట్లనెను:

"నాథా! నేను మిక్కిలి ఆర్తిచెంది, దుఃఖములను భరించజాలక ఇంతగా ఏడ్చితినిగాని రాజును నిందించుట లేదు. భీమసేనా! జరిగినదానికి ఇపుడు అనుకొని లాభమేమి: భావి కార్యముల కొరకు సిద్ధముగా నుండుము".

"నా రూప సౌందర్యములను చూచి, విరాటరాజు నాపై ఆశచేత తనను విడుచునేమో అను భయము చేత సుదేష్ణ సర్వదా ఉద్వేగము చెందుచుండును.

సుదేష్ణ మనోభావము కనిపెట్టిన దుష్ట కీచకుడు నాపై రాణికి అభిమానము లేదని నన్ను పొందుటకే సర్వదా కోరుచు వేడుకొనుచుండును. అతని పైన నాకు కోపము వచ్చినప్పటికిని దానిని ఉపసంహరించుకొని వానికినిట్లు చెప్పుచుందును:-

"కీచకా! నిన్ను రక్షించుకొనుము. జాగ్రత్త! నేను అయిదుగురు గంధర్వుల భార్యను వారు శూరులు, సాహసవంతులు, నిన్ను వధించెదరు."

నా మాట లెక్కచేయక అతడు నాతో నిట్లనుచుండును:-

"లక్షమంది గంధర్వులు వచ్చినను భయపడను. వారందరిని యుద్ధమునందు సంహరించెదను. నా మనస్సుకు ఆనందము కలిగించుము"

అప్పుడు నేను అతనితో నిట్లనుచుందును:-

"కీచకా! నీకు గంధర్వులతో సమానమయిన బలము లేదు. నేను సర్వదా పాతివ్రత్య ధర్మ మాచరించుచు నా కులమర్యాదను కాపాడుకొనుచుందును. నా కారణముగా నొకని వధ జరుగగూడదని కోరుచుందును. అందు చేతనే, నీ వింతవరకు జీవించియున్నావు."

నా మాటలు విని కీచకుడు అట్టహాసము చేయుచు పరిహసించుచుండెను.

"ఆ తరువాత సుదేష్ణ తన సోదరునకు ప్రీతి కలిగించదలచి నాతో, 'కల్యాణీ! కీచకుని యింటికి పోయి మద్యమును తెమ్మ' అని నన్ను కీచకుని యింటికి పంపెను. అతను నన్ను తన ఇంటిలో శాంతి పూర్వకముగా తనను స్వీకరించుమని కోరెను.

నేను నిరాకరించగా క్రుద్ధుడై నన్ను బలాత్కరింప జూడగా విడిపించుకొని త్వరగా విరాట సభకు పరుగెత్తుచు వచ్చితిని. అచ్చట నన్నతడు పడద్రోసి అందరు చూచుచుండగా తన్నెను.

నేను విరాటరాజును నిందించితిని గదా! విరాటరాజు కీచకుని వారించ లేదు. అణచలేదు. కీచకుడు ఇంతటి దురాత్ముడైనను విరాటరాజు, అతని పత్ని సుదేష్ణ అతనిని గౌరవించుచు సేనాపతి పదవిలో నుంచినారు.

కీచకుడు శూరుడు, అభిమానవంతుడు, పాపాత్ముడు, అన్నిటను మూర్ఖుడు పరస్త్రీ లాలసుడు, ప్రజల ధనమును హరించుచుండును. ధర్మమను మాట యెరుగడు. నేను మాటిమాటికి అతని కోరికను తిరస్కరించుచుందును. అందుచేత నేను అతనికి కనపడినప్పుడంతయు నన్ను కొట్టుచుండును. ఒకనాడు నా జీవితమే అతని చేతిలో నశించవచ్చును. అట్టి పరిస్థితిలో ధర్మము కొరకు ప్రయత్నించుచున్న మీ యందరి ధర్మము నశించును.

ప్రతిజ్ఞా పాలనమే ప్రధానముగా మీరు చూచుచున్నచో, మీ భార్య రక్షింపబడదు. భార్య రక్షింపబడిననే సంతానము రక్షింపబడును. సంతతి రక్షణ చేత తాను రక్షింపబడును.

ఎందుకనగా, భార్యకు 'జాయ' (భార్యయందు పతి, పుత్రుడుగా పుట్టునని యర్థము) అని పేరు గదా! కాబట్టి భార్య భర్తను రక్షింపవలెను. ఈ రహస్యమును వర్ణ ధర్మవిదులైన బ్రాహ్మణులు చెప్పగా వినినాను.

క్షత్రియునకు శత్రు విజయముకన్న మరియొక ధర్మము లేదు. యుధిష్ఠిరుడు, నీవు యిరువురును చూచుచుండగనే కీచకాధముడు నన్ను కాలితో తన్నెను గదా!

పూర్వము జటాసురుని బారినుండి నన్ను రక్షించితివి సైంధవుని నాకుగాను జయించితివి అట్లే నన్ను అవమానించుచున్న యీ పాపిష్ఠుడైన కీచకుని గూడ వధించుము. అతడు రాజునకు ప్రియుడైన కారణము చేతనే నాకు దుఃఖము కలిగించుచున్నాడు.

కామ మదముచే త్రుళ్ళిపడుచున్న ఆ దుర్మాతుని రాతిపైన కుండను పగుల గొట్టినట్లుగా కొట్టి ముక్కలు ముక్కలుగా చేయించుము. నాకు గలిగిన అనేకానర్థములకు కారణమైన కీచకుడు తెల్లవారు వరకు జీవించియుండినచో, విషమునైనను త్రాగి ప్రాణములను విడిచెదను. కాని అతనికి వశురాలను కాను. భీమసేనా! దానికన్న నీ సమక్షమునందు నాకు మరణమే శ్రేయస్కరము."

"జనమేజయా! ఇట్లు చెప్పి దుఃఖించుచు ద్రౌపది భీముని యెదపై వ్రాలెను. భీముడామెను ఆలింగనము చేసికొని, మంచి మాటలు చెప్పి ఊరడించి, అశ్రు సిక్తమైన ఆమె ముఖము తన చేతితో తుడిచి, కీచకునిపై క్రోధము చేత మండి పడుచు నాలుకతో పెదవులమూలలు నాకుచు, కీచకుని మనస్సునందు తలచుచు, దుఃఖార్తయైన ద్రౌపదితో నిట్లనెను:-"

అని వైశంపాయనుడు చెప్పి తరువాత భీముడు ద్రౌపదితోనన్న మాటలు ఇట్లు చెప్పదొడగెను:-

"దేవీః నీ యిష్ట ప్రకారమే నేడు కీచకుని అతని బంధువులతో పాటు వధించెదను. నీవు దుఃఖమును విడిచి యీ సాయంకాలమే అతనిని కలిసి, నర్తన శాలకు రమ్మని చెప్పుము. ఆ శాలయందు పగలు కన్యకలు నాట్యము చేసి రాత్రి తమ తమ ఇండ్లకు పోయెదరు. రాత్రి అది నిర్జనముగా నుండును అక్కడ దివ్యమైన శయనము గూడ నున్నది.

ఆనాడు అతనికి, చచ్చిన అతని పూర్వులను చూపించెదను. అతనితో నీవు రహస్యముగా మాట్లాడునప్పుడు ఎవ్వరు గూడ మిమ్ము జూడకుండునట్లు మెలగుము."

"జనమేజయా! ఈ విధముగా ద్రౌపదీ భీములు మాట్లాడుకొని దుఃఖించుచు విడిపోయిరి.

ఆ రాత్రి గడచిన తరవాత ప్రాతఃకాలమునందు కీచకుడు రాజ గృహ మునకు పోయి ద్రౌపదితో నిట్లనెను:-

"సైరంధ్రీ! రాజు చూచుచుండగనే సభలో నిన్ను నేను పడద్రోసి తన్ని నను నిన్ను కాపాడు వాడెవ్వడును లేకుండెను గదా! విరాటుడు మత్స్యదేశము నకు పేరుకు మాత్రమే రాజు గాని, సేనాపతియైన నేనే రాజును సుమా! నన్ను స్వీకరించుము. నీకు దాసుడనయ్యెదను

ప్రతిదినము నీ వ్యయమునకు నూరు బంగారు నాణెము లిచ్చెదను. ఇప్పుడే కైకొనుము. నూరుమంది దాసీజనము, ఇతర దాసీజనము, కంచరి గాడి దలు కట్టిన రథమును నీ సేవకొరకు ఇచ్చెదను ఇప్పుడు మన ఇరువురి సమా గమ మగుగాక!"

ఆ మాటలు విని ద్రౌపది యిట్లనెను:-

"కీచకా! అలాగైనచో నేడు నేనొక ఒడంబడిక చేసెదను. దాని నంగీకరించుము. నీవు నన్ను కలియుటకు నాకడకు వచ్చు సమాచారము నీ మిత్రులకు గాని, సోదరులకు గాని యెవ్వరికి గూడ తెలియగూడదు.

ఎందుకనగా, కీర్తిపరులైన నా పతులు గంధర్వులకు అపకీర్తి వచ్చునని భయపడుచున్నాను. ఇట్లు నాకు నీవు ప్రతిజ్ఞ చేసినచో నేను నీకు అధీనురాల నయ్యెదను."

ఆ మాటలకు కీచకుడు ఇట్లనెను:-

"సైరంధ్రీ! అట్లే కానిమ్ము. ఆ శూన్య గృహమునకు నేనొక్కడనే నీ సమాగమమునకు, గంధర్వులు తెలిసికొనకుండ, వచ్చెదను"

ఆ మాటకు ద్రౌపది యిట్లనెను:-

"కీచకా! విరాటరాజు నిర్మించిన నర్తనశాలకు ఈ రాత్రి చీకటిలో ఒంటరిగా పోయి యుండుము. అక్కడ పగలు కన్యలు నృత్యము చేసి పోయెదరు. రాత్రి యెవరు నుండరు. ఆ సమయమునందు గంధర్వులు మనను కనిపెట్టజాలరు. అక్కడ మనము కలిసికొనినచో అన్ని దోషములు దూరమగును. ఇందులో సంశయము లేదు."

ఆ మాటకు కీచకుడు అంగీకరించి 'నీకు గంధర్వుల వలన భయపడ వలసిన భయము లేదు' అని ఆమెకు ధైర్యము చెప్పెను.

''జనమేజయా! కీచకునితో ద్రౌపది మాట్లాడిన తరువాత మిగిలిన ఆ యర్ధదినము ఒక నెలవలె అతి కఠినముగా, భీమునికి ఆ విషయము తెలుపుటకు, గడపెను.

కీచకుడు తన యింటికి పోయి మిక్కిలి సంతుష్టుడై యుండెను. కాని, సైరంధ్రి రూపములో తనకు మృత్యువు ఆసన్నమైనదని ఆ మూఢుడు తెలిసికొనలేక పోయెను.

అతడు కామ మోహితుడై త్వరగా గంధమాల్యాభరణములతో తనను అలంకరించుకొనెను. సైరంధ్రిని తలచుకొనుచున్న అతనికి కాలము అతి దీర్ఘముగా గడచుచుండెను.

ఇకపైన ఎల్లప్పటికి రాజ్యలక్ష్మితో వియోగము చెందబోవుచున్న కీచకుడు ఆ యలంకారములచే ఆనాడు, ఆరిపోవుచున్న దీపము అధికముగా వెలుగునట్లు ప్రకాశించెను. ద్రౌపది మాటపైన పూర్తి విశ్వాసము గల కీచకుడు కామమోహితుడై ఆమెను తలచుచు, నెంతకాలము గడచినది గూడ తెలియలేకుండెను.

జనమేజయా! ద్రౌపది కీచకునితో మాటడిన తరువాత వంటశాలలో నున్న భీముని వద్దకు పోయి యిట్లనెను:-

"నాథా! నీవు చెప్పిన ప్రకారమే కీచకునితో నేను మాట్లాడి యీ రాత్రి యతడు నర్తనశాలకు వచ్చునట్లు ఏర్పాటు చేసితిని. శూన్యమయిన నర్తనశాలకతడొక్కడే వచ్చును. అతనిని వధించుము.

దర్పితుడై యతడు గంధర్వులను అవమాన పరచుచున్నాడు. కొలకు నుండి సర్పమును లాగిపారవేసినట్లు, చంపుము. నా కన్నీరు తుడువుము. నీ క్షేమము, మన కులము యొక్క మానము కాపాడుము." ఇట్లు ఆమె చెప్పిన మాట విని భీముడిట్లనెను:-

"మానినీ! నీకు స్వాగతము. నాకు ప్రియము తెలిపితివి. కీచకుని వధించుటకు నా కెవరి సహాయము అక్కరలేదు. కీచకునితో నీకీరాత్రి సమాగమ మగునని చెప్పి నాకు హిడింబాసురుని వధించిన నాడు కలిగినంత ప్రీతిని కలిగించితివి.

నా అన్నదమ్ముల మీద, ధర్మము మీద ఒట్టుపెట్టుకొని చెప్పుచున్నాను వినుము. ఈ రాత్రి నేను సత్యముగా కీచకుని, వృత్రాసురుని ఇంద్రుడు వధించినట్లు, వధించెదను.

ఏకాంతము నందు గాని, బహిరంగమునందు గాని, అతడెక్కడ లభించిన నక్కడ మట్టుపెట్టెదను. అతనికి సహాయకులుగా మత్స్య సైనికులు వచ్చి యుద్ధము చేసినను, వారిని గూడ చంపెదను.

తరువాత దుర్యోధనుని గూడ వధించి సమస్త భూమండలమునకు రాజు నయ్యెదను. యుధిష్ఠిరుడిక్కడనే యుండి యీ విరాట రాజును యథేష్టముగా సేవించుచుండుగాక!"

ఆ మాటవిని, ద్రౌపది, "భీమసేనా! నా కొరకై నీ ప్రతిజ్ఞను విడువకుము. రహస్యముగానే కీచకుని చంపుము" అని యనెను.

ఆ మాటకు భీముడు ఇట్లనెను:-

"మానినీ! నీవు చెప్పినట్లే చేసెదను. భయపడకుము. నేడు కీచకుని, అతని బంధువులతో పాటు, ఎవరికి కనపడకుండ చీకటిలో, సర్పము బిల్వ వృక్షము నాక్రమించుకొనునట్లు చుట్టుముట్టి, అలభ్యమైన వస్తువును కోరిన ఫలముగా, నతని తల పగులగొట్టి వధించెదను."

"జనమేజయా! ఆ రాత్రి భీముడు తొలుతనే నర్తనాగారమునకు పోయి ఒకచోట దాగియుండి, సింహము మృగముకై వేచి యుండునట్లు, కీచకుని కొరకు వేచియుండెను.

కీచకుడు అలంకరించుకొని నియమిత సమయమునకే, కామమోహితుడై ద్రౌపదీ సంగమేచ్ఛచేత వచ్చి, లోపల ప్రవేశించెను. అక్కడ చీకటి క్రమ్మి యుండెను.

అదివరకే అక్కడికి వచ్చియున్న భీమసేనుని వద్దకు పోయెను. ద్రౌపది యనుకొని భీముని తాకెను. భీముడప్పుడు ద్రౌపదికి కలిగిన అవమానమును స్మరించుచు కోపముతో మండుచుండెను. కీచకుడు సంతసించుచు నిట్లనెను:-

"కామినీ! నేను సంపాదించిన ధనమంతయు నీకు బహుమానముగా నిచ్చితిని. ఇంతయేకాక, అనేక దాసదాసీ జనముతో, రత్నరాసులతో నలంకృతమై, క్రీడా విలాసముతో శోభితమైన నా గృహము, అంతఃపురము నీకు అర్పించి, త్వరగా నీ వద్దకు వచ్చినాను.

సుందరీ! నా యంతఃపుర స్త్రీలందరు, నా వంటి కమనీయమూర్తి మరి యొకడు లేడని ప్రశంసించుచుందురు."

ఆ మాటలు విని, భీముడిట్లనెను:-

"నీవు నిజముగా అందగాడవే. ఇది నీ భాగ్యము. నిన్ను నీవు ప్రశంసించు కొనుట గూడ నీ భాగ్యమే. ఇంతకుపూర్వ మెప్పుడు గూడ నీవు ఇట్టి కోమలమైన స్పర్శను ఎరిగి యుండవు. నీవు స్పర్శను బాగుగా గుర్తించగలవు కామ ధర్మజ్ఞులలో విలక్షణుడవుగా కనబడుచున్నావు."

"జనమేజయ మహారాజా! ఈ విధముగా చెప్పి భీమసేనుడు, హఠాత్తుగా లేచి నవ్వుచు కీచకునితో నిట్లనెను:-

"అరే! నీవు పర్వతమువలె నున్నావుకాని, నేను, సింహము మదగజమును ఈడ్చినట్లు భూమిపైన ఈడ్చెదను. పాపిష్ఠుడా! నేడు నీ సోదరి ఆ యవస్థలో నిన్ను చూడగలదు. నీవు మరణించినచో సైరంధ్రికి ఏ బాధ యుండదు. ఆమె పతులు సుఖముగా సంచరించగలరు."

ఇట్లు అనుచు భీముడు, జనమేజయా! పుష్పమాలలతో శోభిల్లుచున్న కీచకుని జుట్టు పట్టుకొనెను. కీచకుడు గూడ మహా బలవంతుడు గనుక ఒక్క ఊపుతో తనజుట్టు భీముని పట్టునుండి విడిపించుకొని యతనిని తన బాహువులలో బంధించెను.

అప్పుడా యిరువురికి, క్రోధ ఘూర్ణితములైన రెండు సింహముల వలె, ఒక కరిణి కొరకు పోరాడు రెండు గజములవలెను ఘోరమైన బాహుయుద్ధము జరిగెను. ఆ యుద్ధము పూర్వము వాలిసుగ్రీవులకు పరస్పర జయేచ్ఛతో జరిగిన బాహు యుద్ధమువలె నుండెను.

ఆ యిరువురు నైదు ఫణములుగల సర్పములవలె ఐదు వ్రేళ్లుగలిగి, క్రోధమనెడు విషము చేత ఉద్ధతములైన తమ బాహువులను పైకెత్తి నఖములనెడు కోరలతో అన్యోన్యము కొట్టుకొనిరి.

"బలవంతుడైన కీచకుని చేత వేగముగా కొట్టబడిన భీముడు స్థిరముగా ఒక్క అడుగు గూడ చలించక నిలిచెను. ఒండొరులు ఈడ్చుకొనిరి. అప్పుడు వారు బలసిన ఆబోతులవలె నుండిరి. నఖములు, దంతములే ఆయుధములుగా గలిగి దర్పించిన రెండు వ్యాఘ్రములవలె వారు అతి భయంకరమైన ద్వంద్వ యుద్ధము చేసిరి.

కీచకుడు క్రోధావేశముగల ఒక యేనుగు, కుంభస్థలమున మదజలము గారుచున్న మరియొక మదపుటేనుగును పట్టినట్లు భీముని తన బాహువులతో హఠాత్తుగా పట్టుకొనెను. భీముడు కూడ అతనిని ఆ విధముగనే పట్టుకొనెను. బలవంతుడైన కీచకుడు పట్టును విడిపించుకొనెను. ఆ యిరువురి భుజముల ఒరిపిడిచేత, వెదుళ్లు విరిగినప్పుడు కలుగు ధ్వనివలె, పటపట ధ్వని బయలువెడలెను.

భీముడతనిని ఇంటిలోనికి ఈడ్చి చండమారుతము వృక్షమును వలె గిరిగిర త్రిప్పెను. బలవంతుడైన భీముని చేత యుద్ధమునందు పట్టుకొనబడిన కీచకుడు యథాశక్తి ప్రయత్నించుచు భీముని తన వైపునకు ఈడ్చుకొని మోకాళ్ళతో భూమిపైన పడవేసెను.

అట్లు పడిపోయిన భీముడు అతివేగముతో దండధరుడైన యమునివలె పైకి లేచెను

అట్లా యిరువురు బలవంతులు పరస్పర స్పర్ధతో ఆ యర్ధరాత్రమునందు, నిర్జన స్థలమున నొండొరులు ఈడ్చుకొనుచుండిరి. అది గట్టి యిల్లయినను మాటిమాటికి కంపించెను. క్రోధముచేత ఆ యిరువురు గర్జిల్లిరి.

ఇంతలో, భీముడు కీచకుని తన కరతలముల చేత గట్టిగా కొట్టెను. అయినను కీచకుడు ఒక అడుగైనను కదలక నిలిచెను.

ముహూర్తకాలమట్లు నిలిచియుండియు భీముని బలముచేత వశము దప్పిన కీచకుని బలము క్షీణించెను.

కీచకుని బలము తగ్గుట, అతడు అచేతనుడగుటను కనిపెట్టి భీముడు అతని రొమ్ముపైన ఎక్కి కూర్చొని పిడికిలితో గట్టిగా గ్రుద్దెను. అతడు క్రోధావిష్టుడై, శార్దూలము మృగమును పట్టుకొనినట్లు కీచకుని జుట్టు పట్టుకొనెను. పశువులను పగ్గముతో కట్టినట్లు తన బాహుపాశములతో కీచకుని బంధించెను. పగిలిపోయిన నగారవలె అరచుచున్న కీచకుని భీముడు గిరగిర త్రిప్పెను.

తరువాత భీముడు కీచకుని కంఠమును తన బాహువులతో పట్టి ద్రౌపది కోపము శాంతించుటకు గాను, నులిమెను. అంతటితో కీచకుని సర్వావయములు నలిగి, కనుగ్రుడ్లు వ్రేలాడెను.

భీముడు మోకాలితో అతని నడుమును అదిమి బాహువులతో పశువునువలె చంపెను. భూమిపైన ఈడ్చి భీముడు, "సైరంధ్రికి కంటక ప్రాయుడుగా, నా భార్యను అపహరించువాడుగాను నున్న కీచకుని నేడు చంపి ఋణవిముక్తుడనై శాంతిని పొందితిని" అని చెప్పి వికారముగా చచ్చిపడియున్న కీచకుని విడిచెను.

కాని, అతని కోపము ఆగలేదు. చేతులు నలిపికొనుచు పండ్లు పటపట కొరుకుచు, మరల కీచకునిపై నెక్కి, పూర్వము పరమేశ్వరుడు గయాసురుని అవయవములను అతని శరీరమునందు కూరినట్లు, భీముడు కీచకుని కాళ్ళు, చేతులు, తల, మెడ మొదలైన అవయవములను అతని శరీరములోనికి కూర్చి ముద్దగా ఒక మాంసపిండాకారమును చేసి, ద్రౌపదితో 'పాంచాలీ! రమ్ము ఈ కామాంధుని ఏగతి పట్టించితినో చూడుము' అని చెప్పెను."

"జనమేజయా! ఇట్లు చెప్పి భీముడంతటితో ఆగక, కీచకుని మృత శరీరమును పాదములతో త్రొక్కెను. అగ్నిని మండించి ఆ వెలుగులో కీచకుని పాంచాలికి చూపి, ద్రౌపదీ! సద్గుణశీలవతియగు నిన్ను పొందగోరువారికి, ఈ కీచకుని గతియే పట్టును' అని చెప్పెను.

తరువాత భీముడు శాంతిల్లి, ద్రౌపదిని వీడ్కొని తన పాకశాలకు పోయెను.

కీచకుడు చచ్చిన పిదప, ద్రౌపది మిక్కిలి సంతసించుచున్నదై, నర్తన శాలకు వెలుపలనున్న కావలివారిని పిలిచి 'నన్ను కామించిన కీచకుని నా పతులు గంధర్వులు వచ్చి వధించిరి. అక్కడికి వచ్చి చూడుడు' అని చెప్పెను. ఆ మాటకు ద్వారపాలకులు దివిటీలు పట్టుకొని వచ్చి, అచ్చట చచ్చి నెత్తుటిలో దొగి ముద్దగా పడియున్న కీచకుని చూచి మిక్కిలి ఆశ్చర్యముతో, 'ఇతని కాళ్ళు, చేతులు, మెడ, తల యివన్నియు నెక్కడ నున్నవి?' అని పరీక్షింపజేసిరి.

(భీమ కీచకులు పోరాడు చున్నప్పటి చప్పుడు ఇతరులు విన్నయెడల తనకు అవమానము జరుగునని కీచకుడు, అజ్ఞాతవాస ప్రతిజ్ఞా భంగమగునని భీముడు తలచి చప్పుడు సేయని, గూఢ యుద్ధము చేసినట్లు తిక్కన వ్రాసెను. వ్యాసు డీ మాట వ్రాయలేదు! అని ఆ మహర్షిపై అనౌచిత్య దోషమును కొందరు విమర్శకులు ఆరోపించు చుంచురు. అది సరికాదు. ఎందుకనగా, నిర్జనమైన, నర్తనశాలలో యుద్ధము జరిగెను. ద్రౌపది దప్ప ఆ పరిసరములలో నెవ్వరును లేరు. కీచక వధజేసి భీముడు వెడలిపోయిన తరువాత ద్రౌపది నర్తనశాలకు అతిదూరము నందున్న కావలి వారి వద్దకు పోయి, ఆ సంగతి తెలిపి, వారిని తోడుకొని వచ్చి కీచకుని శరీర పిండము చూపినట్లు వేదవ్యాస మహాముని వ్రాసినారు. ఆ యిరువురు పోరాడు చున్నప్పటి చప్పుడు, ద్రౌపది తప్ప ఎవ్వరును ఇతరులు వినలేదనుట స్పష్టము. తిక్కన ఎట్లు ఆ విషయమును వ్రాసెనో. ఇద్దరు మహాకవులే. అట్లుండగా బ్రహ్మర్షిపైన అనౌచిత్య దోషము మోపరాదు.)

ఉపకీచకులు ద్రౌపదిని బంధించి శ్మశానమునకు తీసికొని పోవుట

"జనమేజయా! అప్పుడు కీచకుని బంధువులందరు అక్కడికి వచ్చి మిక్కిలి యేడ్చిరి. ఆ విధముగా అన్ని అంగములు ముడుచుకొని నేలపైన పడి యున్న తాబేలువలె (తాబేలు నీటిలో నున్నప్పుడే కాళ్ళు, తల వ్యాపింపజేయును. నేలపై నున్నప్పుడు తల, కాళ్ళు ముడుచుకొని ముద్దవలె పడియుండును. ఆ విధముగా కీచకుడున్నాడని అద్భుతమైన యీ ఉపమానముచేత తెలియుచున్నది.) నున్న కీచకుని చూచిన బంధువులకు భయము, గగుర్పాటు కలిగెను.

అట్లు నలగగొట్టబడిన కీచక శరీరమునకు దహన సంస్కారము చేయుటకు వారు ఆ శవమును బయటికి (శ్మశానమునకు) తీసికొని పోవుటకు సిద్ధము చేయుచుండిరి. పూర్వము వృత్రాసురుని వధించి ఇంద్రుడు వృత్రుని శరీరమును గూడ నిట్లే చేసియుండెను

అప్పుడు ఉపకీచకులు ఆ సమీపములో నొక స్తంభమును ఆనుకొని నిలిచియున్న ద్రౌపదిని చూచి, "ఈమె వలననే కీచకుడు చంపబడెను గనుక ఈ దుష్టురాలిని శీఘ్రముగా చంపవలెను. లేదా, ఈమెను బంధించి ఈమెను కామించిన కీచకుని శవముతోనే దహించుడు. కీచకునకు గూడ ప్రియము చేసి నట్లగును" అని చెప్పి ఆ పనికి ఆజ్ఞ యిమ్మని విరాటరాజు నడిగిరి.

ఉప కీచకుల పరాక్రమము నెరిగినవాడు కాబట్టి వారికి భయపడి విరాటుడు ద్రౌపదిని గూడ కీచకుని మృతశరీరముతో బాటు దహించుటకు అంగీకరించెను.

అప్పుడు భయముచేత కంపించుచున్న ద్రౌపది వద్దకు ఉపకీచకులు వచ్చి ఆమెను పట్టుకొని ఆ పాడెపైననే బంధించి శ్మశానమునకు తీసుకొనిపోయిరి. అప్పుడు తన నాథులకు మొరపెట్టుకొనుచు ద్రౌపది వారిని ఇట్లు పిలిచెను:

"జయ-జయంత - విజయ - జయత్సేన - జయద్బలులారా! పిడుగు ధ్వని వంటి ధనుష్టంకారము చేయుచు, మీరు భయంకర రథ ధ్వనిచే పూర్వము శత్రువుల హృదయములను చీల్చుచుండిరి. అట్టి మీ ప్రియపత్నిని ఉపకీచకులు చంపుటకు కొనిపోవుచున్నారు. నా మొర విని త్వరగా రండు."

"జనమేజయా! ద్రౌపది మొర చెవిలో పడగనే భీముడు తన పరుపు నుండి లేచి పరుగెత్తుచు, 'సైరంధ్రీ! నీ మాట నేను విన్నాను. కనుక ఉప కీచకులవలన భయము నీకు లేదు' అని పలుకుచు ఒడలు పెంచుకొని, వేషము మార్చుకొని, ద్వారముగుండా పోయినచో జాగు కావచ్చునని గోడ దుమికి ఉప కీచకులను వధించు నిచ్ఛతో పోయెను.

అతడు ప్రహరీ గోడనుండి వృక్షముపైకి ఎక్కి ఉప కీచకులు పోవువైపు చూచి వారు శ్మశానమువైపు పోవుచుండుట చూచి వేగముగా ఉరికెను.

శ్మశాన సమీపమునందు తాటిచెట్టువలె పొడవుగాను, పెద్ద కొమ్మలుగల అగ్ర భాగము ఎండినదిగాను నున్న ఒక చెట్టును పెరికి, ఏనుగువలె దానిని రెండు చేతులతో ఎత్తి భుజముపైన పెట్టుకొనెను

ఆ చెట్టు పది బారల పొడవుండెను. దండ హస్తుండయిన యమునివలె ఆ వృక్షమును భుజముపైన పెట్టికొని వారిని తరిమెను. అతడు పరుగెత్తునపుడు అతని తొడల వేగముచేత దారిలోని చిన్న చిన్న చెట్లు నేలవ్రాలెను.

ఉప కీచకుల వధ

"సింహమువలె వచ్చుచున్న ఆ గంధర్వుని చూచి కీచకులు భయముచే వణకుచుండిరి. 'సైరంధ్రి వలననే మనకీ ప్రాణభయము కలిగినది. ఈమెను విడువుడు' అని ఆమెను విడిచిపెట్టి పరుగెత్తిరి.

అప్పుడు భీముడు ఆ వృక్షముతోనే ఆ నూటఅయిదు మంది ఉపకీచకులను ఇంద్రుడు రాక్షసులను వలె సంహరించెను.

తరువాత ద్రౌపది బంధములను విడిచి భీముడు ఆమెను ఓదార్చుచు "దేవీ! నిరపరాధవైన నిన్ను బాధపెట్టినవారికి ఈ గతియే పట్టును. ఇక నీవు నిర్భయముగా నగరమునకు పొమ్ము. నేను ఇతర మార్గముగుండా పాకశాలకు పోయెదను" అని చెప్పి వెడలిపోయెను.

"జనమేజయా! నరకబడిన చెట్లు క్రింద పడినట్లు నూటఅయిదు మంది ఉపకీచకుల శవములు శ్మశానమందు పడియుండెను.

జనమేజయ మహారాజా! కీచకునితోపాటు నూటఆరుగురు కీచకులును ఈ విధముగా భీమునిచేత చంపబడిరి. ఆ దృశ్యమును చూచి పౌర స్త్రీ పురుషులు మహాశ్చర్యమును పొంది ఏమియు మాటాడకుండ నుండిరి"

అని చెప్పివైశంపాయనుడు తరువాతి కథ ఇట్లు చెప్పదొడగెను :-

ద్రౌపది బృహన్నలా, సుదేష్ణలతో మాట్లాడుట

"జనమేజయా! పౌరులప్పుడు విరాటరాజుకడకు పోయి యిట్లనిరి :-

'గంధర్వులు ఉప కీచకులను సంహరించిరి. వజ్రాయుధముచేత ఛేదించ బడిన పర్వత శిఖరములవలె వారి తలలు నేలపై వ్రాలి పడియున్నవి. సైరంధ్రి విడిపింపబడి తిరిగి నగరములోకి వచ్చుచున్నది.

రాజా! ఆమె యిచట నుండుటచేత నీ నగర జీవన మంతయు సంకటావస్థలో పడియున్నది. సైరంధ్రియో, అతిలోక సౌందర్యవతి. ఆమెను కాపాడుచున్న గంధర్వులో, మహా బలవంతులు. ఆమెను చూచిన ప్రతి పురుషునికో తప్పక కామేచ్ఛ కలుగును.

రాజా! సైరంధ్రి దోషముచేత ఈ పట్టణము వినాశము చెందకుండు విధానమును త్వరగా అనుసరించుము.'

ఆ మాటలువిని విరాటరాజు ఇట్లనెను :-

"ఈ సూత పుత్రశవములకు అంత్యేష్టి (దహన సంస్కారములు) చేయబడుగాక! ఒక చోటనే అంటించబడిన అగ్నిలో శరీరము లన్నియు చందన కాష్ఠముల చేతను రత్నముల చేతను ఇతర సుగంధ ద్రవ్యముల చేతను దహింపబడునుగాక!"

ఇట్లు చెప్పి సుదేష్ణను చూచి విరాటరాజు ఇట్లనెను:

"దేవి! నీకడకు సైరంధ్రి వచ్చినచో నామాటగా నామెతో నిట్లనుము:-

"సైరంధ్రీ! నీ యిచ్ఛవచ్చినచోటికి పొమ్ము. గంధర్వుల వలన నేను భయపడు చున్నాను నీవు గంధర్వుల చేత రక్షింపబడు చున్నావు. నేను పురుషుడను కనుక స్వయముగా నీతో ఏమాటగూడ చెప్పజాలకున్నాను. కాబట్టి స్త్రీ ద్వారా నీకు చెప్పించుటలో ఏదోషము ఉండదని, నా పత్నిద్వారా నేనే నీతో ఈ మాట చెప్పుచున్నాను."

"జనమేజయా! భీమునిచేత విడిపింపబడిన తరువాత సైరంధ్రి స్నానము చేసి బట్టలు ఉతుకుకొని పరిశుభ్రయై విరాట నగరమునకు పోయెను.

ఆమెనుచూచి పురుషులందరు నలుదిక్కులకు పారిపోయిరి. గంధర్వుల భయముచేత కొందరు ఆమెను చూడగనే కన్నులు మూసికొనిరి.

పాకశాల ద్వారమునందు మదపుటేనుగువలె నిలిచియున్న భీమసేనుని ద్రౌపదిచూచి విస్మయ పూర్వకముగా 'నన్ను విడిపించిన గంధర్వ రాజునకు నమస్కారము' అని యనెను.

ఆ మాటవిని భీముడు 'దేవీ! పూర్వమునుండి యిక్కడ ఉన్న గంధర్వులు తమ ప్రతిజ్ఞా ఋణము నుండి విముక్తులై, నీ యాజ్ఞకు వశులై నేటి నుండి యిచ్ఛానుసారముగా సంచరింతురుగాక!' అని ద్రౌపదితో ననెను.

"తరువాత ద్రౌపది, నర్తనశాలయందు విరాట కన్యలకు నాట్యము నేర్పుచున్న అర్జునుని చూచెను.

అప్పుడు ఆ కన్యకలు నర్తనశాల నుండి బయటికి వచ్చి, ఏ యపరాధము చేయకయే క్లేశములనుభవించి వచ్చుచున్న ద్రౌపదిని చూచి "సైరంధ్రీ! నిరపరాధు రాలైన నిన్ను బాధించిన కీచకులు నీ భాగ్యవశమున వధించబడిరి. నీవు విడిపింపబడితివి" అని ద్రౌపదితో ననిరి.

తరువాత సైరంధ్రీ బృహన్నలకు ఇట్లు సంవాదము జరిగెను:-

బృహ :- "సైరంధ్రీ! ఆ పాపిష్ఠులు ఎట్లు చంపబడిరి? నీ వెట్లు విడిపింపబడితివి? జరిగిన వాస్తవమును వినగోరుచున్నాను."

సైరంధ్రి :- బృహన్నలా! సుఖముగా కన్యకాంతఃపురము నందు సర్వదా వసించుచున్న నీకిప్పుడు సైరంధ్రి విషయముతో నేమిపని? సైరంధ్రికి గలిగిన దుఃఖమును పోగొట్టు దానవు కావుగదా? నాకు గలిగిన దుఃఖానుభవము నీకెక్కడిది? కేవలము నన్ను పరిహాసించుటకు ఇట్టి ప్రశ్నలు చేయుచున్నావా?

బృహ :- "కల్యాణీ! పశువుల వంటి నీచజాతి (నపుంసకుడుగా) లోబడి యున్న బృహన్నలగూడ గొప్ప దుఃఖముననుభవించుచున్నది. నీవు అమాయకురాలవు గనుక బృహన్నలనుగూర్చి తెలియకున్నావు. నీతోనేను కలిసియున్నాను. నీవుగూడ మా అందరితో కలిసియున్నావు.

ఇట్లుండగా, నీకు కష్టముకలిగినప్పుడెవరికి దుఃఖము ఉండదు? నిశ్చయముగా, ఒక వ్యక్తి యితరుల మనస్సును తెలిలిసికొనజాలడు కనుక నీవు నన్ను తెలిసికొనలేకున్నావు."

"జనమేజయా! అట్లు నర్మగర్భితముగా మాట్లాడిన తరువాత ద్రౌపది, తోడి కన్యకలతోపాటు రాజగృహము నందు ప్రవేశించి సుదేష్ణవద్దకు పోయెను. సుదేష్ణ సైరంధ్రితో విరాటరాజు మాటగా నిట్లనెను:-

"సైరంధ్రీ! నీ యిష్టమువచ్చిన చోటికి పొమ్ము. నీ పతులు గంధర్వుల నుండి రాజు భయపడుచున్నాడు. నీవు ఈ భూమండలమునందు అసమాన సౌందర్యవతివి. పురుషులకు విషయోపభోగము ఇష్టముగా నుండుట సహజము. నీ పతులు గంధర్వులో అతి కోపిష్ఠులు."

ఆ మాటలు విని సైరంధ్రి యిట్లనెను:-

"భామినీ! ఇక పదమూడు దినములవరకు మాత్రము మహారాజు నన్ను క్షమించుగాక! అప్పటికి గంధర్వుల అభీష్ట కార్యము పరిపూర్ణమై వారు కృతకృత్యులయ్యెదరు. తరువాత వారు నన్ను తోడ్కొనిపోయెదరు. మీకుగూడ ప్రియము కలిగించెదరు. గంధర్వులు ప్రసన్నులగుటచేత విరాటరాజు గూడ అవశ్యముగా తన సోదర - బాంధవులతో అనేక శ్రేయస్సులు అనుభవించగలడు.

విరాటరాజు వలన ఉపకారము పొందిన గంధర్వులు సర్వదా అతనికి కృతజ్ఞులుగా నుండెదరు. గంధర్వులు అతిసాధువులు, బలవంతులు, తాము పొందిన ఉపకారమునకు ప్రత్యుపకారము చేయదలచెదరు.

నిన్ను ప్రార్థించుచు అడుగుచున్నాను. నీ మనస్సులో ఏమైనను అనుకొనుము. నా ప్రార్థనను నీకు నివేదించినాను. ఇక కొద్ది దినములు మాత్రము నన్ను భరించుము. దీనిచేత నీకు శుభము కలుగును."

"జనమేజయా! సైరంధ్రి మాటలు విని సుదేష్ణ తన సోదరుల మరణము చేత పరితపించుచు, దుఃఖించుచు, ఏమియుతోచక ఆర్తురాలై ద్రౌపదితో నిట్లనెను:-

"భద్రే! నీ ఇచ్ఛ ఉన్నంతవరకు ఇక్కడ ఉండుము. కాని, నా పతిని, పుత్రులను విశేషముగా రక్షించుము. దీనికై శరణుజొచ్చితిని."

ఇట్లు చెప్పి వైశంపాయనుడు జనమేజయునకు తరువాతి వృత్తాంతము నిట్లు చెప్పెను:-

గూఢచారులు కీచకవధనుగూర్చి దుర్యోధనునకు చెప్పుట

"జనమేజయా! కీచకుడు చంపబడిన తరువాత విరాటరాజు సపరివారముగా మిక్కిలి దుఃఖించెను. జనులుగూడ 'అంతటి బలశాలురు కీచకుడు, అతని తమ్ములే వధింపబడిరి. మన గతియేమి?' అని భయపడజొచ్చిరి.

మహా బలవంతుడైన కీచకుడు విరాటునకు ప్రియుడుగానుండెను. ఆ నగరమునందును, దేశమునందును ప్రజలు గుంపులు గుంపులుగా చేరి ముచ్చటింపజొచ్చిరి.

'ఆతడు శత్రుసంహారకుడేగాని, పరస్త్రీలోలుడు, దుర్మార్గుడు. కాబట్టియే గంధర్వులచేత చంపబడెను' అని దేశప్రజలు అనుకొనుచుండిరి.

"దుర్యోధనునిచే పంపబడిన గూఢచారులు, అనేక రాష్ట్రములను, గ్రామములను తిరిగి పాండవులను వెదకుచుండిరి. అంతటను తిరిగి వారు హస్తినాపురమునకు పోయిరి అక్కడ సభలో భీష్మ - ద్రోణ - శకుని - దుశ్శాసనాదులతో కూర్చునియున్న దుర్యోధనునితో గూఢచారు లిట్లనిరి:-

"రాజా! అతి దుర్గమమైన అడవులన్నియు మేము అతిప్రయత్నముతో వెదకితిమి. పర్వత శిఖరములందు, అనేక దేశములందు, పట్టణములందును వెదకితిమి. కాని, యెక్కడగూడ పాండవులజాడ కానరాలేదు.

ఒకవేళ పాండవులు నశించిపోయినారేమో యని అనుమానము కలుగుచున్నది. లేకున్న మా యన్వేషణము నందు వారు తప్పక కనబడియుందురు. వారు ఎక్కడ నివసించుచున్నదికూడా తెలియలేదు.

రాజా! కొంతకాలము మేము వారి సారథులవెంట వెడలితిమి. ఇంద్రసేనాది పాండవ సారథులు పాండవులు లేకయే ద్వారకాపురికి చేరిరి.

కనుక పాండవులు, ద్రౌపది నశించియేయుందురని మా నిశ్చయము. పాండవుల సమాచారముగాని, వారు చేయుచున్న పనిగాని తెలియకున్నది.

ఇకపైన మాకు ఆజ్ఞయేమి? పాండవులను వెదకుటకు ఇంకను నేమిచేయ మనెదరో సెలవీయవలెను.

ఒక క్రొత్త విషయము మాత్రము మాకు తెలియవచ్చినది, వినుడు :

"ఏ బలపరాక్రమశాలి త్రిగర్తులను సంహరించెనో, అట్టి కీచకుని విరాట నగరమునందు ప్రచ్ఛన్నముగా, అతని నూట ఆయిదుగురు తమ్ములతోపాటు గంధర్వులు సంహరించిరి. కీచకులు ఒక స్త్రీ నిమిత్తముగా చంపబడిరట.

రాజా! మీ శత్రువులైన కీచకులకు జరిగిన పరాభవము విని కృత కృత్యుడవుకమ్ము."

అని చెప్పి వైశంపాయనుడు తరువాతి వృత్తాంతము జనమేజయునకిట్లు చెప్పదొడగెను:

పాండవులజాడ కనిపెట్టుటకు ప్రయత్నము

"జనమేజయా! గూఢచారులు చెప్పిన మాటలు విని దుర్యోధనుడు మనస్సులో చాలసేపు యోచించి సభాసదులతో నిట్లనెను:-

"కార్యముల పరిణామము తెలిసికొనుట చాలకఠినము. కనుక అందరును పాండవులను బాగుగా వెదకుడు.

ఈ యజ్ఞాత వాసకాలము పదుమూడవ సంవత్సరమునందు చాల కాలము గడిచినది. ఇక కొద్దికాలమే మిగిలినది.

ఈ మిగిలిన కొద్దికాలముగూడ వారు గడపినచో సత్యవ్రతనిష్ఠగల పాండవులు, తమ ప్రతిజ్ఞాకాలము ముగించిన తరువాత, మత్తగజములవలె, విష సర్పములవలె క్రుద్ధులై కౌరవులకు దుఃఖదాయకులగుదురు. ఇది నిశ్చ యము.

వారందరుగూడ కాలపు గడువు నెరిగినవారు. కనుక తమను గుర్తు పట్టరాని వేషములో వారెక్కడనో దాగియుందురు. త్వరగా వారి జాడ కను గొనుడు.

వారిని మనము కనుగొనగలిగినచో, వారు తమ క్రోధమును అణచుకొని మరల పన్నెండేండ్లు వనవాసము చేసెదరు. నేను సుఖముగా శత్రురహితమైన రాజ్యమును నిశ్చింతగా ఏలుకొనెదను.''

అప్పుడు కర్ణుడిట్లనెను:-

"రాజా! అట్లైనచో, త్వరగా కార్య కుశలులైన యితర గూఢచారులను-పాండవులను వెదకుటకు పంపుము. ఆ గూఢచారులు ధూర్తులుగానుండి రహస్యముగా మెలగుచు కార్యమును బాగుగా సాధించగలరు.

వారిచే అన్ని దేశములు ఊర్లు, పల్లెలు, గోశాలలు, విద్వత్సభలు, సిద్ధాశ్రమములు, సేవకులుండుచోట్లు, పుణ్యతీర్థములు, గనులు ఈ మొదలైన స్థలములలో గాలించి వెదికించవలెను. ఆయాచోట్ల నివసించు జనులను యుక్తితో వినయపూర్వకముగా నడిగి తెలిసికొనవలెను.

పాండవులు ఏ గుప్తస్థానములోనో దాగియుందురు. వారిని వెదకువారు గూడ మంచి తెలివితో రహస్యముగా కార్యసాధనమునందు ఆసక్తి గలిగి వారిని కనుగొనగలుగు వారిని సమర్థులను పంపి నదీ కుంజాదులయందు వెదికించవలెను."

తరువాత పాపభావనయందే ప్రీతిగల దుశ్శాసనుడు అన్నతో నిట్లనెను:-

"రాజా! గుప్తచారులలో నెవ్వరి యెడల మనకు విశ్వాసమున్నదో వారికి సాధన సామగ్రి యంతయునిచ్చి వారిచేత పాండవులను మరల వెదకించవలెను. కర్ణుడు చెప్పిన చోట్లలోనే సంచరించి వారు వెదకవలెను. కర్ణుని యభిప్రాయమే మా యభిప్రాయము.

ఇంతదాక పాండవులు పోయినచోట్లుగాని, నివసించిన చోట్లుగాని తెలియకున్నవిగనుక అనేకులు గూఢచారులు దేశదేశములు తిరిగి పాండవులను వెదకవలెను.

వారు అత్యంత రహస్య స్థానమునకో లేక సముద్రము ఆవలి తీరమునకో పోయియుందురు.

లేదా, 'మేము శూరులముగదా! మాకేమి భయము?' అని గర్వముతో మహారణ్యమునందు తిరుగుచు నొకవేళ సర్పములచేత భక్షింపబడి యుందురు.

లేదా వారు ఏదైన విషమావస్థలో చిక్కుకొని శాశ్వతముగా నాశమునే చెందియుందురు.

అందుచేత కురునందనా! నీవు చిత్తమును స్వస్థముగా నుంచుకొని, ఏది యుక్తమో ఆ పనిని ఉత్సాహముతో చేయుము."

వైశంపాయనుడు మరల నిట్లు తరువాత కథ చెప్పదొడగెను :

అన్వేషణకు ద్రోణాచార్యుని సమ్మతి

జనమేజయా! తత్త్వమునెరిగిన ద్రోణాచార్యుడిట్లనెను :-

"శూరులు, విద్వాంసులు, బుద్ధిమంతులు, జితేంద్రియులు, ధర్మపరులు, కృతజ్ఞులు, ధర్మరాజునే సర్వదా అనుసరించువారునైన పాండవులు వినాశమును గాని, పరాభవమునుగాని పొందరు.

నీతి తత్త్వమును, ధర్మ తత్త్వమును తెలిపి తమ్ములచేత తండ్రివలె సమ్మానింపబడుచు, ధర్మమార్గమునందే స్థిరముగా నడచుచు, సత్యమునే ధైర్యముతో అనుసరించుచు, అజాతశత్రువు - మహాత్ముడునైన జ్యేష్ఠభ్రాతను భక్తితో ననుసరించుచున్న అతని తమ్ములకు ఏ యిక్కట్లు సంభవించవు.

ఆతడుగూడ తమ్ములయెడల పుత్ర ప్రేమతో మెలగుచుండును. తనకు విధేయులు, స్థిరచిత్తులు మహాత్ములునైన తమ్ములకు నీతిమంతుడైన యుధిష్ఠిరుడు మేలు చేయకుండునా! తప్పక వారి శ్రేయస్సుకే ఆతడు పాటుపడుచుండు ననుటలో సందేహములేదు.

కనుక వారు అజ్ఞాతవాసపు గడువు ముగియుటకై ఎక్కడనో వేచి యుందురు. ఎంత యోచించినను వారు నశించియుందురని నేను తలంచుటలేదు.

ఇప్పుడు చేయవలసిన పనిని బాగుగా విచారించి నీవు త్వరగా చేయవలెను.

రాజా! ఇందులో జాగుచేయుట తగదు. అన్ని విషయములలో ధైర్యము వహించు పాండవుల నివాస స్థానపు జాడ బాగుగా వెదకించి కనిపెట్టవలెను. వారు శూరులేకాక తపస్సంపన్నులు గూడ నగుటచేత వారిని కనుగొనుటయు సాధ్యముకాదు.

వారి స్థానమును ఒకవేళ కనుగొన్నను, వారిని గుర్తించుట సులభ సాధ్యముకాదు. పరిశుద్ధాత్ముడైన ధర్మపుత్రు డొకవేళ కనపడినప్పటికిని, తనను చూచిన వారిని మోహపరచి, వారిచేత గుర్తింపబడజాలడు.

కనుక రాజా! ఈ విషయములన్నియు దృష్టియందుంచుకొని జాగ్రత్తతో మరల వారిని వెదకుటకు, బ్రాహ్మణులు, గూఢచారులు, సిద్ధపురుషులు వీరేకాక వారిని కనుగొనగలుగు యితరులు, ఇట్టి వారిద్వారా బాగుగా వెదకించవలెను.''

ఇట్లు చెప్పి వైశంపాయనుడు తరువాతి కథ చెప్పుటకు మొదలిడెను:-

అన్వేషణకు భీష్మపితామహుని సమ్మతి

"జనమేజయా! ద్రోణాచార్యుడు చెప్పిన తరువాత అతని మాటతో ఏకీభవించుచు, కురుపితామహుడు, దేశ కాలజ్ఞుడు, వేదశాస్త్ర విద్వాంసుడు, తత్త్వవేత్త, సమస్త ధర్మవిదుడు, శంతనుపుత్రుడునైన భీష్ముడు, ధర్మజ్ఞుడైన యుధిష్ఠిరుని విషయమై, ధర్మ సమ్మతము, దుర్జనులకు దుర్లభము, సజ్జనులకు ప్రియకరము సాధువులు మెచ్చుకొనదగినదియునగు మాటను యిట్లు చెప్పెను:-

"దుర్యోధనా! విప్రుడైన ద్రోణాచార్యుడు చెప్పిన మాట సర్వవిధముల సరిగానున్నది. సర్వసులక్షణ సంపన్నులు, సాధుశీలమే ఉత్తమముగా గలవారు, శాస్త్ర దృష్టులునైన ఉత్తములనే అనుష్ఠించువారు, అనేక వేదశాస్త్రజ్ఞులు, పెద్దల యాజ్ఞను శిరసావహించువారు, సత్యనిష్ఠులునైన పాండవులు ప్రతిజ్ఞా పాలనము చేయుచు, పరిశుద్ధ మనస్కులై, క్షత్రియ ధర్మమును విడువక, శ్రీకృష్ణనే ఆరాధించువారలు, మహాబలవంతులు, వీరులు, మహాత్ములు, సత్పురుషుల శ్రేయస్సు, భారమును వహించియున్నవారును గాబట్టి వారు నశించిపోవుటకు తగరు. ధర్మము నాశ్రయించియే వారు ప్రచ్ఛన్నులుగా నున్నారు గాబట్టి వారు నశించరని నా దృఢ నిశ్చయము.

"దుర్యోధనా! పాండవుల విషయమై నా నిశ్చయము తెలిపెదను వినుము. ఉత్తమ నీతి సంపన్నులైన పాండవుల నీతిని కనిపెట్టుట అవినీతి పరులకు సాధ్యముకాదు. వారి విషయములో బాగుగా యోచించిన యుక్తి సమ్మతమైన ఉపాయమొకటి నా మనస్సుకు తోచుచున్నది. ఆ ఉపాయమే మనము చేయవలెను. దానిని ద్రోహ బుద్ధితో చెప్పుటలేదు. నీ మేలు కొరకై చెప్పుచున్నాను. సావధానముగా వినుము:-

ధర్మరాజు మహిమ

"మావంటి వారు యుధిష్ఠిరుని నీతిని నిందించగూడదు. అది మంచి నీతి యనియే చెప్పవలెను అది అవినీతియని చెప్పుట ఏ విధముగాగూడ మంచిదికాదు.

''నాయనా! వృద్ధుల శిక్షణలో పెరిగి, సత్యము పలుకు ధీరులు, ఒక వేళ సత్పురుషుల సమాజమునందు, ఏమైన చెప్పదలచినచో, ఆ మాట ధర్మసంగత ముగా, యథార్థముగా, ఉచితమైనదిగాను నుండునట్లు చెప్పవలెను,

ఈ పదుమూడవ యేట అజ్ఞాతవాసమునందు యుధిష్ఠిరుని నివాసమును గూర్చి యితరులు చెప్పిన అభిప్రాయములతో నేను ఏకీభవించను.

"తండ్రీ! ధర్మరాజు నివసించు పట్టణమును గాని, రాష్ట్రమును గాని యేలు రాజులకు ఎప్పుడు గూడ అమంగళము కలుగదు. యుధిష్ఠిరుడు నివసించిన దేశములోని ప్రజలు దానశీలురు, ఉదారులు, వినయవంతులు, లజ్జాశీలురు నై యుండుట భావ్యము. అట్లుండి తీరవలెను.

అతడున్న దేశపు జనులు ప్రియవాదులు. ఇంద్రియ నిగ్రహము గల వారు, మంగళకరులు, సత్యపరులు, దార్ఢ్యము, పుష్టి, శౌచము, సామర్థ్యము గలవారై యుండి యుందురు.

ఆ దేశమునందు, అసూయాపరులు, దురభిమానులు ఉండరు. అందరు ధర్మము ననుసరించియే నడచుకొనెదరు.

అచ్చట, విశేషముగా వేదాధ్యయనము, యజ్ఞములలో పూర్ణాహుతులు, విరివిగా దక్షిణలిచ్చి యజ్ఞములు జరుగుచునుండును.

మేఘము మంచిగా వర్షించి, సంపన్నములైన పైర్లతో అచ్చటి ప్రజలు నిర్భయులై సుఖముగా నుండియుందురు.

అక్కడ గుణము గల మంచి ధాన్యములు, రసముగల మంచి ఫలములు, పరిమళముగల మంచి పుష్పములు, మంగళకరములైన మంచి మాటలు నుండి యుండును.

అచ్చట సుఖస్పర్శగల వాయువు వీచుచుండును. ధర్మమును, పరబ్రహ్మ మును తెలుపు ధర్మ శాస్త్రములు, వాటికి విపరీతమైన అర్థమును తెలుపునవిగా నుండవు. ఎవరికినీ భయము ఉండదు.

కృశములు గాక బలిసిన గోవులు అనేకములుగా నుండి పుష్కలముగా పాలు, పెరుగు, నేయి రుచికరములైనవి యుధిష్ఠిరుడు నివసించు దేశమునందు లభించుచుండును.

రుచికరములైన భోజన - పానీయములు అచ్చట దొరకును జ్ఞానేంద్రియ విషయములగు 'శబ్ద-స్పర్శ-రూప-రస- గంధములు' మంచివిగా నుండును.

ఆ దేశమునందు ద్విజులు (బ్రాహ్మణ-క్షత్రియ-వైశ్యులు) స్వజాతి గుణములను ఆశ్రయించి స్వస్వధర్మములను ఆచరించుచుండెదరు.

ధర్మ పుత్రుడున్న దేశమునందలి ప్రజలు ప్రసన్నులు, సంతుష్టులు, పవిత్రులు, వికార శూన్యులుగా నుండియుందురు.

అక్కడ ఉన్న అందరికిని, దేవతాపూజ-అతిథిపూజ సర్వసాధారణముగా నుండియుండును. అందరును దానము చేయుటయందు ప్రీతి, ఉత్సాహము, ధర్మపాలనము గలవారై యుందురు.

అక్కడి ప్రజలు అశుభమును విడిచి శుభమునే కోరుచుందురు. మంగళకర వస్తువులనే కోరుచు అమంగళములను విడుచుచునుందురు.

యుధిష్ఠిరుడు ధర్మాత్ముడు, సత్య-ధైర్య-దాన-శాంతి-క్షమాది సద్గుణములన్నియు గలవాడు. అందుచేత, ద్విజులనబడు బ్రాహ్మణ-క్షత్రియ-వైశ్యులే అతనిని కనుగొనజాలరనగా, నితర సాధారణ జనులు కనుగొనలేరనుటలో ఆశ్చర్యము లేదు.

ఈ లక్షణములన్నియు నుండిన దేశమునందే యుధిష్ఠిరుడు గుప్తముగా నుండియుండును. ఇంతకంటే వేరు నేను చెప్పజాలను.

దుర్యోధనా! నా మాటపైన నీకు విశ్వాసముండినచో, ఈ విషయములన్ని విచారించి నీకు ఏది హితమో ఆ కార్యమును చేయుము.''

భీష్మపితామహుని ధర్మయుక్తములైన మాటలు ఇట్లు చెప్పి వైశంపాయనుడు జనమేజయునితో తరువాత వృత్తాంతము చెప్పదొడగెను:-

కృపాచార్యుని సమ్మతి

''జనమేజయా! తరువాత మహర్షియగు శరద్వంతుని పుత్రుడు కృపాచార్యుడు దుర్యోధనునితో ''రాజా! భీష్ముడు పాండవుల విషయములో చెప్పిన మాటలు సత్యములు-యుక్తి యుక్తములునై యున్నవి. భీష్ముడు చెప్పిన మాటల వంటివే కొన్ని నేనుగూడ చెప్పెదను వినుము.'' అని యిట్లు చెప్పదొడగెను:-

''రాజా! ఇప్పుడు హితకరమైన నీతినే ఆశ్రయించి నీవుగూడ చారుల ద్వారా పాండవులను వెదకించుము

చక్రవర్తి కాగోరువాడు సామాన్య శత్రువును గూడ నిర్లక్ష్యము చేసి విడువకూడదనగా, సర్వశస్త్రాస్త్ర కోవిదులై, యుద్ధ కుశలులైన పాండవుల విషయమై చెప్పవలసినదేమున్నది?

పాండవులు రహస్య వేషములతో నివసించున్నారు. వారి అజ్ఞాతవాస కాలము దాదాపు ముగియుచున్నది.

ఇట్టి సమయమునందు, స్వరాష్ట్ర పరరాష్ట్రముల యందుగల తమ శక్తిని తెలిసికొనుట అవశ్యకము. ఈ పదుమూడవ యేడు ముగియగనే పాండవులు బయటపడెదరనుటలో సందేహము లేదు.

వారు అమిత పరాక్రమవంతులు అజ్ఞాతవాస ప్రతిజ్ఞాకాలము ముగియగనే అమితోత్సాహముతో వచ్చెదరు.

కనుకనే నీ సైన్యమును, ధనాగారమును జాగ్రత్త పరచుకొనుము. ఆ బలముతో నీవు వారి నెదుర్కొన గలుగవలెను గదా!

నాయనా! నీబలమెంతో బాగుగా యోచించుకొనుము. నీకు సహాయము చేయు దుర్బలుల బలము, బలవంతుల బలము ఎంతయో బాగుగా తెలిసికొనుము.

కురువీరా! నీకు ఉత్తమ, మధ్యమ-అధమ సైన్యము లెన్నియో తెలిసికొనుము. ఉత్తమ-మధ్యమ సేనలు సంతోషముతో నున్నవా? అసంతుష్టితో నున్నవా? అని తెలిసికొనుము.

అప్పుడు మనము శత్రువులతో సంధి చేసికొనుటయా లేక యుద్ధము చేయుటయా అని నిర్ణయించుకొనవచ్చును. శత్రువు తన సమానుడైనప్పుడు

సామము, భేదము (సేనలో భేద భావము కలిగించుట) అనుసరించవలెను. సామమనగా సంధి చేసికొనుట

శత్రువు మనకంటె అధిక బలవంతుడైనప్పుడు దాని నీతిని ఆశ్రయించి అతనికి ధనరత్నాదులు కానుకలు ఇవ్వవలెను.

శత్రువు మనకన్న దుర్బలుడైనప్పుడు అతనిని దండోపాయముతో వధించవలెను. లేదా అణచవలెను.

అందుచేత శత్రువు బలాశయము లెరిగి సామ-దాన-భేద-దండములనెడు నాలుగు ఉపాయములు ప్రయోగించవలెను.

ఈ విధముగా మంచి ధనము-సైన్యము పెంచుకొనినచో నేడు ఫలసిద్ధిని పొందెదవు. అట్టి పరిస్థితిలో అతి బలవంతులైన శత్రువులు, వారు పాండవులు గాని, మరి యెవ్వరుగాని నీపైకి వచ్చినచో, వారు నీకంటె సైన్య-వాహనాదులలో తక్కువవారైనచో వారందరితో నీవు యుద్ధము చేయవచ్చును.

రాజేంద్రా! ఈ విధముగా, నీ కర్తవ్యమును నిర్ణయించుకొనుట నీ విధి. అట్లయినచో చాలకాలము నీవు సుఖమనుభవించెదవు."

"జనమేజయా! ఇట్లు కర్ణ-దుశ్శాసన-ద్రోణ-భీష్మ-కృపాచార్యులు చెప్పిన మాటలన్నియు విని దుర్యోధనుడు, మనస్సులో బాగుగా ఒక క్షణము యోచించి మంత్రులతో నిట్లనెను:-

దుర్యోధనుని నిర్ణయము

"మంత్రులారా! నేను పూర్వము జన సమాజములో శాస్త్రజ్ఞుల సిద్ధాంతములను విన్నాను. 'నీతి దృష్టితో మనుష్యుల బలాబలములను తెలిసికొనవలెను' అని పెద్దలు చెప్పినారు.

ఇప్పుడీ మనుష్యలోకమందు బాహు శరీర బలములందు, ధైర్యసాహసములందు మనుష్యులలో, రాక్షసులలోను ఇంద్రసమాన బలపరాక్రమములు గల పురుష వీరులు నలుగురే యున్నారు. బలములో వారికంటె మించినవారెవ్వరునులేరు. ఆ నలుగురు సమాన బలపరాక్రమములు గలవారు.

వారెవరనగా, బలరాముడు - భీముడు-మద్రరాజు శల్యుడు -కీచకుడు. అయిదవవానిని వినుటలేదు. వారు పరస్పర జయేచ్ఛతో నుందురు. బాహువిద్యా విశారదులు. అందుచేత, నేను భీముని జాడ కనుగొన గలను. పాండవులు తప్పక జీవించియున్నారనియే నా నిశ్చయము.

"కీచకుని భీమసేనుడు చంపినాడని తలచెదను సైరంధ్రియే ద్రౌపది. ఆమె కారణముగా భీమసేనుడు గంధర్వ వేషముతో రాత్రివేళ కీచకుని సంహరించినాడు భీముడు తప్ప కీచకుని వధించగల శూరుడు మరియొక డెవడుండును?

ఆయుధము పట్టకుండ బాహుయుద్ధములో కీచకుని మర్దించి, అతని అంగములు, చర్మ-మాంస- అస్థులు చూర్ణము చేయగలవాడు మరియొక డెవడు? వేషము మార్చుకొనిన భీముని కృత్యమే యిది. ద్రౌపది నిమిత్తముగా గంధర్వ వేషముతో భీముడే కీచకుని, ఉపకీచకులను అందరిని వధించెనని నా నిశ్చయము, సంశయము లేదు.

"భీష్మ పితామహుడు, యుధిష్ఠిరుడు నివసించిన దేశములో స్థితిగతులను గూర్చి చెప్పెను. వాటిలో చాల గుణములు ఈ నగరములోనున్నట్లు విన్నాను. కనుక పాండవులు గుప్త రూపములలో విరాట నగరమునందు నివసించుచున్నారని తలచెదను. కనుక, అక్కడికే పోయి వారిని కనుగొనవలెను.

మనము పోయి మత్స్యరాష్ట్రమును ధ్వంసము చేయుదుము. వారి గోధనమును పట్టుకొందము, అప్పుడు గోవులను విడిపించుటకు పాండవులు గూడ మనతో యుద్ధము చేసెదరు.

పదమూడవ యేడు నిండకముందే మనమొకవేళ పాండవులను కనిపెట్టగలిగినచో, వారు మరి పన్నెండు సంవత్సరములు వనవాసము చేసెదరు. మనకి రెండింటిలో ఏ యొక్కటి సమకూరినను లాభమే యగును—

పాండవులు దొరకకపోయినను ఈ యుద్ధయాత్రలో మత్స్య దేశమును కొల్లగొట్టినచో మన ధనాగారము పెరుగగలదు. దానితోపాటు శత్రువుల వినాశము గూడ జరుగును.

మత్స్యరాజు, 'పూర్వము తాను ధర్మరాజు పోషణలో ఉండి యిపుడు దుర్యోధనుని అధీనములోకి పోవుదునా?' అని మన యెడల తిరస్కారభావముతో నున్నాడు. అతనిని అణచ వచ్చును. ఈ లాభమైనను కలుగును గదా?

కాబట్టి యిప్పుడు మనకు మత్స్యదేశముపైన దాడి సలుపుటయే కర్తవ్యము. ఇది అందరు అంగీకరించినచో, నీతి యుక్తముగా నున్నదని తలచెదను."

"వైశంపాయనుడు దుర్యోధనుని మాటలు జనమేజయునకు చెప్పి తరువాతి వృత్తాంతము నిట్లు చెప్పదొడగెను:—

త్రిగర్తులు-కౌరవులు మత్స్యదేశముపై దాడి చేయుట

"జనమేజయా! త్రిగర్త దేశాధిపతియైన సుశర్మ మహారథికుడు. అతడు కర్ణునివైపు చూచుచు దుర్యోధనునితో సమయోచితముగ నిట్లనెను:-

"ప్రభూ! పూర్వము శాల్వ - మత్స్యదేశముల సైనికులు చాలాసార్లు మనపై దాడిచేసి కష్టపెట్టిరి. విరాటరాజు సేనాపతియైన కీచకుడు, అనేక పర్యాయములు నాపై దాడిచేసి నన్ను చాల కష్టపెట్టెను. మత్స్యరాజు కీచకుని బలంతో నా రాష్ట్రమును బాధించెను. అట్టి క్రూరుడైన కీచకుడు గంధర్వుల చేతిలో మరణించెను. వాని మరణముచేత విరాటరాజు దర్పము ఉడిగినది. ఆశ్రయహీనుడై యిప్పుడు ఉత్సాహము తగ్గియుండును. నీకు ఇష్టమైనచో, నేను కర్ణుడు, ఇతర కౌరవులు అందరుగూడ మత్స్యదేశముపై దాడి సలుపుట ఉచితము.

అట్లు చేయుటకు అనుమతించుము. విరాటరాజు ధనములు, రత్నములు హరించి గ్రామములు ఆక్రమించుకొనుటకు ఇది సరియైన సమయము.

లేదా, వేలకొలది గోవులను, ఆ నగరమును - పీడించి హరింతము. మన మంచరము కలిసినచో ఈ పని అసాధ్యము కాదు. మత్స్యరాజే కాక అతని సేనను గూడ మన అధీనములోకి తీసికొనవచ్చును. దీనిచేత నీకు సైనికవృద్ధి, ధనవృద్ధి కలుగుటయేగాక, మనము సుఖముగా నివసించవచ్చును."

ఆ మాటలు విని కర్ణుడు దుర్యోధనునితో నిట్లనెను:—

"రాజా! సుశర్మ చెప్పినమాట సంగతముగాను సమయోచితముగాను నున్నది. అట్లు చేయుట మనకు హితము. కనుక త్వరగా మత్స్యదేశముపై దాడి వెడలుదము. కురువృద్ధులైన భీష్మ, ద్రోణ-కృపాదుల అభిప్రాయము ప్రకారము మనము సైన్యమును సమీకరించుకొని కదలుట మంచిది.

బలములో, ధనములో, పౌరుషములోను హీనులైన పాండవులతో మనకు పనియేమి? వారు పూర్తిగా అదృశ్యులై యుందురు. లేదా మరణించియుందురు.

కనుక రాజా! మనము నిరాతంకముగా మత్స్యదేశముపై దాడిచేసి, వారి గోవులను, ధనములను ఆక్రమించుకొందము."

"జనమేజయా! కర్ణ సుశర్మల మాటలు విని దుర్యోధనుడు, తన యాజ్ఞా పాలకుడైన దుశ్శాసనునితో, "కురువృద్ధుల సమ్మతి తీసికొని త్వరగా యుద్ధ యాత్రకై సేనా సన్నాహము చేయుము" అని ఆజ్ఞ యిచ్చుచు నిట్లనెను:—

"ఏవైపు నుండి ఆక్రమించుటకు నిర్ణయము జరుగునో ఆవైపే సైనికులతో వెడలుదము. సుశర్మకూడ, తన సైనికులతో అతడు నిర్ణయించుకొనిన దిక్కునకు పోవుగాక!

మొదట సుశర్మ వెడలిన తరువాత, మరునాడు మనము వెడలి మత్స్య రాజ్యముపై దాడి సలుపుదము.

వారు గోవులను పట్టుకొని, ఆ ప్రాంతపు ధనమునుగూడ హరించెదరు గాక! మనముగూడ సేనను రెండు భాగములు చేసి లక్షలాది గోవులను పట్టుకొనెదముగాక!"

"జనమేజయా! యిట్లు మాట్లాడుకొనిన పిదప సుశర్మ పూర్వ నిర్ణయము ప్రకారము, తన సైనికులతో కృష్ణపక్ష సప్తమినాడు విరాటనగరమునకు ఆగ్నేయ మూలగా ఆ దేశమునందలి గోవులను పట్టుకొనుటకు ప్రవేశించెను.

ఈ విధముగా, అతని సైనికులు, మత్స్యదేశముపై తమకు పూర్వము నుండి ఉన్న వైరమును తీర్చుకొనుటకు ఉత్సాహముగా వెడలిరి.

ఆ మరునాడు, అనగా అష్టమినాడు, ఇతర దిక్కులనుండి, కౌరవులందరు కలిసికట్టుగా వెడలి, వేలకొలది గోవులను ఆక్రమించుకొనిరి."

ఇట్లు చెప్పి వైశంపాయనుడు తరువాత కథ యిట్లు చెప్పదొడగెను:—

దక్షిణ గోగ్రహణము

"జనమేజయా! ఈ విధముగా విరాటరాజు నగరమునందు తమ తమ సేవలు నిర్వర్తించుచున్న పాండవుల అజ్ఞాతవాసపు గడువు కాలము ముగియ వచ్చెను.

కీచక మరణానంతరము విరాటరాజు ధర్మపుత్రునిపైన మిక్కిలి ఆదర బుద్ధి గలవాడై యుండెను. త్రయోదశ సంవత్సరాంతమునందు సుశర్మ తన సైన్యముతో విరాటరాజు గోవులను పట్టుకొనెను.

త్రిగర్త సైన్యముల సింహనాదములు, పాదధూళులు ఆకాశమునంటెను. శంఖ-దుందుభుల ధ్వనులు విని గోపాలకులు ఆ సైనికులను ఆపిరి.

త్రిగర్త సేనలు గోపాలురతో పోరాడి వారిని అణచి ఆ ప్రాంతమునందలి గోవులను ఇతర ధనాదులను దోచుకొనిరి. గోపాలకులతో వారికి యుద్ధము జరిగెను. వారు త్రిగర్తుల గుఱ్ఱములను చంపిరి. వివిధాయుధములతో త్రిగర్తులు గొల్లల నెదిరించి పారద్రోలిరి.

"ఒక గొల్లవాడు అతి వేగముతో నగరమునకు పోయి దూరమునుండియే రథము దిగి మత్స్యరాజు కడకు పోయి సభలో అనేక యోధ-మంత్రి-పాండవ సహితుడై యున్న విరాటరాజునకు నమస్కరించి యిట్లనెను:—

"రాజా! త్రిగర్తులు మమ్ము యుద్ధమునందు ఓడించి లక్షకొలది గోవులను తోలుకొని పోవుచున్నారు. మీ గోవులు పట్టుకొనిపోబడకపూర్వమే విడిపించి తెచ్చికొనుడు."

ఆ మాట విని విరాటరాజు, శత్రువులను ఎదిరించుటకు చతురంగ బలములను సమీకరించి యుద్ధ సన్నద్ధులగుటకు యోధులను రాజపుత్రులను ఆజ్ఞాపించెను.

"విరటుని తమ్ముడు శతానీకుడు బంగారు కవచమును, అతని తమ్ముడు మదిరాక్షుడనువాడు బంగారు తొడుపుగల ఉక్కు కవచమును, విరాటరాజు 'అభేద్యకల్పము' అను పేరుగల కవచమును, సేనాపతియైన సూర్యదత్తుడను వాడు సువర్ణమయ కవచమును, విరాటుని జ్యేష్ఠ పుత్రుడు శంఖుడనువాడు ఉక్కు కవచమును, యుద్ధ వీరులందరు తమ తమ దృఢ కవచములను

ధరించిరి. సువర్ణాలంకార భూషితములయిన అశ్వములను పూన్చిన రథములను సిద్ధము చేసిరి.

"జనమేజయా! ఇట్లు పోవుచున్న సైనికులు ఆ సాయంకాలము వరకు త్రిగర్తులను కలిసికొనిరి. ఇరు సేనలు గోవులయందు ఆశపడి పరస్పరము తలపడి యుద్ధము చేయుట కారంభించిరి.

గజ సేనలు అతి భయంకరముగా పోరాడుచు, చచ్చుచు యమధర్మరాజు రాష్ట్రములో జన సంఖ్యను పెంచుచుండెను. అది దేవాసుర సంగ్రామమువలె ఉండెను. పరస్పరము అతిక్రమించి చంపుచు సాగిన ఆ దొమ్మి యుద్ధముచేత భూమి దుమ్ము రేగి వారికి ఏమియు కనపడకుండెను.

ఆ ధూళిలో చిక్కుకొని పక్షులు నేల వ్రాలెను. బాణములచేత సూర్య మండలము కనపడకుండి, ఆకాశమంతయు బాణములు మిణుగురు పురుగులు వ్యాపించినట్లుండెను.

రథికులు, రథికులతో పోరాడుచున్నప్పుడు ఒకరి ధనుస్సు పిడి మరి యొకరు లాగుకొని వారిని నిరాయుధులను చేయ జొచ్చిరి.

అశ్వికులు అశ్వికులతో, పదాతులు పదాతులతో పోరాడుచుండిరి. నెత్తురు చేత భూరజస్సు అణగుచుండెను. హద్దు మీరి యుద్ధము చేయుటచేత వారికి మూర్ఛ వచ్చుచుండెను.

"అప్పుడు యుధిష్ఠిరుడు తమ్ములతో పాటు సేనను శ్యేనాకారముగా వ్యూహము పన్నెను. ఆ డేగకు తుండముగా యుధిష్ఠిరుడు, రెక్కలుగా నకుల సహదేవులు, పుచ్ఛముగా భీముడును నిలుచునట్లు ధర్మపుత్రుడు వ్యూహము పన్నెను.

యుధిష్ఠిరుడా యుద్ధమునందు వేయిమంది రథికులను వధించెను. భీమ సేనుడు రెండువేల శత్రు రథములను యమలోకమునకు పంపెను. నకులుడు మూడునూర్లు, సహదేవుడు రెండునూర్లు, రథికులను మట్టుపెట్టిరి.

ఆ యుద్ధపు తాకిడికి తట్టుకొనజాలక, పక్షులకు ఆకాశమునందు వాటి గమనము ఆగిపోయెను. తుదకు అవి కనపడకుండ గూడ నుండెను. ఎంతటి ప్రగాఢమైన దెబ్బలు తగిలినను నిక్కమైన వీరులు వెను దిరుగక నిలిచి పోరాడుచునే యుండిరి.

"విరటుని తమ్ములు-శతానీకుడు, విశాలాక్షుడు చేరి నూరుమందిని చంపి త్రిగర్త సైన్యములోనికి దూరిరి వారు శత్రు సైనికులను మూర్ఛితులను చేయజొచ్చిరి.

ఇట్లు కేశా కేశి-రథా రథి యుద్ధములు జరుగుచుండెను. ఆ యిరువురికి ముందు సూర్యదత్తుడు, వెనుక విరూపాక్షుడు అను సోదరులు బాసటగా నిలిచి పోరాడుచుండిరి.

"ఆ యుద్ధము నందు విరాటరాజు ఐదునూర్ల రథములను భూమి పాలు చేసి, ఎనిమిదినూర్ల అశ్వములను, ఐదుగురు మహా రథికులను చంపెను.

తరువాత సుశర్మను తాకెను. సుశర్మ బంగారు రథమునందు విరాజిల్లుచుండెను. ఆ యిరువురు, గోశాలలో రెండు బలముగల ఆబోతులవలె పోరాడుచుండిరి. సుశర్మ విరాటునితో ద్వైరథ యుద్ధము సలుపుచు పరస్పరము శరముల గురియు చుండిరి. ఇరువురు యుద్ధ కుశలురే కాబట్టి ఒకరుకూడ తీసిపోక అనేకాయుధములతో యొండొరులు కొట్టుకొన జొచ్చిరి. వారి యుద్ధములో రేగిన దుమ్ముచేత సైనికులు ఒండొరులను చూడజాలకుండిరి.

సుశర్మ విరాటుని బంధించికొనిపోవుట

"జనమేజయా! ఆ సాయంకాలము చీకటిచేతను, దుమ్ము చేతను, సైనికులు పరస్పరము చూచుకొనజాల నప్పుడొక ముహూర్త మాత్ర కాలము ఊరక నిలిచి యుండిరి. ఆ ముని మాపటి చీకటిని చీల్చుచు ఆ రాత్రినంతటిని ప్రకాశింప జేయుటకును, యోధులను ఆనంద పరచుటకును చంద్రుడు ఉదయించెను. వెన్నెల వచ్చిన పిదప యోధులు తిరిగి యుద్ధమునకు సన్నద్ధులైరి. ఘోరమైన యుద్ధము చేయుచు వారు, యుద్ధావేశముతో నొకరిని మరియొకరు చూడక యుండిరి.

"అప్పుడు త్రైగర్త రాజగు సుశర్మ తన తమ్మునితో గలిసి విరాట రాజును నలువైపుల రథములతో చుట్టి అతనిపై దాడి సలిపెను. తరువాత ఆ యిరువురు రథము నుండి నేలపై దుమికి గదాధారులై శత్రు సేనలో దూరిరి.

ఆ యిరువురు మదించిన ఆబోతులవలె, గజములవలెను, గజగ్రహణము చేయనుంకించు రెండు సింహముల వలె, ఇంద్ర-వృత్రాసురుల వలెను ముందుకు సాగజొచ్చిరి.

ఇరువురును సమాన బల-పరాక్రమోత్సాహులే, ఇరువురును మహాస్త్ర విదులే, యుద్ధ విశారదులే, వారి సైనికులును నట్టివారే.

అందరు క్రుద్ధులై పదునైన గదా ఖడ్గ పరశు ప్రాసాది యుద్ధముల చేత పోరాడ జొచ్చిరి. త్రిగర్తాధిపుడైన సుశర్మ సైన్యముతో విరాటుని సైన్యనాశము చేసి విరాట రాజుపై దాడి చేసెను.

సుశర్మ, అతని తమ్ముడు వేరువేరుగా విరాటుని రథాశ్వములను రెంటిని చంపి, చక్ర రక్షకుల నిరువురను, సారథిని వధించి, విరాటరాజును విరథుని చేసి సజీవముగా పట్టుకొనిరి.

ఒక కాముకుడు యువతిని పట్టుకొనునట్లు విరాటరాజును పీడించి పట్టుకొని, త్వరగా పరుగెత్తు గుఱ్ఱములు గల తన రథముపై నెక్కించి సుశర్మ వెడలిపోయెను.

"రాజు పట్టు పడగనే మాత్స్య సైనికులు, త్రిగర్తుల చేత పారద్రోలబడి పరుగెత్తి పోయిరి. అప్పుడు యుధిష్ఠిరుడు భీమసేనునితో నిట్లనెను:-

"తమ్ముడా! మనము విరాట నగరమునందు సుఖముగా, సగౌరవముగాను నివసించుచున్నాము. త్రిగర్తాధీశుడు సుశర్మ విరాటరాజును పట్టుకొని పోయెను. అతడు శత్రువుల వశము కాకుండ విడిపింపుము. విరాటరాజు మనకు చేసిన ఉపకారమునకు ఈ విధముగా ప్రత్యుపకారము చేసి ఋణవిముక్తుల మయ్యెదముగాక!"

అది విని భీముడు ఇట్లనెను:-

"రాజా! నీ యాజ్ఞ మేరకు నేను విరాట రాజును కాపాడెదను. ఇప్పుడు నా యుద్ధ కౌశలమును చూడుము. నీవు తమ్ములతో స్వబాహు బలము నాశ్రయించి జాగ్రత్తతో నుండుము. తమ్ములతో ఒంటరిగా నిలబడి నీవు నా పరాక్రమమును నేడు చూడుము. ఈ యెదుట నున్న చెట్టు కొమ్మలు గదలవలె నిటారుగా నున్నవి. ఒక కొమ్మను త్రెంచి గదగా జేసికొని దీని ద్వారా శత్రువుల సేనను కొట్టి పారద్రోలెదను."

"జనమేజయా! ఆ వృక్షమును మదపు టేనుగువలె చూచుచున్న తమ్మునితో యుధిష్ఠిరుడిట్లనెను:-

"భీమసేనా! సాహసము చేయకుము, ఈ చెట్టును విరవకుము. వృక్ష శాఖతో నీవు మానవాతీతముగా యుద్ధము చేసిన యెడల నిన్ను శత్రువులు భీమ సేనుడని త్వరగా కనిపెట్టెదరు.

కనుక మానుషోతచితమైన 'ధనుస్సు - శక్తి - ఖడ్గము-గండ్రగొడ్డలి-' వీటిలో దేనినైన తీసికొని యుద్ధము చేసి రాజును విడిపింపుము.

నీ రథమునకు చక్ర రక్షకులుగా నకుల - సహదేవు లుండెదరు. మీరు ముగ్గురు సోదరులు కలిసి విరాటరాజును విడిపించి తీసికొనిరండు."

పాండవులు త్రిగర్తులతో పోరుట

"జనమేజయా! యుధిష్ఠిరుడిట్లు చెప్పగనే భీమసేనుడు ఒక ఉత్తమ ధనుస్సును తీసికొని, శరవర్షమును, జలధరము జలమునువలె కురిసెను. భయంకరుడైన సుశర్మను వెన్నంటి సమీపించి యతనితో భీముడు 'ఆరే! నిలు నిలుము' అని అరచుచు ననెను.

అది విని సుశర్మ వెనుక చూడగనే కాలాంతకునివలె వచ్చుచున్న మహా వీరుడు కనపడెను. 'మరల మహా యుద్ధము సంప్రాప్తించునట్లున్నది' అని తన వారితో సుశర్మ అనెను. అతడు తమ్మునితోపాటు వెనుదిరిగి ధనుర్ధారియై యుద్ధము చేయుటకు ఉపక్రమించెను.

ఒక నిమిష మాత్రములో భీమసేనుడు శత్రువుల రథములను, గజములను, గుఱ్ఱములను, వాటిని నడపువారితో పాటు గదాపాణియై నేలగూల్చెను. వేలాది ధనుర్ధారులైన పదాతులను గూడ గదతో మట్టుపెట్టెను.

"జనమేజయా! రణకోవిదుడు, దుర్మదాంధుడునైన సుశర్మ, ఆకస్మాత్తుగా గలిగిన ఆ సంఘటనను చూచి దిగ్భ్రాంతి చెంది, 'నా సైన్యములో నింక మిగిలినదేమి?' అని మనస్సులోనే అనుకొనెను.

'తన సోదరుడొకడు శత్రుసేనలో నిమగ్నుడై యుద్ధము చేయుచున్నాడు. అతని గతియేమో' అని కూడ చింతించెను. సుశర్మ ఆకర్ణాంతము లాగిన ధనుస్సు నుండి వాడి బాణములను శత్రువులపై కురియుచుండెను.

అప్పుడు మాత్స్య సేనలు ముందుకు సాగి త్రిగర్త సైన్యములను కొట్టు చుండెను. ఆ విధముగా పాండవులు త్రిగర్తులను అగడు పరచుటను చూచి విరాటరాజు సేన అతి కోపముతో పరమాద్భుతముగా యుద్ధము చేసెను.

యుధిష్ఠిరుడు వేయి మంది సైనికులను, భీముడు ఏడు వేల మందిని నకులుడును ఏడు వందల మందిని, సహదేవుడు మూడువందల మందిని యమ లోకమునకు అంపిరి.

"తరువాత యుధిష్ఠిరుని ఆజ్ఞపై సహదేవుడు అత్యుగ్రుడై త్రిగర్త సేనలను సంహరించి సుశర్మపై దాడిచేసెను. అప్పుడు యుధిష్ఠిరుడు త్వరచేయుచు సుశర్మపై బడి బాణవర్షము గురిసెను. సుశర్మ గూడ తొమ్మిది బాణములతో యుధిష్ఠిరుని కొట్టి అతని నాలుగు గుఱ్ఱములను నాలుగు బాణములతో కొట్టెను.

భీమ సుశర్మల యుద్ధము

జనమేజయా! అప్పుడు భీమసేనుడు త్వరపడుచు సుశర్మ పైకి దుమికి అతని అశ్వములను వధించెను. సుశర్మను పార్శ్వమునందు రక్షకులుగా నున్న వారిని, రథసారథిని కొట్టి నేల గూల్చెను.

అట్లు సుశర్మ విరథుడగుటను చూచి విరాటరాజుయొక్క చక్రరక్షకుడైన మదిరాక్షుడు ముందుకువచ్చి సుశర్మను బాణములతో కొట్టెను. ఇంతలోనే విరాటరాజు సుశర్మరథము నుండి దుమికి, సుశర్మ గదనే తీసికొని యతని పైకి ఉరికెను. గదాపాణియై యుద్ధభూమిలో తిరుగుచున్న విరాటరాజు వృద్ధుడైనను చూచువారికి తరుణునివలె కనపడుచుండెను.

సుశర్మను పట్టుకొనుట

ఆ స్థితిలో గత్యంతరము లేక పలాయనము చిత్తగించిన సుశర్మతో భీముడు ఇట్లనెను:-

"రాజకుమారా! నీవు యుద్ధమునందు వెన్నుచూపి పారిపోవుట ఉచితము గాదు. తిరిగివచ్చి యుద్ధము చేయుము ఇట్టి పరాక్రమముతో నీవు విరాటుని గోవులను బలాత్కారముతో కొనిపోవదలచితివా? నీ అనుచరులను శత్రువుల దారికి విడిచి ఉరికెదవా? దుఃఖపడుచుంటివా?"

అది విది సుశర్మ భీమునితో "నిలు నిలుము" అని మరల శత్రుసేనను తాకెను.

భీముడు ఏమాత్రము చలించక వెంటనే రథమునుండి దుమికి, సుశర్మ ప్రాణములను గొనుటకు ఉరికెను.

సుశర్మ భయపడి మరల పారజొచ్చెను. భీము డతనిని తరిమి, క్షుద్ర మృగమును సింహము పట్టుకోబోయినట్లు, సుశర్మ వెనుక పరుగెత్తెను. సుశర్మ జుట్టు పట్టుకొని భీముడు పైకెత్తి నేలపైవేసి అదిమికొట్టెను. ఆ దెబ్బతో సుశర్మ విలపింప జొచ్చెను. అప్పుడు భీముడు అతని తలపై కాలితో తన్నెను. మోకాళ్ళతో సుశర్మ కడుపులో బిగ్గరగా పొడిచెను ఆ దెబ్బతో సుశర్మ మూర్ఛిల్లెను.

సుశర్మ విరథుడై శత్రువులకు పట్టువడగనే త్రిగర్త సేనలు భయపడి చెదిరిపోయెను. అప్పుడు పాండుపుత్రులు, గోవులను మరలించుకొని, సుశర్మను బంధించి తెచ్చిరి.

పాండుపుత్రులు స్వబాహు బల సంపన్నులు, లజ్జాశీలురు, నియమముతో వృత్తమును పాలించువారలు, మహాత్ములు, విరాటరాజుకు కలిగిన క్లేశమును నివారించువారునైరి. అందరు అప్పుడు రాజసమక్షమునందు నిలిచిరి.

భీముడు "ఈ పాపిష్ఠుడైన సుశర్మను నేను ప్రాణములతో విడువను. ఐనను నేనేమి చేయగలను? మన రాజు సర్వదా దయాళుడై యుండెను" అని యనెను.

తరువాత భీముడు సుశర్మను మెడపట్టుకొని యీడ్చుచు రాజువద్దకు కొనిపోయెను. సుశర్మ వివశుడై యుండెను. కాని, అతడు కాలు చేతులు కదలించుచుండుటను చూచి భీముడు, కదలకుండ బిగ్గరగా నతనిని బంధించి రథముపైన ఉంచెను. సుశర్మ అచేతనుడై, శరీరమంతయు దుమ్ముగప్పి యుండెను.

భీముడు సుశర్మను రణభూమిలో నిలిచియున్న యుధిష్ఠిరుని వద్దకు తెచ్చి యతనికి చూపెను.

అప్పుడు యుధిష్ఠిరుడు, యుద్ధశూరుడైన భీముని మెచ్చుకొని, 'ఈ నరాధముని విడిచి పుచ్చుము' అని భీమునితో ననెను.

అప్పుడు భీముడు సుశర్మతో నిట్లనెను:-

"మూఢాత్మా! నీకు జీవితముపై ఇచ్ఛ యుండినచో, నేను ఉపాయమును చెప్పెదను. అట్లు చేయుము.

ఏమనగా సభలలోను, సమావేశములలోను నీవు ముక్తకంఠముతో 'దాసోస్మి' అని యనవలెను. అప్పుడు నిన్ను ప్రాణములతో విడిచెదను. ఇది యుద్ధమునందు ఓడిపోయినవారు చేయు విధి."

అట్లు చెప్పిన భీమునితో యుధిష్ఠిరుడు ప్రేమ పూర్వకముగా నిట్లనెను:-

"సోదరా! నీవు నా మాటపైన గౌరవము ఉన్నచో ఈ పాపిష్ఠుని విడిచి పెట్టుము. ఆతడు ఏలాగైనను విరాటరాజుకు దాసుడే అయినాడు."

తరువాత యుధిష్ఠిరుడు సుశర్మను నిట్లనెను:-

"నీవు దాస్యమునుండి విముక్తుడవైతివి. వెడలిపొమ్ము. ఇకపైన ఎప్పుడు గూడ ఇట్టి పని చేయకుము."

"జనమేజయా! యుధిష్ఠిరు డిట్లనుచుండగా సుశర్మ సిగ్గుతో తల వంచుకొని యుండెను. అతడు తరువాత విరాటరాజు కడకువచ్చి తల వంచి నమస్కరించి వెడలిపోయెను."

అని వైశంపాయనుడు చెప్పి తరువాతి కథ జనమేజయున కిట్లు చెప్పదొడగెను:-

విరాటరాజు పాండవులను సన్మానించుట

జనమేజయా! పాండవులు సుశర్మను విడిచి శత్రు విజయమును సాధించి యుద్ధభూమియందే ఆ రాత్రి సుఖముగా నివసించిరి.

తరువాత మానవాతీత పరాక్రమ సంపన్నులైన పాండవులను విరాటరాజు గౌరవించి అనేక ధనములు వారికిచ్చి సత్కరించి వారితో నిట్లనెను:-

"వీరులారా! నా రాజ్యమునందు ధన కనకరత్న వస్తు వాహనము లన్నియు నా వలెనే మీరుగూడ అనుభవించుచు సుఖముగా నా రాజ్యమునందే నివసించియుండుడు. మీకు సాలంకృత కన్యల నిచ్చెదను. మీరు కోరిన వస్తువుల నిచ్చెదను. యుద్ధమునందు శత్రు జయమును సాధించిన మీకు ఏమిచ్చినను

తక్కువ యగును. మీ పరాక్రమాతిశయము చేత నేను విముక్తుడనై క్షేమముగా నున్నాను. కాబట్టి మీరే యీ మత్స్య రాజ్యమునకు ప్రభువులు."

"జనమేజయా! అట్లు చెప్పిన విరాటరాజుతో పాండవులు విడివిడిగా అంజలి బద్ధులై యిట్లు నివేదించిరి:-

"మహారాజా! సత్యమే. మీ మాటలన్నియు మేము అభినందించు చున్నాము. కాని, నేడు తమరు శత్రువుల నుండి విముక్తులై తిరి. అంతటితోనే మేము సంతోషులమైతిమి ఇతర బహుమానములక్కరలేదు." ఆ మాట విని మత్స్యరాజు యుధిష్ఠిరునితో నిట్లనెను:-

"కంకభట్టా! రమ్ము. నీకు నేను రాజ్యపట్టాభిషేకము చేసెదను. నేటి నుండి నీవే మాకందరికి మత్స్యరాజుగా నుండుము.

అంతియేకాక యీ భూమండలమునందు దుర్లభమైన వస్తువేదైనను నీవు కోరినచో అదిగూడ నీకు నేనిచ్చెదను. మా సర్వస్వమును పొందుటకు నీవు అధికారివి. నీకు నమస్కారము చేసెదను. నీ కారణముగా నేను నేడు రాజ్య మును, సంతానమును చూడగల్గుచున్నాను. నన్ను సుశర్మ బంధించిన తరువాత భయపడియుంటిని. నీ పరాక్రమమువలన శత్రువశమునుండి విడిపింపబడితిని."

ఆ మాటలు విని యుధిష్ఠిరుడు విరాటరాజుతో, "మత్స్యరాజా! నీ మాటలు మెచ్చుకున్నాను. చాల మనోహరముగా మాట్లాడితివి. నీవు నిరంతరము ఇట్లే దయాశీలుడవై సుఖముగా నుండుము" అని యనెను.

"జనమేజయా! మరలగూడ విరాటరాజు కంకునితో నిట్లనెను:-

"బ్రాహ్మణోత్తమా! వంటవాడైన బల్లవుని పరాక్రమ మేమని చెప్పు దుము? యుద్ధమునందు అతడే నన్ను రక్షించెను. మీకు సర్వస్వము సమ ర్పించుటకు సంసిద్ధుడనై యున్నాను. వరము కోరుకొనుము, ఇచ్చెదను. వివిధ రత్నములు, రాష్ట్రములు ఇవన్నియు నిచ్చెదను. నా ప్రీతి కొరకు స్వీక రింపుము."

అట్లు చెప్పుచున్న విరాటునితో యుధిష్ఠిరుడు ఇట్లనెను:-

"రాజా! నీవు శత్రువుల బారినుండి విముక్తుడవైతివి. దీనిచేతనే నేను తృప్తుడనైతిని. నీవు సంతుష్టుడవై తిరిగివచ్చి నీ పురమునందు నీ భార్యా

పుత్రాదులతో సుఖముగా కలిసికొనబోవుచున్నావు. ఇంతకన్న నాకు వేరు తృప్తి యేమున్నది?

రాజా! ప్రియమైన నీ విజయ వార్తను తెల్పుటకు తొలుత దూతలను నగరమునకు పంపుము. నీ విజయమును నగరమంతటను వారు ఉద్ఘోషింతురు గాక!"

ఆ మాట విని విరాటరాజు కంకభట్టు సూచన ప్రకారమే దూతలతో నిట్లనెను:-

"మీరు పట్టణమునకుపోయి మా విజయవార్త అందరికీ తెలుపుడు. కుమారీ జనము అలంకరించుకొని మమ్ము ఎదుర్కొని స్వాగతము చెప్పుదురు గాక! అనేక మంగళ వాద్యములు, మంచిగా అలంకరించుకొనిన వేశ్యలు మమ్ము ఎదుర్కొందురు గాక!"

రాజాజ్ఞ గొని దూతలు సంతోషించుచు ఆ రాత్రియే ప్రయాణము చేసి తెల్లవారు వరకు విరాటనగరము చేరి రాజు విజయమును ఎలుగెత్తి చాటిరి."

అని చెప్పి వైశంపాయనుడు జనమేజయునకు తరువాతి కథ యిట్లు చెప్పదొడగెను.

ఉత్తర గోగ్రహణము

"జనమేజయా! విరాటరాజు తన గోవులను విడిపించుటకు గాను త్రిగర్తులతో యుద్ధము చేయుటకు వెడలెనని తెలియగనే దుర్యోధనుడు తన మంత్రులతో పాటు విరాట దేశముపై దాడి సలిపెను

మహారథికులైన భీష్మ-ద్రోణ-కృప-కర్ణ-అశ్వత్థామ-శకుని-దుశ్శాసన-వివింశతి-వికర్ణ-చిత్రసేన-దుర్ముఖ-దుశ్శలాదులు - తదితర వీరులు విరాటుని యొక్క మత్స్యదేశము యందు ప్రవేశించి, గొల్ల పల్లెలలో అల్లరిచేసి, అక్కడి గోవులను బలాత్కారముగా అపహరించుటకు ఆరంభించిరి.

కౌరవులు అనేక రథముల చేత గోవులను నలువైపుల చుట్టుముట్టి తోలుకొనిపోయిరి. ఆ ఘోర యుద్ధమునందు ఆ మహారథికుల చేత దెబ్బతిన్న గొల్లవారు హాహాకారములు చేయుచు అరచిరి.

తక్కువ యగును. మీ పరాక్రమాతిశయము చేత నేను విముక్తుడనై క్షేమముగా నున్నాను. కాబట్టి మీరే యీ మత్స్య రాజ్యమునకు ప్రభువులు."

"జనమేజయా! అట్లు చెప్పిన విరాటరాజుతో పాండవులు విడివిడిగా అంజలి బద్ధులై యిట్లు నివేదించిరి:-

"మహారాజా! సత్యమే. మీ మాటలన్నియు మేము అభినందించు చున్నాము. కాని, నేడు తమరు శత్రువుల నుండి విముక్తులైతిరి. అంతటితోనే మేము సంతోషులమైతిమి ఇతర బహుమానములక్కరలేదు." ఆ మాట విని మత్స్యరాజు యుధిష్ఠిరునితో నిట్లనెను:-

"కంకభట్టా! రమ్ము. నీకు నేను రాజ్యపట్టాభిషేకము చేసెదను. నేటి నుండి నీవే మాకందరికి మత్స్యరాజుగా నుండుము.

అంతియెకాక యీ భూమండలమునందు దుర్లభమైన వస్తువేదైనను నీవు కోరినచో అదిగూడ నీకు నేనిచ్చెదను. మా సర్వస్వమును పొందుటకు నీవు అధికారివి. నీకు నమస్కారము చేసెదను. నీ కారణముగా నేను నేడు రాజ్యమును, సంతానమును చూడగల్గుచున్నాను. నన్ను సుశర్మ బంధించిన తరువాత భయపడియుంటిని. నీ పరాక్రమమువలన శత్రువశమునుండి విడిపింపబడితిని."

ఆ మాటలు విని యుధిష్ఠిరుడు విరాటరాజుతో, "మత్స్యరాజా! నీ మాటలు మెచ్చుకున్నాను. చాల మనోహరముగా మాట్లాడితివి. నీవు నిరంతరము ఇట్లే దయాశీలుడవై సుఖముగా నుండుము" అని యనెను.

"జనమేజయా! మరలగూడ విరాటరాజు కంకునితో నిట్లనెను:-

"బ్రాహ్మణోత్తమా! వంటవాడైన బల్లవుని పరాక్రమ మేమని చెప్పుదుము? యుద్ధమునందు అతడే నన్ను రక్షించెను. మీకు సర్వస్వము సమర్పించుటకు సంసిద్ధుడనై యున్నాను. వరము కోరుకొనుము, ఇచ్చెదను. వివిధ రత్నములు, రాష్ట్రములు ఇవన్నియు నిచ్చెదను. నా ప్రీతి కొరకు స్వీకరింపుము."

అట్లు చెప్పుచున్న విరాటునితో యుధిష్ఠిరుడు ఇట్లనెను:-

"రాజా! నీవు శత్రువుల బారినుండి విముక్తుడవైతివి. దీనిచేతనే నేను తృప్తుడనైతిని. నీవు సంతుష్టుడవై తిరిగివచ్చి నీ పురమునందు నీ భార్యా

పుత్రాదులతో సుఖముగా కలిసికొనబోవుచున్నావు. ఇంతకన్న నాకు వేరు తృప్తి యేమున్నది?

రాజా! ప్రియమైన నీ విజయ వార్తను తెల్పుటకు తొలుత దూతలను నగరమునకు పంపుము. నీ విజయమును నగరమంతటను వారు ఉద్ఘోషింతురు గాక!"

ఆ మాట విని విరాటరాజు కంకభట్టు సూచన ప్రకారమే దూతలతో నిట్లనెను:-

"మీరు పట్టణమునకుపోయి మా విజయవార్త అందరికీ తెలుపుడు. కుమారీ జనము అలంకరించుకొని మమ్ము ఎదుర్కొని స్వాగతము చెప్పుదురు గాక! అనేక మంగళ వాద్యములు, మంచిగా అలంకరించుకొనిన వేశ్యలు మమ్ము ఎదుర్కొందురు గాక!"

రాజాజ్ఞ గొని దూతలు సంతోషించుచు ఆ రాత్రియే ప్రయాణము చేసి తెల్లవారు వరకు విరాటనగరము చేరి రాజు విజయమును ఎలుగెత్తి చాటిరి."

అని చెప్పి వైశంపాయనుడు జనమేజయునకు తరువాతి కథ యిట్లు చెప్పదొడగెను.

ఉత్తర గోగ్రహణము

"జనమేజయా! విరాటరాజు తన గోవులను విడిపించుటకు గాను త్రిగర్తులతో యుద్ధము చేయుటకు వెడలెనని తెలియగనే దుర్యోధనుడు తన మంత్రులతో పాటు విరాట దేశముపై దాడి సలిపెను

మహారథికులైన భీష్మ-ద్రోణ-కృప-కర్ణ-అశ్వత్థామ-శకుని-దుశ్శాసన-వివింశతి-వికర్ణ-చిత్రసేన-దుర్ముఖ-దుశ్శలాదులు - తదితర వీరులు విరాటుని యొక్క మత్స్యదేశము యందు ప్రవేశించి, గొల్ల పల్లెలలో అల్లరిచేసి, అక్కడి గోవులను బలాత్కారముగా అపహరించుటకు ఆరంభించిరి.

కౌరవులు అనేక రథముల చేత గోవులను నలువైపుల చుట్టుముట్టి తోలుకొనిపోయిరి. ఆ ఘోర యుద్ధమునందు ఆ మహారథికుల చేత దెబ్బలతిన్న గొల్లవారు హాహాకారములు చేయుచు అరచిరి.

అప్పుడు గొల్లల పెద్ద భయపడి తన సహచరులతో రథముపైన త్వరగా ఆర్తునివలె మొరపెట్టుచు విరాట నగరమువైపు పోయెను.

నగరములో ప్రవేశించి రథము దిగి ఆ విషయమంతయు చెప్పుటకు భవనమునకు పోయెను.

అక్కడ విరాటరాజు యొక్క అభిమాన పుత్రుడగు భూమింజయుని ఉత్తరుని చూచి అతనితో నిట్లనెను:-

''రాజకుమారా! కౌరవ సేనలు మన అరువదివేల గోవులను మరలించి తోలుకొని పోవుచున్నారు. కావున వారిని జయించి గోవులను తెచ్చుకొనుము. రాష్ట్రహితమును గోరి త్వరగా బయలుదేరుము. విరాటరాజు తాను రాజ్యములో లేనప్పుడు నిన్నే రక్షకునిగా ఉంచెను.

పదిమందిలో మహారాజు 'ఇతడు శూరుడు, మా కులమును ఉద్ధరించగల వాడు, నాకు తగిన కొడుకు' అని శ్లాఘించుచుండెను. "నా కొడుకు బాణవిద్య యందు నిపుణుడు, యోధుడు, వీరుడు" అని చెప్పుచుండెను. అతని మాట యిప్పుడు సత్యమగుగాక!

కురుసేనను జయించి పశువులను మరలించుము. నీ భయంకర బాణాగ్ని చేత కురుసేనను కాల్చివేయుము. గజపతి తన శత్రుగణములను ఛిన్నాభిన్నము చేసినట్లు నీ వాడి బాణములచేత శత్రుసేనను ఛేదించుము.

ధనుర్దండమునకు ఉండు రెండు అగ్రములే మెత్తలుగను, అల్లెత్రాడే తంత్రిగాను, ధనుస్సే ధ్వనించు దండముగాను, బాణములే వర్ణములుగానున్న నీ ధనుస్సనెడు వీణను వాయించుము. వెండివలె తెల్లగానున్న నీ గుఱ్ఱములను రథమునందు పూన్చుము. సువర్ణమయమైన సింహధ్వజమును రథముపై నెక్కించుము.

నీ చేయి దృఢమైనది. దానినుండి సువర్ణ పక్షములు - స్వచ్ఛమైన కొనలునుగల బాణములను ప్రయోగించి శత్రురాజుల మార్గమును నిరోధించి సూర్యమండలమును గూడ ఆచ్ఛాదించుము. ఇంద్రుడు రాక్షసులనువలె నీవు యుద్ధమునందు శత్రువులను జయించి గొప్ప కీర్తిని పొంది తిరిగి పురమునందు ప్రవేశించుము.

రాజపుత్రా! పాండవులకు అర్జునుడువలె నీవు ఈ రాష్ట్రవాసులకు దిక్కై యున్నావు మాకందరకు నీవే గతి."

జనమేజయా! గోపాలురు ఇట్లు పొగడుచున్నప్పుడు భూమింజయుడు స్త్రీల సమాజమునందు కూర్చొని యుండెను. గొల్లల మాటలు విని రాజకుమారుడు ఉబ్బిపోయి యిట్లనెను:-

"నేను ఇప్పుడేపోయి యుద్ధము చేయగలను కాని, అశ్వ హృదయము తెలిసిన మంచి సారథి నా రథమును నడుపగలవాడెవడు గూడ ఇప్పుడు లేడు.

నాకు తగిన సారథిని వెంటనే చూడుడు పూర్వము దాదాపు ఒక నెల జరిగిన మహాయుద్ధమునందు నా సారథి వధింపబడెను. మంచి సారథి లభించి నచో నిప్పుడే యుద్ధమునకు బయలుదేరుదును."

నారథ ధ్వజము రెప రెప లాడుచుండగా నేను చతురంగ బల సహిత మైన శత్రుసేనలో దూరి, కురుసేనను నిర్వీర్యముగా చేసి, వారిని ఓడించి గోవులను మరలించుకొని వచ్చెదను.

ధనుర్విద్యా కోవిదులైన దుర్యోధన-భీష్మ-కర్ణ-కృప-ద్రోణ-అశ్వత్థామాదులను యుద్ధమునందు ఇంద్రుడు రాక్షసులను వలె భయపరచి, ఈ క్షణములోనే గోవులను తెచ్చెదను.

మన వారెవ్వరు లేకుండ జూచి కురు సైనికులు మన గోధనమును తీసి కొనిపోవుచున్నారు. అప్పుడక్కడ నేను లేకుంటిని. ఇప్పుడు నేనేమి చేయ గలను? ఇప్పటికైనను మించిపోయిన దేమియులేదు. నేడు కౌరవులు నా పరాక్ర మమును చూచెదరు గాక!

వారు మన ప్రాంతములోనికి రానే వచ్చినారు గదా! నా పరాక్రమమును చూచి 'అర్జునుడే వచ్చి మమ్ము బాధించుచున్నాడా?' అని వారు బిత్తరపోవు నట్లుగా నా శౌర్యము రుచి చూపెదను."

"జనమేజయా! ఉత్తరుడు పలుకుచున్న యీ ప్రగల్భములను విని, అక్కడదే ఉన్న అర్జునుడు రహస్యముగా ద్రౌపదితో నిట్లనెను :

"దేవీ! యీ బృహన్నల పూర్వము అర్జునునకు ఇష్టమైన సారథిగా నుండెను. ఇతడు దృఢగాత్రుడు మహా యుద్ధములందుకూడ సారథిగా నుండ గలడు.

నా మాటగా నీవు ఉత్తరునకు చెప్పుము "

అని వైశంపాయనుడు చెప్పి తరువాత కథ యిట్లుచెప్పెను:

"జనమేజయా! అట్లు ఉత్తరుడు స్త్రీ సమాజమునందు మాటిమాటికి తనను అర్జునునితో పోల్చి చెప్పుటను ద్రౌపది సహించ జాలక ఉత్తరుని వద్దకు పోయి సిగ్గు పడుచున్నదానివలె మెల్లగా నతనితో నిట్లనెను:-

"రాజకుమారా! గజరాజువలె పుష్టిగలిగి, సుందర యువకుడుగా నున్న యీ బృహన్నల, పూర్వము అర్జునునకు రథసారథిగా నుండెను.

ఇతడు అర్జునుని శిష్యుడే కాబట్టి ధనుర్విద్యలో గూడ అర్జునునకు ఏ మాత్రము తీసిపోడు. పూర్వము పాండవులవద్ద నేను ఉన్నప్పు డితనిని చూచి నాను.

అగ్నిదేవుడు దావానల రూపము దాల్చి అర్జునుని సహాయముతో ఖాండవ వనమును దహించినప్పుడు ఈ బృహన్నలయే అర్జునుని రథమును తోలెను.

ఈ సారథి సహాయముతోనే అర్జునుడు సంపూర్ణ ఖాండవ ప్రస్థము నందలి ప్రాణులను అప్పుడు జయించగలిగెను. కనుక ఇతనితో సమానుడైన సారథిమరియొకడు లేడు".

ఆ మాట విని ఉత్తరుడు ద్రౌపదితో నిట్లనెను:-

"సైరంధ్రీ! ఈ యువకుడు నపుంసకుడు కాడని నీకు తెలిసిన యెడల, నీవే యితనిని అడుగుము. నేను బృహన్నలతో స్వయముగా, నా రథసారథిగా నుండుమని అడుగజాలను."

ఆ మాటకు ద్రౌపది ఉత్తరునితో నిట్లనెను:.

"కుమారా! ఈ నీ చెల్లెలు ఉత్తర చెప్పినచో బృహన్నల తప్పక అంగీక రించును. ఇతడు నీకు సారథిగా నుండినచో నీవు కౌరవులందరిని జయించి గోవు లను తెచ్చెదవు. సందేహము లేదు."

ద్రౌపది మాట ప్రకారమే ఉత్తరుడు తన చెల్లెలగు ఉత్తరను, బృహన్న లను తోడ్కొని వచ్చుటకు పంపెను. ఉత్తర అన్నకోరికపై త్వరగా నాట్య గృహమునకు పోయి అచ్చట మాయా వేషముతో ప్రచ్ఛన్న రూపములోనున్న బృహన్నల కడకు పోయెను.

"జనమేజయా! ఉత్తర బంగారు హారము, నెమలిపింఛము, మణిఖచిత మయిన ఒడ్యాణము ధరించి, దేదీప్యమానముగా ప్రకాశించుచు, విద్యుల్లత మేఘమాలలో ప్రవేశించినట్లుగా, నర్తనశాలయందు ప్రవేశించెను

గజరాజు వద్దకు, కరిణివలె అర్జునుని వద్దకుపోయి, అతి ప్రీతితో, అర్జునుని పలకరించెను. ఆమెను చూచి, అర్జునుడు, "భామినీ! యింత త్వరగా, ఇక్కడికి వచ్చుటకు కారణమేమి? నీ ముఖము, ప్రసన్నముగా ఏలలేదు? త్వరగా చెప్పుము" అని అడిగెను.

ఆ మాటకు, రాజపుత్రి ఉత్తర చనువుతో, సఖీజనము పరివేష్టించి యుండగా నిట్లనెను:-

"బృహన్నలా! కురు సైనికులు మన రాష్ట్రములోని గోవులను పట్టి తీసికొని పోవుచున్నారు. వాటిని మరలించుకొని వచ్చుటకు, మా అన్న ధనుర్ధారియై పోబోవుచున్నాడు. ఇటీవలనే యుద్ధమునందు అతని రథసారథి చంపబడినాడు. అతనికి ఈడైన సారథి మా అన్నకు దొరకుటలేదు

సారథి కొరకు ప్రయత్నించుచున్న ఉత్తర కుమారునకు సైరంధ్రి, "నీవు అశ్వహృదయమునందు సమర్థుడవు" అని చెప్పెను. నీవు పూర్వము అర్జునుకు సారథిగా నుంటివటకదా? నీ సహాయముతోనే, ఆ పాండవ మధ్యముడు భూమండలమును జయించెనట కదా?

కనుక మా అన్నకు నీవు సారథ్యము చేయుము. కౌరవులు గోవులను దూరముగా తోలుకొని పోవక పూర్వమే, ఆయన త్వరగా బయలుదేరవలసి యున్నది కనుక నేను నీతో ప్రేమతో చనవుతోను చెప్పుచున్నాను. నీవు సారథ్యము చేయనిచో, నేను ప్రాణము విడిచెదను."

"జనమేజయా! ఉత్తర చెప్పిన మాటలు వినిన తోడనే, అర్జునుడు. ఉత్తర కుమారుని దర్శించుటకు బయలుదేరెను.

మదజలము స్రవించుచున్న గజమువలె త్వరగా వచ్చుచున్న బృహన్నల వెంట, గజమును గజవధువు అనుసరించుచున్నట్లు, ఉత్తర నడచుచుండెను. అట్లు వచ్చుచున్న బృహన్నలను దూరమునుండియే చూచి, ఉత్తర కుమారుడు, ఇట్లనెను:-

'బృహన్నలా! నిన్ను పూర్వము అర్జునుడు తన రథమునకు సారథిగా చేసికొని, ఖాండవదహనమునందు అగ్నిదేవుని తృప్తిపరచెననియు, సమస్త భూమండలమును జయించెననియు సైరంధ్రి చెప్పుచున్నది. ఆమె పాండవులను బాగుగా నెరుగునట.

కావున అర్జునునకు సారథ్యము చేసినట్లే నాకును నీవు చేయుము. నేను కౌరవులతో యుద్ధము చేసి, వారు అపహరించిన మన గోధనమును మరలించుకొని తేదలచుకొన్నాను."

ఆ మాటలు విని బృహన్నల అతనితో నిట్లనెను:-

"రాజకుమారా! యుద్ధ భూమియందు సారథ్యము చేయుటకు నాకు శక్తి యెక్కడిది? గీతము, నృత్యము, వాద్యము వివిధ రీతులలో చేసెదనుకాని, రథసారథ్య శక్తి నాకెక్కడిది?"

అది విని ఉత్తరుడు ఇట్లనెను:-

"బృహన్నలా! నీవు గాయకుడవో, నర్తకుడవో, యుద్ధభూమినుంచి వచ్చిన తరువాత అగుదువుగాని, ఇప్పుడు త్వరగా రథమునకు మంచి గుఱ్ఱములను గట్టితెమ్ము."

"జనమేజయా! అర్జునునకు అన్నియు తెలిసినప్పటికిని ఉత్తర సమక్షమునందు, వినోదముకొరకు అజ్ఞాని చేష్టలు చేసెను.

ఎట్లనగా కవచమును పైకెత్తి తన శరీరముపైన విడిచెను. అది చూసి అచ్చటి కుమారీ జనము నవ్వెను. అప్పుడు ఉత్తరుడు బృహన్నలకు కవచమును స్వయముగా తొడిగెను.

ఉత్తరుడు కూడ సూర్య తేజస్సుకల కవచమును ధరించి, రథముపైన సింహధ్వజము నెక్కించి, బృహన్నలను సారథ్యముకొరకు నియోగించెను. అనేకాయుధములు రథమునం దుంచుకొని ఉత్తరుడు యుద్ధమునకు బయలుదేరెను.

అప్పుడు ఉత్తర, తదితర కన్యలు బృహన్నలతో నిట్లనిరి:-

"భీష్మ, ద్రోణాదులను యుద్ధమునందు జయించినప్పుడు, వారు ధరించిన మెత్తని సున్నితములయిన, చిత్రవిచిత్ర వస్త్రములను మా బొమ్మలకొరకు తీసికొని రమ్ము."

అట్లు అడిగిన కన్యలతో అర్జునుడు ఇట్లనెను:-

"ఒకవేళ ఉత్తరుడు యుద్ధమునందు మహావీరులను జయించినచో, శత్రువుల సుందర వస్త్రములను నేను తప్పక తెచ్చెదను."

"జనమేజయా! ఇట్లు చెప్పి అర్జునుడు కౌరవులకు అభిముఖముగా గుఱ్ఱములను తోలెను. బృహన్నలతో వెడలుచున్న ఉత్తరుని చూచి అచ్చటి స్త్రీలు, కన్యకలు, బ్రాహ్మణులు ఆ రథమునకు ప్రదక్షిణముగా వచ్చి యిట్లనిరి:-

"బృహన్నలా! పూర్వము ఖాండవదహనము చేసిన అర్జునునకు కలిగిన శుభములే కౌరవులతో నేడు యుద్ధము చేయబోవు రాజకుమారుడికి గూడ, నీ సహాయముతో కలుగుగాక!"

"జనమేజయా! ఉత్తరుడు రాజధానినుండి బయలుదేరి "కౌరవులున్న చోటికి పొమ్ము. కౌరవులనందరిని జయించి గోవులను మరలించుకొని తెచ్చెదను" అని బృహన్నలతో ననెను.

అర్జునుడు చాతుర్యముతో తోలగా అశ్వములు వాయువేగముతో ఆకాశమును ఒరసికొనుచు నతి వేగముగా చౌకళింపులతో పరుగెత్తెను.

ఆ యిరువురు కొంత దూరము పోయి కురు బలమును చూచి శ్మశానము వైపుగా పోయి శత్రువులను చేరుకొనిరి.

శ్మశానమునందు ఉన్న శమీ వృక్షమును చూచి, వ్యూహములు పన్నిన కురుసేనను గూడ చూచిరి.

అది నిలిచినప్పుడు విశాల సముద్రము వలె, నడచునప్పు డాకాశమునందు పోవుచున్న పెద్ద అడవి వలెను ఉండెను. దాని నుండి రేగిన దుమ్ము ఆకాశము నంటుచుండెను. భీష్మద్రోణాది మహారథికులు గల ఆ సైన్యమును చూచి ఉత్తరుడు భయపడెను.

"బృహన్నలా! దేవతలకు గూడ సాధ్యముగాని యీ మహా కురుసేనతో యుద్ధము చేయుటకు నాకు ఉత్సాహము కలుగకున్నది. చూడుము. నా శరీరమంతయు భయముచే నెట్లు గగుర్పొడిచినదో! ఈ సేనను సమీపించుటకే నాకు భయము కలుగుచున్నది.

ఆ భయంకర ధనుస్సులు, గజములు, రథములు, అశ్వములు చూడగనే నా మనస్సు కలత పడుచున్నది. అక్కడి భీష్మాది వీరులందరు యుద్ధ విశారదులే. ఇంద్రాది దేవతలుగూడ వారిని జయించజాలరు. నేను దుర్బుద్ధినై తెలియక వచ్చితిని. నా మనస్సు కశ్మలమగుచున్నది."

"జనమేజయా! మూర్ఖుడైన ఉత్తరుడొక సామాన్య మనుష్యుడు గాబట్టి గుప్త వేషమునందున్న అర్జునుని ప్రభావమును తెలియక ఇట్లు దుఃఖింపసాగెను:-

"బృహన్నలా! నా తండ్రి సమస్త సేనను తీసికొని శూన్యమైన నగరమునందు నన్నొక్కనిని ఉంచి త్రిగర్తుల పైకి యుద్ధమునకు పోయెను. నాకు సైన్యము లేదు. ఏకాకిని, బాలకుడననగు నేను అతిరథ మహారథులైన అనేక కురు వీరులతో నెట్లు పోరాడగలను? నా చేతకాదు. రథమును మరలింపుము."

ఆ మాటలు విని బృహన్నల ఉత్తరునితో ఇట్లనెను:-

"రాజకుమారా! నీవు భయపడుచు అతి దీనుడవై శత్రువులకు సంతోషము కలిగించుచున్నావు. ఇప్పటికింకను శత్రువులు తమ పరాక్రమును చూపనే లేదు. కేవలము వారిని చూచినంత మాత్రమున భయపడుచున్నావు.

కౌరవుల వద్దకు తీసికొని పొమ్మని కదా ఇప్పుడే చెప్పితివి? అక్కడికే తీసికొనిపోయెదను. మాంసము కొరకు గ్రద్దలు వాలినట్లుగా గోవులకొరకు వచ్చిన ఆతతాయులైన (చంపుటకు వచ్చినవారు) కౌరవుల మధ్యకు నిన్ను తీసికొనిపోయెదను. అక్కడ నీవు వారితో యుద్ధము చేయుము.

గోవులనేకాక వారు నీ భూమిని ఆక్రమించదలచినను పోరాడుము. నీవు స్త్రీ పురుషుల మధ్య గొప్పగా నిన్ను నీవు శ్లాఘించుకొనుచు 'కౌరవులను ఓడించి గోవులను తెచ్చెదను' అని ప్రతిజ్ఞ చేసి యుద్ధమునకు వెడలి, యిప్పుడెందుకు యుద్ధము చేయుటకు వెనుకాడుచున్నావు?

శత్రువులను జయించి గోవులను తీసికొని పోవకుండినచో నిన్ను నగరమునందలి స్త్రీ పురుషులు పరిహసించెదరు.

నన్ను గూడ సైరంధ్రి యెంతయో పొగడి నా సారథ్య కౌశలమును అక్కడ చాటెను. కనుక నేను శత్రుజయము చేసి గోవులను మరలించుకొనకుండ తిరిగి పోవను.

నీవు, సైరంధ్రి యిరువురు గూడ నన్ను చాల గొప్పగా ప్రశంసించితిరి. అట్టి నేను కౌరవులందరితోను యుద్ధము చేయకుండ ఎట్లు ఉండగలను? నీవు స్థిరముగా నిలువుము, భయపడకుము.''

ఆ మాటలు విని ఉత్తరుడు బృహన్నలతో నిట్లనెను:

''బృహన్నలా! కౌరవులు మత్స్య దేశమునందలి ధనమును హరించి తీసికొని పోవుదురుగాక! వారి స్వేచ్ఛకు నేను అడ్డుపడను. నగరమునందలి స్త్రీ పురుషులు నన్ను జూచి నవ్వినను నవ్వుదురుగాక! నా గోవులు హరింపబడి నను హరింపబడుగాక! ఈ యుద్ధముతో నాకు అవసరము లేదు.

నా పట్టణము శూన్యముగా నున్నది. నా తండ్రి నన్ను నగర రక్షణము నకై ఉత్తరువు చేసెను. ఆయన మాటకు భయపడెదను. కనుక నేనిక్కడ నిలువజాలను.''

''జనమేజయా! ఇట్లు చెప్పి ఉత్తరుడు మానాభిమానములను విడిచి, ధనుర్బాణములను క్రింద పడవేసి రథమునుంచి దుమికి భయముతో పరుగెత్త మొదలిడెను.

అప్పుడు బృహన్నల యిట్లనెను:

''రాజకుమారా! క్షత్రియుడు యుద్ధమునుండి పారిపోవుట శూరులధర్మము గాదు. భయపడి పారిపోవుట కంటె యుద్ధమునందు చచ్చుట మేలు.''

జనమేజయా! ఇట్లు చెప్పి అర్జునుడు రథమునుండి ఎగిరి, దుమికి పారిపోవుచున్న ఉత్తరుని వెంట పరుగెత్తెను.

అట్లు పరుగెత్తుచున్న బృహన్నలయొక్క పొడవైన జెడ ఊగుచుండెను. అతడు ఎఱ్ఱని వస్త్రములు ధరించి యుండెను.

అటువంటి రూపమును చూచి సైనికులు, వాస్తవమును తెలియక, పకపక నవ్విరి. అట్లు త్వరగా పరుగెత్తుచున్న బృహన్నలను చూచి కౌరవులు తమలో నిట్లనుకొనిరి:

''నివురు గప్పిన నిప్పువలె గుప్త వేషములోనున్న యితడెవడు? కొంత స్త్రీ రూపము, మరికొంత పురుష రూపముతో నున్నాడు. ఇతనిలో అర్జునుని పోలికలున్నవి.

నపుంసకుని ఆకారములో నున్నాడు. ఇతని తల, మెడ, దీర్ఘ బాహువులు అర్జునునికి ఉన్నట్టివే యున్నవి. అటువంటి పరాక్రమమే యితనిలో కనపడు చున్నది. కనుక నితడు అర్జునుడే యగును.

దేవతలలో నింద్రునివలె మానవులలో నర్జునుడు అసహాయశూరుడు. ఇత డర్జునుడు కాకున్నచో, అసహాయుడై ధైర్యముతో మరియొక్కడు మనపై దాడి చేయగలడా?

విరాట నగరమును రక్షించుటకుగాను ఒక విరాట పుత్రుని మాత్రమే ఉంచినారు. ఆతడిప్పుడు బాల్య చాపల్యముతో మనపై దాడి చేయుటకు వెడలినాడే కాని పౌరుషము చేతకాదు.

కపట వేషముతో గుప్తముగా తిరుగుచున్న అర్జునుని ఉత్తరుడు తన రథ సారథిగా చేసికొని ఊరు వెడలెను. సందేహము లేదు. ఇప్పుడు మనను చూచి భయపడి పారిపోవుచున్న ఉత్తరుని పట్టుకొనుచున్నవాడు తప్పక అర్జునుడే!"

"జనమేజయా! ఈ విధముగా కౌరవులు వేరువేరుగా విమర్శించుకొనుచు, మారు వేషమునందున్న అర్జునుని, ఉత్తరుని చూచి, ఇదమిత్థమని నిశ్చయించు కొనజాలకుండిరి.

అప్పుడు దుర్యోధనుడు ఇట్లనెను.

'అర్జున - బలరామ - కృష్ణ - ప్రద్యుమ్నులలో నెవడు వచ్చినను మనను ఎదుర్కొనజాలడు. మరియొకడు నపుంసక రూపముతో వచ్చి యుండినచో నా బాణములచే చంపెదను.

ఒకవేళ ఇతడు ఆ నలుగురిలో నొకడైనను, ఇంతమంది శూరులతో నతడు ఒంటరిగా నెట్లు పోరాడగలడు? ఇతడర్జునుడా? కాడా? అను విషయ మును నిర్ణయించజాలకున్నాము."

ఇతర వీరులు బృహన్నలను చూచి, "బలపరాక్రమ సంపన్నుడు, ఇంద్ర సమానుడునగు అర్జునుడే ఒకవేళ నేడు యుద్ధము చేయుటకు వచ్చియుండిన యెడల మన సైనికుల ప్రాణములు సంశయాస్పదములై యున్నవి. ఇతడు అర్జు నుడే కాని మరియొకడు కాడు'' అని నిశ్చయించుకొనిరి.

''జనమేజయా! అట్లు పారిపోవుచున్న ఉత్తరుని వెంట పరుగెత్తిన అర్జు నుడు నూరడుగుల దూరములోనే అతని జుట్టు పట్టుకొని ఆపెను.

అట్లు పట్టుపడిన ఉత్తరుడు, అతిదైన్యముతో అర్జుని వలె ఏడ్వసాగెను.

"కల్యాణీ! బృహన్నలా! నా మాట వినుము. రథమును మరలింపుము. బ్రతికియుండిన శుభములు బడయ వచ్చును.

నీకు నూరు బంగారు నాణెములను, బంగారమందు పొదిగిన యెనిమిది వైడూర్యమణుల ఆభరణములను, బంగారు దండములు గలిగి ఉత్తమాశ్వము లను కట్టిన రథమును, పది మదపుటేనుగులను కానుక లిచ్చెదను. నన్ను విడువుము'' అని బృహన్నలతో ననెను.

"జనమేజయా! ఇట్లే యింకను ఎన్నియో మాటలాడుచు నేడ్చుచు అచేతనుడై యున్న ఉత్తరుని అర్జునుడు నవ్వుచు రథము వద్దకు తెచ్చెను.

''రాజకుమారా! నీకు యుద్ధము చేయుటకు ఉత్సాహము లేకున్నచో, నేను చేసెదను. నీవు నాకు సారథివిగా నుండి రథమును తోలుము. నా బాహు బలముచే సురక్షితుడవుగా నుండి రథసైన్యమువైపు రథమును తోలుము.

శత్రువుల రథసేన యెట్లున్నది చూచితివా? అది యితరులు జెనకుటకు అలవికాకుండా మహారథికులచే కాపాడబడుచు అతిభయంకరముగా నున్నది.

నీవు క్షత్రియుడవు యుద్ధభూమియందు భయపడకుము. ఏమి పురుషుడ వయ్యా నీవు! శత్రుమధ్యమునందు ఏడ్చుచున్నావు.

ఈ రథసైన్యమునందు దూరి, నేను శత్రువులను ఓడించి, పశువులను తెచ్చెదను చూడుము. నాకు సారథిగా నుండుము.''

ఇట్లు ఉత్తరునితో చెప్పుచు నతనిని ఓదార్చెను.

కొంత సేపటికి ఉత్తరుడు తెప్పరిల్లెను. భయపడుచు సారథ్యము చేయుటకు అతనికి ఇష్టములేకున్నను, అతనిని అర్జునుడు రథముపై నెక్కించెను.

ఉత్తరుడు సారథ్యము చేయగా నర్జునుడు, తన గాండీవమును తెచ్చుకొనుటకు శమీవృక్షము వైపునకు పోయెను.''

అని చెప్పి వైశంపాయనుడు జనమేజయునకు తరువాతి వృత్తాంతము నిట్లు చెప్పదొడగెను:

ద్రోణాచార్యుడు అర్జునుని ప్రశంసించుట

"జనమేజయా! నపుంసక వేషముతో రథమునందు ఉత్తరుని కూర్చొన బెట్టుకొని శమీ వృక్షమునకు అభిముఖముగా పోవుచున్న అర్జునుని చూచి భీష్మ ద్రోణాదులైన కురుపుంగవులు భయభ్రాంతులైరి. అప్పుడు అద్భుతముగా తోచిన ఉత్పాతములను చూచి ద్రోణాచార్యు డిట్లనెను:-

"పాషాణములను గురియుచు పొడి వాయువు ప్రచండముగా వీచుచున్నది. బూడిద వర్ణముగల చీఁటి ఆకాశమును అలముకొనినది. మేఘములు శుష్క వర్ణము గలవై అద్భుతముగా కనపడుచున్నవి. వివిధాయుధములు ఒరలనుండి తమంతట బయలువెడలుచున్నవి. దిక్కులు దహింపబడుచున్నట్లున్నవి. నక్కలు భయంకరముగా కూయుచున్నవి. అశ్వములు కన్నీరు కార్చుచున్నవి. టెక్కెములు కంపించు చున్నవి.

దుశ్శకునములను చూడగా, మన కేదో భయోత్పాతము మూడినట్లు తోచుచున్నది. కనుక, వీరులారా! మీరు జాగ్రత్తతో మిమ్ము మీరు రక్షించు కొనుడు. సేనను వ్యూహములుగా పన్నుడు. ఈ యుద్ధమునందు గొప్ప మానవ సంహారము జరుగవచ్చునని తోచుచున్నది.

గోధనమును రక్షించుకొనుడు. ధనుర్ధారులలో శ్రేష్ఠుడు, వీరుడునైన అర్జునుడు నపుంసక రూపముతో మనపై దాడిచేయుచున్నాడు. సంశయములేదు.

భీష్మాచార్యా! హనుమద్ధ్వజము గలిగి, ఒక వృక్షము (అర్జున-కడిమి) పేరుతో ఒప్పునట్టి యింద్రపుత్రుడు (అర్జునుడు) స్త్రీ వేషముతో నిదుగో వచ్చు చున్నాడు.

అతడు దుర్యోధనుని జయించి, గోవులను మరలించుకొనిపోవును. కనుక దుర్యోధనుని రక్షింపుము. ఇదుగో, శత్రు సంతాపకారకుడైన అర్జునుడు పరిపూర్ణ పరాక్రమముతో మనపైన పడుచున్నాడు. ఇతడు, తనను దేవదానవులు ఎదిరించినను వారితో యుద్ధముచేయక తిరిగిపోవువాడుకాడు.

ఈ శూరుడు వనమునందు అనేక క్లేశములను అనుభవించినవాడు. ఇంద్రునివద్ద శస్త్రాస్త్ర శిక్షణమును పొందినవాడు. ఇంద్రసమానుడు. ఇప్పుడు క్రుద్ధుడై యున్నాడు.

కౌరవులారా! మనలో నొక్కడు గూడ నితనిని ఇప్పు డెదిరించగలవాడు నాకు కనబడుటలేదు. కిరాత వేషముతో నున్న సాక్షాత్ పరమేశ్వరునే హిమవత్పర్వతమునందితడు యుద్ధమునందు సంతోషపరచెనని వినినాను."

ఆ మాటలు విని కర్ణుడు ఇట్లనెను:-

"ఆచార్యా! నీవు మా యెదుట నెల్లప్పుడు గూడ అర్జునుని శ్లాఘించు చుందువు. కాని యతడు నాకుగాని, దుర్యోధనునకుగాని, పదియారవ వంతు కైన తగినవాడు కాడని తెలిసికొనుము."

అప్పుడు దుర్యోధనుడు కర్ణునితో నిట్లనెను:-

"రాధానందనా! ఇతడొకవేళ అర్జునుడే అయియుండినచో నా కార్యము నెరవేరినట్లేయగును. ఈ పదుమూడవయేట అజ్ఞాతవాసములోనున్న పాండవులను మనము తెలిసికొనినచో మరల వారు పన్నెండేండ్లు వనవాసము చేయవలసినవారే కదా! అట్లుగాక మరియెవడైన నపుంసక వేషముతో మనపైకి వచ్చెనా, అతనిని నా వాడిబాణములచేత కూల్చెదను."

అని చెప్పి వైశంపాయనుడు జనమేజయునితో తరువాతి కథ ఇట్లు చెప్పదొడగెను:-

అర్జునుడు ఉత్తరునితో జమ్మిచెట్టునుండి ఆయుధములను తీయించుట

"జనమేజయా! అర్జునుడు శమీవృక్షము కడకుపోయి ఉత్తరునితో నిట్లనెను:-

ఉత్తర కుమారా! నీవు త్వరగా ఈ శమీవృక్షముపై నెక్కి ధనుస్సులను దించుము. ఎందుకనగా, నీ యీ ధనుస్సులు నా బాహుబలమును సహించజాలవు. బరువును మోయజాలవు. గొప్ప మదగజములను చంపుటకుగూడ ఇవి పనికిరావు.

ఇంతేకాక శత్రు విజయమును సాధించునప్పుడు నా చేతి వడినిగూడ ఈ నీ ధనుస్సులు సహింపజాలవు ఈ ధనుస్సులతో విజయమును సాధించలేము. నీ యీ యాయుధములన్నియు అతి సూక్ష్మములు, హ్రస్వములు, మృదువులుగా నున్నవి.

కనుక భూమింజయా! ఈ శమీ వృక్షముపైకి ఎక్కుము దీనిపైన పాండవుల ధనుస్సులు ఉంచబడినవి. ఆ శూరుల ధ్వజములు, బాణములు, దివ్యములైన కవచములు ఉన్నవి. ఇక్కడ అతి దృఢమైన అర్జునుని గాండీవ ధనుస్సు ఉన్నది. ఆ ఒక్క ధనుస్సే లక్ష ధనుస్సులతో సమానము. యుద్ధపు తాకిడిని సహించునది. అది గొప్ప తాటిచెట్టువలె నున్నది చూడుము. అది అన్ని అయుధములలో పెద్దది. ఆ బంగారు ధనుస్సుకు ఇంతవరకు ఒక్క దెబ్బగూడ తాకలేదు. అది అతి భయంకరము, సుందరమునైనది. ఎంత బరువునైనను మోయగలది.

దానివంటివే, పాండవులందరి యితరాయుధములుగూడ దృఢములు, బలిష్ఠములునైనవి.''

ఆ మాటలకు, ఉత్తరుడు బృహన్నలతో నిట్లనెను:-

''బృహన్నలా! ఈ వృక్షమునందు ఏదో శవము కట్టబడినదని విని యుంటిని. నేనెట్లు మృతశరీరమును తాకుదును? గొప్ప రాజకుమారుడను గదా! వేదమంత్రములను పఠించి, యజ్ఞకర్మలను చేసినవాడను. ఈ అపవిత్ర వస్తువును తాకుట నాకు ఉచితముకాదు నేను దీనిని స్పృశించినచో పీనుగులను మోయువానివలె అపవిత్రుడ నయ్యెదను. ఆ తరువాత నీవు నన్ను పనిగొనుటకు ఎట్లు శుద్ధపరచెదవు?''

ఆ మాటకు బృహన్నల యిట్లనెను :-

''రాజేంద్రా! నీవు దీనిని తాకినను నీ అర్హత లోపించదు. పవిత్రుడవుగానే యుండెదవు. భయపడకుము. ఇవి ధనుస్సులేకాని, యిందులో శరీరము లేదు. నీవు గొప్ప వంశమునందు పుట్టినవాడవు. మత్స్య రాజపుత్రుడవు. రాజకుమారా! అట్టి నీతో నిందితమైన పని నేనెట్లు చేయించెదను?''

పాండవుల యాయుధముల వర్ణనము

''జనమేజయా! ఇట్లు అర్జునుడు చెప్పగనే, చేయునదిలేక ఉత్తరుడు రథమునుండి దుమికి, శమీవృక్షముపైకి ఎక్కెను.

'ఆ ధనుస్సులను త్వరగా వృక్షమునుండి దించుము' అని అర్జునుడు రథమునుండియే ఆజ్ఞాపించెను. 'దించిన తరువాత వాటికి చుట్టబడిన ఆకులు మొదలైనవాటిని విప్పుము' అని కూడ చెప్పెను.

అప్పుడు ఉత్తరుడు ఆ యాయుధముల కట్టను దించి, దానికి చుట్టబడిన ఆకులను విప్పెను. ఆ ధనుస్సులు విడువబడుచున్నప్పుడు, వాటి నుండి సూర్య ప్రభతో విరాజిల్లుచు నలువైపుల గ్రహములు ఉదయించునప్పుడు వెడలు కాంతుల వంటి కాంతులు వ్యాపించెను. సర్పములవలె విజృంభించుచున్న ఆ ధనుస్సుల రూపములను చూచిన ఉత్తరునకు శరీరమునందు రోమాంచము కలిగి వెంటనే భయోద్విగ్నుడయ్యెను. తేజస్వంతములైన ఆ గొప్ప ధనుస్సులను తాకి ఉత్తరుడు, జనమేజయా! అర్జునునితో నిట్లనెను:-

''బృహన్నలా! నూరు బంగారు పువ్వులు చెక్కబడి, సహస్రకోటి సువర్ణ కాంతులను వెదజల్లుచున్న యీ ఉత్తమ ధనుస్సు ఎవనిది?

వెనుక భాగమునందు బంగారు గజములు చెక్కబడి యిరువైపుల దృఢముగా నున్న యీ ధనుస్సు ఎవనిది?

శుద్ధమైన బంగారముతో అరువది ఆరుద్ర పురుగులు వెనుక భాగమునందు చెక్కబడి ప్రకాశించుచున్నయీ ధనుస్సు ఎవనిది?

సువర్ణముతో మూడు సూర్యబింబములు చెక్కబడి, జాజ్వల్యమానమైన తేజస్సుతో నొప్పుచున్న యీ ధనుస్సు ఎవనిది?

బంగారపు మిడుతలు చెక్కబడి, విచిత్ర వర్ణములుగల మణులు పొదుగబడిన యీ ధనుస్సు ఎవనిది?

బృహన్నలా! మంచి రెక్కలు కలిగి, బంగారు కొనలతో బంగారు అంబుల పొదియందు విరాజిల్లుచున్న యీ వేలకొలది బాణము లెవనివి?

స్థూలములైన దండముగలిగి, గ్రద్దల రెక్కలతో నొప్పుచు, రాతిపైన పదును చేయదగిన పసుపురంగు గలిగి, పదునైన కొనలు గలిగి, యినుముతో చేయబడిన యీ బాణము లెవనివి?

ఐదు శార్దూలముల గుర్తులు గలిగి, వరాహ కర్ణముల వంటి పది బాణములను ఒకేసారి సంధింపగలిగిన యీ నల్లని ధనుస్సు ఎవనిది?

శత్రువుల నెత్తురు త్రాగగలిగి, అర్ధచంద్రాకారములైన యీ యేడు వందల గొప్ప బాణము లెవనివి ?

పూర్వార్ధము చిలుక రెక్కలవంటి పసుపువర్ణము గలిగి, ఉత్తరార్ధము ఉక్కుతో చేయబడినవై, బంగారు పుంఖములు, రాతిపైన పదును చేయదగిన యీ బాణములు ఎవనివి?

శత్రు భయంకరమై, గొప్ప భారమును సహించ గలిగి, వృష్ణ భాగము నందును? ఎఱ్ఱి చేపలకు ఆకర్షకమైన జంతువుల చిత్రములు గలిగి, సుదీర్ఘమైన యీ బాణమెవనిది ?

మేక చర్మపు ఒరలో ఉంచబడి, బంగారు చిత్రములతో గలిసి, శత్రువులకు చేరరానిదై, పదునైన అంచుగలిగి, బంగారు చిరుగజ్జెలతో విరాజిల్లుచు, ఒరపైన సుందర చిత్రములు గలిగి, బంగారు పిడిగల యీ నిర్మలమైన కత్తి ఎవనిది?

గో చర్మపు ఒరలో ఉంచబడి, బంగారు పిడిగలిగి, నిషధ దేశమున పుట్టిన యీ విమల ఖడ్గమేవనిది?

వ్యాఘ్రచర్మపు ఒరలో ఉంచబడి, బంగారు పిడిగలిగి, ఆకాశవర్ణముగల యీ కత్తి యెవనిది?

బంగారు ఒరలో ఉంచబడిన యీ పెద్ద కత్తి ఎవనిది ?

బంగారు పువ్వులు చెక్కబడి, నీల సర్పమువలె శత్రు శరీర భేదనము చేయగలగిన యీ నల్లని పెద్ద ఖడ్గమెవనిది?

బృహన్నలా! ఈ యాయుధములన్నియు చూచి నాకు చాల విస్మయము కలుగుచున్నది. వీటిలో ఏ యాయుధము లెవరివో నాకు వివరించి తెలుపుము."

ఆ మాటలు విని బృహన్నల యిట్లుచెప్పెను :-

"రాజ కుమారా! మొదట నీ వడిగిన ధనుస్సే గాండీవము. అది అర్జునుడు ధరించునది యని లోక ప్రసిద్ధము గదా! అది అన్ని ఆయుధములకన్న పెద్దది. అది ఒక్కటే ఒక లక్ష ధనుస్సులతో సమానము. రాష్ట్రాభివృద్ధిని చేయునది. అర్జునుడు దీని సహాయముతోనే మనుష్యులను దేవతలను జయించుచుండును.

దీనిని దేవ-దానవ-గంధర్వులు అనేక సంవత్సరములు పూజించిరి. దీనిని పూర్వము బ్రహ్మదేవుడు వేయియేండ్లు, ప్రజాపతి ఐదువందల మూడేండ్లు,

ఇంద్రుడు ఎనుబది యైదేండ్లు, సోముడు ఐదు నూర్లేండ్లు, వరుణుడు నూరేండ్లును ధరించిన తరువాత ఇప్పుడు అర్జునుడు అరువది యైదేండ్లుగా ధరించుచున్నాడు.

దేవ-మర్త్య లోకములందు పూజింపబడిన ఈ మరియొక బంగారు ధనుస్సు భీమసేనునిది. దీని సహాయముతోనే భీముడు తూర్పు దిక్కు నంతటిని జయించెను.

ఆరుద్ర పురుగుల చిత్రములతో విరాజిల్లు ధనుస్సు యుధిష్ఠిరునిది.

సూర్యుని చిత్తరువులుగలది నకులునిది

బంగారు మిడుతల చిత్రములతో నొప్పు ధనుస్సు సహదేవునిది.

ఉత్తర కుమారా! చురకత్తితో సమానములై, విషమును వెడల గ్రక్కుచున్న యీ వేలకొలది బాణములు అర్జునునివి. ఇవి యుద్ధమునందు ప్రజ్వరిల్లుచు వేగముగా పోయి శత్రువులను హతమార్చును. ఎంతటి వీరుడైనను వీటి ధాటికి తట్టుకొన జాలడు.

సుదీర్ఘములైన యీ అర్ధచంద్ర బాణములు, పసపు వర్ణముతో బంగారు కొనలు గలిగి యున్నవి చూడుము. ఇవి భీముని బాణములు.

ఐదు శార్దూలముల చిత్రములు గల యీ అంబులపొది నకులునిది. అతడు దీనిచేత పడమటి దిక్కునంతటిని జయించెను.

సూర్యుని ఆకృతితో ప్రకాశించుచున్నయీ బాణములు సహదేవునివి.

మూడు గెణుపులు గలిగి పసపు వన్నెతో దీర్ఘములుగా నున్న యీ సువర్ణ పుంఖ బాణములు యుధిష్ఠిర మహారాజువి.

పృష్ఠ భాగమునందు ముఖభాగమునందు ఎఱ్ఱని చిత్తరువులు గలిగిన యీ మహా ఖడ్గము అర్జునునిది.

వ్యాఘ్ర చర్మపు ఒర గల యీ కత్తి భీమసేనునిది.

పదునయిన అంచుగలిగి, చిత్రములు గల ఒర బంగారు పిడిగల ఖడ్గము ధర్మరాజుది.

మేక చర్మపు ఒరలోనున్న కత్తి నకులునిది.

గోచర్మపు ఒరలోనున్న ఖడ్గము సహదేవునిది."

ఆ మాటలు విని ఉత్తరుడిట్లనెను:-

"బృహన్నలా! సువర్ణాకారములైన యీ యాయుధములను ధరించు పాండవు లెక్కడ నున్నారు? శత్రు భయంకరులైన పార్థులు జూదమునందు సర్వము పోగొట్టుకొని పోయిరి. వారి విషయమే తెలియలేదు. స్త్రీ రత్నమగు ద్రౌపది గూడ జూదమునందు గెలువబడి పతులనే అనుసరించెను. ఆమె యెక్కడ నున్నది?"

ఆ మాటకు అర్జునుడు ఇట్లనెను:-

అర్జునుడు తమను గూర్చి తెలుపుట

"రాజకుమారా! నేనే అర్జునుడను, రాజసభయందు గౌరవ సభ్యుడుగా నున్న కంకభట్టుడే యుధిష్ఠిరుడు, మీ తండ్రికి విశిష్టముగా వంటచేయు బల్లవుడే భీమసేనుడు, అశ్వ శిక్షకుడు నకులుడు, గో శిక్షకుడు సహదేవుడు, ఏ స్త్రీ కొరకై కీచకులు చంపబడిరో ఆ సైరంధ్రియే ద్రౌపది."

అది విని ఉత్తరుడు ఇట్లు అడిగెను:-

అర్జునుడు తన పది పేర్లను వివరించుట

"బృహన్నలా! అర్జునునకు పది పేర్లు ఉన్నట్లు విని యున్నాను. ఆ పేర్లు ఏమియో చెప్పుము. అవి చెప్పినచో నీ మాటలను విశ్వసించెదను."

ఆ మాటకు అర్జునుడు తన "అర్జున - ఫాల్గున - జిష్ణు - కిరీటి - శ్వేతవాహన - బీభత్సు - విజయ - కృష్ణ - సవ్యసాచి - ధనంజయ" అను పది నామములను వరుసగా చెప్పెను.

ఆ మాటకు ఉత్తరుడు 'అర్జునకు ఈ పేర్లు ఏ కారణము చేత వచ్చినవో చెప్పుము. అప్పుడు నిన్ను నమ్మెదను,' అని యనెను.

అర్జునుడు వరుసగా ఆ పేర్లు తనకు ఎట్లు వచ్చినవో చెప్పదొడగెను:-

"రాజకుమారా! అన్ని దేశములను జయించి అక్కడి నుండి కప్పముగా ధనమును తెచ్చి ఆ ధనమధ్యము మధ్య ఉండెదను గాబట్టి నన్ను ధనంజయుడు అనెదరు.

"యుద్ధోన్మత్తులైన శత్రువుల నెదుర్కొని వారిని జయించకుండ ఎప్పుడు గూడ నేను వెనుతిరిగి రాను కాబట్టి నాకు విజయుడు అని పేరు వచ్చినది.

"బంగారు కవచములు తొడుగబడిన తెల్లని గుఱ్ఱములు నా రథమునకు యుద్ధ సమయమందు కట్టబడును గనుక నను 'శ్వేతవాహనుడు' అని పిలిచెదరు.

"హిమాలయ పృష్ఠ భాగమునందు నేను పగటి వేళ రెండు ఉత్తర ఫల్గుణీ నక్షత్రముల కాలమునందు పుట్టినాను గనుక నాకు 'ఫాల్గునుడు' అను పేరు వచ్చినది.

"పూర్వము నేను రాక్షసులతో యుద్ధము నేయుచున్నప్పుడు ఇంద్రుడు సూర్య తేజస్సుగల కిరీటమును నా తలపైన ఉంచెను గనుక నన్ను 'కిరీటి' అనెదరు.

"యుద్ధము చేయునప్పుడు నేను ఏవగింపు గలుగు పని చేయను గాబట్టి 'బీభత్సుడు' అని స్వర్గ మర్త్య లోకములందు ప్రసిద్ధుడనయినాను.

"గాండీవ ధనుస్సును లాగుటలో నా రెండు కుడి యెడమ చేతులు గూడ సమర్థములై యుండును గనుక నన్ను మనుష్యులు, దేవతలు 'సవ్యసాచి' అని అని యందురు.

"అర్జున శబ్దమునకు మూడు అర్థములున్నవి. అవి 'దీప్తి - సమత్వము- శుద్ధత్వము' అని. చతుస్సముద్రముద్రితమైన భూమండలము నలువైపుల గూడ నాకు గల దీప్తి యితరునికి ఎవనికిని లేదు, అందరి యెడల సమభావముతో మెలగెదను, పరిశుద్ధమైన కర్మ చేసెదను, ఈ మూడు గుణములు నాయందున్నవి గనుక ఈ మూడు అర్థములుగల 'అర్జున' శబ్దము నాకు సార్థకమై యున్నది.

"శత్రువులకు నన్ను పట్టుకొనుటగాని, తిరస్కరించుటగాని అతి కఠినము. నేను ఇంద్ర పుత్రుడను. శత్రు దమనుడను. అందుచేత నాకు 'జిష్ణు' నామ మేర్పడినది.

"కృష్ణ శబ్దమునకు నలుపు తెలుపు గలిగిన వర్ణము మరియు మనస్సుకు 'ఆకర్షకము' అని రెండు అర్థములు గలవు. నా శరీర వర్ణము శ్యామము (తెలుపు నలుపు మిశ్రము), నేను అందరి మనస్సులను ఆకర్షించువాడనయి నా తండ్రికి

చాలా ప్రియుడనుగా నుంటిని గనుక ఆయన నాకు 'కృష్ణుడు' అని పేరు పెట్టెను. అది నా పదవ పేరుగా నెరుగుము."

ఇట్లు అర్జునుడు చెప్పిన మాటలు విని ఉత్తరుడు ఆశ్చర్యానందములలో మునిగెను "

"జనమేజయా! ఉత్తరుడప్పుడు, తన పేరు 'భూమింజయుడు - ఉత్తరుడ'ని తన నామగోత్రములను చెప్పుచు అర్జునునకు నమస్కరించి (పెద్దలకు నమస్కారము చేయునప్పుడు నామ గోత్రములు చెప్పి చేయుట ఆచారము) అర్జునునితో నిట్లనెను:-

"కుంతీపుత్రా! నా యదృష్టమేమనవలెను? నిన్ను సన్నిహితునిగా చూడగలుగుచున్నాను. నీకు స్వాగతము. లోహితములైన (ఎరుపు) కన్నులు, గజతుండమువలె సుదీర్ఘములైన బాహువులు గల నిన్నుచూచి ఆనందించుచున్నాను.

అజ్ఞానమువలన నిన్ను ఏమేమో అనినాను. నన్ను క్షమించుము. అత్యంత దుష్కరములైన అనేక కార్యములను సాధించిన నీవంటి వీరుని అండ నాకు దొరకినది. ఇక నా భయము పటాపంచలైనది. నీయెడల అతిప్రీతికలుగుచున్నది. నీకు దాసుడనయ్యెదను. నను దయతో చూడుము.

నీకు సారథ్యము చేసెదనని ప్రతిజ్ఞ చేయుచున్నాను నా మనస్సు కుదుటపడినది. నీ రథమును నడపుట నా మహాభాగ్యమని తలచెదను. నీవు రథమును అధిష్ఠించుము ఏ సేనపైకి రథమును నడపుమనెదవో చెప్పుము అవైపే నడపెదను"

ఆ మాటలు విని అర్జునుడిట్లనెను :-

"ఉత్తర కుమారా! ఇప్పుడు నీకు భయము లేదని తెలిసి నాకు చాల సంతోషమైనది. ఇప్పుడే చూడుము, యుద్ధమునందు నీ శత్రువులనందరిని కొట్టి పారద్రోలెదను. నీవు ఇక శాంతితో నుండుము. యుద్ధమునందు శత్రువులతో అతి భయంకరముగా యుద్ధము చేయబోవు నా పరాక్రమము చూడుము. ఈ అంబుల పొదుల నన్నిటిని త్వరగా నా రథమునం దుంచుము. సువర్ణముచే నలంకరించబడిన యొక ఖడ్గమునుగూడ తెమ్ము".

"జనమేజయా! అర్జునుని మాటలు విని ఉత్తరుడు వేగముగా ఆయుధములు తీసికొని ఆ వృక్షమునుండి దిగెను, అప్పుడతనితో నర్జును డిట్లనెను:-

"ఉత్తర కుమారా! నేను కౌరవులతో పోరాడి నీ గోవులను గెలుచుకొని తెచ్చెదను. నీవు నాచేత సురక్షితుడవై యీ రథముపైన కూర్చొనుము.

ఇదియే నీ పట్టణమనుకొనుము. రథము యొక్క యిరుసు, చక్రము మొదలైన అవయవములే, పట్టణపు వీథులలో నిరుప్రక్కల నిర్మింపబడిన గృహములుగా భావించుము. నా రెండు భుజములే పట్టణయొక్క దుర్గము, పురద్వారము అనుకొనుము. అంబులపొదులు, ధ్వజము, ఆయుధములు ఇవియే నగరమునందలి చతురంగ బలములుగానుండి శత్రువులను చేర రాకుండ చేయగలవు. అల్లెత్రాడే శతఘ్ని (తోపు) నాళము అనియు, రథచక్రపు ఆకుల ధ్వనియే నగరమునందు శత్రు భయంకరములైన దుందుభి ధ్వనులనియు తలచుము.

యుద్ధమునందు నేను అధిష్ఠించిన రథము శత్రుసేనకు జయింపనలవి కానిదగును. నా గాండీవ ప్రభావమట్టిది."

అది విని ఉత్తరు డిట్లనెను:-

"అర్జునా! ఇప్పుడు నేను శత్రువులకు భయపడను, ఎందుకనగా, నీవు యుద్ధభూమియందు, శ్రీకృష్ణ భగవానునివలె, సాక్షాత్తు ఇంద్రునివలెను స్థిరముగా నుండువాడవని నేను బాగుగా నెరుగుదును.

కాని, నా బుద్ధి సరిగా లేనందువలన మోహము కలుగుచున్నది. ఒక నిశ్చయమునకు రాజాలకున్నాను. ఒక్క విషయము నన్ను బాధించుచున్నది. అది యేమనగా, నీవు సర్వలక్షణసమేతుడవై సర్వావయవశోభితుడవై యుండియు, ఏ కర్మ విపాకముచేత నీకు ఈ నపుంసకత్వము వచ్చినది? నీవు ఈ క్లీబరూపముతో సంచరించు శూలపాణియైన పరమేశ్వరుడవో లేక సకల గంధర్వ రాజైన యింద్రుడవోయని తలచెదను."

ఆ మాటకు అర్జును డిట్లనెను:-

"ఉత్తరకుమారా! ఊర్వశి శాపమున నాకీ నపుంసకత్వము వచ్చినది. పూర్వము నేను అన్నగారి ఆజ్ఞపై దేవలోకమునకు పోయియుంటిని. అప్పుడు నేను సుధర్మ (దేవసభ) యందు అతిలోక సౌందర్యవతియైన ఊర్వశి యింద్రుని సమక్షమునందు నాట్యము చేయుచుండగా చూచితిని.

ఆమె నా వంశమునకు కూటస్థురాలు అని జననీ భావముచే భక్తితో రెప్పవాల్చక ఆమెను చూచితిని. 'నాకు ఆమె యెడల ప్రేమ కలిగినది' అను భావముచేత నామె నాయందు అనురాగముగలిగి యారాత్రి నాతో రమించుటకు నా వద్దకు వచ్చెను.

అప్పు డామెకు నేను నమస్కారము చేసి మాతృ భావము చేత పూజా సత్కారాదులు చేసితిని.

భగ్నమనోరథయైన ఊర్వశి క్రుద్ధురాలై 'నపుంసకుడవు కమ్ము' అని శపించెను.

ఆ శాపము సంగతి విని యింద్రుడు నాతో 'అర్జునా! నీవు భయపడకుము నీకు అజ్ఞాతవాసమునందు ఈ షండత్వము ఉపకారకమే యగును' అని చెప్పి నన్ను అనుగ్రహించి ఆ శాపము నాకీయేడు వరముగా మార్చెను.

ఉత్తరకుమారా! నాకు నపుంసకత్వము వచ్చుటకిది కారణము. ఈ యేడు ఆ నియమమును పాలించితిని. మా యన్నగారి యాజ్ఞ మేరకీ సంవత్సరము ఇట్లు గడపితిని. ఇది సత్యముగా నీకు చెప్పుచున్నాను. నేను వాస్తవముగా నపుంసకుడను గాను. ధర్మపాలన కొరకై గత్యంతరములేక దీని నాశ్రయించితిని. నేటితో ఆ వ్రతము తీరినదని తెలిసికొనుము."

ఆ మాటలు విని ఉత్తరు డిట్లనెను:-

"అర్జునా! నాకు వాస్తవమును తెలిపి నన్ననుగ్రహించితివి. ఎందుకనగా, నీవంటి పురుషశ్రేష్ఠులు క్లీబరూపమునందు ఉండరు. ఇప్పుడు నాకు నీ సహాయము లభించినది. దేవతలతోనైనను యుద్ధము చేసెదను. నా భయము తీరినది. ఇప్పుడు నేనేమి చేయవలెనో ఆజ్ఞాపింపుము.

నేను గురువులవద్ద సారథ్యవిద్య నేర్చినాను. శత్రురథములను కూల్చునట్టి యీ యశ్వములను వశపరచుకొని నడపెదను. శ్రీకృష్ణునకు సారథి 'దారకుడు' వలెను, ఇంద్రునకు సారథి 'మాతలి' వలెను, నేను నీకు సారథ్యము చేసెదను. ఆ యిరువురి వలెనే నేనుగూడ సారథ్యమునందు సుశిక్షితుడను.

పాండుకుమారా! ఈ కుడివైపు కట్టబడిన గుఱ్ఱముయొక్క నడక కనిపెట్టుట కష్టము. ఇది యెప్పుడు నేలపైన అడుగులు పెట్టును, ఎప్పుడు పైకెత్తును అని చూచువారలు కనిపెట్టజాలరు. అట్టి నేర్పుతో సారథ్యము చేసెదను.

ఈ యశ్వము శ్రీకృష్ణుని 'సుగ్రీవ' నామక హయముతో సమానమైనది. ఇక ఎడమవైపు రథభారమును వహించుచున్న గుఱ్ఱమున్నదే - యిది వేగము నందు శ్రీకృష్ణుని 'మేఘపుష్ప' నామముగల అశ్వముతో సమానమైనది.

ఎడమవైపు వెనుక నొగను వహించుచున్న కాంచన కవచముగల యీ యశ్వము వేగమునందు శ్రీకృష్ణుని 'శైబ్య' నామముగల గుఱ్ఱముతో సమానమైనది.

ఇక కుడివైపు వెనుక నొగను వహించుచున్న యీ నాల్గవ అశ్వమున్నదే యిది శ్రీకృష్ణుని 'వలాహక' మను సశ్వము కంటెను అధిక వేగము గలది. నా రథమునకు కట్టబడిన యీ నాల్గు గుఱ్ఱములు శ్రీకృష్ణుని గుఱ్ఱములవంటివే యగును ఈ రథము నీ వంటి వీర పురుషులు కూర్చొని యుద్ధము చేయుటకు తగియున్నది."

"జనమేజయా! ఉత్తరకుమారుని మాటలు విని అర్జునుడు తనచేతి కడియములను తీసి, వృక్షమునుండి తేబడిన బంగారుకవచమును తొడిగికొనెను. నల్లని తన వెంట్రుకలను తెల్ల బట్టతో కట్టెను. తూర్పుదిక్కు మొగమై సమస్త దేవతలకు నమస్కరించి భక్తితో ధ్యానము చేసి, ఆ యా దేవతల అస్త్రములను రథముపైకి ఆహ్వానించెను అప్పుడా అస్త్రములన్నియు అర్జునునకు ప్రత్యక్షమై 'మీ సేవకులము వచ్చినాము' అని దోసిలొగ్గి నివేదించెను.

అర్జునుడు ఆ యస్త్రములకు నమస్కరించి, చేతితో స్పృశించి, 'మీరందరు నా హృదయమునందు నివసించియుండుడు' అని వేడుకొనెను. అస్త్రములను పొంది అర్జునుడు ఆనందించెను.

గాండీవమునందు అల్లెత్రాడు బిగించి అర్జునుడు ఒక్కసారి టంకారము చేసెను. ఆ ధ్వని రెండు పర్వతములు పరస్పరము కొట్టుకొనినపుడు వెడలిన ధ్వనివలె గంభీరముగా వినపడెను.

అతి భయంకరమైన ఆ గాండీవధ్వని భూమిని చీల్చునదిగా నుండెను. నలుదిక్కుల ప్రచండవాయువు వీచెను. గొప్ప తోకచుక్క పడెను. దిక్కుల తేజస్సు మాసి అంధకారము వ్యాపించెను. రథముల ధ్వజములు ఆకాశము నందు అల్లాడెను. పెద్ద పెద్ద వృక్షములు కంపించెను. ఆ ధ్వని విని కౌరవులు 'ఎక్కడనుండియో పిడుగు వచ్చిపడెను' అని భయపడిరి.

అప్పుడు అర్జునునితో ఉత్తరుడిట్లనెను:-

"పాండవోత్తమా! నీవు ఒక్కడవే, సర్వశాస్త్ర పండితులైన యీ కౌరవ మహారథికులను యుద్ధమునందు ఎట్లు జయించగలవు? కౌంతేయా! నీవు అసహాయుడవే! కౌరవులో పరిపూర్ణ సహాయసంపత్తితో నున్నారు. నాకు భయము కలుగుచున్నది."

అప్పుడర్జునుడిట్లనెను:-

"భూమింజయా! భయపడకుము, ఘోషయాత్రయందు గంధర్వులతో యుద్ధము చేయుచుండిన నాకు ఎవరు సహాయకులుండిరి?

ఖాండవ దహన కాలమునందు దేవదానవులతో జరిగిన మహాయుద్ధమునందు నాకు ఎవరు సహాయకులుగా నుండిరి?

ఇంద్రుని సహాయార్థమై నేను మహా బలవంతులైన నివాత కవచ - కాలకేయాదులతోను 'పౌలోమ' రాక్షసులతోను పోరునప్పుడు నాకు ఎవరు సహాయము చేసిరి?

ద్రౌపదీ స్వయంవర కాలమునందు అనేక రాజులతో నేను పోరాడినప్పుడు ఎవరు నాకు సహాయకులుగా వచ్చిరి?

నా గురువైన ద్రోణాచార్యులు, ఇంద్రుడు, కుబేరుడు, యముడు, వరుణుడు, అగ్నిదేవుడు, గురువైన కృపాచార్యులు, భగవంతుడైన శ్రీకృష్ణుడు, పరమేశ్వరుడైన పినాకపాణి - ఈ మహాత్ములందరి యనుగ్రహమును సంపాదించినవాడను. అట్టి నాకు వీరొక లెక్కయా! వీరితో అవలీలగా యుద్ధము చేసెదను.

త్వరగా రథము నడుపుము. ఎన్నాళ్ళ నుండియో నన్ను దహించుచున్న నా మనోజ్వరము నేడు నశించిపోవుగాక!"

ఇట్లు చెప్పి వైశంపాయనుడు తరువాతి వృత్తాంతమును చెప్పదొడగెను:-

"జనమేజయా! అర్జునుడు ఉత్తరుని సారథిగా జేసికొని, శమీవృక్షమునకు నమస్కారములు చేసి, ఆయుధములను తీసికొని యుద్ధమునకు బయలుదేరెను.

ఆ రథమునుండి ఉత్తరుని సింహ ధ్వజమును తీసి, శమీవృక్షమూలము నందు ఉంచెను అర్జునునకు అగ్నిదేవుని యనుగ్రహముచేత లభించిన సువర్ణ ధ్వజమును స్మరించెను. దానిపైన మూర్తిమంతమైన వానరము చిహ్నముగా నుండెను. ఆ వానరము యొక్క పొడవైన తోక సింహము తోకవలె నుండెను. ఆ చెక్కేము విశ్వకర్మ చేత నిర్మింపబడినది.

ఆ రథము దైవమాయచేత ప్రభావితమై యుండును. అగ్నిదేవుడు అర్జునుని మనోభావమును తెలిసికొని ఆ ధ్వజమునందు ఉండుటకుగాను భూత ములకు ఆజ్ఞ యిచ్చెను.

ఆ తరువాత అంగోపాంగములచేతకూడి మిక్కిలి శక్తిమంతమైన ఆ దివ్య ధ్వజము, వెంటనే ఆకాశమునుండి అర్జునుని రథముపైన వ్రాలెను. అట్లువ్రాలిన ధ్వజమును చూచి అర్జునుడు ఆ రథమునకు ప్రదక్షిణనమస్కారములు గావించి రథముపైన కూర్చొని, ఉడుము తోలుతో చేయబడిన అంగుళిత్రాణములను (చేతి తొడుగులు) చేతివ్రేళ్ళకు తొడుగుకొనెను.

పిదప ఉత్తర దిక్కుగా ప్రయాణము సాగించెను. బిగ్గరగా తన శంఖ మును ఊదెను. ఆ ధ్వనికి శత్రువులకు భయము కలిగి గగుర్పాటు పొడమెను. అర్జునుని శంఖము చంద్రునివలె ప్రకాశించుచుండెను. దాని ధ్వని ప్రళయకాల మేఘధ్వనివలె నుండెను.

శంఖధ్వనిచేత, ధనుష్టంకారస్వనముచేత, ధ్వజమునందలి వానరము యొక్క సింహనాదముచేత, రథచక్రముల అకుల ధ్వనిచేత అర్జునుడు అచట నున్న సమస్త ప్రాణుల హృదయములందు అతి భయమును కలిగించెను.

ఆ శంఖ ధ్వనికి రథాశ్వాలు కూడ భయపడి నేలమీద మోకాళ్ళపై కూలబడెను. రథసారథియైన ఉత్తరుడుకూడ మిక్కిలి భయభ్రాంతుడై నొగల నుండి లేచి అర్జునుని ప్రక్క చేరి కూర్చుండెను.

అప్పుడు అర్జునుడు స్వయముగా గుఱ్ఱముల పగ్గములను లాగి రథమును నిలిపి ఉత్తరుని ఆలింగనము చేసికొని 'భయపడకుము' అని ఊరడించుచు నిట్లనెను:—

"రాజపుత్రా! నీవు క్షత్రియుడవు కదా! శత్రువుల మధ్య ఇట్లు భయపడ వచ్చునా? నీవు అనేక పర్యాయములు శంఖధ్వని, రణభేరి, దుందుభుల ధ్వని,

గజముల ఘీంకార ధ్వని వినియుందువు గదా! అట్టి నీవు ఈ శంఖధ్వని చేత సామాన్యునివలె వివవర్ణుడవై ఇట్లేల భయపడుచుంటివి?"

ఆ మాటలు విని ఉత్తరుడు ఇట్లనెను:-

"వీరోత్తమా! గొప్ప యుద్ధములందు శంఖాదిధ్వనులను ఎన్నియోసార్లు విన్నాను. కాని, యిటువంటి శంఖధ్వని పూర్వమెప్పుడుగూడ నేను వినియుండ లేదు. ఇటువంటి రూపముగల ధ్వజమునుగూడ చూచియుండలేదు. ఇట్టి ధను ష్టంకార ధ్వనియు నేను వినలేదు.

ఈ శంఖ - ధనుస్సుల ధ్వనుల చేతను ధ్వజమునందలి భూతముల అమానుష ధ్వనుల చేతను, రథచక్రధ్వని చేతను భయము కలిగి నా మనస్సు వ్యాకుల పడుచున్నది. ఈ ధ్వజముచేత దశదిశలు కప్పబడి నాకు ఏమియు తోచకున్నది. నా మనస్సుకు చాల బాధ కలుగుచున్నది. గాండీవ శబ్దముచేత నాకు చెవుడు వచ్చినది."

ఆ మాటవిని అర్జునుడు ఉత్తరునితో నిట్లనెను:-

"రాజకుమారా! నీవు రథముపైన దృఢముగా కూర్చొనుము. కాళ్ళుగట్టిగా నొగలకు బిగబట్టి యుండుము. దృఢముగా పగ్గములను పట్టుకొనుము. నేను మరల శంఖమును ఊదెదను."

అని చెప్పి జనమేజయా! అర్జునుడు మరల బిగ్గరగా శంఖము పూరించెను. అతడు పర్వతములను, పర్వతగుహలను, దశదిశలనూ చీల్చుచున్నాడా యనునంత ధ్వని వెడలజేసెను.

ఈసారి గూడ ఉత్తరుడు భయపడి రథములోనికిదూరి దాగి కూర్చొనెను. ఆ ధ్వనులన్నిటిచేత భూమి కంపించెను. అర్జునుడు మరల ఉత్తరుని శాంత పరచెను.

అప్పుడు ద్రోణాచార్యుడు కౌరవసేన యందుండి ఆ ధ్వనివిని యిట్లనెను:-

కౌరవసేనలో దుశ్శకునములు

"వీరులారా! మేఘ గర్జనము వంటి యీ రథ ధ్వని వింటిరి గదా! ఈ ధ్వనిచే భూమి కంపించుట చూచుచుంటిరి గదా! ఇట్టి ధ్వని అర్జునుని రథ ధ్వనియే కాని మరియొకనిదికాదు.

మన సేనలో ఎన్నియో అపశకునములు కలుగుచున్నవి చూడుడు, మన ఆయుధములు ప్రకాశించుటలేదు. గుఱ్ఱములు ప్రసన్నములుగ లేవు అగ్నులు జ్వలించుటలేదు. ఇది మనకు శుభము కాదు. మన గజములు, అశ్వములు సూర్యునికి అభిముఖముగా అరచుచున్నవి. మన ధ్వజములందు కాకులువచ్చి వాలి యున్నవి. ఇది మనకు శుభసూచకము కాదు. పక్షులు మన వామ భాగము నుండి యెగురుచు మహా భయమును సూచించు చున్నవి. నక్క మన సేనా మధ్యము నుండి, ఎవరును కొట్టకయే, యేడ్చుచు పోవుచున్నది. ఇదియు భయ సూచకమే.

కురు వీరులారా! మీ శరీరములందు భయముచేత గగుర్పాటు కలిగి నట్లు నాకు స్పష్టముగా తెలియుచున్నది. ఈ యుద్ధము కారణముగా క్షత్రియు లకు వినాశము తప్పక మూడియున్నట్లు స్పష్టమగుచున్నది. సూర్యాది గ్రహ ముల ప్రకాశము తగ్గియున్నది. భయంకరములైన మృగ పక్షులు మనకు ఎదురుగా వచ్చుచున్నవి.

క్షత్రియ వినాశకరములైన ఉత్పాతములు (అపశకునములు) అనేక విధములుగా భయంకరములైన నిమిత్తములు కనబడుచున్నవి.

దుర్యోధనా! ఇప్పుడు మనకు వినాశకరములైన నిమిత్తములు కనబడు చున్నవి. మండుచున్న ఉల్కలు (తోకచుక్కలు) నీ సేనను పీడించుచున్నవి. నీ గజాశ్వాది వాహనములు అప్రసన్నములై యేడ్చుచున్నట్లు కనబడుచున్నవి. సేనకు నలువైపుల గ్రద్దలు వాలియున్నవి.

అర్జునుని బాణములచేత పీడించబడిన సైన్యమును చూచు నీ మనస్సుకు సంతాపము కలుగగలదు సుమా! నీ సేన, యీ ధ్వని విని, యిప్పుడే తిరిగిపోవు చున్నది. ఒక్కడుగూడ యుద్ధము చేయుటకు ఇష్టపడకున్నాడు. అందరు నిరు త్సాహులై యున్నారు.

కాబట్టి గోవులను హస్తినాపురమునకు పంపించి, మన సేనను వ్యూహ ములుగా పన్ని శత్రువులను ఎదుర్కొనుటకు సంసిద్ధులము కావలెను."

"జనమేజయా! ద్రోణుని మాటలు విని దుర్యోధనుడు భీష్మ-ద్రోణ- కృపాచార్యులతో నిట్లనెను:-

"ఆచార్యులారా! నేను, కర్ణుడు ఈ విషయమును అనేక పర్యాయములు చెప్పియున్నాము. అయినను, దానినే మరల చెప్పెదను. ఎన్నిసార్లు చెప్పినను నాకు తృప్తితీరదు.

జూదమునందు ఓడినవారు, పన్నెండేడ్లు అడవియందు ప్రకటముగా నివసించునట్లును. తరువాత నొక యేడు ఒక పట్టణమునందు అజ్ఞాతముగా నుండునట్లును పందెము నిర్ణయించబడెను. ఇంకను పాండవులకు పదుమూడవ యేడు ముగియలేదు.

నేడు అర్జునుడు ప్రకటముగా మనకు కనబడెను. కాబట్టి పాండవులు మరల పన్నెండు సంవత్సరములు వనమందు నివసించవలెను.

పాండవులొకవేళ రాజ్యలోభముచేత తమ ప్రతిజ్ఞ మరచియుందురు. లేదా మనమే మోహముచేత పొరపడియుందుము.

ఈ పదుమూడవయేటి గడువునందలి ఎచ్చుతగ్గులు భీష్మునికి తెలిసి యుండును.

సాధారణముగా విషయనిర్ణయమునందు సందేహము కలుగుట సహజము. ఒకప్పుడు ఒకటి యనుకొనునది మరియొకటి కావచ్చును.

మనము మత్స్య దేశములయొక్క ఉత్తరభాగము నందున్న గోవులను పట్టుకొనుటకు వచ్చితిమి. విరాట సైనికులు వచ్చినచో యుద్ధము చేయదలచితిమి. ఇట్టి పరిస్థితియందు, ఒకవేళ అర్జునుడు మనతో పోరాడుటకు వచ్చినచో, మన లోపమేమి? అర్జునుని యెదుర్కొందుముగాక!

మత్స్య దేశములతో యుద్ధము చేయుటకు మనము స్వార్థము కొరకు రాలేదు. త్రిగర్తులకు సహాయము చేయుటకు వచ్చితిము.

మత్స్యదేశీయ సైనికులు చేసిన అత్యాచారముల నెన్నిటినో త్రిగర్తులు మాకు చెప్పియున్నారు. వారు చాల భయభ్రాంతులయి యుండుటచేత వారికి బాసటగా వచ్చుటకు మాట యిచ్చితిమి.

త్రిగర్తులు సప్తమీ తిథినాడు దక్షిణ గోగ్రహణము చేయవలెనని మాట్లాడు కొనియుంటిమి. వారు అలాగే చేసిరి.

మనము అష్టమీ తిథినాడు ఉత్తర గోగ్రహణము చేయవలెనని నిశ్చయించుకొంటిమి. దానికి కారణము, విరాటరాజు గోవులున్నచోటికి పోవుటకు త్రిగర్తులను తప్పక అనుసరించి యుండునని మా నిశ్చయము.

త్రిగర్తులు గోవులనైనను అపహరించి యుందురనియు, లేదా పరాజితులై యిక్కడ మాతో కలిసికొని మత్స్యరాజుతో యుద్ధమునైనను చేయుదురనియు తలచితిమి.

అథవా, మత్స్యరాజు త్రిగర్తులను ఓడించి పారద్రోలి, తన సైన్యముతో ఈ రాత్రి యిక్కడికైనను మనతో యుద్ధము చేయుటకు వచ్చునని కూడ తలచి యుంటిమి.

మత్స్య సైనికులలోనే యితడొక మహావీరుడై యుండును. లేదా మత్స్య రాజే స్వయముగా మనను జయించుటకు వచ్చియుండును.

ఇంత యెందుకు? విరాటరాజే రానీ, లేక అర్జునుడే రానీ, మనము తప్పక యుద్ధము చేయవలసినదే. ఇది నా ప్రతిజ్ఞ.

ఇట్టి పరిస్థితిలో మహారథికులైన భీష్మ - ద్రోణ - కృప - వికర్ణ - అశ్వత్థామాదులు భ్రాంత చిత్తులై తమ తమ రథములందు ఎందుకు ఊరక కూర్చుని యున్నారు? ఇప్పుడు యుద్ధము చేయుట తప్ప వేరొక కార్యము వలన మనకు శ్రేయస్సు లేదు. కనుక అందరు ఆత్మ విశ్వాసముతో జాగ్రత్తగా నుండవలెనని కోరుచున్నాను.

మననుండి యిప్పుడు గోధనమును లాగుకొని పోవుటకు సాక్షాత్తు ఇంద్రుడే వచ్చినను, యముడే వచ్చినను వారితో యుద్ధము చేయక, మనలో నెవడు తిరిగి హస్తినాపురికి పోవును?

ఒకవేళ ప్రాణరక్షణకై పదాతి దళమువారు వనమునకు పారిపోదలచినచో నా బాణముల చేత వారిని ముక్కలు ముక్కలుగా ఖండించెదను. అశ్వికులు ఒకవేళ తప్పించుకొనవచ్చు గాని, కాల్బలము నా బాణములను తప్పించుకొనజాలదు."

దుర్యోధనుని మాటలు విని కర్ణు డిట్లనెను

కర్ణుని అభిప్రాయము

"రాజా! ఈ విషయమునందు ద్రోణాచార్యుల మాటలు లెక్కచేయక, విజయమును సాధించు నీతిని అవలంబించుము. ఈయన పాండవుల యెడల నభిమానము చేత మనను భయపెట్టుచున్నాడు. అర్జునుని యందు ఈయనకు ప్రీతి యెక్కువయని నాకు స్పష్టమగు చున్నది. మనపైన దాడి చేయుచు వచ్చు చున్న అర్జునుని చూచి ప్రశంసించుచున్నాడు. మన సేన చెదరిపోకుండునట్టి నీతిని నీవు ఆశ్రయింపుము. అర్జునుని గుఱ్ఱముల సకిలింతలు వినగనే యీ ద్రోణాచార్యులు భయపడి పోవును.

మన మిప్పుడు విదేశము నందు ఉన్నాము. ఇది అరణ్యము, గ్రీష్మ కాలము, శత్రువుల వశము నందున్నాము. కనుక ఇట్టి సంకట సమయమునందు ఈయన మాటలు విని, పారిపోయిన సైనికులకు విశ్రాంతి కలుగకుండు నీతిని నీవిప్పుడు అవలంబించవలసి యున్నది.

ద్రోణాచార్యులు పాండవులను సర్వదా తనకు అతిప్రియులుగా భావించు చుండును. పాండవులు తమ స్వార్థమును సాధించుటకే ద్రోణాచార్యులను నీవద్ద ఉంచినారు. ఈయన వారినిగూర్చి చెప్పుమాటల వలన గూడ నా యభిప్రాయము రుజువగుచున్నది. కేవలము గుఱ్ఱముల సకిలింతలు విని యెవడైన అర్జునుని ప్రశంసించునా? అవి ఒకచోట నిలిచియున్నను, నడచుచున్నను సకిలించు చుండును. అది వాటి స్వభావము. దానితో వాటి యజమానుని పరాక్రమమునకు సంబంధమేమి?

సర్వదా వాయువులు వీచుచుండును. ఇంద్రుడు వాన కురియుచుండును. మేఘములు ఉరుముచుండును అలాగే ఇప్పుడు గుఱ్ఱములు సకిలించినవి. దానితో అర్జునునకు సంబంధ మేమి? అంతమాత్రముననే యీ యాచార్యుడు అతనిని ప్రశంసించుట యెందుకు? ఈ ప్రశంసకు కారణము ఈయన అర్జునుని యందలి ప్రేమచే నతనిని పొగడుట, మనయెడల కోపముచేత మనను ద్వేషించుటయే తప్ప మరియే యితర కారణము నాకు గోచరించదు.

రాజా! ఆచార్యులు మహాదయాళువులు, బుద్ధిశాలురు, పాప కార్యమును తలపెట్టనివారుగా నుందురు. కాబట్టి యిట్టి సంకటములు ఏర్పడినప్పుడు వారితో సంప్రదించి ఉపాయమును అడుగకూడదు.

పండితులు సుందర రాజ మందిరమందును, సభల యందును కూర్చొని చిత్ర విచిత్ర కథలు చెప్పి శ్రోతలకు ఆనందము కలిగించుటయే వారికి శోభ నిచ్చును.

జనసముదాయము నందు మందిరములందును సభలయందును ఉద్యాన వనము లందును ఆశ్చర్యజనకములైన అనేక వినోద కార్యములను చేయుట, యజ్ఞములందలి ఉపకరణములను (పనిముట్లు) గూర్చి చర్చించుట పండితులకు శోభాకరముగా నుండును. ఇతరుల రంధ్రములను (లోపములను) కనిపెట్టు చుందురు.

మనుష్యుల దినచర్యలను నిర్ణయించుట యందు, అశ్వ రథ ప్రయాణము లకు శుభముహూర్తములను చూచుటయందు, గాడిదలు, ఒంటెలు, మేకలు, గొర్రెలు మొదలైన జంతువుల గుణదోష విచారమునందు - వాటి చికిత్సయందు, గోవుల సంపాదన - రక్షణములందు, ఇండ్లకు వాకిండ్లకు శుభ సంస్కార కార్య ములు చేయించుట యందు, అన్నము కేశ కీటాదులచే అపవిత్రమైనప్పుడు దానికి సంస్కారము నిర్ణయించుట యందును పండితుల అభిప్రాయము అడిగి తెలిసి కొనుట శోభాకరము.

కనుక రాజా! శత్రువులను ప్రశంసించు పండితులను దూరముగ నుంచి, శత్రువు వధింపబడుటకు తగిన ఉపాయమును గూర్చి యోచింపుము. మనము పట్టుకొనిన గోవులను నడుమ ఉంచి నలువైపుల సైన్యమును కాపుదలకై ఉంచి, వాటిని జాగ్రత్తతో రక్షించుకొనుచు, శత్రువులతో యుద్ధము చేయు విధానమును యోచింపుము."

జనమేజయా! ఇట్లు చెప్పి కర్ణుడు, అంతటితో ఆగక యింకను ఇట్లనుచున్నాడు:-

కర్ణుని అహంకారము-ఆత్మ ప్రశంస

"రాజా! అందరును ఇప్పుడు భయపడుచు యుద్ధమునందు మనస్సులేక చంచలముగా నున్నట్లు కనపడుచున్నారు. ఒకవేళ మత్స్యరాజు వచ్చినను, అర్జు నుడే వచ్చినను సముద్ర వేగమును ఒడ్డు అడ్డుకొనునట్లుగా నేను వారిని నివా రించెదను. నా ధనుస్సు నుండి విడువబడిన బాణములు సర్పములవలె సరసర ముందుకు సాగి శత్రువుల ప్రాణవాయువును పీల్చునే కాని తిరిగిరావు.

బాహుబలశాలినైన నా చేత ప్రయుక్తములైన బాణములు అర్జునుని, వృక్షమును మిడతలవలె కప్పగలవు. నారియందు సంధించి నేను బాణములను విడుచునప్పుడు నా కరతలముల నుండి ధ్వని, భేరీధ్వనివలె బయలు వెడలును అందరు వినుడు.

అర్జునుడు పదుమూడేండ్లుగా యుద్ధ కర్మలు వీడి శాంతముగా నుండెను. ఇప్పుడు అత్యుత్సాహముతో, యుద్ధమునందు స్నేహము గలవాడై వచ్చి నన్ను బాణములతో కొట్టగలడు.

ధర్మిష్ఠుడైన బ్రాహ్మణుడు దానమునకు పాత్రుడైనట్లు, గుణవంతుడైన అర్జునుడు నేడు నా బాణదానమును స్వీకరించుగాక! నేను సత్పాత్రదానము చేసెదను.

మహా ధనుర్ధారియైన యీ యర్జునుడు మూడు లోకములందును మహా వీరుడని ప్రసిద్ధి చెందినవాడు. నేను గూడ అతనికి ఏ మాత్రము తీసిపోను.

గ్రద్దల రెక్కలతో గూడిన మా యిరువురి సువర్ణ బాణములు నేడు ఆకాశమునందు మిణుగురు పురుగులవలె వ్యాపించును, చూడుడు. నేను నేడు అర్జునుని సంహరించి దుర్యోధనునకు చేసిన ప్రతిజ్ఞా ఋణమును అక్షయముగా తీర్చుకొనెదను.

నడుమనే చూర్ణము చేయబడిన మా యిరువురి బాణ ఖండములు ఆకాశమునందు మిడుతలవలె ఎగురుచుండగా మీరందరు చూడగలరు.

ఇంద్ర సమాన పరాక్రమవంతుండైన అర్జునుని నేను, ఇంద్రుని వజ్రాయుధమువంటి నా బాణములు చేత, కౌరవుల చేత ఏనుగును పీడింప జేసినట్లు, బాధించెదను చూడుడు.

సర్వ శస్త్రాస్త్ర కోవిదుడు, మహారథికుడునైన అర్జునుని నేడు వివశుని జేసి రథము నుండియే, గరుత్మంతుడు సర్పమునువలె, పట్టుకొనెదను.

అగ్నివలె చేరరానివాడై, ఖడ్గము-శక్తి-బాణము మొదలైన ఆయుధములే యింధనములై ప్రజ్వరిల్ల జేయుచుండగా, మండుచు శత్రువులను దహించుచున్న అర్జునాగ్నిని, నేను నేడు మహామేఘమై, చల్లార్చెదను.

ఆ కార్యమునందు నా యశ్వముల వేగమే మహా వాయువుగా, నా రథ ధ్వనులే ఉరుములుగా, నా బాణములే వర్షధారలుగా నాకు తోడ్పడగలవు.

నేడు నా ధనుస్సు నుండి విడువబడిన బాణములు విష సర్పములవలె అర్జునుని శరీరమను వల్మీకము (పుట్ట) లోపలికి దూరునుగాక!

కర్ణికార పుష్పములు (కొండగోగు పువ్వులు) పర్వతములపైన వ్యాపించి నట్లు నా బాణములు అర్జునుని శరీరమును కప్పివేయగలవు, చూడుడు.

ముని శ్రేష్ఠుడైన పరశురాముని సేవించి నేను సంపాదించిన అస్త్ర బల మునకు నా పరాక్రమము తోడుకాగా దేవేంద్రునితోనైనను పోరగలను.

అర్జునుని ధ్వజాగ్రమునందున్న వానరమును నా బల్లెము చేత కొట్టె దను. అది భయంకరముగ అరుచుచు నేడు క్రింద పడుగాక! అర్జునుని ధ్వజము నందున్న భూతములు నేడు నా యాయుధములచే బాధింపబడి దశదిశల పరుగెత్తుచుండగా అంతటను వాటి అరపులు వ్యాపించుగాక!

నేడు నేను రథము నుండి అర్జునుని పడగొట్టి దుర్యోధనుని హృదయము నందు చాల కాలమునుండి ఉన్న శల్యము మొదలంట పెరికివైచెదను.

పౌరుషముగల అర్జునుని అశ్వములను గూల్చి విరథుని జేసెదను. అప్పుడు కోరలు పెరికిన సర్పమువలె బుస కొట్టుచు నిలుచున్న యతని యవ స్థను కౌరవులు చూచెదరుగాక!

లేదా కౌరవులు నేడు గోధనమును తీసికొని యథేష్టముగా పోవుదురుగాక లేదా, వారు తమ రథములందే కూర్చొని అర్జునునితో నేను చేయు యుద్ధమును వినోదముగా చూచెదరుగాక, వారికి యుద్ధముతో ప్రమేయము ఉండదు. వారిని నేను అసహాయుడనై గెలిపించుట తథ్యము."

ఇట్లు బింకములు పలికిన కర్ణుని మాటలు విని కృపాచార్యులు ఆతనితో నిట్లనెను:-

కృపాచార్యుల యభిప్రాయము

"రాధానందనా! యుద్ధము విషయమునందు నీ బుద్ధి సర్వదా క్రూరముగా నుండును. కార్యముల స్వరూపమును, వాటి పరిణామమును నీ వెరుగవు.

నేను శాస్త్రములను ఆలోచన చేసి అనేక కపటకృత్యములు తెలిసికొని నాను. అన్నిటిలోను యుద్ధము అతి పాపిష్ఠమైన కృత్యమని ప్రాజ్ఞులు చెప్పినారు.

దేశ కాలముల ననుసరించి చేయబడు యుద్ధము విజయమును చేకూర్చును. కాని, ఉపయుక్తము కాని కాలమునందు, దేశమునందు చేయబడు యుద్ధము సఫలము కాదు. తగిన దేశకాలములయందు ప్రదర్శింపబడు పరాక్రమము శుభ పరిణామము నిచ్చును.

రథకారుడు చెప్పు మాటలనే ఆధారము చేసికొని దేశ కాలములను విచారించకుండ యుద్ధాదులు నిశ్చయింపబడకూడదని పండితులు చెప్పెదరు.

(రథములను నిర్మించువాడు - సూతజాతివాడు - కర్ణుడు ఆ జాతివాడు కనుక ఈ శబ్దము కర్ణుని గూడ ఆక్షేపించుచున్నది.

రథమును నిర్మించువాడు తాను నిర్మించిన రథమును తెచ్చి 'నేను ఈ దివ్యమైన రథమును నిర్మించినాను. దీని ప్రతి యవయవము దృఢముగా నున్నది. దీనిపైన కూర్చొని యుద్ధము చేసినచో దేవతలను గూడ జయించవచ్చును అని చెప్పిన మాటల పైననే విశ్వాసము ఉంచి బుద్ధిమంతుడైనవాడు యుద్ధమునకు సన్నద్ధుడు కాడుగదా!

ఆ విధముగానే కర్ణా! నీవు గూడ రథకార జాతి వాడవే కనుక, నీ ప్రగల్భములనే నమ్మి దేశకాలాదులను విచారించకుండ మేము యుద్ధమునకు సన్నద్ధులమగుట మంచిది కాదు." అని కృపాచార్యుల అభిప్రాయము)

ఎంత విచారించినను, అర్జునునితో యుద్ధము చేయుట మనకిప్పుడు ఎంత మాత్రము ఉచితముకాదు.

ఎందుకనగా, అతడొక్కడే మన నందరిని గూడ ఓడించగలడు. అతడు ఒంటరిగానే ఉత్తర కురుదేశములను జయించెను. అసహాయుడుగానే శత్రువుల నందరిని ఓడించి, ఖాండవ వనమును దహించి అగ్నిదేవుని తృప్తిపరచెను.

అతడు ఒక్కడుగానే కఠినమైన తపస్సు చేయుచు ఐదేండ్లు బ్రహ్మచర్యముతో నుండెను. ఒక్కడే సుభద్రను అపహరించి రథముపైన తీసికొనిపోయెను. శ్రీకృష్ణుని గూడ ద్వంద్వ యుద్ధమునకు ఆహ్వానించెను. ఒక్కడుగానే కిరాత వేషమునందున్న పరమేశ్వరునితో యుద్ధము చేసెను.

ఈ వనమునందే సైంధవుడు ద్రౌపదిని అపహరించినప్పు డతడొక్కడే జయద్రథుని (సైంధవుని) జయించి ద్రౌపదిని విడిపించుకొని తెచ్చెను. ఒక్కడే

స్వర్గలోకము నుండి ఇంద్రునివద్ద అస్త్రవిద్యను ఐదేండ్లు అభ్యసించెను. అతడొక్కడే శత్రువులను జయించి కురువంశ కీర్తిని పెంచెను.

ఘోష యాత్రయందు, అర్జును డొక్కడే గంధర్వ సేన నెదుర్కొని, జయించి, గంధర్వ రాజగు చిత్రసేనుని ఓడించి దుర్యోధనుని విడిపించెను.

దేవతలకు అజేయులైన నివాత కవచ కాలకంజాది రాక్షసుల నొక్కడే వధించి యింద్రునకు సహాయము చేసెను.

కర్ణా! నీవెప్పుడైన ఒంటరిగా ఈ ప్రపంచమునందు ఏదైనను పురుషార్థమును సాధించితివా, చెప్పుము? పాండవు-లో నొక్కొక్కరే వేర్వేరు దిక్కులకు పోయి అక్కడి రాజులకు జయించి వశపరచుకొనిరి. నీవు గూడ ఎప్పుడైనను అట్టి కార్యమును చేసితివా, చెప్పుము?

ఇంద్రుడు గూడ అర్జునునితో యుద్ధము చేయజాలడు. అట్టి అర్జునునితో, ఒక్కడే యుద్ధము చేయబూనుకొనువాడు పిచ్చివాడు కాడా? అట్టి పిచ్చికి మందు పెట్టుట అవసరము

కర్ణా! అర్జునునితో నీవు ఒంటరిగా యుద్ధము చేయబూనుట యెట్టిదనగా క్రోధముతో నున్న విషసర్పము నోటిలోకి కుడిచేతి చూపుడు వ్రేలును దూర్చి దాని విషపు కోరలను పెరుకబూనుట వంటిదని తెలిసికొనుము.

అడవియందు ఒంటరిగా తిరుగుచు నీవు, ఒక మదపుటేనుగుపైన చేతిలో అంకుశము లేకుండ ఎక్కి నగరమునకు రాబూనుకొనుట వంటిది యగును- నీవు ఒంటరిగా అర్జునుని జెనక జూచుట సుమా!

ఇంకను నెట్టి దనగా, నీ శరీరమంతయు నేయి పూసికొని నారవస్త్రములను ధరించి, నేయితోను, క్రొవ్వుతోను జ్వలించుచున్న అగ్ని మధ్యమున నడచిపోవుటవంటిది.

మెడకు పెద్దరాయి కట్టుకొని సముద్రములో దుమికి బాహువుల సహాయముతో సముద్రమును ఈద బూనుటగూడ ఒక పురుషార్థమగునా? అది మూర్ఖత్వమే యగును గదా!

కర్ణా! శస్త్రాస్త్ర విద్యలు నేర్వని దుర్బల పురుషుడు, శస్త్రాస్త్ర విద్యల యందు ప్రవీణుడైన యర్జునునివంటి బలశాలితో యుద్ధము చేయబూనినచో, అట్టివాని బుద్ధి నశించినదని తెలిసికొనవలెను.

మనము పాండవులను పదుమూడేండ్లు వనవాస - అజ్ఞాత వాసవ లందుంచి, ఎన్నియో అపరాధములను చేసితిమి. ఇప్పుడు వారు ప్రతిజ్ఞాబంధవ నుండి విముక్తులైనారు. కనుక కట్లుపీడిన సింహములవలె వారు మనను నశిం జేయకుందురా?

కూపమునందు జ్వలించుచున్న అగ్ని నుండి తప్పించుకొని పోవుటకు వీ కలుగునా?

ఇప్పుడు మనము ఏకాంతమునందు అర్జునుని బారిలో పడితిమి. సంకట వస్థ యేర్పడినది. కనుక మన మందరము ఏకమై యుద్ధోన్మాదముతో మనపై వచ్చుచున్న అర్జునునితో యుద్ధము చేయుదము.

సైనికులు ఆయుధములను ధరించి సిద్ధముగా నుందురుగాక! సేనన వ్యూహముగా పన్నుదము. అందరము కలిసి ఒక్క పెట్టున పోరాడుటక సిద్ధము కావలెనని నా యభిప్రాయము.

నీవు, నేను, ద్రోణ-భీష్మ-దుర్యోధన-అశ్వత్థామాదులమై మనమందరమ కలిసికట్టుగా చేరి అర్జునునితో పోరాడుదము.

కర్ణా! నీవు సాహసము చేసి ఒక్కడవే పోవకుము. మనము అరుగురమ రథికులమై ఏకముగా కలిసి యున్నప్పుడే యింద్రునివలె మనపైన దాడిచేయు అర్జునునితో యుద్ధము చేయుటకు మనకు సాధ్యమగును.

సేనను వ్యూహములుగా పన్ని, మనమందరము జాగ్రత్తలో నుండినప్పుడే దానవులు ఇంద్రుని నెదుర్కొనునట్లు అర్జును నెదుర్కొనజాలుదుము."

జనమేజయా! కృపాచార్యుల మాటలు కురు వీరులందరు సావధానముగా వినిరి.

అప్పుడు అశ్వత్థామ యిట్లనెను:-

అశ్వత్థామ యభిప్రాయము

"కర్ణా! ఇంకను మనము గోవులను గెలుచుకొననేలేదు. మత్స్యదేశపు ఎల్లలనుండి దాటిపోలేకున్నాము. హస్తినాపురమును చేరలేదుగదా? నీవెన్నియో ప్రగల్భములు, ఆత్మస్తుతులు మాట్లాడుచున్నావు.

విజ్ఞానులు, అనేక యుద్ధములందు శత్రువులను జయించియు, అపార ధనమును సంపాదించియు, శత్రుసేనను కూల్చియు ఏ మాత్రము తమ పౌరుషమును గూర్చి ప్రశంసించుకొనరు. ఎందుకిట్లు వ్యర్థముగా మాట్లాడెదవు?

అగ్ని యేమి మాట్లాడకయే అన్నిటిని కాల్చి భస్మము చేయును. సూర్యుడు మౌనముతో నుండియే జగత్తు సంతతిని ప్రకాశింపజేయుచున్నాడు. భూమి యీ చరాచరాత్మకమైన ప్రపంచమును ఏమియు పలుకకుండనే మోయుచున్నది. వీటిలో నేదికూడ తన పరాక్రమమును గూర్చి ప్రశంసించుకొనుట లేదు, చూచితివా?

కర్ణా! లోకమునందు మహా భాగ్యవంతులైన పురుషులు, శాస్త్రాను సారముగా నడచుకొనుచు న్యాయ-ధర్మమార్గములలో రాజ్యమును సంపాదించియు అత్యంత గుణహీనులైన గురుజనులను గూడ సత్కరించెదరు.

(ఈ సందర్భమునందు రాజ్యము అన్యాయ మార్గమునందు జూదముతో సంపాదింపబడినది. ఇక్కడి మీ గురుజనులో అత్యంత గుణవంతులు. అట్లుండియు మీ వంటి వారి చేత వారికి తిరస్కారము జరుగుచున్నదని అశ్వత్థామ, తన తండ్రిని కర్ణుడు అధిక్షేపించినందుకు సూటిగా మర్మములకు తగులునట్లు అధిక్షేపించుచున్నాడు)

రాధేయా! జూదమునందు గెలుచుకొనబడిన రాజ్యము చేత ఏ క్షత్రియుడైనను సంతుష్టిచెందునా? కాని, యీ దుర్యోధనుడు క్రూరుడు, దయలేనివాడు కాబట్టి యిట్టి రాజ్యముతోనే సంతోష పడుచున్నాడు.

ఒక కిరాతుడు కపట వృత్తితోను, వంచనా వృత్తితోను, తన బ్రతుకును గడుపుకొనుచున్నట్లుగా, కపట వృత్తితో ధనమును సంపాదించి కూడ, బుద్ధిమంతుడైన వాడెవడు తనను తాను పొగడుకొనును?

"దుర్యోధనా! నీవు ఏ పాండవుల ధనమును కపటవృత్తితో లాగుకొంటివో, వారిలో అర్జునుని గాని, నకులునిగాని. లేక సహదేవునిగాని, ద్వంద యుద్ధమునందు ఓడించితివా?

యుధిష్ఠిరునిగాని, భీమసేనునిగాని నీవు ఏ యుద్ధమునందు జయించితివి?

ఇప్పుడు నీవు అధికారము వహించియున్న యింద్రప్రస్థ నగరమును ఏ యుద్ధమునందు గెలుచుకొంటివి?

నీవు ద్రౌపదిని ఏ యుద్ధమునందు జయించుకొని నిండుకొలువునందు, ఏకవస్త్ర - రజస్వలయైన యామెను ఈడ్చుకొని తెచ్చితివి?

కర్ణా! ధనేచ్ఛగలవాడు చందన వృక్షమును సమూలముగా ఖండించినట్లు, నీవు, దుర్యోధనుడు మాయాజూదము ద్వారా, ద్రౌపదిని అవమానపరచుటద్వారా పాండవులను మొదలంట పెరికితిరి.

పాండవులను మీరు బానిసలుగా చేసినప్పుడు మహాత్ముడైన విదురుడు 'జూదము కురుకుల సంహారమునకు కారణమగును' అని చెప్పిన మాటలు జ్ఞాపకము నందున్నవి కదా!

మనుష్యుడు గాని, యితర జంతువులేవైనగాని, చివరకు పురుగులుగాని, అన్ని గూడా తమ తమ శక్తి ననుసరించి ఓర్పు వహించుచుండును. ఓర్పునకు ఒక పరిమితి ఉండును. ద్రౌపదికి మీరు చేసిన అవమానము - కష్టములను, అర్జునుడు ఓర్చుకొని మిమ్ము ఎప్పుడుగూడ క్షమించడు.

కర్ణా! ధార్తరాష్ట్రుల నాశముకొరకే అర్జునుడు పుట్టెను. నీవేమో పండితునివలె పెద్ద పెద్ద మాటలను ఆడుచున్నావు!

శత్రుత్వమునకు ప్రతిక్రియ చేయదలచిన అర్జునుడు, మనలో నెవ్వరిని గూడ మిగిలించకుండ సంహరించగలడు.

అతడు భయభ్రాంతుడై దేవాసుర గంధర్వరాక్షసాదులతో యుద్ధము చేయడనుమాట కల్ల.

గరుత్మంతుడు కాలుపెట్టిన ప్రతి వృక్షమును కూల్చివేయునట్లు, అర్జునుడు క్రోధావిష్టుడై తానెదుర్కొనిన శత్రువుల నందరిని నాశము నొందించియే ముందుకు సాగును.

కర్ణా! అర్జునుడు నీకంటే పరాక్రమమునందు ఎంతయో అధికుడు. ధనుర్యుద్ధమునం దతడు దేవేంద్రునికి సమానుడు. యుద్ధ విద్యయందు సాక్షాత్తు శ్రీకృష్ణునకు ఈడైనవాడు. అట్టి అర్జునుని ఎవడు ప్రశంసించడు?

అర్జునుడు దేవతలతో దేవోచితముగాను, మనుష్యులతో మనుష్యోచితము గాను యుద్ధము చేయగలడు. ఏ యస్త్రమును శత్రువు తనపైన ప్రయోగించినను, దానికి తగిన ప్రతీకారాస్త్రమును ప్రయోగించి దానిని అణచును. అట్టి అర్జునునకు ఈడైన వాడెవడున్నాడు?

ధర్మజ్ఞులు, పుత్రుని తర్వాత పుత్రుని వంటివాడు శిష్యుడని చెప్పుదురు. పూర్వకారణములే కాక, యీ కారణముచేత గూడ, అర్జునుడు ద్రోణాచార్యులకు ప్రియుడు.

దుర్యోధనా! నీవు పూర్వము జూదము నాడినట్లే, ఇంద్ర ప్రస్థమును హరించినట్లే, ద్రౌపదిని సభలోకి ఈడ్చినట్లే, ఇప్పుడు అర్జునునితో యుద్ధము చేయుము.

(నీవు అన్యాయములు చేయు సమయమునందు, మా సహాయము నీకు అక్కరలేకుండినట్లుగానే, యిప్పుడుగూడ మా సహాయమును నీవు ఆశించకుము అని భావము).

ప్రాజ్ఞుడు, క్షాత్ర ధర్మమును బాగుగా నెరిగినవాడునైన యీ నీ మేనమామ ఉన్నాడే, ఆ జూదరియైన శకునియే యిప్పుడు యుద్ధము చేయుగాక! గాండీవ ధనుస్సు 'ద్వాపరము-త్రేత' అను పాచికలను విడువదు. అది తీక్ష్ణములై జ్వలించుచున్న బాణములను ఏకధారగా వర్షించును.

గాండీవ నిర్ముక్తములైన వాడి బాణములు, నడుమనే నిలువక, పర్వతములు అడ్డువచ్చినను చీల్చివేయును. కనుక గ్రద్ద రెక్కలతో ప్రకాశించు అర్జునుని బాణములు శత్రువుల యెదల దూరిపోవక నిలువవు సుమా!

"దుర్యోధనా! 'యముడు, ప్రళయకాలవాయువు, ప్రళయాగ్ని' యివి యేవియు ప్రపంచమును పూర్తిగా నశింపజేయక ఒకవేళ కొంచెము మిగిలించునేమో కాని, క్రుద్ధుడైన అర్జునుడు మాత్రము అణువణువును గూడ నశింపజేయును సుమా!

నీవు పూర్వము శకుని మామ సహాయముతో జూదమాడినట్లే యిప్పుడు గూడ అతని సహాయముతోనే యుద్ధము చేయుము. (ఇతరుల సహాయమును ఆశించకుము అని భావము).

ఇతర యోధులకు ఇష్టముండినచో వారు యుద్ధము చేయుదురుగాక, నేనైతే అర్జునునితో యుద్ధము చేయను.

మాకు మత్స్యరాజుతో యుద్ధము చేయవలసి యున్నది. అతడొకవేళ ఈ గోవులను విడిపించుకొనుటకు యుద్ధసన్నద్ధుడై వచ్చిన యెడల, అతనితో నేను యుద్ధము చేయగలను."

ఆ మాటలు విని, జనమేజయా! భీష్ముడు ఇట్లనెను :-

"దుర్యోధనా! అశ్వత్థామ మాట బాగుగ నున్నది. కృపాచార్యుల అభిప్రాయముగూడ సరిగనే యున్నది.

కర్ణుడు కేవలము క్షత్రియ ధర్మముచేత యుద్ధము చేయగోరుచున్నాడు. విజ్ఞుడెవడు గూడా ఆచార్యుని నిరసించి తిరస్కరించగూడదు.

దేశకాలములను గనిపెట్టి యుద్ధము చేయుట మేలని నాయభిప్రాయము. మంచి శస్త్రకోవిదులై, సూర్యుని వలె తేజరిల్లుచున్న తన శత్రువులు ఐదుగురు అభ్యుదయము చెందుచుండగా, విద్వాంసుడు మోహము చెందకుండ నెట్లుండగలడు? ఎంతటి ధర్మాత్ముడైనను స్వార్థమును యోచించునపుడు మోహపరవశుడుగా యుండును.

(కనుక రాజా! నీ కిష్టమైనచో నేనొకమాట చెప్పెదను వినుము. కర్ణుడు నీ పరాక్రమమును ఉత్సాహమును పెంపొందించుటకుగాను నీతో నట్లనెను. ఆచార్య పుత్రుడు క్షమించుగాక, ఇప్పుడు చాల గొప్ప కార్యము మనము చేయవలసియున్నది. ఇప్పుడు అర్జునుడు వచ్చియున్నాడు. కనుక మనలో విరోధము తగదు. ద్రోణాచార్యులు, కృపాచార్యులు ఇప్పుడు మీ తప్పున్ని క్షమించవలెను.

సూర్యుని యందు తేజస్సు, చంద్రునియందు కాంతి సర్వదా ఉండును. అవి యెప్పుడుగూడ వారిలో తగ్గనట్లే, మీయందుండు అస్త్ర విద్యా నైపుణ్యము గూడ అక్షీణముగా నున్నది.

కనుక ఆచార్యులారా! మీయందు బ్రాహ్మణత్వము, బ్రహ్మాస్త్రము రెండు గూడ సర్వదా ప్రతిష్ఠితము లైయున్నవి. ఒకవైపు చతుర్వేద పాండిత్యము, మరి యొక వైపు క్షాత్ర తేజస్సు ఈ యిరువురి యందున్నవి.

బ్రహ్మతేజస్సు, క్షాత్ర తేజస్సు ఈ రెండున్ను భరతవంశ గురువులైన ద్రోణ-కృప-అశ్వత్థామల యందున్నవి. ఈ గుణములు మరి యితరు లందెవరి యందును కానరావు ఈ యుభయ శక్తులకు ఏకత్రసమావేశము దుర్లభమని నా దృఢవిశ్వాసము.

"రాజా! వేదాంత - పురాణ - ప్రాచీనేతిహాసాది విద్యలయందు ద్రోణాచార్యుల కంటె మించినవాడు, ఒక పరశురాముడు దప్ప, మరియొకడెవడున్నాడు?

బ్రహ్మాస్త్రములు, వేదములు ఈ రెండు మహిమలు మరియొకని యందు లేవు. కనుక ఆచార్య పుత్రుడిప్పుడు ఓర్పు వహించి యుండవలెను. మనలో మనకు విరోధమునకిది సమయముకాదు. మన మందరము ఒకటిగా చేరి, మనపై వచ్చిన అర్జునునితో పోరాడుదము.

మనీషులైన విద్వాంసులు సేనా నాశమునకు అంతరంగ విరోధమే ముఖ్య కారణమని, ఇది మహా పాపమనియు చెప్పినారు."

ఈ మాటలు విని అశ్వత్థామ యిట్లనెను:

"పురుష శ్రేష్ఠా! న్యాయోచితములైన మాటలను నిందించగూడదు. ద్రోణాచార్యులు, పాండవుల యెడల పూర్వము జరిగిన అన్యాయములను స్మరించి కోపముతో నర్జునుని గుణగణములను వర్ణించెను అంతియేకాని, మనలో మనకు భేదము కల్పించుటకు చెప్పలేదు.

గుణములు శత్రువు నందున్నవైనను కీర్తించుట నీతిమంతుల లక్షణము. గురువైన వాడు సర్వ ప్రయత్నముల చేతను, తన పుత్రునకు, శిష్యునకు హిత మేదియో దానినే చెప్పవలెను. ఆ గురువు తన పుత్రుడని పక్షపాతముతో వ్యవహరించడు".

అది విని దుర్యోధనుడు ఇట్లనెను :-

"ఆచార్యులిప్పుడు క్షమింతురుగాక. శాంతించవలెనని ప్రార్థించుచున్నాను. గురువుల మనస్సు నందు భేద భావము లేదనియు, వారు పాండవుల యెడల కలిగిన అన్యాయమువలన కోపము చేతనే పూర్వ మీ మాటలన్ని చెప్పినారనియు వారి ప్రవర్తన వలననే తెలియ వచ్చినది."

ఇట్లు చెప్పి "జనమేజయా? దుర్యోధనుడు క్షమించ వలసినదని ఆచార్య ద్రోణ - కృప - భీష్మ - కర్ణులను ప్రార్థించెను.

అప్పుడు ద్రోణాచార్యులు భీష్మునితో యిట్లనెనని వైశంపాయనుడు మర నిట్లనెను:-

"భీష్ముడు తొలుత చెప్పిన మాటలతోనే నేను శాంతించితిని. ఇప్పుడ మనమనుసరించ వలసిన నీతిని గూర్చి విచారించుదము

అర్జునుడు సాహసించి దుర్యోధనుని చుట్టుముట్టకుండునట్టి యుపాయమున యోచించ వలసియున్నది. వనవాసపు గడువు పూర్తికాకుండ అర్జునుడు మనక కనపడడు. ఇప్పుడు గోధనమును మరలించి తీసుకొని పోకుండ మనను క్షమిం విడువడు

ఇట్టి పరిస్థితియందు అర్జునుడు ధృతరాష్ట్రపుత్రులపై దాడి సలుపకుండు నట్లు ఒక ఉపాయము నాలోచించవలసి యున్నది.

పాండవుల అజ్ఞాతవాసము పూర్తికాలేదని, ఆ సందేహమును నీవు తీర్చ వలెననియు నీతో దుర్యోధనుడు పూర్వమని యుండెను.

కనుక భీష్మ పితామహా! నీవు స్వయముగా జ్ఞప్తికి తెచ్చుకొని, ఇందలి సత్యమును తెలుపుము. పాండవుల అజ్ఞాతవాసకాలము పూర్తియైనదా? లేదా? అను విషయమును నిర్ణయించి చెప్పుము."

ద్రోణాచార్యుల మాటలకు భీష్మ పితామహు డిట్లనెను :-

అజ్ఞాతవాసము ముగిసినట్లు భీష్ముని సమ్మతి

"పదునెనిమిది రెప్పపాట్ల కాలమొక 'కాష్ఠ' యనబడును. అట్టి కాష్ఠలు ముప్పదియైనచో నొక 'కళ' యనబడును. దానికే 'క్షణము' అని పేరు. అట్టి పన్నెండు కళలకు - అనగా క్షణములకు (రెండు గడియల కాలము) ఒక ముహూర్తము, అని పేరు. ఇట్టి ముప్పది ముహూర్తములు (అరువది గడియలు) ఒక దినము, ఇట్టి దినములు పదునైదింటికి 'అర్ధ మాసము' (పక్షము), రెండు అర్ధ మాసములు ఒక మాసము అనియు నగును.

ఈ విధముగా నక్షత్రములు, గ్రహములు, ఋతువులు, (రెండు మాస ముల కొక ఋతువు) అగును.

ఇట్లు కాలము యొక్క అంశములను కలిపికొనుచు పోయినచో పన్నెండు మాసముల కొక సంవత్సరమగును. ఇట్లు కాల విభాగముచేత కాల చక్రము తిరుగుచుండును.

ఈ 'పక్ష - మాస - సంవత్సర' ఇత్యాది సమయములయొక్క హెచ్చు తగ్గుల చేత, గ్రహ నక్షత్ర గమనముల ఎగుడు దిగడుల చేతను ప్రతి ఐదేండ్ల కొకసారి రెండు నెలలు అధికముగా వచ్చును. వీటినే అధిక మాసములందురు.

ఈ విధముగా లెక్కపెట్టినచో నేటికి అధిక మాసములతో పాండవులకు పదుమూడేండ్లపైన ఐదు నెలల పన్నెండు దినముల కాలము అధికమైనదని నా విశ్వాసము.

(చాంద్రమానము ప్రకారము సంవత్సరమునకు 354 దినములుండును. సౌరమానము ప్రకారము 365 దినములు, పదునైదు గడియలు, కొన్ని క్షణము లుండును.

ఈ లెక్క ప్రకారము పదుమూడు సౌరమాన సంవత్సరములలో, చాంద్రమాన సంవత్సరములు పదుమూడు నిండి దాదాపు ఐదు నెలలు ఎక్కువగును.

ఈ పదుమూడు సంవత్సరములలో ఆరుసార్లు అధిక మాసములు వచ్చినచో, ఏ తిథినాడు పాండవుల వనవాసము మొదలైనదో, సరిగా పదుమూడు సంవత్సరములకు అదే తిథినాటికి లెక్కవేసినచో పదుమూడు సంవత్సరముల పైన ఐదు నెలల పన్నెండు దినములు అధికముగా, అధికమాసములతో నగును.

పాండవులు సౌరమానము ప్రకారము సంవత్సరములను లెక్కపెట్టి యుండిరి. కనుక వారు, అధిక మాసముల కారణముగా అధికమైన నెలలు దినముల సంఖ్య వేరుగా భావించలేదు. అందుచేతనే పాండవుల లెక్కలో పదుమూడు సంవత్సరముల కాలము మాత్రమే ఆయెను.

భీష్ముడు చాంద్రమాన సంవత్సరముల ప్రకారము లెక్కచేసి అయిదు నెలల పన్నెండు దినములు గడువుకంటె అధికముగా తేల్చెను.

ఈ కాల భేదము - చాంద్ర సౌరమానముల లెక్కల భేదము చేతనే అయినది.

సౌరమానము ప్రకారము లెక్కచేసినను పాండవుల గడువు కాలము వాస్తవముగా పదుమూడేండ్ల పైన ఆరు దినములు ఆ నాటికి గడిచియుండెను

పాండవులు చేసిన ప్రతిజ్ఞలన్నియు సక్రమముగా వారు పాలించిరి. ఈ విషయమును పూర్తిగా తెలిసియే అర్జునుడు ఇక్కడికి వచ్చెను.

వారందరు మహాత్ములు, ధర్మార్థ కోవిదులు. ధర్మాత్ముడైన యుధిష్ఠిరుడు నాయకుడుగా గల పాండవులు, ధర్మము విషయమై యెప్పుడైనను పొరపాటు చేయుదురా,

కుంతీ పుత్రులు లోభములేనివారు. వారు తపశ్చర్యాదులైన దుష్కర కర్మలు చేసినవారు. అట్టివారు అధర్మము, అనుచితమునైన మార్గము ద్వారా రాజ్యమును సంపాదించుటకుగాను ధర్మము వీడరు.

"కురుకుల పావనులైన పాండవులు, తాము జూదమునందు ఓడినప్పుడే తమ పరాక్రమమును చూపుటకు సమర్థులై యుండిరి. కాని, అప్పుడు వారు ధర్మపాశబద్ధులై యుండిరి. కాబట్టి క్షత్రియ నియమమునుండి చలించకుండిరి.

'అర్జునుడు అసత్యవాది' అని చెప్పినవాడు తప్పక పరాభవమును చెందును. పాండవులు మరణమునైన వరింతురుగాని, యెన్ని కష్టములు వచ్చినను అసత్యమునాడరు.

వారు, సమయము వచ్చినప్పుడు, తాము పొందవలసిన భాగమును పొందకుండ విడువరు. ఆ వస్తువును ఇంద్రుడు రక్షించుచుండినను అతనిని జయించి తాము సంపాదించగలరు. వారి పరాక్రమము అటువంటిది సుమా!

ఇప్పుడు రణభూమియందు సమస్త శస్త్రాస్త్రకోవిదుడైన అర్జునునితో మనకు యుద్ధము చేయవలసియున్నది. కనుక ప్రపంచమునందు సత్పురుషులు అనుసరించు మంచి ఉపాయమును త్వరగా మనమిప్పుడు ఆశ్రయించి, ఈ గోధనము మరల శత్రువశము కాకుండ చూచుకొనవలెను.

దుర్యోధనా! యుద్ధమునందు ఏదో ఒక పక్షమునకే అవశ్యముగా విజయము కలుగకుండుట నేనెప్పుడుగూడ చూడలేదు.

ఇప్పుడు అర్జునుడు వచ్చినాడు. యుద్ధము కలిగినపుడు, ఒక పక్షమునకు లాభము, మరియొక పక్షమునకు హాని జరుగుచుండును. ఇది తప్పదు. ఇది నా అనుభవపూర్వకమైన మాట. ఇందులో సందేహములేదు.

కనుక రాజా! ఇప్పుడు నీవు యుద్ధమునకైనను సన్నద్ధుడవు కమ్ము లేదా! ధర్మోచితమైన కార్యముచేసి యుద్ధము మాని, వారికి రాజ్యమునిచ్చి సంధి యైనను చేసికొనుము. ఏది చేయదలచినను వెంటనే చేయుము. ఇదిగో అర్జునుడు వచ్చి మనపై పడినాడు!

అర్జునుడు ఒంటరిగానే యెవరి సహాయము నపేక్షింపక సమస్త భూమండలమును తన బాణములచేత దహించగలడు. ఇట్లుండగా, అతడు అన్నదమ్ములతో కలిసి యుద్ధము చేసినచో నిక చెప్పవలసిన దేమున్నది? కౌరవులనే నశింపజేయలేడా? కనుక, నీకు యుక్తమని తోచినచో పాండవులతో సంధి చేసికొనుము.

ఆ మాటలు విని దుర్యోధనుడు భీష్మునితో నిట్లనెను:-

"పితామహా! నేను పాండవులకు రాజ్యము నివ్వను. అందుచేత సంధి ప్రసక్తియేలేదు, కనుక యుద్ధోచితమైన కార్యమునే శీఘ్రముగా చేయుడు."

ఆ మాటకు భీష్ముడిట్లనెను:-

"ఈ విషయమునందు నా అభిప్రాయ మొకటి కలదు. నీకు ఇష్టమైనచో వినుము, నేను అన్ని విధముల శ్రేయస్సునే దృష్టియందుంచుకొని చెప్పెదను.

నీవు ఈ సైన్యములో నాల్గవ భాగమును తీసికొని హస్తినాపురమునకు త్వరగా పొమ్ము. మరియొక నాల్గవ భాగము సైన్యము గోవులను తోలుకొని పోవుగాక. మేము, తక్కిన సగము భాగము సైన్యముతో నర్జును నెదుర్కొని యుద్ధము చేసెదము.

నేను, ద్రోణుడు, అశ్వత్థామ, కృపాచార్యులు అర్జును నెదుర్కొనెదము. ఒకవేళ విరాటరాజు వచ్చినను, ఇంద్రుడే వచ్చినను నేనొక్కడనే పోరాడి, సముద్రమును ఒడ్డు అడ్డగించినట్లు శత్రు సైన్యమును నిలువరించెదను.

"జనమేజయా! భీష్ముని మాటలు అందరికిని రుచించెను. అతడు చెప్పినట్లుగానే, దుర్యోధనుడు చేసెను. భీష్ముడు తొలుత దుర్యోధనుని, తరువాత గోవులను పంపి, సేనాపతులను వ్యవస్థీకరించి, సేనావ్యూహములను పన్నుటకు ఆరంభించి యిట్లనెను:-

"ద్రోణాచార్యా! నీవు సేనామధ్యమున నుండుము. అశ్వత్థామా! నీవు ఎడమవైపున నుండుము. కృపాచార్యులు కుడివైపుననుండి సేనను రక్షించుగాక.

కర్ణుడు కవచధారణము చేసి ముందువైపు నిలుచుగాక. నేను సైన్యమంతటికి వెనుక భాగమునందుండి కాపాడుచుండెదను.

మహారథికులు, శూరులు, మహాబలవంతులు ధనుర్యుద్ధమునందు గొప్ప నేర్పరులునైన అందరును అర్జునునితో యుద్ధము చేయుదురుగాక."

"జనమేజయా! ఈ విధముగా భీష్ముడు సమస్త సేనను దుర్భేద్యము లైన "వజ్రగర్భ - వ్రీహీముఖ - అర్ధచక్రాంతమండల" నామకములైన వ్యూహములుగాపన్ని, ఆ సేనకు వెనక తాను సువర్ణమయమైన తన తాళధ్వజ మును ఎగురవేసి, ఆయుధములను ధరించి, రథముపైన నిలిచెను.

అప్పుడు భీష్ముడు అతి శోభాయమానముగా విరాజిల్లుచుండెనని చెప్పి వైశంపాయనుడు తరువాతి కథను ఇట్లు చెప్పదొడగెను:-

అర్జునుడు దుర్యోధనునిపై దాడిచేసి గోవులనుమరలించుట

"జనమేజయా! కౌరవసేన యొక్క వ్యూహరచన అయిన పిదప అర్జునుడు తన రథధ్వనులు దిక్కులు పిక్కటిల్లగా అతి త్వరగా కురు సైన్య మును సమీపించెను.

సైనికులాతని ధ్వజాగ్రమును చూచిరి, రథధ్వనితోపాటు గాండీవ టంకారమును గూడ వినిరి. అట్లు వచ్చుచున్న అర్జునుని చూచి ద్రోణాచార్యు డిట్లనెను:-

"ఇదుగో అర్జునుని ధ్వజాగ్రము దూరమునుండియే ప్రకాశించుచున్నది. ధ్వజమునందలి హనుమంతుని ధ్వని, రథధ్వని, రథమునందు నిలుచున్న రథికశ్రేష్ఠుడైన అర్జునుడు గాండీవము నాకర్షించి చేసిన టంకారధ్వనిన్ని వినుడు. ఆ ధ్వనులు పిడుగుల చప్పుడు వలె నున్నవి.

ఇదుగో ఈ రెండు బాణములు నా పాదములపైన పడియున్నవి, మరి రెండు బాణములు నా చెవులను తాకుచు వెడలి పోయినవి.

వనమునందు నివసించి, మానవాతీతములైన కర్మలు చేసి వచ్చిన అర్జునుడు నా పాదములకు బాణముల ద్వారా నమస్కారము చేయుచున్నాడు. మరి రెండు బాణములను చెవులకు తాకించి, తాను నాతో యుద్ధము చేయుటకు నా యాజ్ఞ తీసుకొనుచున్నాడు.

బంధు ప్రియుడు, ప్రజ్ఞాశాలియునైన అర్జునుడు మాకు దాం కాలమునకు కనపడినాడు. మహాశోభతో విరాజిల్లుచున్నాడు. రథమునందు కూర్చొనియున్న అర్జునుడు, అందమైన చేతితొడుగులు, అంబుల పొదులు, శంఖము, కవచము, కిరీటము, ఖడ్గము, ధనుస్సు ధరించి యెంతయో తేజస్సుతో కనబడుచున్నాడు చూడుడు.

ఈ సాధనములతో ప్రజ్వరిల్లుచున్న అర్జునుడు, చుట్టుముట్టు స్రుక్ స్రువములు ఒప్పుచుండగా అహుతుల చేత భాసిల్లుచున్న యజ్ఞాగ్నివలె తేజరిల్లు చున్నాడు.

జనమేజయా! మధ్యందిన మార్తాండునివలె ప్రకాశించుచు సమీపించు చున్న అర్జునుని, శత్రువులు తేరిపార జూడజాలకుండిరి.

అర్జునుడప్పుడు తన యెదుటనున్న రథికుల సేనను చూచి సారథితో నిట్లనెను:-

"సారథీ! బాణపువ్రేటు దూరము వరకు, మన రథమును కురుసేన వైపు పోనిమ్ము. ఈ సైన్యమునందు కురు కులాధముడైన దుర్యోధను డెక్కడ నున్నాడో చూచెదనుగాక. తక్కిన వారినందరిని విడిచి, అతని తలపై బడెదను. ఆ దురభిమానుడు ఓడినచో తక్కినవారందరు స్వయముగా ఓడి పారిపోయెదరు.

ఇదుగో ద్రోణాచార్యులు, ఆయన ప్రక్కలో అశ్వత్థామ, భీష్మ, కృప, కర్ణాదులున్నారు చూచెదను.

ఇక్కడ దుర్యోధను డెక్కడను కనపడుటలేదు. అతడు గోవులను తోలు కొని దక్షిణ దిక్కుగా బయలుదేరి తన ప్రాణములను కాపాడు కొనుటకు పారిపోవుచున్నాడను కొనెదను.

ఈ రథికులందరిని విడిచి సుయోధనుడున్న చోటికి రథమునుపోనిమ్ము. అక్కడనే యుద్ధము చేసెదను. దుర్యోధనుని ఓడించి గోవులను మరలించుకొని వత్తము."

"జనమేజయా! ఆ మాట విని ఉత్తరుడు, ఇతర కౌరవులవైపు నడచు చున్న అశ్వముల పగ్గములు పట్టి రథమును ఆపి, దుర్యోధనుడు పోవుచున్న వైపునకు తోలెను.

తమను విడిచి మరియొకవైపు పోవుచున్న అర్జునుని అభిప్రాయము కని పెట్టి కృపాచార్యు డిట్లనెను:-

"అర్జునుడు, దుర్యోధనుడు లేని యీ సైన్యముకడ నిలుచుటకు ఇష్ట పడక, ఆతడున్నవైపునకే త్వరగా పోవుచున్నాడు. మనముగూడ అర్జునుని వెన్నాడుదము. వెంటనే బయలుదేరుడు. అతి క్రోధావిష్టుడైయున్న అర్జునునితో ఒంటరిగా, ఇంద్రుడు, శ్రీకృష్ణుడు, ద్రోణాచార్యులు, నశ్వత్థామ తప్ప మరి యెవ్వరు గూడ పోరాడజాలరు.

దుర్యోధనుడు అర్జునుడనెడు ప్రవాహజాలమునందు నౌకవలె మునిగి పోయిన పిదప, మనకు ఈ గోవులతో గాని, ఈ ధనముతో గాని యేమి ప్రయోజనము?

"కృపాచార్యుడిట్లనుచుండగనే, ఆ వైపు అర్జునుని రథము దుర్యోధనుని సమీపించి, బిగ్గరగా తన పేరు చెప్పి మిడుతల దండువలె తన బాణవర్షమును కురుసేనపై కురిపించెను.

అట్లు బాణవర్షము భూమ్యాకాశములను ఆవరించగా భీతులైన సైనికులు క్రిందుమీదెరుగక గగ్గోలు పడిరి.

అట్లు తమపైన బాణములు పడుచున్నను, సైనికులు ఆచోటు విడిచిపోవ గోరకుండిరి. అర్జునుని ఆ చురుకుదనమునే వారు మనస్సునందు పొగడు చుండిరి.

తరువాత అర్జునుడు, శత్రువులకు గగుర్పాటు గలుగునట్లు శంఖ ధ్వని చేసెను. ధనుష్టంకారము చేసి ధ్వజమునందలి భూతములకు సింహనాదము చేయుటకు ప్రోత్సహించెను. ఆ ధ్వనులన్నియు విని గోవులు తోకలు పైకెత్తు కొని అంభారవములు చేయుచు, అన్నివైపులనుండి దక్షిణపు వైపునకు మరలి వచ్చెను.

గోవులు మరలిపోయి, అర్జునుడు దుర్యోధనుని పైకి పోవుచుండుటను చూచి కురువీరులు త్వరగా యుద్ధము చేయుటకు వచ్చిపడిరి. అర్జునుడప్పుడు, కురుసైన్యమును, వారు పన్నిన వ్యూహములను చూచి నిట్లనెను:-

"రాజకుమారా! మన రథమును త్వరగా ఈ మార్గముగుండా వెను వెంటనే దుర్యోధనుని చేరుకొనుటకు అనువుగా తోలుము.

ఇదుగో చూడుము, ఏనుగుతో ఏనుగు తలపడజూచుచున్నట్లు ఈ దురాత్ముడు కర్ణుడు నాపైకి వచ్చుచున్నాడు. కనుక తొలుత కర్ణునివద్దకే నన్ను తీసికొని పొమ్ము. ఇతడు దుర్యోధనుని ఆశ్రయము సంపాదించి గర్వించియున్నాడు."

ఆ మాట ప్రకారమే ఉత్తరుడు రథమును కురుసేన మధ్యకు రథసైన్యమును ధ్వస్తము చేయుచు పోయి నిలిచెను.

ఇంతలో, 'చిత్రసేనుడు, సంగ్రామజిత్తు, శత్రుసింహుడు, జయుడు' మొదలైన వీరులు కర్ణుని రక్షకై అర్జును నెదుర్కొని వాడి బాణములను విడిచిరి.

అప్పుడు అర్జునుడు వారినందరిని కార్చిచ్చు అడవిని దహించినట్లు తన బాణాగ్నిచేత దహించివైచెను.

అట్లు ఘోరయుద్ధము జరుగుచుండగా కర్ణుడు అర్జునుడి పైబడి బాణవర్షము గురిపించెను. అర్జునుడు కర్ణుని ధనుస్సును విరిచి ధ్వజమును పడగొట్టి అతనిని పారదోలెను.

మానవాతీతములైన కర్మలు చేయుచు శత్రు భయంకరుడైన అర్జునుని 'శత్రుంతపు'డను వీరు డెదుర్కొని బాణవర్షము గురిసెను. అర్జునుడప్పుడు కురుసేనలోనికి దూసుకొనిపోయి అతిరథుడైన శత్రుంతపుని ఐదు బాణములతో కొట్టి పది బాణములతో నతని సారథిని కొట్టెను అంతలో శత్రుంతపుడు, వృక్షము పర్వత శిఖరమునుండి కూలిపడినట్లు, రథముపై నుండి నేలపైన గూలిపడెను.

అర్జునునిచే కూల్చబడిన కురువీరులు గూడ ప్రళయకాల వాయువుచేత మహావనము కంపించినట్లు వణికి అందరును మరణించి పడిపోయిరి.

బంగారు కవచములు కొందరు, ఉక్కు కవచములు తొడుగుకొనిన వీరులు హిమాలయముపైనున్న గజరాజువలె ప్రకాశించుచుండిరి.

అట్టి వారిని పార్థుడు సంహరించి యుద్ధ రంగమునందు గ్రీష్మకాలమునందు మహావనమును దహించుచున్న దావాగ్నివలె, దశదిశలు అలముకొని శత్రుసేనను దహించుచుండెను.

వసంత ఋతువునందు వడిగా వీచు గాలి, శిఖరమునందు రాలిపడిన, ఆకులను ఎగురవేసినట్లు, మేఘములను చెదరగొట్టినట్లు అర్జునుడు శత్రువుల తలలను ఎగురవేయుచు తన రథమును యుద్ధరంగమునందు త్రిప్పుచుండెను.

కర్ణార్జునుల యుద్ధము

"అప్పుడు అర్జునుడు, ఎఱ్ఱని గుఱ్ఱములు గల రథమునందు కూర్చొని తన పైబడుచున్న కర్ణుని సోదరుడగు సంగ్రామజిత్తు యొక్క రథాశ్వములను కూల్చి అతని తల ఎగురవేసెను.

సోదరుడు కూలిపోవుట చూచి కర్ణుడు, మహా శౌర్యముతో మహాగజము పర్వతము నెదుర్కొనునట్లు, వ్యాఘ్రమును ఆబోతు ఎదుర్కొనునట్లును అర్జునుని పైబడి పది బాణములతో అర్జునుని కొట్టి, అతని గుఱ్ఱములను, సారథి ఉత్తరుని చేతిని కొట్టెను.

అట్లు తనపైకి వచ్చిన కర్ణునిపైన అర్జునుడు, సర్పముపై గరుత్మంతుడు పడినట్లు పడెను. ధనుర్యుద్ధములలో సత్యోత్తములైన కర్ణార్జునుల యుద్ధమును చూచుచు కురు సైనికులు ప్రేక్షకులవలె నిలిచియుండిరి.

అర్జునుడు కర్ణుని, అతని రథ సారథిని బాణ వర్షములో ముంచి కనపడకుండ చేసెను చతురంగ బలములు అర్జునునిచేత దెబ్బలు తిని హాహాకారములు చేయదొడగెను.

అట్లు అర్జునుని బాణముల చేత కర్ణుని రథము కప్పబడుటను జూచి భీష్మాది యోధాగ్రేసరులు రణ రంగమునుండి అంతర్హితులైరి.

అప్పుడు కర్ణుడు అర్జునుని బాణములను తునుమాడి ధనుఃపాణియై మిణుగురులు గ్రక్కుచున్న అగ్నివలె రథముపై శోభిల్లెను.

అట్లు నిలిచి కర్ణుడు ధనుష్టంకారము చేయుచుండుటను చూచి కురు సైనికులు హర్షముతో చప్పట్లు చరచుచు, శంఖ భేరీ నాదములు చేయుచు కర్ణుని ప్రశంసించిరి.

ధ్వజమునందలి హనుమంతుడు, భూతములు సింహనాదము చేయుచుండగా, గాండీవ ధనుష్టంకారము గూడ చేయుచున్న అర్జునుని చూచి కర్ణుడు బిగ్గరగా సింహగర్జనము చేసెను.

అర్జునుడు భీష్ముని, ద్రోణాచార్యులను, కృపాచార్యులను చూచుచు, కర్ణుని రథాశ్వ సారథులను బాణములతో ముంచెను. అట్లు వారిరువురు బాణ యుద్ధమును ఘోరముగా చేయుచుండిరి.

బాణములచేత కప్పబడి ప్రకాశించుచున్న ఆ యిరువురు వీరులు, చూచు వారలకు, మేఘముల మధ్య ప్రకాశించుచున్న సూర్య చంద్రులవలె తోచిరి.

అప్పుడు కర్ణుడు విజృంభించి, నిశిత బాణములచేత అర్జునుని నాల్గు గుఱ్ఱములను కొట్టి, మూడు మూడు బాణములను ప్రయోగించి అర్జునుని సారథిని ధ్వజమును కొట్టెను.

అట్లు కర్ణుని బాణ ఘాతములచేత నిద్రించిన సింహము మేల్కొనినట్లు విజృంభించి అర్జునుడు బాణ వృష్టి కురియుచు కర్ణునిపై బడెను. కర్ణుని బాణములచేత కొట్టబడిన అర్జునుడు ముందుకుసాగి, సూర్యుడు కిరణములచేత సమస్త లోకములను కప్పినట్లు కర్ణుని రథమును బాణములచేత కప్పివైచెను.

ఏనుగును ఏనుగు ఎదుర్కొనినట్లు కర్ణు నెదుర్కొని యర్జునుడు బాణములతో కర్ణుని అవయవములను నొప్పి పరచెను. కర్ణుని బాహువులను, తొడలను, లలాటమును, మెడను, ఇతరాంగములను బాణములతో కొట్టెను.

అట్లు కొట్టిన అర్జునుని బాణముల దెబ్బలకు తాళజాలక కర్ణుడు ఒక గజమునకు మరియొక గజము ఓడినట్లు, యుద్ధభూమిని విడిచి అర్జున బాణ తప్తుడై పారిపోయెను."

అని చెప్పి వైశంపాయనుడు తరువాత కథ జనమేజయునకు ఇట్లు చెప్పదొడంగెను:—

"జనమేజయా! కర్ణుడు యుద్ధభూమిని వీడి పారిపోయిన పిదప దుర్యోధనాది యోధులు తమతమ సేనలతో మెల్లగా అర్జునుని వైపు పోయిరి.

వ్యూహములుగా పన్నబడిన ఆ సైన్యము బాణవర్షము కురియుచు తన వయిపు వచ్చుచుండగా వీరుడైన అర్జునుడు ఒడ్డు సముద్రపు పొంగును అడ్డినట్లు, కురుసైన్యమును అడ్డుకొని గాండీవమునందు దివ్యాస్త్రమును సంధించి శర పరంపరలు కురుసైన్యముపై పరపెను. అప్పుడా బాణములచేత భూమిని, సూర్య కిరణములు కప్పినట్లుగా శోభిల్లజేసెను.

రథములు, అశ్వములు, గజములు, కవచములు, ఈ యన్నింటిని అర్జున బాణములు, రెండగుళముల చోటుగూడ అంతరము లేకుండ గ్రుచ్చుకొనెను.

అర్జునుని దివ్యాస్త్రముల ప్రయోగము, అశ్వముల శిక్షణము, రథము నడుపుటయందు ఉత్తరునకు గల కౌశల్యము అర్జునుడు శస్త్రములను ప్రయోగించు పద్ధతి, ఈ మొదలయిన కారణములచేత, అతని పరాక్రమము, వేగము, అత్యద్భుతముగా నుండుటచేతను, ఆ యుద్ధము చూచుచున్న శత్రువులుగూడ అర్జునుని ప్రశంసించ దొడగిరి.

ప్రళయకాలాగ్ని ప్రజలను దహించినట్లు అర్జునుడు అతిభయంకరముగా శత్రుదహనము చేయుచుండగా, శత్రువు లతనిని జ్వలించుచున్న అగ్నినివలె చూడజాలకుండిరి.

అర్జున బాణములచేత కప్పబడిన సైన్యములు పర్వత సమీపమునందలి మేఘ సమూహములు సూర్య కిరణములచేత కప్పబడినట్లుండెను. అర్జున బాణ ఘాతములచేత నెత్తురు చిప్పిల్లుచు ఎఱ్ఱగానున్న సైన్యము, ఎఱ్ఱని పువ్వులు పూచిన అశోకవనమువలె నుండెను.

అర్జున బాణములచేత తెగిన సంపంగి పూవుల మాలలనుండి క్రిందపడి యెండిన పూవులు, ఛత్రముల ఖండములు, ధ్వజ శకలములు మొదలయిన వాటిని వాయువు కొంత సేపటివరకు ఆకాశమునందే ధరించి యుండెను. (అనగా బాణముల వలలో అవి తగులుకొని త్వరగా క్రిందపడలేదని భావము)

అర్జునుని బాణములచేత ఖండింపబడిన కాడిమ్రానుల ఖండములను మెడలపై ధరించిన గుఱ్ఱములుగూడ తమ సైన్యములు భయపడుటచేత, భయము చెందినవై దశ దిశలకు పారిపోయెను.

అర్జునుడు గజముల చెవులను, కక్ష (చంక) ప్రదేశములను, దంతములను, క్రింది పెదవులను, ఇతర మర్మ స్థానములను నరికి గజములను నేలపై గూల్చెను. కౌరవ సేనా ముఖమునందున్న గజములు చచ్చి, వాటి శరీరముల చేత భూమి వ్యాపించి, మేఘములచేత కప్పబడిన ఆకాశమువలె నొప్పెను.

ప్రళయ కాలమునందు మండుచున్న జ్వాలలచేత ముందుకు సాగుచున్న 'సంవర్తక'మను నగ్ని సమస్త చరాచర ప్రపంచమును భస్మము చేసినట్లే అర్జునుడు తన బాణాగ్నిచేత శత్రుసేనయందలి చరాచరములను దహించివేసెను.

అప్పుడు అర్జునుడు, తన యస్త్రశస్త్రముల తేజస్సుచేత, గాండీవ టంకార ధ్వనిచేత, ధ్వజమునందున్న భూతముల కోలాహల ధ్వనులచేత, హనుమంతుని భయంకర సింహనాదముచేత, శంఖధ్వనిచేతను. దుర్యోధనుని సైన్య వనమునందు మహా భయమును కలిగించెను.

శత్రువుల రథసైన్యము నర్జునుకు పూర్వమే నేలపాలు చేసియుండెను, ఇక నశక్తులయిన సామాన్య సైనికులను వధించుట అనుచితమైన సాహస మగునని ఆ రంగమునుండి యొకమారు తప్పుకొనెను. కాని ఆ సైనికులు తన పైకి వచ్చుటను చూచి మరల యుద్ధమునకు సన్నద్ధుడయి వారికడకు వచ్చెను.

పదునయిన మొనలుగల బాణములతో నాకాశమునంతటిని కప్పెను. అవి పక్షులవలె ఆకాశమును ఆచ్ఛాదించెను, ఆకాశము చాలక ఆ బాణములు సూర్యుని వేడి కిరణములవలె దశదిశలు అలముకొనెను.

అశ్వ సైనికులు ఒక్కసారి మాత్రమే అర్జునుని సమీపించగలుగుచుండిరి, ఎందుకనగా, వారు దగ్గరికి రాగానే యతడు వారి యశ్వములతో పాటు వారిని పరలోకమునకు పంపుచుండెను.

అతని బాణములు శత్రు శరీరములలో గ్రుచ్చుకొని యక్కడ నిలువక దూసికొని పోవునట్లే, అతని రథముగూడ సేనలో నిలువక, అడ్డుపడినవారి నందరిని చీల్చుచు ముందుకు సాగుచుండెను.

వేయిపడగలతో, నొప్పు మహా సర్పము సముద్రమునందు విచ్చలవిడిగా క్రీడించుచు మథించునట్లు, అర్జునుడు ఆ మహాసేనలో తిరుగుచు గొప్ప అలజడిని కలిగించెను.

అతడు బాణ ప్రయోగము చేసినప్పుడు అతని గాండీవ ధనుష్టంకార ధ్వనిని సమస్త ప్రాణులు వినుచుండెను. అట్టి అద్భుత ధ్వనిని ఎవరుగూడ పూర్వము వినియుండలేదు. ఆ ధ్వనిముందు ఇతర ధ్వనులన్నియు అణగిపోయి యుండెను.

యుద్ధభూమిలోని గజముల అవయవములు అర్జున బాణములచే ఛిన్నాభిన్నములై నెత్తురు చెమర్చుచుండెను. అవి అప్పుడు సూర్య కిరణములచేత కప్పబడిన మేఘ సమూహమువలె నుండెను.

అర్జునుడు అన్ని దిశలయందు మాటిమాటికి తిరుగుచు, కుడియెడమ చేతులచేత సర్వత్ర బాణములను ప్రయోగించుచుండెను.

అతని బాణాగ్ని మండలాకారముగా నిరంతరము తిరుగుచుండుట యెట్లున్నదనగా, మండుచున్న ఒక కొరవిని నిరంతరముగా త్రిప్పుచున్నప్పుడు గుండ్రముగా ఒకటే అగ్ని తిరుగుచున్నట్లే యుండెను.

రూపహీన వస్తువులందు దృష్టి పడనట్లే అర్జునుని బాణములుగూడ అతడు గురిపెట్టని వారిపై పడుటలేదు.

వేయి గజములు నడచుట చేత మార్గము చదునై వెడల్పయి నట్లుగా, అర్జునుని బాణవర్షము చేత నతని రథ మార్గముగూడ చదునై వెడల్పయినది.

అర్జునుని జయమును గోరి యింద్రుడే స్వయముగా దేవ సేనలతో వచ్చి మమ్ము చంపుచున్నాడని గాయపడిన సైనికులు తలంచుచుండిరి. ఒకవేళ యముడే వచ్చెనాయని కూడ భావించిరి.

పార్థునిచేత కొట్టబడనివై నప్పటికిని కొన్ని కురుసైనికుల శరీరములు పార్థుని శౌర్యకర్మలను తలచుచుండుట చేత 'పార్థుడు మమ్ముగూడ కొట్టినాడు' అని భ్రాంతిగొని (భ్రమరకీట న్యాయమున) నశించినవి.

అతడు పైర్లు కోసినట్లు శత్రువుల తలలు నరకుచుండెను. అతని వలన భయముచేత కురుసైనికుల శక్తి నశించెను.

అర్జునుడను వాయువుచేత భిన్నములైన శత్రు సేనా వనములు నేల గూలగా రక్త ధారలు ప్రవహించి భూమి నంతటిని ఎఱ్ఱగా చేయుచుండెను. రక్త సిక్తమైన దుమ్ము రేగి సూర్యకిరణములను మరింత ఎఱ్ఱగా చేయుచుండెను.

అప్పుడాకాశము సూర్యునితో పాటు, సంధ్యాకాలము నందు వలె ఎఱ్ఱగా నాయెను. సూర్యుడ స్తమించి నివృత్తుడై నప్పుడు పరులను (ఇతరులను) తపింప జేయడుగాని, అర్జునుడు సర్వదా పరులను (శత్రువులను) తపింపజేయుచునే యుండును.

పౌరుషము చూపించుచున్న శత్రువులనందరిని అర్జునుడు దివ్యాస్త్ర ములచేత రూపుమాపెను. ద్రోణునిపై దెబ్బదిమూడు, దుస్సహునిపై పది, అశ్వత్థామపై నెనిమిది, దుశ్శాసనునిపై పన్నెండు, కృపాచార్యులపై మూడు,

భీష్మునిపై నరువది, దుర్యోధనునిపై నూరు క్షురప్ర (అర్ధచంద్ర) బాణములను ప్రయోగించి, కర్ణుని చెవిని ఒక 'కర్ణి' యను బాణముచేత కొట్టెను. తరువాత కర్ణుని రథాశ్వసారథులను చంపగా నతడు విరథుడయ్యెను. అంతటితో సైన్య మంతయు చెల్లా చెదరయ్యెను.

ఇట్లు సైన్యము భగ్నమైనప్పటికిని అర్జునుడు యుద్ధభూమిని విడువక నిలిచియుండుటను జూచి సారథి, ఉత్తరుడు, 'వీరాగ్రేసరా! రథము నెటు తోలుమనెదవు? ఎవరితో పోరాడ దలచుచున్నావు? చెప్పుము. ఆవైపే రథము తీసికొని పోయెదను' అని యనెను.

అప్పుడర్జునుడిట్లనెను:—

అర్జునుడు కృపాచార్యుల పైకి పోవుట

"ఉత్తరా! ఎఱ్ఱని అశ్వముల రథమునందు, వ్యాఘ్రచర్మ కవచమును తొడిగికొని, రథముపైన నల్లని టెక్కెము ఎగురగా విరాజిల్లుచున్న రథమునందు కూర్చొని యున్న యతడే కృపాచార్యుడు. అదియే యతనిసేన, మన రథము ఆ సైన్యము వద్దకే తోలుకొని పొమ్ము. నేనతనికి నా యస్త్రవిద్యాకౌశలమును చూపెదను.

ధ్వజమునందు కమండలు వున్నదే, ఆ రథమునందున్న యతడే ద్రోణాచార్యుడు. అతడు శస్త్ర ధారులలో శ్రేష్ఠుడు. ఈయన నాకే కాక, శస్త్రాస్త్ర కోవిదులందరికిని మాననీయుడు. కనుక మన రథమును ఆయనకు ప్రదక్షిణముగా త్రిప్పుము. లేదా, యక్కడనే దిగెదను. ఇది గురువులకు చూపించు గౌరవము. ఇదియే సనాతన ధర్మము, ఒకవేళ ఆయనయే నాపైన తొలుత బాణము ప్రయోగించినచో, పిదప నేనాయనపై ప్రయోగించెదను. అట్లు తరువాత బాణ ప్రయోగము చేయుట చేత అయనకు నాపైన కోపమురాదు.

ఆయన దగ్గరనే ధ్వజాగ్రముపైన ధనుస్సు చిహ్నముగల రథము నందున్న యతడే ఆచార్య పుత్రుడు అశ్వత్థామ. అతడు గూడ మహారథుడే యగును. నాకును, ఇతర ధనుర్ధారులకును సదామాన్యుడతడు, అతని వద్దకు రథము పోయినప్పటికిని మరలిరమ్ము.

ఈ రథికుల సేన యందు, సువర్ణ కవచమును ధరించి, మూడవ సేన వద్ద, సువర్ణ ధ్వజాగ్రమునందు సర్పచిహ్నము గల రథమునందు, ఏ పరిశ్రమయు లేక ఊరక కూర్చొనియున్నవాడే దుర్యోధనుడు.

సారథీ! ఇతని కడకే మన రథమును పోనిమ్ము. ఇతడు యుద్ధ దుర్మదుడు. ఇతడు శీఘ్రముగా బాణప్రయోగము చేయుటయందు ద్రోణాచార్యుని శిష్యులలో మొదటి వాడుగా నెన్నబడినవాడు.

ఏనుగు చిహ్నముతో నొప్పు ధ్వజాగ్రము గల రథము నందున్నవాడే కర్ణుడు. ఇతనితో నీకు పూర్వమే పరిచయము కలిగినది గదా! ఇతని రథము వద్దకు పోయినప్పుడు నీవు జాగ్రత్తతో నుండుము. ఇతడు సర్వదా యుద్ధమునందు నాతో స్పర్థ (పోటి) చేయుచుండును.

"ఉత్తరా! అదుగో అక్కడ నల్లని యైదు నక్షత్రములు గల ధ్వజముతో విరాజిల్లుచున్న రథమునందు కూర్చుని, చేతికి తొడుగులు తొడిగికొని, పెద్ద ధనుస్సు ధరించి, అదుగో ఆ యైదు నల్ల నక్షత్రముల చిహ్నముతో, సూర్య చిహ్నముతోను టెక్కెము ప్రకాశించుచున్నదే, ఆ రథమునందు, తలపైన శ్వేతచ్ఛత్రము శోభిల్లగా, అనేక పతాకలు గల రథము లందున్న రథికుల యగ్రమునందు నాయకుడుగా, మేఘములముందు సూర్యునివలె నిలిచి, శరీరమునందు సూర్యచంద్రుల చిహ్నములుగల సువర్ణ కవచమును, తల పైన సువర్ణ కిరీటమును ధరించి, శ్రేష్ఠమైన రథమునందు కూర్చొని యున్న మహాపురుషుడే మా యందరికినీ పితామహుడైన భీష్ముడు, ఈయన రాజ్యలక్ష్మీ సంపన్నుడు. ఆయన, దుర్యోధనుని యధీనమునందున్నాడు. ఆయన నాకు విఘ్నకారకుడు కాడు. కనుక ఆయన వద్దకు మనము తరువాత పోవచ్చును. ఆయనతో నేను యుద్ధముచేయుచున్నప్పుడు మాత్రము నీవు జాగ్రత్తతో అశ్వములను నడపవలయును సుమా!"

జనమేజయా! ఉత్తరుడు అర్జునుని మాటలన్నియు విని ఆతడు చెప్పిన చొప్పుననే రథమును కృపాచార్యులవైపు తోలుకొని పోయెను."

అని చెప్పి వైశంపాయనుడు తరువాతి యుద్ధ వృత్తాంతమును జనమేజయునకిట్లు చెప్పదొడగెను:-

దేవతలు అర్జున కృపాచార్యుల యుద్ధము చూచుటకు వచ్చుట

"జనమేజయా! కురుసైనికులు మందమందముగా నడిచిపోవుట యెట్లుం డెననగా గ్రీష్మాంతమునందు, మందమారుతముచేత వర్షారంభమున ప్రేరితములై మెల్లగా వచ్చుచున్న మేఘములా యను నట్లుండెను.

అశ్వసైనికులు దగ్గరకువచ్చి నిలిచిరి. వారితో పాటు గజసైనికులు గూడవచ్చిరి. ఆ సమయమునందే యింద్రుడు దేవసేనలతో పాటు అక్కడికి వచ్చెను.

అప్పుడు దేవ యక్ష గంధర్వాదుల చేత ప్రకాశించుచున్న ఆకాశము, మేఘములు వీడిన గ్రహగణములు గలదిగా విరాజిల్లెను.

ఆ దేవతలు, తమతమ శక్తులతో మనుష్యులపై ప్రయోగింపబడుచున్న యస్త్రముల భయంకర యుద్ధమును కనులార చూచుటకు వేరువేరుగా తమతమ విమానములయందు ఆకాశమున నిలిచియుండిరి.

ఆ విమానములలో నింద్రుని విమానము మిక్కిలి శోభిల్లుచుండెను. ఇచ్ఛానుసారముగా పోవు నా విమానము అనేక విధములుగ నలంకరింపబడి యుండెను. ఒకవైపు స్తంభములు బంగారువి, మరియొకవైపువి రత్నమయ ములుగ నుండెను. ఆ విమానమునందు నింద్రునితో ముప్పదిముగ్గురు దేవత లుండిరి.

వారుగాక, గంధర్వ-రాక్షస-సర్ప - పితృ-మహర్షి - వసుమనస్సు అను నృపతి-బలాక్ష-సుప్రవర్ధన-అష్టక-శిబి - యయాతి - నహుష-మను-పురు-రఘు- భాను-కృశాశ్వ-సగర - నల" ఇత్యాదులు తేజోవంతములైన రూపములను ధరించి దేవరాజ విమానమునందు విరాజమానులై కనపడు చుండిరి.

'అగ్ని-ఈశ్వరుడు-సోముడు -వరుణుడు - ప్రజాపతి - ధాత - విధాత - కుబేరుడు-యముడు-అలంబుషుడు-ఉగ్రసేనుడు - తుంబురు గంధర్వుడు' ఈ మొదలైన వారు తమతమ శరీరముల కొలతల ప్రకారము నిర్మింపబడిన విమా నములలో నాకాశమునందు వేరువేరు స్థలములందు విరాజిల్లుచుండిరి.

సర్వదేవతా సమూహములు, మహర్షులు, సిద్ధులు, అర్జునునకు కౌరవ సేనలకు జరుగు యుద్ధమును చూచుటకు సమావిష్టులై యుండిరి.

దివ్యములైన వివిధ పుష్పమాలికల సుగంధము, వసంత ఋతువునందు వనముల సుగంధమువలె అంతట వ్యాపించెను.

విమానములలో కూర్చునియున్న దేవతలు ధరించిన రత్నములు-ఛత్రములు-వస్త్రములు-పుష్పమాలికలు - వ్యజన - చామరములు ప్రకాశమానములై కనపడుచుండెను.

అప్పుడు, భూమిపైనున్న ధూళి శాంతించెను. పృథివియందలి సమస్త వస్తువులపైన దివ్య కిరణముల ప్రకాశము కప్పబడియుండెను. వాయువు దివ్య గంధములతో వీచుచు యుద్ధ వీరులను సేవించుచుండెను.

దేవతల చిత్ర విచిత్ర విమానములు అనేక రత్నకాంతులతో భాసిల్లుచుండెను. ఆ విమానములలో కొన్ని ఆకాశమునందు స్థిరములై నిలిచియుండెను. మరికొన్ని క్రిందకు మీదకు ఎగురుచుండెను వాటిచేత ఆకాశము చిత్ర విచిత్రముగా భాసిల్లుచుండెను.

అక్కడ విమానస్థ దేవతలతో చుట్టబడిన యింద్రుడు కమలములు-కలువల యొక్క మాలికలు ధరించి విరాజమానుడై యుండెను.

ఆ దేవతలందరు, అనేక వీరులతో నర్జునుడు చేయుచున్న యుద్ధమును పలుసార్లు చూచుచుగూడ తృప్తి చెందకుండ నుత్సాహముతో విడువక చూచుచునే యుండిరి.

అని చెప్పి వైశంపాయనుడు తరువాతి యుద్ధ వృత్తాంతము నిట్లు చెప్ప దొడగెను:-

అర్జున కృపాచార్యుల యుద్ధము

"జనమేజయా! వ్యూహములుగా పన్నబడియున్న కురుసేనలను చూచి యర్జునుడప్పుడు ఉత్తరునితో, సారథీ! అదుగో, బంగారు వేది చిహ్నముగా గల రథధ్వజమున్నదే, ఆ వైపు మన రథమును పోనిమ్ము. ఆ రథమునందున్న వీరుడే కృపాచార్యుడు."

"అని చెప్పగనే జనమేజయా! అర్జునుని యాజ్ఞమేరకు ఉత్తరుడు, సువర్ణాభరణములతో ప్రకాశించుచు వెండివలె తెల్లగానున్న తన అశ్వములను కృపాచార్యులవైపు తోలెను. అవి కుపితములై పరుగెత్తుచున్న వాయువునట్లు త్వరగా పోయెను. వివిధ గమనములతో నశ్వములను నడుపుచున్న ఉత్తరుని అశ్వవిద్యా నైపుణ్యమును చూచి కురుసేనలు మోహము చెంది, ఆ గుఱ్ఱములు ఏ రథికుని వైపుపోవుచున్నదియు తెలియజాలకుండిరి.

ఉత్తరునకు ఏ వైపునుండి గూడ ఏలాటి భయము లేకుండెను. అతడు కృపాచార్యుల రథము దగ్గరకు పోయి రథముతోనే ఆ వీరునికి ప్రదక్షిణము చేసి అతని యెదుట నిలిచెను.

తరువాత అర్జునుడు తన పేరు తెలిపి శంఖమును బిగ్గరగా ఊదెను. పర్వతము చీలినప్పటి ధ్వనివలె ఆ శంఖారావముచేత దిక్కులు పిక్కటిల్లెను. కురుసైనికులు ఆ ధ్వనిని శ్లాఘించుచు, 'అర్జునుడింత బిగ్గరగా ఊదినను శంఖము పగులకున్నది ఆశ్చర్యము! మరియొకటియైనచో ఈ ధ్వనికి నూరు ప్రక్కలుగా చీలియుండెడిది' అనిరి.

ఆ శంఖధ్వని స్వర్గము వరకు పోయిపోయి ఆ లోకమునకు కొట్టుకొని తిరిగివచ్చి పూర్వమువలెనే గంభీరముగా వినపడగా, యుద్ధభూమిలోనివారు, 'ఇంద్రుడే వజ్రాయుధము పర్వతముపై కొట్టగా ఈ ధ్వని వెడలెనా!' అని ఆశ్చర్యము భయము ప్రకటించిరి.

ఇంతలో మహా బలపరాక్రమసంపన్నుడైన కృపాచార్యుడు ఆ ధ్వని విని యుద్ధసన్నద్ధుడై తాను గూడ శంఖమును పూరించి ధనుష్టంకారము చేసెను ఆ రెండు ధ్వనులు మూడు లోకముల నావరించెను.

ఆ యిరువురు మహా రథికులు తలపడి పోరాడుచుండగా, రెండు శరదృతు మేఘములు తలపడినట్లు చూచు వారికి గోచరించెను.

అప్పుడు కృపాచార్యుడు త్వరగా పది బాణములతో నర్జునుని కొట్టెను. అర్జునుడు కూడ సుప్రసిద్ధ గాండీవము నెక్కుపెట్టి అనేక బాణములను కృపాచార్యుని పైకి ప్రయోగించెను. రక్త భోజనమును చేయు నూర్లు, వేలును అగు పార్థుని బాణములను కృపాచార్యుడు నడుమనే నరికెను.

అప్పుడర్జును డతిక్రుద్ధుడై చిత్ర విచిత్ర గతులతో బాణప్రయోగము చేసి దశదిశలు బాణములతో కప్పెను. దిక్కులు, ఆకాశమంతయు బాణాచ్ఛాదనము చేత అంధకార బంధురమయ్యెను.

అర్జునుడు అగ్ని సమానములగు ననేక బాణములతో కృపుని కప్పగా నతడును కోపించి వేలకొలది బాణములతో నర్జునునికప్పి సింహనాదము చేసెను.

అర్జునుడు నాలుగు దివ్యబాణములతో నాల్గు గుఱ్ఱములను కొట్టెను. ఆ దెబ్బతో కృపాచార్యుని గుఱ్ఱము లొక్కసారి చెంగున ఎగిరెను. దానితో కృపాచార్యుడు రథము నుండి క్రింద పడెను. అది చూచి అర్జునుడతని యందు గౌరవముచే నతనిని మరల కొట్టలేదు.

కృపాచార్యుడు మరల రథమునందు కూర్చుని పది బాణములతో నర్జునుని కొట్టెను. అర్జునుడు 'భల్ల' బాణముతో నతని ధనుస్సు విరిచి చేతి తొడుగులను నశింపజేసెను తరువాత కృపాచార్యుని కవచమును గూడ బాణములతో చిన్నాభిన్నము చేసెనుగాని, యతని శరీరము మాత్రము నొప్పింపలేదు.

కవచము పోయిన తరువాత కృపాచార్యుని శరీరము అప్పుడే కుబుసము వీడిన సర్ప శరీరమువలె తళతళ మెరయుచుండెను.

అప్పుడతడు మరియొక ధనుస్సును తీసికొనెను. దానిని, ఆ తరువాత తీసికొనిన పెక్కు ధనుస్సులను గూడ వెంట వెంట అర్జునుడు విరిచెను.

అప్పుడు కృపాచార్యుడు 'రథశక్తి' అను నాయుధమును తీసికొని దానిని పిడుగు వైచినట్లు అర్జునునిపై విసరెను. అది ఆకాశము నుండి కొరవివలె మండుచు తనపై పడుచుండగా నర్జునుడు పది బాణములతో కొట్టెను. అది పది శకలములుగా విరిగి నేలపై పడెను.

వెంటనే కృపాచార్యుడు ధనుస్సునందు పది 'భల్ల' బాణములను సంధించి ఒక్కసారి అర్జునునిపై వేసెను. అప్పుడర్జునుడు పదుమూడు అగ్నితేజస్సుగల నిశిత బాణములను కృపాచార్యునిపై వేసెను. ఆ తరువాత అతని రథము కాడిమ్రానును ఒక బాణముతోను, నాల్గింటితో నాల్గు గుఱ్ఱములను, ఆరవదానితో సారథి శిరస్సును, మూడింటితో రథపు మూడు వేణువులను, రెండింటితో ఇరుసును, పన్నెండవ భల్ల బాణముచేత కృపాచార్యుల రథధ్వజమును, చివరకు

పదమూడవదైన పిడుగువంటి బాణము చేత కృపాచార్యుని వక్షమును అవలీలగా కొట్టెను.

ఇట్లు కృపాచార్యుడు ఛిన్నధనువై, విరథుడై, హతాశుడై, హతసారథియైన వెంటనే గదాపాణియై రథమునుండి దుమికి అర్జునుని పైకి గదను విసరెను. ఆ గదను అర్జునుడు కొట్టి నడిమి నుండియే త్రిప్పిగొట్టెను.

కృపాచార్యుని ప్రాణ రక్షణము చేయగోరి కురు సైనికులు అతనికి బాసటగావచ్చి, అర్జునునిపై బాణవర్షము కురియించిరి.

అప్పుడు ఉత్తరుడు రథాశ్వములను కుడివైపుగా మరలించెను. మండలాకారములతో రథసంచాలనము చేయుచు ఆ సైనికులందరిని బాణ వర్షము చేత అర్జునుడు నిలువరింప చేసెను.

తరువాత యోధులు విరథుడైన కృపాచార్యుని తోడుకొని అర్జునుని బారి నుండి తప్పించుకొని పోయిరి" అని చెప్పి వైశంపాయనుడు తరువాతి యుద్ధ వృత్తాంతమును జనమేజయునకిట్లు చెప్పదొడగెను:-

ద్రోణార్జుల యుద్ధము - ద్రోణుని పలాయనము

"జనమేజయా! అట్లు కృపాచార్యుడు తొలగిపోవగనే ద్రోణాచార్యుడు ధనుర్ధారియై ఎఱ్ఱని గుఱ్ఱములు కట్టబడిన రథమునందుండి అర్జునునిపై దాడి చేసెను.

అట్లు బంగారు రథమునందు వచ్చుచున్న గురువర్యుని చూచి అర్జునుడు ఉత్తరునితో నిట్లనెను:-

"ఉత్తరా! ఎత్తైన దండముపై ఎగురుచు సువర్ణవేది ధ్వజ చిహ్నముతో ప్రకాశించునదే ద్రోణాచార్యుల సైన్యము. అక్కడకు నన్ను తీసికొనిపొమ్ము. అదుగో ఎఱ్ఱని అశ్వములు గల రథమే ఆయనది ఆ గుఱ్ఱములు అన్ని విధములైన యుద్ధ శిక్షణములలో నిపుణములు

ఆ వీరుడు మహాబల పరాక్రమ సంపన్నుడు, సర్వలోక ప్రసిద్ధుడు, ద్రోణాచార్యుడు శుక్రాచార్యునితో సమానమైన బుద్ధి కౌశలము గలిగి నీతియందు బృహస్పతికి ఈడైనవాడు.

చతుర్వేదములు - బ్రహ్మచర్యము - ప్రయోగోప సంహారములతో గూడిన సర్వదివ్యాస్త్రములు - పరిపూర్ణమైన ధనుర్వేదము - శాంతి - దానము- సత్యము - దయ - సరళ స్వభావము - ఇంకను ఇతర సద్గుణములన్నియు ఆ మహాత్మునియందు సర్వదా ప్రతిష్ఠితములై యుండును. అందువలన నేను ఆ మహాత్మునితో యుద్ధము చేయగోరుచున్నాను. ఆయన కడకు నన్ను త్వరగా తోడుకొని పొమ్ము."

"జనమేజయా! అర్జునుని యాజ్ఞప్రకారమే ఉత్తరుడు ద్రోణుని రథము వైపు తేరు తోలెను.

అటు వచ్చుచున్న అర్జునుని ద్రోణుడు ఎదుర్కొనెను. ఆ యిరువురి సమాగమము రెండు మదగజములు తలపడినట్లుండెను. ద్రోణుడు శంఖనాదము చేసెను. అది నూరు నగారాలు వాయించినట్లుండెను. ఆ ధ్వని చేత సైన్య మంతయు నుప్పొంగిన మహా సముద్రమువలె క్షోభిల్లెను.

అట్లు ఎరుపు తెలుపు వర్ణములు గల ద్రోణార్జునుల అశ్వముల కలయి కను చూచి యోధులు విస్మయము చెందిరి. మహా రథికోత్తములైన ఆ గురు శిష్యు లిరువురు పరస్పరము తలపడుట చూచి కౌరవ సైన్యము భయము చేత గడగడ వణకెను.

అప్పుడు అర్జునుడు మహానందముతో అవలీలగా తన రథమును ద్రోణుని రథమునకు సమీపముగా పోనిచ్చి ఆచార్యునకు నమస్కారము చేసి శాంతి పూర్వ కముగా నిట్లనెను:-

"ఆచార్యవర్యా! యుద్ధములో నిన్ను జయించుట కఠినము, మేము అనేక సంవత్సరములు వనమునందు నివసించి యెన్నియో కష్టములు అనుభవించితిమి. ఇప్పుడు ప్రతిక్రియ చేయగోరుచున్నాము. అందువలన తమరు మాపై కోపము చూపదగరు.

మహాత్మా! తమరు తొలుత నాపైన బాణప్రయోగము చేసిన గాని నేను తమపై చేయను. ఇది నా నిశ్చయము. కాబట్టి తమరే తొలుత నన్ను కొట్టుడు."

ఆ ప్రకారమే ద్రోణుడు అర్జునుని పైన ఇరువదికి మించిన బాణములు తొలుత వేసెను. అర్జునుడు అవి తనను సమీపించక పూర్వమే నడుమనే వాటిని ఛేదించెను.

ద్రోణుడు శతసహస్ర బాణములను అర్జునుని రథముపైన కురియించి, ఆతని శ్వేతవాహనములను గూడ బాణములతో ముంచెను ఈ కార్యముల చేత ద్రోణుడు పార్థుని కోపము అతిశయింప జేయుచున్నాడా యనునట్లుండెను.

"ఇట్లు ఒకరికొందరు తీసిపోకుండ ద్రోణార్జునులు సమానముగా బాణ ప్రయోగము చేయుచుండిరి. సమాన బలపరాక్రమములు గలిగి-సమాన దివ్యాస్త్ర బలసంపదగల గురుశిష్యులు యుద్ధము చేయుచుండగా, ఇతర రాజవీరులు చూచి మోహము చెందిరి. ఇరువురిని సాధువాదముల చేత శ్లాఘించిరి.

'పార్థునకు దప్ప ద్రోణునితో యుద్ధము చేయు సామర్థ్య మితరున కెవరి కున్నది? క్షత్రియ ధర్మమెంత భయంకరమైనది! అర్జునుడు గురువుతోనే యుద్ధము చేసెనే!' అని ఆ యుద్ధభూమి యందున్నవారు అనుకొనిరి.

ఇరువురు పరస్పరము బాణములతో ముంచుకొనిరి ద్రోణుడు ధనుస్సు నెక్కుపెట్టి ప్రయోగించిన బాణములు సూర్య మండలమును కప్పివేసెను. మేఘము వాన చేత పర్వతమును కొట్టినట్లు అతడర్జునుని బాణములతో కొట్టెను. అర్జునుడు గూడ అనేక బాణముల నాచార్యునిపై ప్రయోగించి ఆయన బాణములను నశింపజేసెను. అది చూచు వారలకు ఆశ్చర్యకరముగా నుండెను.

అప్పుడర్జునుడు రథముతో నంతట సంచరించుచు అన్ని దిక్కులకు బాణములు విసరి, ఆకాశమును అంధకార బంధురము చేసెను.

అప్పుడు ద్రోణుడు, మంచుచేత కప్పబడినట్లు కనపడకుండెను. అర్జున శరములచే కప్పబడిన ద్రోణుడు అంతటను దహింపబడుచున్న పర్వతమువలె నుండెను.

పార్థుని శరముల చేత తన రథము కప్పబడియుండుటను చూచి ద్రోణుడు ధనుస్సు ఎక్కుపెట్టి కోపముతో అగ్నిచక్రము వంటి ఉత్తమాస్త్రము చేత ఆ బాణములను ఛేదించెను. అప్పుడు వెదుళ్ళు కాలినప్పుడు వెడలుచున్న భయంకర పటపట శబ్దములవలె మహాధ్వని వెడలెను.

అప్పుడు ద్రోణుడు పుంఖాను పుంఖములుగా బాణములు విడిచి దిక్కులను సూర్యమండలమును కప్పివేసెను. ఆకాశమునందా బాణములు మెరయుచుండెను. ఇట్లు విడువబడిన ద్రోణచార్యుని బాణములు ఒకటి వెనుక నొకటి క్రమముగా

తగులుకొని, భూమినుండి ఆకాశము వరకతడొకే సుదీర్ఘ బాణమును ప్రయో గించెనా యనునట్లుండెను. ఆ యిరువురి శరములు ఆకాశమునందు ఉల్కల (కొరవులు)వలె మండుచు కనపడెను.

కంకపక్షములతో, మయూర పక్షములతో ప్రకాశించు నా యిరువురి బాణములు ఆకాశమునందు శరదృతువునందు స్వేచ్ఛగా సంచరించు హంసల పంక్తులవలె శోభిల్లెను.

ఇంద్ర - వృత్రాసురులవలె ఆ యిరువురు అతిఘోరముగా పోరాడు చుండిరి. రెండు గజములు దంతములతో పరస్పరము కొట్టుకొనుచున్నట్లా యిరు వురు దీర్ఘబాణములతో కొట్టుకొనుచుండిరి. దివ్యాస్త్రములను,వాటి నామోచ్చారణము చేయుచు ప్రయోగించుచుండిరి.

ఆచార్యుడు విడిచిన వాడి బాణములను అర్జునుడు తన బాణములతో త్రిప్పగొట్టెను. ఇట్లనేక బాణప్రయోగముల చేత తనను సంహరించదలచుచున్న అర్జునునితో ద్రోణాచార్యుడు గూడ బాణక్రీడ సలిపెను.

అది దేవదానవుల యుద్ధమువలె నుండెను. ఇంద్ర-వాయు-అగ్ని దేవతాక ములగు నస్త్రములను ద్రోణుడు విడిచిన వెంటనే యర్జునుడు గూడ అట్టి యస్త్ర ములతోనే వాటిని నివారించెను.

అర్జున ప్రయుక్తములైనబాణములచ్చటి యోధులపై పడినప్పుడవి పర్వతము లపై పిడుగు పడినప్పటి ధ్వనివలె అతిభయంకరముగా వినబడుచుండెను. చతు రంగ బలములు రక్తసిక్తములై,పూచిన మోదుగులవలెనుండెను.ఆ యుద్ధమునందు విరిగిన చేతులచేత, రథములచేత, కవచములచేత, ధ్వజములచేత, యోధుల చేత, ఆ సైన్యమంతయు మిక్కిలి గగ్గోలు పడియుండెను. పరస్పరము వారు వాడి శరములచేత శరీరములను చీరుకొనుచుండిరి.

బలిచక్రవర్తి - ఇంద్రుడు పోరాడుచున్నట్లు వారి యుద్ధము భయంకర ముగ నుండెను. ఇరువురు ప్రాణములను పందెముగ నొడ్డి యుద్ధద్యూతమును ఆడుచు నొండొరులను చీల్చుకొను చుండిరి.

ఆకాశమునందు దేవతలు ద్రోణార్జునుల దుష్కర యుద్ధ కృత్యములను చూచి బిగ్గరగా అరచుచుండిరి.

పార్థుని సామర్థ్యము చూచి ద్రోణునకు విస్మయము కలిగెను. అప్పు డర్జునుడు కురియించిన బాణవర్షము మిడుతల దండువలె ఆశ్చర్యము కలిగించెను. దేవతలకు ప్రశంసాపాత్ర మయ్యెను. ఎడతెగకుండ అర్జునుడు విడుచు బాణముల నడుమ వాయువు గూడ దూరుటకు అవకాశము లేకుండెను.

అతడు బాణములను తీయుట, సంధించుట, విడుచుట, వీటిలో అంతరము కానరాకుండెను. అట్లు ఇరువురును అతి శీఘ్రముగా అస్త్రయుద్ధము చేయుచుండగా పార్థుని బాణవర్షము శీఘ్రతర మయ్యెను.

అతడు నూర్లు వేలు బాణములను ఒక్కసారి ప్రయోగించి ద్రోణుని రథమును ఆచ్ఛాదించుటను చూచి సైనికులలో హాహాకారము పుట్టెను. పార్థుని అస్త్ర ప్రయోగ కౌశలమును ఇంద్రాది దేవతలు ప్రశంసించు చుండిరి.

అప్పుడాచార్యపుత్రుడు అశ్వత్థామ గొప్ప సైన్యముతో తండ్రికి బాసటగా వచ్చి అర్జునుని పొదివెను. అతడర్జునుని పరాక్రమమును మనస్సులో శ్లాఘించియు కోపముచేత నతనిపై వాడి బాణము లనేకములను కురిసెను.

అప్పుడు అర్జునుడు అశ్వత్థామ వైపు తన రథమును పోనిచ్చి ద్రోణుడు పారిపోవుటకు అవకాశము కలిగించెను.

ద్రోణుడు కవచము భిన్నమై, ధ్వజము విరిగిపడి, శరీరము గాయపడి యుండి ఆ యవకాశమును చూచుకొని అచటినుండి తొలగిపోయెను."

అని వైశంపాయనుడు చెప్పి తరువాతి యుద్ధ వార్తను జనమేజయునకిట్లు చెప్పదొడగెను:-

అర్జున - అశ్వత్థామల యుద్ధము

"జనమేజయా! అప్పుడు తనపైకి వాయు వేగముతో వచ్చిన అశ్వత్థామపై నర్జునుడు వర్షామేఘము నిరంతరము కురియు జలధారలవలె బాణధారలను కురిసెను.

అది దేవాసురుల యుద్ధమువలెను. ఇంద్ర-వృత్రాసురుల యుద్ధమువలెను అతి భయంకరముగా నుండెను.

అంతటను చీకట్లు క్రమ్మి సూర్యచంద్రులు గూడ కనబడకుండిరి. వెదుళ్ళు దహింపబడినప్పుడు పుట్టు పటపట శబ్దము ఇరువురి బాణప్రయోగము లందు పుట్టెను.

అశ్వత్థామాశ్వములు గాయపడి దిక్కుతోచక నిలిచియుండెను. పార్థుడు అంతటను సంచరించు చుండగా అవకాశమును గొని అశ్వత్థామ పార్థుని నారి తెగగొట్టెను. దేవతలతనిని ప్రశంసించిరి.

భీష్మ-ద్రోణ-కర్ణ-కృపాచార్యులు గూడ అశ్వత్థామను పొగడిరి. అశ్వత్థామ వాడి బాణములతో అర్జునుని యెదపైన కొట్టెను.

అప్పుడర్జునుడు మందహాసము చేసి గాండీవమునందు మరియొక అల్లె త్రాటిని సంధించి మదగజమును తాకినట్లు అశ్వత్థామపై దాడి చేసెను.

భూమండలమునందు ఏకైక వీరులైన ఆ యిరువురు విషసర్పముల వంటి తీవ్ర బాణములతో నొండొరులు కొట్టుకొను చుండిరి. పార్థుని అంబుల పొదులు అక్షయములు (తరగని బాణములు గలవి) గనుక ఆ వీరుడు రణము నందు పర్వతమువలె స్థిరముగా అచంచలుడై నిలిచెను. అశ్వత్థామ బాణములు అయిపోయినవి. అది చూచి పార్థుడు మిక్కిలి విజృంభించెను.

"అప్పుడు కర్ణుడు ధనుష్టంకారము చేసి అర్జునుని దృష్టిని ఆకర్షించెను. అర్జునుడు మహా కోపముతో కర్ణునే సంహరించు నుద్దేశముతో నతనివైపు దృష్టి మరల్చెను. ఆ యవకాశమును గొని యోధులు వేలకొలది బాణములను తెచ్చి అశ్వత్థామకు ఇచ్చిరి.

ద్రోణపుత్రుని విడిచి యర్జునుడు కర్ణుని పైననే దాడిచేసి అతనితో ద్వంద్వ యుద్ధము చేయదలచి యిట్లనెను:-

కర్ణార్జునుల సంవాదము

"కర్ణా! పూర్వము సభలో నీవు నీతో సమానుడు యుద్ధమునందెవడును లేడని డంబములు పలికితివి. దానికిప్పుడు సమయము వచ్చినది. నాతో యుద్ధము చేసి యిప్పుడు నీవు దుర్బలుడవని తెలిసికొని యిక నితరుల నెప్పుడు గూడ అవమాన పరచవు

పూర్వము నీవు ఎన్నియో అధర్మములు మాట్లాడితివి. నీవు చేయదల చిన పనులు నీకు దుష్కరములని భావించెదను. నన్నెదుర్కొనుటకు పూర్వము చేయదలచిన పనులిప్పుడు చేయుము నీ శక్తి యెంతటిదో నీకు తెలిపెదను.

ఆనాడు సభయందు కౌరవులు ద్రౌపదిని కష్టపెట్టు చుండుటను మిక్కిలి ఉత్సాహముతో చూచుచు ఆనందించితివి. దాని ఫలమిప్పు డనుభవించెదవు.

అప్పుడు ధర్మపాశ బద్ధుడనై ఓర్చుకొనియుంటిని. ఇప్పుడు నా విజయ మును నీకు చూపెదను వనమందు పన్నెండేండ్లు ఓర్చుకొని యుంటిని.

దుర్మతీ! ఆ నా కోపమునకు ప్రతి క్రియ చేసెదను. తత్ఫలితముననుభ వించుము. కర్ణా! ఇప్పుడు నాతో ద్వంద్వ యుద్ధము చేయుము. నీ సైనికులం దరు ప్రేక్షకులుగా నుండి మన అసహాయ యుద్ధమును చూచెదరు గాక"

ఆ మాటలు విని జనమేజయా! కర్ణుడిట్లనెను:-

"పార్థా! నోట మాట్లాడినంత మాత్రమున ఉపయోగము లేదు. చేతచేసి చూపుము. నీవు పనికన్న ఎక్కువ మాట్లాడెదవని లోకప్రసిద్ధి. నీ డంబపు మాటలు విని, పూర్వము నీవు ఆశక్తిచేత నేమియు చేయజాలక ఓర్చుకొని యుంటివని నిశ్చయించుకొని యున్నాము.

పూర్వము ధర్మపాశబద్ధుడనని చెప్పితివి. ఇప్పుడు కూడ బంధనము నిన్నువీడలేదు. కాని బంధవిముక్తుడనని చెప్పుకొనుచున్నావు. నీవేదో వనము నందు ధర్మార్థబద్ధుడవై 'క్లేశము ననుభవించితిననియు, ఇప్పుడు యుద్ధము చేయ దలచితిననియు' వట్టి మాటలు చెప్పుచున్నావు.

ఒకవేళ నీ కొరకు సాక్షాత్తు ఇంద్రుడు వచ్చి యుద్ధము చేసినను నన్ను వ్యథపరచ జాలడు. నేనంతటి పరాక్రమముతో పోరాడెదను చూడుము.

అర్జునా! నాతో యుద్ధము చేయవలెనని చాల కాలముగా నీవు కోరు చుంటివి. నేడు నా పరాక్రమమును చూచెదవు గాక!"

ఆ మాటలకు అర్జునుడు ఇట్లనెను:-

"రాధేయా! ఇంతకు ముందే నీవు నా దెబ్బతిని వెన్ను చూపి పారిపోయి తివి గనుక బ్రతికితివి. లేకున్న నీ తమ్ముడు చచ్చినట్లే నీవు అప్పుడే మరణించి యుందువు. తమ్ముడు చంపబడుటను చూచియు యుద్ధ భూమిని విడిచి పారిపో

యిన నీవంటి వాడితరుడెపుడును నుండడు. మానము వీడి పెద్దమనిషి వలె వచ్చి మరల మాట్లాడుచున్నావు."

"ఇట్లనుచునే, జనమేజయా! అర్జునుడు కర్ణునిపై అనేక బాణములు విడిచి యతని కవచములను ఛేదించ జూచెను.

ఇంతలో కర్ణుడు ఆ బాణములను తన శరవర్షముచేత త్రిప్పి గొట్టెను.

అర్జునుడు కర్ణుని రథాశ్వములను కొట్టి భుజములను గాయపరచి, యతని చేతి తొడుగులను చీల్చెను. కర్ణుని అంబుల పొదికట్టు త్రాటిని గూడ త్రెంపివేసి ఆ పొది క్రింద పడగొట్టెను.

కర్ణుడు వేరు అంబుల పొది తీసికొని బాణ ప్రయోగము చేసి అర్జునుని చేతి పైన కొట్టగా నతని పిడికిలి సడలెను.

పార్థుడు కర్ణుని ధనుస్సు ఛేదించెను. కర్ణుడు శక్తిని ప్రయోగించెను. దానిని గూడ అర్జునుడు నష్టపరచెను. కర్ణునకు సహాయకులుగా వచ్చిన యోధులను గూడ సంహరించెను. కర్ణుని రథాశ్వములను కొట్టి నేలగూల్చెను. తీక్ష్ణ శరముచేత కర్ణుని యెదపైన కొట్టెను. ఆ బాణము కర్ణుని కవచమును ఛేదించి శరీరమునందు గ్రుచ్చుకొనెను అ దెబ్బతో కర్ణుడు సొమ్మసిల్లి యేమియుతోచక యుండెను.

ఆ నొప్పి భరించలేక ఉత్తర దిక్కుగా కర్ణుడు పారిపోయెను. అప్పుడు అర్జునుడు ఉత్తరుడు బిగ్గరగా సింహనాదములు చేసిరి."

అని చెప్పి వైశంపాయనుడు తరువాతి వృత్తాంత మిట్లు జనమేజయునకు చెప్పదొడంగెను:-

అర్జునుడు ఉత్తరుని ఓదార్చుట

"జనమేజయా! కర్ణుని జయించిన తరువాత పార్థుడు ఉత్తరునితో 'బంగారు తాటి చిహ్నముతో నున్న ధ్వజమే భీష్మునిది. ఆయన మా పితామహుడు. అతడు దేవతలకు గూడ పూజ్యుడు. నాతో యుద్ధము చేయగోరి అక్కడ నిలిచియున్నాడు. ఆయన వద్దకు నన్ను తీసికొనిపొమ్ము' అనియనెను.

ఆ మాటలకు ఉత్తరుడిట్లనెను:-

"వీరాగ్రేసరా! ఇక నేను యుద్ధభూమియందు నీ రథము నడపజాలను. నేను గాయపడినాను. నా ప్రాణములు తటతటలాడు చున్నవి. మనస్సు వ్యాకుల మైనది నీవు - కురువీరులు ప్రయోగించిన బాణముల ప్రభావముచేత నా కన్నులు తిరుగుచున్నవి. దశదిశలు పరుగెత్తుచున్నట్లు కనబడుచున్నవి. క్రొవ్వు-నెత్తురు-మాంసముల దుర్గంధముచేత నేను మూర్ఛపోయిట్టున్నాను నిన్ను చూచుచు నా మనస్సు చెదరిపోయినది.

ఇటువంటి శూరులు యుద్ధము చేయుచుండగా నేనిదివరకెప్పుడు గూడ చూడలేదు. ఈ గదాఘాతములు - శంఖ నాదములు - సింహ నాదములు - గజముల ఘీంకారములు - పిడుగువంటి గాండీవధ్వని - నేనెప్పుడును విని యుండలేదు నా చెవులు బద్ధలై నా స్మరణశక్తి నశించినది.

నీవు ఘీంకారము చేయుచు గాండీవమును ఎక్కుపెట్టుచున్నప్పుడది కొరవి వలె తిరుగుచున్నట్లు కానవడుటచే నా చూపు చెదరి గుండె పగులుచున్నట్లు తోచుచున్నది. యుద్ధమునందు అత్యుగ్రమైన నీ శరీరము క్రుద్ధుడైన రుద్రుని శరీరము వలె భయంకరముగా నుండెను

నీవు బాణములు తీసి ప్రయోగోప సంహారములను చేయుటతో అంతరము నాకు కనబడుటలేదు. అప్పుడు నీవు కనపడనే కనపడవు. కనపడినను నిన్ను చూడగానే అచేతనుడనయ్యెదను. నా ప్రాణములు శిథిలమగుచున్నవి. భూమి కంపించుచున్నట్లు తోచుచున్నది కొరడాను గాని, పగ్గములనుగాని పట్టుకొను టకు నాకు శక్తి చాలకున్నది."

ఆ మాటలు విని అర్జునుడిట్లనెను:-

"ఉత్తర కుమారా! భయపడకుము. స్థిరముగా నిలువుము. రణరంగ మునందు నీవు గూడ అత్యద్భుత కార్యములను చేసితివి. నీవు సుప్రసిద్ధ మత్స్య వంశమునందు జనించిన రాజపుత్రుడవు. శత్రు విజయమును సాధించునప్పుడిట్లు నీ మనస్సు చలించియుండగూడదు. ధైర్యముతో నా రథమునందుండి నేను యుద్ధము చేయుచున్నప్పుడు అశ్వములను నడపుము."

"జనమేజయా! అర్జునుడీ విధముగా ఉత్తరునకు ధైర్యము గొలిపి మరల నిట్లనెను:-

ఉత్తరా! నీవు త్వరగా మన రథమును భీష్మపితామహుని సేనవద్దకు తీసికొనిపొమ్ము ఈ యుద్ధమునందు నేనీ భీష్ముని అల్లెత్రాటిని తెగగొట్టెదను. నేను నేడుచేయు విచిత్ర దివ్యాస్త్ర ప్రయోగమును చూచుచుండుము.

ఆకాశమునందలి మేఘమునుండి పిడుగులు పడినట్లుగా నా గాండీవ నిర్ముక్త బాణములు పడగలవు. నా బాణప్రయోగమును కౌరవులు విస్మయముతో చూడగలరు. నేను అస్త్రప్రయోగము కుడిచేత చేయుచున్నానా నా యెడమ చేతనా యని శత్రువులందరు అనుమానముతో చూచుచుండెదరు.

పరలోకమువైపు ప్రవహించుచున్న యీ సేనానదిని మథించి వేసెదను చూడుము. ఆ నదియందు నెత్తురే నీరు, రథములే సుళ్ళు, ఏనుగులే మొసళ్ళుగా నుండి అది దాటుటకు శక్యముగాకుండ నుండగలదు.

శత్రువుల చేతులు-కాళ్ళు-శిరస్సు-వీపు-భుజములు ఇవే కొమ్మలుగాగల కౌరవ వనమును నా బాణములచేత మొదలంట నరకెదను.

కౌరవ సేనను చెండాడుచు పోవుచున్నప్పుడు నేనొక్కడనైనను, వనమును దహించుచున్న అగ్నివలె నాకు ఎటుబట్టిన నటు అనేక మార్గములు శత్రు సంహారమునకు ఏర్పడగలవు.

నా బాణముల దెబ్బలుదిని గిరగిర చక్రమువలె తిరుగు శత్రుసేనను చూడగలవు. బాణ విద్య యందు నాకుగల విచిత్రమైన శిక్షణమును అభ్యాసమును నీకు చూపించెదను.

ఉత్తర కుమారా! సమ విషమ (మిట్ట-పల్లములు) ప్రదేశములందు నీవు భ్రాంతి పడక జాగ్రత్తగా రథమునందు కూర్చొనియుండి అశ్వములను వశములో నుంచుకొనుము. సమస్తాకాశమును ఆవరించి నిలిచియున్న మహాపర్వతమును గూడ నేను బాణములతో చీల్చి వైచెదను.

నేను పూర్వము ఇంద్రుని యాజ్ఞపై పౌలోమ, కాలఖం' జాది రాక్షసులను నూర్లను - వేలను సంహరించినాను.

నేను ధనుస్సును పట్టుకొనినప్పుడు ఇంద్రుని పిడికిలికన్న నా ముష్టి దృఢముగా నుండును. బాణ ప్రయోగమునందు నా చేతి చురుకుదనము బ్రహ్మ చేతిని మించి యుండును

చిత్ర విచిత్ర గతులలో తుములు (ద్రామ్మి) యుద్ధము చేయుచున్నప్పుడు ప్రజాపతికన్న మించినవాడనని తెలిసికొనుము.

సముద్రపు ఆవలివైపునున్న 'హిరణ్యపుర' వాసులయిన అరువదివేల మహారథికులు, ధనుర్విద్యా నిపుణులయిన వీరులను జయించిన నాకు ఈ కురు వీరులు లెక్కయా!

నేడు చూడుము. ప్రబలమైన వేగముతో వచ్చు మహానదీ ప్రవాహము ఒడ్డును కొంచెము కొంచెము తెగగొట్టి కూల్చుచుండునట్లే నేనుగూడ నేడు కౌరవ సేనను క్రమముగా కొట్టి నేలగూల్చెదను.

ధ్వజము లనెడు వృక్షములు గలిగి, కాల్బలమనెడి తృణములు గలిగి, రథములనెడి సింహ వ్యాఘ్రాదులుగల కౌరవ వనములను నా యస్త్రాగ్ని జ్వాలల చేత దహించి వైచెదను.

రథము లనెడు గూండ్లనుండి కురువీరు లనెడు పక్షులను వ్యాధుడు కొట్టి పడవేసినట్లు నేలగూల్చెదను.

ఇంద్రుడు సమస్త రాక్షసులను ఒక్కడే సంహరించినట్లు నేను ఈ కురు వీరులనందరను ఒక్కడనే చంపెదను.

రుద్రునినుండి పాశుపతాస్త్రమును, వరుణునినుండి వరుణాస్త్రమును, అగ్నినుండి ఆగ్నేయాస్త్రమును, వాయువునుండి వాయవ్యాస్త్రమును, ఇంద్రుని నుండి వజ్రము మొదలయిన ఆయుధములను సంపాదించుకొనినాను.

ఉత్తర కుమారా! వీరులనెడు సింహ వ్యాఘ్రాదులచేత రక్షింపబడిన యీ ధార్తరాష్ట్రవనమును మొదలంట పెరికివైచెదను. నీవు భయపడవలసిన అవసరము లేదు."

దుశ్శాసనాదుల పరాజయము

"జనమేజయా! ఇట్లు ఆశ్వాసింపబడి ఉత్తరుడు ధైర్యము నవలంబించి భీష్ముని సైన్యముపైకి రథము తోలెను. అట్లు యుద్ధమునందు కౌరవులను జయించవలెనని వచ్చుచున్న అర్జునుని భీష్ముడు వారించెను.

అప్పుడర్జునుడు భీష్మునివైపు తిరిగి యతని ధ్వజమును నేలగూల్చెను.

అదిచూచి దుశ్శాసన, వికర్ణ, దుస్సహ, వివింశతి అను దుర్యోధనుని తమ్ములు వచ్చి భయంకరముగా ధనుర్యుద్ధము చేయుచున్న అర్జునుని నిలువరించిరి

దుశ్శాసనుడొక బాణముతో నుత్తరుని కొట్టి మరియొక బాణముతో నర్జునుని యెదపై గొట్టెను.

అతని ధనుస్సును అర్జునుడు ఒక్క బాణముతో ఛేదించి యైదు బాణములను దుశ్శాసనుని యెదపై గొట్టగనే యతడు తాళజాలక యుద్ధము విడిచి పారిపోయెను.

తరువాత వికర్ణుడు వచ్చి బాణములు తనపై ప్రయోగింపగా నర్జునుడు అతని లలాటము నొక్క బాణముతో గొట్టి క్రింద పడవేసెను.

తరువాత సోదరుని పడగొట్టిన అర్జునిపైన ప్రతీకారేచ్ఛతో దుస్సహుడు-వివింశతి వచ్చి యతనిపై శరవర్షము గురియించిరి. ఆ యిరువురిని రెండు బాణములతో కొట్టి పార్థుడు వెంటనే వారి రథాశ్వములను చంపెను. వారు హతాశులై గాయపడి సేవకుల సహాయముతో మరియొక రథమునెక్కి పారిపోయిరి.

మహా పరాక్రమశాలియైన బీభత్సుని గురి యెప్పుడు గూడ తప్పిపోకుండెను ఆతడాయుద్ధరంగమునందు అన్నివైపుల నిరాతంకముగా తిరుగుచుండెను."

అని చెప్పి వైశంపాయనుడు తరువాతి యుద్ధ వృత్తాంతమును జనమేజయునకిట్లు చెప్పదొడగెను:

అర్జునుడు కురువీరులందరితో పోరాడుట

జనమేజయా! అనంతరము, కురువీరులందరు ఏకముగా నర్జునుని పొదివిరి. అప్పుడతడు బాణములవలతో అందరినీ మంచు పర్వతమును గప్పినట్లు కప్పివేసెను.

అప్పుడా సేనయందు, గజముల ఘీంకారములు, గుఱ్ఱముల సకిలింపులు, భేరీ శంఖముల నాదములు ఏకమై బ్రహ్మాండమైన ధ్వని పుట్టెను.

అర్జునుడు మనుష్యుల యొక్క, గుఱ్ఱముల యొక్క శరీరములను, ఉక్కు కవచములను, బాణములతో కొట్టి పడవేసెను.

అప్పుడతి త్వరగా బాణప్రయోగము చేయుచున్న అర్జునుడు శరత్కాలము నందు మధ్యాహ్న మార్తాండునివలె వెలిగెను. అతని వాడికి తాళలేక రథికులు రథములనుండి, అశ్వికులు అశ్వములనుండి దుమికి, ఆయుధములను విడిచి పారిపోయిరి. ఇక కాల్బలము మాట అడుగనే అక్కర లేదు.

అర్జునుని బాణములచేత పగులుచున్న తామ్ర - రజత-లోహ కవచముల నుండి టంగు టంగుమను ధ్వని వెడలెను. యుద్ధ భూమియంతయు పీనుగుల పెంటగా మారెను. అర్జునుడు ధనుర్ధారియై యుద్ధభూమియందు నర్తనము చేయు చున్నాడా యనునట్లు నిర్భయుడై అవలీలగా తిరిగెను.

పిడుగుధ్వని వంటి గాండీవధ్వని విని భయపడిన సైన్యములు యుద్ధము విడిచి పారిపోయెను. రణభూమిపైన, కుండలములు, తలపాగలు, బంగారు హారములుగల శిరస్సులు కనబడు చుండెను బాణములచేత తెగిన అవయవముల చేతను, ధనుస్సులు ధరించిన బాహువులచేతను, కంకణాలంకృతములైన కరముల చేతను భూమి కప్పబడి యుండెను. బాణములచేత నరకబడి క్రిందికి రాలుచున్న వీరుల శిరస్సులు, ఆకాశమునుండి పాషాణము కురియుచున్నట్లు అగుపడెను.

పదుమూడు సంవత్సరములు వివశుడై వనవాసాది క్లేశముల ననుభవించిన యర్జును డిప్పుడు రౌద్రాకారముతో రుద్రపరాక్రముడై బయల్పడి కౌరవులపైన తన క్రోధాగ్ని వర్షము కురిపించు చుండెను.

అట్లు సైన్యమును దహించుచున్న అర్జునుని పరాక్రమము చూచి యోధు లందరు దుర్యోధనుడు చూచుచుండగానే నిర్వీర్యులై చల్లపడియుపడిరి.

సైన్యమును బెదరించి, మహారథికులను పారద్రోలి, అర్జునుడు రణ రంగమునందంతటను విచ్చలవిడిగా తిరుగుచుండెను.

ప్రళయకాలమునందు యముకు నిర్మించిన మహానదివలె యుద్ధరంగము నెత్తురు అను నీటి అలలతోను, ఎముకలనెడి శైవలము (నాచు తీగెలు) లతోను, ఒప్పుచుండెను. ఆ ప్రళయకాల నదియందు ధనుర్బాణములు పడవల వలె తేలి యాడుచుండెను. కేశములనెడు నాచుతీగెలుండెను. కవచములు, తలపాగలు తేలి యాడుచుండెను.

చచ్చిపడిన యేనుగులు నది యందలి తాబేళ్ళు, నీటి యేనుగులవలె ఆ నెత్తురు నదియందు తోచెను. అందులో క్రొవ్వు నెత్తురుల ప్రవాహములు అతి భయంకరముగా నుండి రౌద్రాకారము గలిగియుండెను.

ఆ రక్త నదీతీరమునందు క్రూర మృగములు నిలిచి రక్తపానము చేయుచు అరచుచుండెను. దానిలో తేలిన ఆయుధములు మొసళ్ళవలె నుండెను. క్రూర మృగములు రక్తమాంసముల నాస్వాదించు నాశ చేత నిలిచియుండెను. యోధుల తెగిపడిన ముత్యాలహారములే అలలుగా నుండెను. చిత్ర విచిత్ర భూషణములు బుడగలవలె గోచరించెను. ఆ విధముగా అర్జునుడు ఆ సేనానదిని దాటరాని దానినిగా చేసెను.

అందరు పారిపోవుట

"జనమేజయా ! దుర్యోధన - కర్ణ - దుశ్శాసన - వివింశతి - ద్రోణ - అశ్వత్థామ - పునర్మయు - కృపాచార్యాది మహారథులందరు ఏకమై యర్జునుని చంపవలెనని ఒక్కసారిగా అన్ని వైపులనుండి దాడి చేసిరి. దశదిశలందును బాణములు ప్రయోగించుచు నర్జునుడు ఆ యందరిని ఊపిరి సలుపుకొనసీయ కుండ కొట్టుచుండెను కృప - కర్ణ - ద్రోణాచార్యులు అర్జునుని పడగొట్టవలెనని శరవర్షములను గురిసిరి. ఒక అంగుళము సందులేకుండ బాణములు నిండెను.

అప్పుడర్జునుడు నవ్వి, ఇంద్రాస్త్రమును ధనుస్సునందు ఎక్కుపెట్టి బాణ పరంపరలు విసరుచు ముందుకు సాగుచుండగా, బాణములనెడు కిరణములను ప్రసరింపజేయుచున్న చండమార్తాండునివలె తేజరిల్లుచు౦డెను. ఆ బాణములచేత అతడు కురువీరులనందరిని కప్పివేసెను.

మేఘమునందు మెరుపువలె, పర్వతమునందు అగ్నివలె అర్జునుని చేతియందు గాండీవము బాణాగ్ని జ్వాలలను క్రక్కుచు ఆకాశమునందలి ఇంద్ర ధనుస్సు వలె ప్రకాశించెను.

మేఘము వాన కురియుచున్నప్పుడు ఆకాశమునందు మెరవు మెరయుచు దశదిశలు ప్రకాశింపజేసినట్లే బాణములు గురియునప్పుడు గాండీవము గూడ భాసిల్లుచుండెను.

అది చూచి సైనికులు మోహితులైరి. నిరుత్సాహులై యందరును యుద్ధ రంగము విడిచి పారిపోయిరి. జనమేజయా ! అర్జునునిచేత ఈ విధముగా భంగ పాటుచెందిన యోధులు నలుదిక్కుల పారిపోయిరి.''

భీష్మార్జునుల యుద్ధము : భీష్ముడు మూర్ఛిలుట

''జనమేజయా! అట్లు యోధులందరు అర్జునునిచేత వధింపబడుచుండగా, భీష్మపితామహుడు పార్థునిపైకి ఉరికెను. బంగారు ధనుస్సునుండి అతడు పుంఖానుపుంఖములుగా వాడి బాణములను ప్రయోగించుచుండెను.

అయన తలపైన శ్వేతచక్రము ప్రకాశించుచుండగా సూర్యోదయ కాలమందు పర్వతమువలె భాసిల్లెను. శంఖమును పూరించి దుర్యోధనాదులకు సంతోషము గలిగించుచు భీష్ముడు అర్జునునికి కుడివైపుగా పోయి యతనిని ఆపెను.

అప్పుడర్జునుడు వర్షించుచున్న మేఘమును పర్వతమువలె నెదుర్కొనెను భీష్ముడు బుసకొట్టుచున్న సర్పముల వంటి యెనిమిది బాణములను పార్థుని ధ్వజముపై ప్రయోగించెను. అవి పార్థుని ధ్వజమునందు వెలుగుచున్న వానరమును, అక్కడి భూతములను కొట్టెను.

అప్పుడర్జునుడు భల్లబాణముచేత భీష్ముని శ్వేతచ్ఛత్రమును కొట్టి క్రింద పడవేసెను. భీష్ముని ధ్వజమును రథాశ్వములను చక్రరక్షకులనుగూడ నిశిత బాణములతో వేధించెను, దానిని ఓర్వక భీష్ముడు దివ్యాస్త్రమును సంధించి అర్జునునిపై బాణవర్షము కురియించెను. అట్టి దివ్యాస్త్రమునే ప్రయోగించి పార్థుడు గూడ మహామేఘమును పర్వతమువలె భీష్ముని బాణ వర్షమును ఆపెను.

ఆ యిరువురు వీరాగ్రేసరుల కప్పుడు బలి చక్రవర్తికి ఇంద్రునకు జరిగినట్లు ద్వంద్వ యుద్ధము దొమ్మిగా జరిగెను. భీష్మార్జునులు విడిచిన బాణములు ఒండొంటిని స్పర్ధ (పోటీ) పడి కొట్టుకొనుచుండగా ఆకాశమునందు మిడుతలదండువలె ప్రకాశించుచుండెను. ఆ చిత్రమును చూచుచు యోధులు నిలిచియుండిరి.

కుడి యెడమ వైపుల సమముగా బాణములు విడుచుచున్న అర్జునుని గాండీవమప్పుడు అగ్ని చక్రమువలె భాసిల్లెను అర్జునుడు నూర్లకొలది బాణముల చేత భీష్ముని, పర్వతమును జలధారలచేతవలె కప్పివేసెను.

ఆ బాణములన్నిటిని భీష్ముడు నశింపజేసి పార్థునిపై ననేక బాణములను వేసెను. వాటిని నడుమనే అర్జునుడు ఖండింపగా ఆ బాణ శకలములు పార్థుని రథముపైన పడెను. అర్జునుడు విడిచిన బాణములు మిడుతల దండువలె భీష్ముని పైకి వచ్చి పడబోవుచుండగా నతడు వాడి బాణములచేత వాటిని నశింపచేసెను.

అది చూచి కౌరవసైనికులు 'భలే! భేష్! భీష్ముని బాణ ప్రయోగము అతి దుష్కరము' అని ప్రశంసించిరి.

'బలవంతుడు, సమర్థుడు, చురుకుదనముగలవాడు నైన అర్జునుని బాణ వేగము భీష్ముడు, కృష్ణుడు, ద్రోణాచార్యుడు దప్ప మరి ఎవరు ఆపగలరు?.' అని కూడ అందరు అనుకొనుచుండిరి.

బ్రాహ్మ - ఐంద్ర - ఆగ్నేయ - రౌద్ర - కౌబేర - వారుణ - యామ - వాయవ్యాస్త్రములను పరస్పరము ఆ యిరువురు భారత వీరులు ప్రయోగించుచు యుద్ధ క్రీడలు సలుపుచుండిరి. అది సర్వ ప్రాణుల కన్నులకు మిరుమిట్లు గొలుపుచు వాటిని మోహపరచుచుండెను. సర్వభూతములు ఇరువురిని సాధువాదముల చేత ప్రశంసించెను.

'ఆ యిరువురి బాణప్రయోగ కౌశలము మానవాతీతము, మనుష్యలోకము నందు మరియెవరు గూడ నిట్టివారులేరు' అని చూచువారలు అనుకొనిరి.

"జనమేజయా! యిట్లు ఇరువురు భరత వీరులకు దివ్యాస్త్ర యుద్ధము జరిగిన తరువాత బాణయుద్ధము మొదలయ్యెను.

అప్పుడు చురకత్తి వంటి బాణముతో నర్జునుడు భీష్ముని బంగారు ధనుస్సును ఖండించెను. వెంటనే వేరొక ధనుస్సును తీసికొని భీష్ముడు క్రుద్ధుడై బాణ ప్రయోగము చేసెను.

ఆ యిరువురు పరస్పరము వాడి బాణములను విసరుకొనుచుండిరి. వారి బాణ ప్రయోగమునందు హెచ్చు తగ్గుల భేదము చూచువారలకు తెలియకుండెను. బాణములచేత దశ దిశలు నింపిరి. ఒకరినొకరు మించుచు బాణ ప్రయోగము చేయుచున్న వారి యుద్ధము అద్భుతముగా నుండెను.

అర్జునుడు చంపిన వీరులు, చక్ర రక్షకులు అర్జునుని రథముచుట్టు పడియుండిరి. శత్రువులలో నొకడు గూడ మిగులకుండ చేయవలెనని అతి ఘోరముగా అర్జునుడు విడుచుచున్న తెల్లని బాణములు ఆకాశమునందు హంసపంక్తుల వలె విరాజిల్లుచుండెను. ఇంద్రాది దేవతలు ఆకాశము నుండి అర్జునుని శౌర్యమును ఆశ్చర్యముతో చూచుచుండిరి.

జనమేజయా! సుప్రసిద్ధ కర్మకౌశలము గలిగి, తీవ్ర పరాక్రమముతో యెవరికిని జయించుటకు సాధ్యులు కాని భీష్మార్జునులు మధ్యాహ్న సూర్యులవలె ప్రజ్వరిల్లుచుండిది.

చూచువారలకు వారి బాణ ప్రయోగోపసంహారముల అంతరము తెలియ పడకుండుటను చూచి అకాశమునందున్న చిత్రసేనుడను గంధర్వరాజు ఇంద్రునితో 'ఇటువంటి దివ్యాస్త్ర ప్రయోగ కౌశలము - ఈ యుద్ధ సామర్థ్యము మానవ లోకమునందు ఎక్కడ గూడ మనము జూడజాలము' అని ప్రశంసించెను. ఇంద్రుడు గూడ ప్రశంసించుచు ఇతరులకు దుర్నిరీక్ష్యులుగానున్న ఆ భరత వీరులపైన పుష్పవర్షము గురియించి గౌరవించెను.

అప్పుడు భీష్ముడు అర్జునుని యెడమ శరీర భాగమును, అతడు చూచు చుండగనే బాణములతో కొట్టెను. వాటిని వారించి యర్జునుడు వెంటనే భీష్ముని ధనుస్సును ఖండించెను. సూర్య తేజస్సుగల భీష్ముని యెదపైన పది బాణములు కొట్టెను. ఆ దెబ్బతో భీష్ముడు తాళజాలక రథపు నొగను పట్టుకొని సోలిపోయి మూర్ఛిల్లెను.

'ఇట్టి అవస్థ వచ్చినప్పు రథికుని రక్షణము సారథి చేయవలెను' అను యుద్ధనీతి ప్రకారము భీష్ముని సారథి రథమును దూరముగా తోలుకొని పోయెను."

అర్జున-దుర్యోధనుల యుద్ధము

"జనమేజయా! భీష్ముడు యుద్ధ రంగమును వీడి పోవగానే దుర్యోధనుడు తన రథ ధ్వజమును ఎగుర వేయించి ధనుర్ధారియై అర్జునునెదుర్కొని భల్ల బాణముచేత నతని లలాటమునందు కొట్టెను. ఆ బాణము అర్జునుని నొసటి యందు గ్రుచ్చుకొనెను. ఆ బాణము ఏక శిఖర పర్వతమునందు మొలిచి నిలిచిన ఒక వెదురువలె నర్జునుని లలాటమునందు ప్రకాశించెను. ఆ బంగారు కొనగల బాణపు దెబ్బచేత అర్జునుని లలాటమునుండి నెత్తురు గారెను.

తరువాత అర్జునుడు దుర్యోధనుని, దుర్యోధను డర్జునుని పరస్పరము బాణములచేత కొట్టుకొనిరి.

అప్పుడు మహా గజముపై వికర్ణుడు గజపాదములను రక్షించు నాల్గు రథములతో అన్నకు సహాయకుడుగా వచ్చి అర్జునుని పొదివెను.

అప్పు డర్జునుడు ఉక్కు మొనగల గాఢమైన బాణముతో ఆ యేనుగు కుంభస్థలము నందు గట్టిగా కొట్టెను. పర్వతముపైన పిడుగు పడినట్లు పడిన ఆ బాణపు దెబ్బతో గజము విల విల లాడుచు వజ్రాయుధపు దెబ్బతో విరిగిపడిన పర్వత శిఖరము వలె నేలపై గూలెను.

ఆ యేనుగు కూలగానే వికర్ణుడు ఎనిమిది నూర్ల అడుగులు పరుగెత్తి పోయి త్వరగా వివింశతి రథముపైన చేరెను.

అట్లు గజమును గూల్చి యర్జునుడు, అట్టి బాణములతోనే దుర్యోధనుని యెదపై గొట్టెను. ఈ విధముగా గజము, గజరక్షక రథములు, దుర్యోధనుడు వికర్ణుడు గాండీవముక్త బాణముఃచేత నాగిలి పోవగానే యితర యోధులు గూడ యుద్ధభూమి విడిచి పారిపోయిరి.

ఏనుగు చచ్చి యోధులు చెదరి పోవుటను చూచి దుర్యోధనుడు రథమును త్రిప్పుకొని అర్జునుడు లేని వైపుగా చూచి పారిపోయెను.

అప్పుడర్జునుడు బిగ్గరగా సింహనాదము చేసి యిట్లనెను:-

"దుర్యోధనా! నీవు కీర్తిని అభిమానమును విడిచి వెన్ను జూపి యుద్ధరంగము నుండి పారిపోవుచున్నావు. నేడు పూర్వమువలె నీ విజయ భేరులు మ్రోగుట లేదు.

నీవు ఏ ధర్మాత్ముని రాజ్య పదము నుండి భ్రష్టుని జేసితివో ఆ యుధిష్ఠిరుని యాజ్ఞచేత అతని తమ్ముడు మధ్యమ పాండవుడిప్పుడు యుద్ధము నందు నిలిచి యున్నాడు.

అందుచేత తిరిగి వచ్చి నన్నెదుర్కొనుము. క్షత్రియ ధర్మము స్మరించుకొని మెలగుము. ఇట్లు యుద్ధము నందు పారిపోవుట రాజ ధర్మము కాదు.

నీకు దుర్యోధనుడు (ఎంత కష్టపడియైనను యుద్ధము నందు ఓడింపబడుటకు సాధ్యుడు కాని వాడు) అను పేరు వ్యర్థముగా పెట్టబడినది. ఇట్లు పారిపోవుచున్న నీకు ఇక దుర్యోధనత్వము లేదు.

దుర్యోధనా! ఇప్పుడు నీకు ఏ వైపునను రక్షకులు లేరు. పరుగెత్తిపోయి నీ ప్రియమైన ప్రాణములను ఈ యర్జునుని నుండి రక్షించు కొనుము."

అర్జునుడు సమస్త కౌరవ సేనను ఓడించుట

"జనమేజయా! ఇట్లు అర్జుననిచే పిలువబడుచు దుర్యోధనుడు మహా గజము అంకుశము పొడుపుచే మరలినట్లు అభిమానముతో తిరిగి యుద్ధ రంగమునకు వచ్చెను. తోక ద్రొక్కిన సర్పమువలె అర్జునుని పొడుపు మాటలను సహింప జాలక తన రథమును అర్జునుని వైపు మరలించి యా మహా రథికునితో అతి రథుడైన దుర్యోధనుడు తల పడుటకు వచ్చుచుండెను.

అట్లు వచ్చుచున్న దుర్యోధనుని చూచి కర్ణుడు, తాను గాయపడి యున్నప్పటికిని అతనికి సహాయకుడుగా అతని యెడమ వైపు నిలిచి అర్జునునితో తాను గూడ పోరాడ దొడగెను. అప్పుడు భీష్ముడు గూడ ధనుర్ధారియై దుర్యోధనుని రక్షణార్థమై యతని వెనుక భాగమున వచ్చి నిలిచెను. అట్లే ద్రోణ-కృప-వివింశతి - దుశ్శాసనులుగూడ తిరిగి యుద్ధమునకు దుర్యోధన రక్షణార్థమై వచ్చిరి.

నిండు ప్రవాహమువలె తిరిగి తన పైకి వచ్చుచున్న సైన్యములను, అర్జునుడు, సూర్యుడు కిరణములచేత మేఘ సమూహములను తపింప జేసినట్లు, తన బాణాగ్నిచేత తపింప జేసెను.

ఆ యందరు ఒక్కసారిగా అర్జునునిపైన, మేఘములు మహా పర్వతముపైన వర్షము గురిసినట్లు, బాణ వర్షములను గురిపించిరి.

అప్పుడర్జునుడు వారి బాణములను తన బాణములతో నివారించుచు, ఇతరుల కెవరికిని వారింప వీలుకాని సమ్మోహనాస్త్రమును కురు వీరులపైన వేసెను.

తరువాత నిశిత శరములచేత దశ దిశలు కప్పి గాండీవ ధనుష్టంకారముచేత శత్రువుల మనస్సులను వ్యథ పరచెను.

సమ్మోహ నాస్త్రమును విడిచి శంఖము పూరించగానే కురు వీరులందరు సమ్మోహితులై ధనుస్సులు విడిచి మూర్ఛ పడిపోయిరి.

అట్లు అచేతనులై పడియున్న వారిని చూచి యర్జునుడు, ఉత్తరా కుమారి బొమ్మ పొత్తిళ్ళకు కురువీరుల వస్త్రములను తెమ్మని ఉత్తర కుమారునికి చెప్పిన మాట జ్ఞప్తికి తెచ్చుకొని, ఉత్తరునితో నిట్లనెను:—

"కుమారా! నీకు జ్ఞప్తి లేదా? వీరి వస్త్రములను తెమ్ము. వీరు మూర్ఛ దేరులోపల వీరిమధ్యమునుండి దూరిపోయి ద్రోణాచార్య-కృపాచార్యులు వీరిరువురి తెల్లని వస్త్రములను, కర్ణుని పసపుపచ్చని వస్త్రమును, అశ్వత్థామ దుర్యోధనుల నీలవస్త్రములను తీసుకొని రమ్ము.

భీష్మునివద్దకు మాత్రము పోవకుము, ఆయన మూర్ఛపోలేదు. ఆయనకు ఈ సమ్మోహనాస్త్రముయొక్క విరుగుడు తెలియును.

కనుక ఆయనకు ఎడమవైపుగాపోయి నీవు సైన్య మధ్యమునందు దూరిపొమ్ము. మూర్ఛపోక పడియున్న వీరుల సమీపముగా పోవలసివచ్చినప్పుడు వారి యెడమవైపునుండియే పోవలెను. ఇది యుద్ధధర్మము."

"ఆ మాటలు విని ఉత్తరుడు పగ్గములను విడిచి, రథము నుండి దిగిపోయి వస్త్రములను తీసికొని త్వరగా తన రథమును చేరుకొనెను. గుఱ్ఱములను తోలుచు ఒక్కసారి సేననంతటిని చుట్టి ఉత్తరుడు సేనాముఖమునుండి బయటకు వెడలుచుండెను.

అట్లు పోవుచున్న అర్జునునిపైన భీష్ముడు విజృంభించి బాణప్రయోగము చేసి కొట్టెను. అప్పుడర్జునుడు తిరిగి బాణములు విడిచి భీష్ముని రథాశ్వములను చంపి భీష్ముని పది బాణములతో కొట్టెను.

తరువాత అర్జునుడు భీష్ముని విడిచి యతని సారథిని బాణములతో నొప్పి పరప రథసైన్యమునుండి బయటకు, మేఘములను తన కిరణములతో చీల్చుకొని పోవు సూర్యునివలె, పోయి నిలిచెను.

అప్పుడు కురువీరుల కందరికి స్మృతి వచ్చెను. దుర్యోధనుడు యోధులను చూచి, 'అర్జునుడెట్లు మిమ్మందరిని దాటిపోయెను? ఇతడు తప్పించుకొనిపోకుండ పట్టి నలిపివేయుడు' అని యనెను.

అది విని భీష్ముడు నవ్వి దుర్యోధనునితో నిట్లనెను:—

"సుయోధనా! ఇంతవరకు నీ బుద్ధి యెక్కడికి పోయెను? నీ యీ శౌర్యమంతయు నెక్కడ నుండెను? ఇంతవరకు ధనుర్బాణములను విడిచి మూర్ఛిల్లి యుంటివి!

ఈ యర్జునుడు క్రూరుడు కాడు సుమా! పాపము చేయుట కీతని మనస్సు ఒప్పదు. తాను త్రైలోక్య రాజ్యము సాధించుటకొరకైనను తన ధర్మమును

విడువడు. అట్లతడు తలచియే యుండినయెడల మిమ్మందరిని ఇప్పుడు చంపి యుండును. అట్లతడు అధర్మ కార్యము చేయలేదు.

కురువీరుడా! ఇక నీవు త్వరగా కురుదేశములకు మరలిపొమ్ము. అర్జునుడు గోవులను గెలుచుకొనిపోవుగాక!

ఇట్లు చేయుటచేత నీ స్వార్థముగూడ నశించదు. అందరు తమ మేలు కోరుచే పని చేయవలెనుగదా! అందుకే నీవిప్పుడు నీ మేలు ఏదో అదే చేయుట మంచిదని చెప్పితిని."

"జనమేజయా! దుర్యోధను డామాటలను విని 'భీష్మపితామహుడు తన మేలుకోరియే చెప్పుచున్నాడు' అని నిశ్చయించుకొని, యుద్ధమునందిచ్ఛ విడిచి మనస్సునందే కోపమును అణచుకొని నిట్టూర్పు విడుచుచు నూరకుండెను.

తక్కిన యోధులందరుగూడ భీష్ముని మాటలు తమకు హితములని తలచియు, అర్జునాగ్ని మండుచుండుటను చూచియు, దుర్యోధనుని రక్షించు కొనుచు తిరిగిపోవుటకే నిశ్చయించుకొనిరి.

అట్లు తిరిగిపోవుచున్న కురువీరులను చూచి అర్జునుడు సంప్రీతిజెందిన వాడై ఒక్క ముహూర్తకాలము ఎవరితోను మాట్లాడక మౌనముతో నుండెను.

తరువాత భీష్మపితామహునకు, ద్రోణాచార్యులకు తలవంచి నమస్క రించెను. తరువాత అశ్వత్థామ-కృపాచార్య-బాహ్లీక-సోమదత్తాది మాన్యుల పాదములపై నమస్కార బాణములు వేసి వారియెడల తనకుగల భక్తిని ప్రక టించెను.

తరువాత ఒక్క బాణము ప్రయోగించి దుర్యోధనుని రత్న కిరీటమును క్రింద పడవేసెను. ఇతర మాన్యులందరినుండి సెలవు తీసికొని అర్జునుడు గాండీవ ధనుష్టంకారము చేసి, శంఖము పూరించి, ఆ ధ్వనిచేత శత్రువుల మన స్సులను క్షోభపరచెను.

సువర్ణహార శోభితమైన తన ధ్వజముచేత అందరు కురువీరులను తిరస్క రించుచు అర్జునుడు, తిరిగి పోవుచున్న కురువీరులను చూచి సంతోషించి ఉత్త రునితో నిట్లనెను:—

"ఇక మన రథమును మరలింపుము. నీ గోవులను గెలుచుకొంటివి. నీ శత్రువులు పారిపోయిరి. ఇక సంతోష పూర్వకముగా నీ పట్టణమునకుపొమ్ము."

"అప్పుడు జనమేజయా! అర్జునునకు కురువీరులకు జరిగిన ఆ యద్భుత యుద్ధమును ఆకాశమునందుండి చూచుచున్న దేవ గంధర్వాదులందరు, అర్జునుని బలపరాక్రమాదులను ప్రశంసించుచు తమ తమ యిండ్లకు పోయిరి."

అని చెప్పి వైశంపాయనుడు తరువాతి వృత్తాంతమును జనమేజయునితో నిట్లు చెప్పెను:—

ఉత్తరార్జునులు విరాటరాజధానికి పోవుట

"జనమేజయా! ఎద్దుల కన్నుల వంటి విశాల నేత్రములుగల అర్జునుడు యుద్ధమునందు కౌరవులను జయించి విరాటరాజు గోధనమును మరలించుకొని పోవుటకు బయలు దేరెను.

దుర్యోధనాదులు తిరిగి పోయిరి. భంగపాటు చెంది వనములలోను, ఇతర స్థలములలో భయముచేత దాగియుండిన సైనికులు బయటికివచ్చి, జుట్టు విరబోసికొని, ఆకలిదప్పులచేత బడలియుండి, అంజలిబద్ధులై భయపడుచు అర్జునుని యెదుట దీన వదనములతో నిలబడి 'పార్థా! మేము నీకు ఏమి సేవచేయవలెనో ఆజ్ఞ యిమ్ము, మా ప్రాణములను కాపాడుము, మేము నీ దాసులము' అని విన్నవించిరి."

ఆ మాటలు విని అర్జునుడిట్లనెను:—

"సైనికులారా! అనాథులను దుఃఖితులను, దీనులను, బక్కచిక్కిన వారిని వృద్ధులను, ఓడిన వారిని, ఆయుధములను కింద పడవేసిన వారిని, నిరాశ చెందిన వారిని, దోసిలొగ్గి వేడుచున్న వారిని నేను సంహరించను. మీకు మంగళమగుగాక! భయపడకుడు. నేనెప్పుడు కూడ ఆర్తిచెందిన వారిని చంపనిచ్చగించనని మీకు విశ్వాసము గలిగించుచున్నాను. మీరు సుఖముగా మీ యిండ్లకు పొండు."

"జనమేజయా! ఆ విధముగా అర్జునుడు చెప్పిన అభయవాక్కులను విని అర్జునుని ఆయుస్సు, కీర్తి అభివృద్ధి చెందుగాకయని దీవించుచు వారు వెడలి పోయిరి.

అట్లు శత్రువులను పారదోలి మదగజమువలె తిరిగి పోవుచున్న అర్జునుని పైన మరల దాడి చేయుటకు కౌరవులకు శక్తి చాలకుండెను.

అర్జునుడు ఉత్తరుని గాఢముగా ఆలింగనము చేసికొని యిట్లనెను:—

"నాయనా! నీ తండ్రి వద్ద పాండవులు, ద్రౌపది ఉన్న సంగతి నీకు తెలిసినది. కనుక నీవు నగరమునకు పోయిన తోడనే పాండవులను ప్రశంసించకుము. అది విని మీ తండ్రి భయపడి ప్రాణములే విడువ వచ్చును. తండ్రి వద్ద, నీవు కురుసైన్యమును జయించినట్లు, గోవులను గెలుచుకొని తెచ్చినట్లును, నీ శౌర్యమును ప్రశంసించు కొనుచు చెప్పుము."

ఆ మాటలకు ఉత్తరుడిట్లనెను:—

"వీరాగ్రేసరా! నీవు చేసిన అపార సాహసకర్మను చేయుటకు నాకు శక్తి లేదు గదా! అయినను, నీవు నాకు ఆజ్ఞ యిచ్చువరకు నిన్ను గూర్చి నా తండ్రి వద్ద ఏమియు చెప్పను."

అటు తరువాత జనమేజయా! అర్జునుడట్లు విజయుడై తిరిగి శమీ వృక్షము కడకుపోయి నిలిచెను. అగ్నితుల్యుడైన ధ్వజమునందలి వానరుడు, భూతములు ఆకాశమునకు ఎగిరిపోయిరి. అట్లే అర్జునుని ధ్వజముతో గూడ దైవమాయ గూడ అంతర్ధానము చెందెను.

రథముపైన మరల ఉత్తరుడు తన సింహధ్వజము నుంచెను. పాండవుల ఆయుధములన్నియు పూర్వము వలెనే జమ్మిచెట్టు నందు ఉంచి ఉత్తరుడు తాను రథికుడై విరాటనగరమునకు పోవుటకు సంసిద్ధుడయ్యెను.

అర్జునుడు శమీ వృక్షమునందుంచిన తన ఆభరణములను తీసి ధరించుకొని పూర్వమువలెనే జెడవేసికొని బృహన్నలయై పగ్గములు పట్టి సారథియై సంతోషముతో విరాటనగరము కడకు వచ్చెను.

జనమేజయా! అర్జునుడప్పుడు ఉత్తరునితో నిట్లనెను:—

"రాజపుత్రా! గోపాలకులతోపాటు గోవులన్నియు వచ్చియున్నవి. చూచుకొనుము. తరువాతనే మనము అపరాహ్ణము నందు పురములో ప్రవేశింతము. ఇంతలో మన గుఱ్ఱములకు మేత, నీరు ఇచ్చి అలసట తీర్చుదము.

ఈ గోపాలకులను త్వరగా నగరమునకు పంపుము. వీరు పోయి ప్రియమైన నీ విజయవార్తను నగరమంతట చాటెదరుగాక!"

"జనమేజయా! ఉత్తరుడు త్వరపడుచు అర్జునుని మాట మేరకు గోపాలకులతో "మీరు పోయి నా విజయవార్తను, శత్రువుల పరాజయమును, గోవుల గెలుపును గూర్చి రాజునకు చెప్పుడు" అని పంపెను.

తరువాత కొంత సేపటికి ఆ యిరువురు నగరమునకు పోవుటకు బయలు దేరిరి,

"జనమేజయా! అక్కడ విరాటరాజు దక్షిణ గోగ్రహణ యుద్ధమునందు శత్రుజయమును సాధించి పాండవులతో తిరిగి నగరమునకు చేరియుండెను. విజయియైన విరాటరాజును సభయందు పాండవాదులందరు సేవించుచుండిరి.

కొంత సేపటికి పురజనుల నందరిని పంపి విరాటరాజు 'ఉత్తరుడెక్కడ' అని అడిగెను. ఆ మాటకు రాజభవనమునందలి స్త్రీలు, కన్యకలు, ఉత్తర గోగ్రహణము సంగతి చెప్పి "బృహన్నల సారథిగా ఉత్తరుడు కౌరవులతో పోరాడుటకు ఉత్తర గోగ్రహణయుద్ధమునకు పోయెననియు, భీష్మద్రోణాది మహా వీరులతో యుద్ధము చేయుటకు ఉత్తరుడొక్కడే అసహాయుడై పోయెననియు" చెప్పిరి.

"జనమేజయా! ఆ మాటలు విని విరాటరాజు మిక్కిలి పరితపించి, 'బృహన్నల సహాయముతో ఉత్తరుడొక్కడే మహావీరులతో యుద్ధము చేయుటకు పోయెనా?' అని చింతించి మంత్రులతో నిట్లనెను:—

"త్రిగర్తులు మనకు ఓడి, ఊరక తిరిగి పోవరు. వారు కౌరవులకు సహాయకులుగా ఉత్తర దిశకు పోయియుందురు. కనుక గాయపడని యోధులందరిని కూర్చుకొని ఉత్తరునికి సహాయముగా పొండు. చతురంగబలముతో పోయి కుమారుని క్షేమము నరయుడు. నపుంసకుని సారథిగా చేసికొని పోయిన కుమారుడు శత్రువుల చేతిలో మరణించియుండును."

"జనమేజయా! ఆ మాటలు విని ధర్మరాజు, మిక్కిలి పరితపించుచున్న విరాటరాజుతో నిట్లనెను —

"రాజా! బృహన్నలయే సారథిగా నుండినచో శత్రువులు నీ గోవులను తీసికొని నేడు పోయి యుండరు. అట్టి కుశలుడైన సారథిగల నీ కుమారుడు తప్పక నేడు కౌరవులనే కాదు, దేవ-రాక్షస-సిద్ధ-యక్షాదులు వచ్చినను జయించుటకు సమర్థుడగును. నీవు భయపడకుము."

"ఇంతలో ఉత్తరుడు పంపిన దూతలు వచ్చి ఉత్తరుని విజయవార్త తెలిపిరి. ఆ విషయమును విరాటుని మంత్రి రాజు కడకు పోయి, కుమారుని విజయమును, శత్రువుల పరాజయమును, గోవుల గెలుపును, ఉత్తరుడు సారథితో క్షేమముగా తిరిగి వచ్చుచుండుటను సంతోషముతో తెలిపెను.

అవుడు యుధిష్ఠిరుడు రాజుతో నిట్లనెను:-

"మహారాజా! గోవులను గెలుచుట, కురుసైన్యమును పారదోలుట, కౌరవ వీరులైన భీష్మద్రోణాదులను ఓడించుట అనునవి బృహన్నల సారథిగాగల నీ కొడుకు చేసినాడనుటలో అద్భుత మేమియులేదు.

ఇంద్రుని సారథి మాతలిగాని, కృష్ణుని సారథి దారుకుడుగాని బృహన్నలతో సమానులు కారు. బృహన్నల యున్నచో నీ కొడుకు ఎంతటి ఘన కార్యమునైనను సాధించగలడు."

"కుమారుని విజయవార్త విని మహానందము చెందిన విరాటరాజు కుమారుని మంగళ వాద్యములతో నెదుర్కొనుమని ఆజ్ఞాపించి ఆయా పనులకు అందరిని పంపి, తాను కంకభట్టుతో పాచికలాడుటకు కూర్చొని, పాచికలను తెమ్మని సైరంధ్రితో ననెను.

అప్పుడు ధర్మరాజు విరాట రాజుతో నిట్లనెను:-

"రాజా! నీవు నేడు అతి సంతోషముతో నున్నావు. ఇట్లు సంతోషముతో నున్నవారితో జూదము ఆడగూడదని చెప్పెదరు. నీతో నేడు ఆడుటకు సాహసింప జాలకున్నాను. అయినను నీవు కోరుచున్నావు కనుక ఆడెదను."

ఆ మాటకు విరాటరాజు "కంకభట్టా! స్త్రీ సువర్ణాదులేవి గూడ నాకు జూదమువలె ప్రియములుగావు. ఇది లేనప్పుడు అవియుండియు వ్యర్థములు."

ఆ మాటకు ధర్మరాజు ఇట్లనెను:-

"రాజా! బహుదోషదుష్టమైన యీ జూదముతో నీకు ఉపయోగమేమి? కనుక దీనిని విడుచుట యుక్తము. నీవు వినలేదా? చూడలేదా?

పూర్వము యుధిష్ఠిరుడు ఈ జూదము చేతనే కదా రాజ్యమును, సోదరులను పోగొట్టుకొనెను. కనుక జూదమాడుట తగని పని.

జూదరి, అన్నియు పోగొట్టుకొనిన తరువాత తప్పక తపించును. ధర్మరాజు వివిధ రత్నములను, ధనములను పోగొట్టుకొనెను. ఇంతయేకాక, జూదమునందు పరుషవాక్కులు మాట్లాడుకొనుట, మనస్తాపము సంభవించును. ఒక్కదినములోనే సమస్త ద్రవ్యములు నశించును. కనుక జూదమును నమ్మ గూడదు. అయినను నీకు ఇచ్ఛయున్నచో నాడుదము."

"జనమేజయా! పాచికలు ఆడుచుండగా విరాటరాజు సంతోషమును పట్ట లేక యుధిష్ఠిరునితో 'చూడుము, కుమారుడు కురు వీరులందరిని ఒక్కడే జయిం చెను' అని యనెను.

ఆ మాటలకు ధర్మరాజు 'బృహన్నల సారథిగా నుండగా ఉత్తరుడు యుద్ధము నందు జయము నందకుండునా?' అని యనెను.

ఆ మాట విని విరాటుడు కుపితుడై యిట్లనెను:-

"బ్రాహ్మణాధమా! నా కొడుకును ఒక నపుంసకునితో పాటు ప్రశం సించెదవా? యుక్తాయుక్తములు తెలియక మాట్లాడుచు నన్ను అవమానించు చున్నావు. భీష్మద్రోణాదులను నా కొడుకు ఏల జయించ జాలడు? తప్పక జయించగలడు.

స్నేహ భావముతో నిన్ను క్షమించితిని. నీవు బ్రతుకదలచినచో మరల ఇట్టిమాట మాట్లాడకుము"

ఆ మాట విని యుధిష్ఠిరుడిట్లనెను:-

"రాజా! భీష్మ - ద్రోణ - దుర్యోధన - కర్ణ - కృప - అశ్వత్థామాది మహావీరులేకాక యితర మహారథికు లెందరు ఎదిరించినను, వేయేల, సమస్త దేవతాగణముతో దేవేంద్రుడే వచ్చి యుద్ధము చేసినను వారందరితో బృహన్నల దప్ప ఇతరుడెవడు యుద్ధము చేయగలడు? అతని బాహుబలముతో సమానమైనది మరియే బలముగూడ, ఇదివరకు లేదు ఇకపైన ఉండబోదు.

బృహన్నల యుద్ధము చూచిన చాలును. ఉప్పొంగి పోవును. సురాసుర మానవులందరు కలసి వచ్చినను వారందరిని జయించిన బృహన్నల సహాయ కుడుగా నుండగా ఉత్తరుడు కురు వీరులను ఏల జయించక యుండగలడు?"

"జనమేజయా! యుధిష్ఠిరుని మాటలు విని విరాటరాజు కోపించి యిట్ల నెను:-

"ఎన్నిసార్లు నేను నిషేధించినను నామాట లక్ష్యపెట్టక మాటి మాటికి ఆ మాటలే గట్టిగా చెప్పుచు నోరు మూసికొనక యున్నావు సత్యమే. శాసించు రాజు లేకున్నచో నెవడు గూడ ధర్మమును ఆచరించడు."

ఇట్లు చెప్పుచు కోపముతో విరాటరాజు పాచిక తీసికొని యుధిష్ఠిరుని ముఖముపైన 'ఇక ఇట్లు మాట్లాడవు కదా?' యని బెదిరించుచు కొట్టెను.

గట్టిగా కొట్టుట చేత యుధిష్ఠిరుని ముక్కు నుండి నెత్తురు కారెను. అది క్రింద పడకుండ ధర్మరాజు తన చేతులలోనికి తీసికొని, ప్రక్కన ఉన్న ద్రౌపదిని జూచెను.

అతని యింగితమును కనిపెట్టి ద్రౌపది వెంటనే జలము నింపిన సువర్ణ పాత్రను తెచ్చి దానియందు ధర్మరాజు దోసిలిలోనున్న నెత్తురే కాక, యింకను ముక్కులోనుండి స్రవించుచున్న రక్తమును గూడ తీసికొనెను.

అప్పుడు ఉత్తరుడు నగర వీధులలో నతనిపైన చల్లబడిన గంధమాల్యాదులతో నలంకృతుడై సంతోషించుచు వచ్చి ద్వారము నందుండి 'బృహన్నలా సహాయుడనై తాను వచ్చినా'నని తండ్రికి తెలిపెను.

విరాటరాజు సేవకునితో 'వెంటనే ఆ యిరువురిని ప్రవేశ పెట్టుము. నేను వారిని చూడగోరుచున్నాను' అని చెప్పెను.

అది విని ధర్మరాజు 'ఉత్తరునొక్కనినే ప్రవేశ పెట్టుము. బృహన్నల వలదు' అని సేవకుని చెవిలో మెల్లిగా నిట్లు చెప్పెను:-

'ఆర్యా! బృహన్నల కొక వ్రతము గలదు. యుద్ధమునందు దప్ప ఇతర స్థలములందు నన్ను గాయపరచిన వానినిగాని, నా రక్తమును కనపరచినవానినిగాని సంహరించును. నన్ను గాయపరచినవాడు జీవించజాలడు.

నా శరీరమునందు రక్తము పారుట చూచి బృహన్నల క్షమించజాలడు. ఇప్పుడే యిక్కడ విరాటరాజును మంత్రి పుత్రాదులతో గూడ సంహరించును.'

ఆ మాట ప్రకారమే సేవకుడు ఉత్తరు నొక్కనినే ప్రవేశ పెట్టెను.

అప్పుడు ఉత్తరుడు వచ్చి తండ్రికి నమస్కారము చేసి, కంకుభట్టుకు గూడ తలవంచి నమస్కరించెను.

తరువాత ఒంటరిగా కూర్చొని సైరంధ్రి సేవలు గొనుచున్న నిరపరాధి యైన కంకుని శరీరమునుండి నెత్తురు వెడలుట చూసి ఉత్తరుడు తండ్రిని, 'ఇతని నెవరు కొట్టి పాపము నాడిగట్టుకొనిరి?' అని యడుగగా విరాటుడు ఇట్లనెను:-

'ఈ కుటిలునకు ఈ దండనము చాలదు. ఇంకను ఎక్కువ కావలసి యుండెను. నీ విజయమును నేను ప్రశంసించుచుండగా నితడు నపుంసకుడైన బృహన్నలను పొగడెను. కనుక సహించజాలక నేనే యితనిని పాచికతో కొట్టితిని.'

ఆ మాట విని ఉత్తరు డిట్లనెను:-

"మహారాజా! నీవు అకార్యము చేసితివి. వెంటనే యతనిని శాంతపరచి ప్రసన్నుని చేసికొనుము. లేకున్నచో బ్రాహ్మణుని క్రోధవిషము నీ వంశమును సమూలముగా నశింపజేయును."

పుత్రుని మాటలు విని విరాటుడు నివురుగప్పిన నిప్పువలె నున్న కంక భట్టును క్షమించుమని వేడెను.

ఆ మాటలకు కంకభట్టు ఇట్లనెను:-

"రాజా! నేను చాలకాలమునుండి ఓర్పు అను వ్రతమును అవలంబించి యున్నాను. నీ యపరాధమును ఎప్పుడో క్షమించితిని. నాకు నీ యెడల కొంచము గూడ కోపము లేదు. ఈ నెత్తురు నా ముక్కునుండి క్రింద పడినచో తప్పక నీవు నీ రాజ్యముతో పాటు నశించెదవు. దోషము చేయని నన్ను నీవు కొట్టినను నిన్ను నేను నిందించను. ఎందుకనగా, బలవంతుడైన రాజులకు త్వరగా కోపము వచ్చి యిట్టి అకార్యము చేయుట సహజము."

"జనమేజయా! నెత్తురంతయు పోయిన తరువాత బృహన్నల రాజసభ యందు ప్రవేశించి, రాజునకు, కంకునకు అభివాదము చేసెను.

అప్పుడు విరాటుడు ధర్మరాజును ఓదార్చి, అర్జునుడు వినుచుండగా నుత్తరునితో నిట్లనెను:-

"కుమారా! నీ చేత నేను వాస్తవముగా పుత్రవంతుడనైతిని. నీ వంటి పుత్రుడు నాకు కలుగలేదు ఇక కలుగబోడు.

నాయనా! ఒక్కడే గురిలో అనేక వేల శత్రువులను సంహరించు కర్ణునితో నీవెట్లు పోరాడితివి?

మహారథికుడైన భీష్మునెట్లు ఎదుర్కొని యుద్ధము చేసితివి? ఈ మానవ లోకమునందే అతనికి సమానుడైన వీరుడు లేడే!

క్షత్రియ కులమునకే ఆచార్యుడు గదా, అట్టి ఆచార్య ద్రోణునితో నెట్లు పోరాడ గలిగితివి?

ఏ వీరులను రణరంగమునందు చూడగనే శత్రువులు, ధనము పోగొట్టు కొనిన వారివలె విలవిలలాడుదురో, అట్టి కృపాశ్వత్థామలతో నెట్లు యుద్ధము చేయగలిగితివి?

పర్వతమును గూడ భేదింపగలవాడే దుర్యోధనుడు, వాని నెట్లు యుద్ధము నందు ఎదుర్కొంటివి?

కుమారా! శత్రువులనుండి మన గోవులను విడిపించుకొని తెచ్చి చాల మంచిపని చేసితివి.

మన శత్రువులు ఓడిపోయిరి. నేడు నేను పీల్చుచున్న వాయువు చాల సుఖదాయకముగా నున్నది.

ఇతర జంతువులనుండి సింహము మాంసము లాగి తెచ్చినట్లు నీవు మన గోవులను తెచ్చి నాకు మహానందము కలిగించితివి."

ఆ మాటలు విని ఉత్తరుడు తండ్రితో నిట్లనెను:-

ఉత్తరుడు తన విజయమునకు కారణము చెప్పుట

"తండ్రీ! ఈ విజయ మొక దేవపుత్రుడు సాధించెను. భయపడి పారి పోవుచున్న నన్ను మరలించి తానే రథికుడై వజ్రము వంటి దృఢ శరీరము గల వీరుడు కురువీరులను పారద్రోలి గోవులను గెలిచి తెచ్చెను. నేను కాదు.

భీష్మద్రోణాది మహారథిక వీరులనందరిని అతడు చెదరగొట్టి పార ద్రోలెను. పారిపోవుచున్న దుర్యోధనునితో ఆ దేవపుత్రు డిట్లనెను:-

"దుర్యోధనా! నీవు హస్తినాపురమునకు పోయినను నీకచట రక్షణము లేదు. అందుచేత దేశదేశములు తిరుగుచు నీ ప్రాణమును కాపాడుకొనుము. నీవు

ఉరికిపోయినంత మాత్రమున విముక్తి దొరకదు. యుద్ధము చేసి, చచ్చి స్వర్గమునో, జయించి రాజ్యమునో పొందుము."

ఆ మాటలకు రోషముచేత దుర్యోధనుడు తిరిగివచ్చి సర్పమువలె బుసకొట్టుచు బాణములు విడిచెను.

అతనిని చూచి ఆ దేవపుత్రుడు బాణ ప్రయోగము చేసి, సైన్యమును, దుర్యోధనుని చాల బాధ పెట్టెను.

అది చూచి నాకు రోమాంచము కలిగెను.

సింహపరాక్రముడైన ఆ దేవపుత్రుడు భీష్మాదులైన ఆరుగురు రథిక వీరులను ఓడించి, వనమునందు సింహము వనచరములను పారద్రోలినట్లు, అందరిని పారద్రోలి, వీరులను భూమిపైన మూర్ఛపడగొట్టి వారి వస్త్రములను గూడ లాగుకొని తెచ్చెను."

ఆ మాటలు విని విరాటరాజు ఉత్తరునితో ఇట్లనెను:-

పుత్రా! మహా బాహు పరాక్రమ సంపన్నుడైన ఆ వీరుడు ఎక్కడున్నాడు? ఆ దేవపుత్రుని చూచి అతనిని పూజింపగోరుచున్నాను."

అది విని ఉత్తరుడు తండ్రితో నిట్లనెను:-

తండ్రీ! ఆ దేవపుత్రు డక్కడనే అంతర్ధానము చెందెను. రేపో ఎల్లుండో మనకు కనపడవచ్చును."

"జనమేజయా! ఈ విధముగా పొగడబడుచు మాయావేషమునందు దాగియున్న అర్జునుని విరాటరాజు కనుగొనజాలకపోయెను.

"తరువాత విరాటుని యాజ్ఞచేత బృహన్నల, యుద్ధభూమినుండి తెచ్చిన వస్త్రములను విరాట పుత్రికకు ఇచ్చెను. వివిధములైన సుందర వస్త్రములు తీసికొని ఉత్తర మహానందమొందెను.

అర్జునుడు ఉత్తరునితో పాటు ధర్మరాజుతో, తాము ఏ విధముగా తమ స్వరూపములను ప్రకటించుకొనవలెనను విషయమును సంప్రదించి అందరు నొక నిర్ణయమునకు వచ్చిరి.

ఆ నిర్ణయము ప్రకారమే ఉత్తరుడు తగు ఏర్పాట్లు చేసెను."

అని చెప్పి వైశంపాయనుడు తరువాత కథ యిట్లు చెప్పదొడగెను:-

విరాటునకు అర్జునుడు ధర్మరాజును గూర్చి తెలుపుట

"జనమేజయా! ఆ తరువాత మూడవవాడు పంచపాండవులు స్నానము చేసి శుభ్ర వస్త్రములను ధరించి అనుష్ఠానాదులను నిర్వర్తించి యుధిష్ఠిరుని ముందిడికొని సర్వాభరణభూషితులై విరాట భవన ద్వారమునందు మదపు టేనుగులవలె చేరి సభా భవనమునందు ప్రవేశించి రాజాసనములయందు కూర్చొనిరి అప్పుడు వారు వేర్వేరు యజ్ఞవేదికలయందు ప్రజ్వలించుచున్న పవిత్రాగ్నులవలె ప్రకాశించుచుండిరి.

అప్పుడు విరాటరాజు రాజ కార్యములను తీర్చుటకు సభకు వచ్చి, అచ్చట అగ్నులవలె విరాజిల్లుచున్న పాండవులను చూచి, క్షణకాలము ఊరకుండి, రోషముతో, దేవతలు పరివేష్టించియుండగా సభలో ఇంద్రునివలెనున్న కంకుభట్టుతో నిట్లనెను:-

"కంకా! పాచికలాడుటకుగాను నిన్ను నా సభలో చేర్చుకొనియుంటిని. అట్టి నీవు సకలాలంకార భూషితుడవై రాజ సింహాసనమునందెట్లు కూర్చొనియుంటివి?"

"జనమేజయా! అప్పుడర్జునుడు పరిహాసము చేయుచున్నవాని వలె నవ్వుచు విరాటునితో నిట్లనెను:-

"రాజా! ఈ మహాత్ముడు ఇంద్రుని అర్ధాసనమును గూడ ఎక్కుటకు అర్హుడు. ఈయన బ్రహ్మవేత్త. మహా విద్వాంసుడు. త్యాగధనుడు. యజ్ఞనిష్ఠ గలవాడు. తన నియమవ్రతములను దృఢముగా పాలించువాడు సుమా! ఈ మహాపురుషుని మూర్తీభవించిన ధర్మమునుగాను, పరాక్రమంతులలో నుత్తముని గాను, అధిక బుద్ధిమంతునిగను, తపోధనునిగను, వివిధ శస్త్రాస్త్ర కోవిదునిగను తెలిసికొనుము.

మూడు లోకములందును ఈ మహావీరు డెరిగినన్ని అస్త్రములను మరి యెవరును ఎరుగరని తెలిసికొనుము. దూరదృష్టి గలవాడు. మహా తేజశ్శాలి, ప్రజలకు ప్రియుడునై పాండవులలో నతిరథుడై మహర్షి సమానుడైన రాజర్షి యీ మహాత్ముడు, సర్వలోకములందును ప్రఖ్యాతుడు. బల, ధైర్య, సామర్థ్య, సత్య, జితేంద్రియత్వ, ధన సంపదలలో ఇంద్ర కుబేరుల వంటివాడు సుమా

ఈ తేజశ్శాలి మనువు లోకమును పాలించునట్లు ప్రజాదరమును సంపాదించిన ప్రజా పాలకుడు. ఈ మహా పురుషుడే కురువంశాధిపుడైన 'యుధిష్ఠిర' మహారాజు, ధర్మరాజు!

ఈయన కీర్తి లోకమునందు సూర్య తేజస్సువలె ప్రకాశించుచున్నది. సూర్యకిరణములవలె నీ మహాత్ముని కీర్తిప్రభలు సర్వదిక్కులయందును ప్రసరించుచున్నవి.

ఈయన కురుదేశము లేలుచున్నప్పుడు ఈయన వెనుక పదివేల యేనుగులు, ముప్పదివేల రథములు అనుసరించి పోవుచుండెను మహర్షులు ఇంద్రుని స్తుతించునట్లు ఈయనను ఎనిమిదివందలమంది వందిమాగధులు స్తుతించుచుండిరి.

కురుదేశ వాసులందరు ఈయనను, కుబేరుని దేవతలవలె, కింకరులై ఉపాసించుచుండిరి. ఈయన రాజులందరిని వివశులనుచేసి, వారినుండి కప్పములను గొనుచుండెను.

పదునెనిమిది వేలమంది స్నాతకులు (వ్రతనిష్ఠ గలవారు) ఈయనను ఆశ్రయించి జీవనము గడపికొనుచుండిరి వృద్ధులను, అనాథులను, కుంటి - గ్రుడ్డివారను, ఇతర ప్రజలను, ధర్మనిష్ఠుడై తన పుత్రులవలె ఈయన పరిపాలించెను.

క్రోధమన్నది యెరుగడు. ఈయనకు గలిగిన సంతాపముచేత దుర్యోధనుడు సపరివారముగా త్వరలోనే పరితాపము చెందగలడు.

రాజా! ఈ మహాత్ముని సుగుణములను లెక్కించుటకు ఎవరికిని సాధ్యము కాదు. ఇటువంటి మహారాజు, పాండవ శ్రేష్ఠుడునైన యుధిష్ఠిరుడు, రాజా! రాజోచితమైన సింహాసనమునందు కూర్చొనుటకు అర్హుడెట్లుకాడు?"

ఆ మాటలువిని విరాటరాజు బృహన్నలతో ఇట్లనెను:-

భీమాదుల పరిచయము

"బృహన్నలా! ఇతడే యుధిష్ఠిరుడైనచో భీమాదులు, ద్రౌపది యెక్కడ నున్నారు? జూదమునందు ఓడిపోయినప్పటినుండి వారి సమాచారమే తెలియ లేదు."

ఆ మాటకు విరాటరాజునకు అర్జునుడిట్లు చెప్పెను:-

"రాజా! 'బల్లవు'డను పేరుతో మీ వంటల వాడుగా నున్నవాడే భయంకర వేగ పరాక్రమములు గల భీమసేనుడు. ఇతడే గంధమాదన పర్వతమునందు 'క్రోధవశులు' అను రాక్షసులను సంహరించి ద్రౌపదికి సౌగంధిక పుష్పములను హరించి తెచ్చినవాడు.

ఇతడే గంధర్వుడై దురాత్ములయిన కీచకులను చంపెను.

నీ అంతఃపురమునందు స్త్రీల వినోదార్థమై వ్యాఘ్ర - భల్లూక - వరాహములతో నితడే పోరాడి చంపెను.

హిడింబ - బక - కిమ్మీర - జటాసురులను సంహరించి అరణ్యమంతటిని నిష్కంటకము చేసినవాడును నితడే.

రాజా! నీ యశ్వశాలాధిపతిగా నింతవరకు నుండినవాడే శత్రు సంతాపకరుడయిన నకులుడు. గోశాలాధిపతి సహదేవుడు. ఈ ఇరువురు, మహారథికులైన మాద్రీపుత్రులు.

వీరు శృంగారముగా వేషాభరణములను ధరించి, రూపవంతులయి యశస్కులయిన వారు.

వేయిమంది మహారథికులలో సమర్థులయిన భరత కులశ్రేష్ఠులు నకుల సహదేవులు సుమా!

పద్మపత్ర దళాయతాక్షియై సుందరముగా నవ్వుచున్న సైరంధ్రియే ద్రౌపదియని తెలిసికొనుము. ఈమె కొరకేగదా కీచకులు హతులైరి!

రాజా! నేనే అర్జునుడను, నాపేరు తప్పక నీవు విని యుందువు. భీమునకంటె చిన్నవాడను. నకుల సహదేవులకన్న పెద్దవాడను.

మహారాజా! మేము ఈ యజ్ఞాతవాస సంవత్సరము నీ యింటియందు సుఖముగా గర్భమునందు శిశువులవలె క్షేమముగా నివసించితిమి."

"జనమేజయా! అర్జునుడిట్లు చెప్పగనే ఉత్తరుడు అర్జునుని పరాక్రమమును గూర్చి మరల తండ్రికి చెప్పెను. పాండవులందరిని మరల తండ్రికి చూపుచు నిట్లనెను:-

"బంగారువలె పరిశుద్ధ దేహవర్ణము గలిగి, మహాసింహమువలె అభివృద్ధుడై, భయంకరమైన నాసిక గలిగి, విశాల సుదీర్ఘములు, ఎఱ్ఱనివియునైన కన్నులు గలవాడు కురురాజైన యుధిష్ఠిరుడు.

మదగజగమనము గలిగి బంగారు వర్ణముగలిగి, బలిసి పొడవుగానున్న భుజములు గలిగినవాడే భీమసేనుడు.

చూడుమితనిని. ఈ భీముని పక్కనే యున్నాడే, అతడే అర్జునుడు. ఇతడు శ్యామవర్ణముగలిగి, మహాధనుష్మంతుడై గజయూథపతివలె విరాజిల్లుచున్నాడు. కమలాయతాక్షుడు, ఉన్నత భుజశోభితుడు, గజమువలె గంభీరగమనము గలవాడితడు.

యుధిష్ఠిరుని సమీపమునందున్న పురుషశ్రేష్ఠులే నకుల సహదేవులు. వీరు ఇంద్రవిష్ణు సమానులు. మానవ లోకమునందు రూప - బల - శీలములందు ఎవడుగూడ వీరికి సమానుడు లేడు.

వీరిరువురి ప్రక్కన, కనకమువంటి శ్రేష్ఠ శరీరము గలది, మూర్తిమతియైన సాక్షాత్తు గౌరీదేవివలె భాసిల్లుచు నీలోత్పల కాంతితో దేవతా స్త్రీవలెనున్న యీమెయే ద్రౌపది. ఈమె మూర్తిమతియైన లక్ష్మీదేవివలె ప్రకాశించుచున్నది."

జనమేజయా! ఇట్లు పాండవులను వేర్వేరుగా వర్ణించి చెప్పి ఉత్తరుడు అర్జునుని విశిష్టమైన పరాక్రమమును గూర్చి యిట్లు చెప్పదొడగెను:-

"ఈ యర్జునుడు, మృగములను సింహమువలె శత్రువులను సంహరించెను. రథములను గూల్చుచు నితడు రథ సైన్యమునందు విచ్చలవిడిగా సంచరించెను, ఒక్క బాణముతోనే యితడు మహాగజమును కొట్టి నేలగూల్చగా నది దంతములను భూనుకొని తన బంగారు సంకెళ్ళతో సహితముగా నేలకొరగెను. ఇతడే కురుసైన్యమును జయించి గోవులను గెల్చుకొని వచ్చెను. ఇతని శంఖనాదముచేత నా చెవులు బధిరములయ్యెను."

"జనమేజయా! ఉత్తరుని మాటలువిని యుధిష్ఠిరుని యెడల అపరాధము చేసిన విరాటరాజు ఉత్తరునితో నిట్లనెను:-

''పుత్రా! పాండవులను ప్రసన్నులను చేయు సమయమాసన్నమైనది. నీవు నాతో నేకీభవించిన యెడల ఉత్తరను అర్జునునకిచ్చి వివాహముచేయు సంకల్పము నాకు గలదు.''

ఆ మాటవిని ఉత్తరుడు తండ్రితో నిట్లనెను:-

''ఆర్యులు - పూజ్యులు - మాన్యులు - మహానుభావులునైన పాండవులను పూజించుటకు ఇది తగిన కాలము''.

ఆ మాటకు విరాటరాజు ఉత్తరునితో ఇట్లనెను:-

''పుత్రా! నేనుగూడ దక్షిణ గోగ్రహణ యుద్ధమునందు శత్రువులకు పట్టుపడితిని. అప్పుడు ఈ భీమసేనుడు నన్ను విడిపించి గోవులను తెచ్చెను.

ఈ పాండవుల బాహుబలముచేతనే యుద్ధమునందు మనకు విజయము చేకూరినది. కనుక మనము మంత్రి పురోహితాది పరివారముతో కలిసి వీరిని సన్మానింతము. మనమేదైన తెలియక వీరినిగూర్చి నిర్లక్ష్యముగా మాట్లాడి యున్నచో, వీరు మనను క్షమింతురుగాక!''

''జనమేజయా! ఈ విధముగా విరాటరాజు చెప్పి మిక్కిలి సంతుష్టి చెందినవాడై సమస్తరాజ్యమును యుధిష్ఠిరునకు సమర్పించెను.

తరువాత విరాటరాజు అర్జునుని ముందిడుకొని పాండవులనందరిని సాధువాదములచేత స్తుతించెను. పాండవుల తలలను మూర్కొని మాటిమాటికి అందరిని వేర్వేరుగా కౌగిలించుకొని వారితో నిట్లనెను:-

''వీరశిరోమణులారా! మీ రందరు మా వద్ద అజ్ఞాతవాసమును మా భాగ్యవశాత్తు క్షేమముగా గడపికొనుటచేత మాకు గూడ క్షేమము గలిగినది. ఈ నా రాజ్యమే కాక మరియేదైనను మీకు సమర్పించుటకు సిద్ధముగా నున్నాను. మీరు ఏ మాత్రము సందేహించక గైకొనుడు. ఉత్తరను అర్జునుడు గ్రహించుగాక! ఈమెకు అతడే యోగ్యుడైన పతి.''

ఆ మాటలు విని ధర్మరాజు అర్జునుని వైపు చూచెను.

అతడు విరాటరాజుతో నిట్లనెను:-

నందు ఒక సంవత్సరము కొరకు ద్వారకలో నుండుటకు నియమింపబడిన యింద్రసేన సారథి మొదలైనవారు అన్ని వివాహసామగ్రులతోపాటు వచ్చిచేరిరి.

పదివేల యేనుగులు, ఇరువదివేల గుఱ్ఱములు, పదివేల రథములు, పది లక్షల కాల్బలము గల మహాసైన్యము అక్కడ చేరియుండెను. ఇంతయేకాక వృష్ణి - అంధకులకు సంబంధించిన అనేక వీరులు గూడ శ్రీకృష్ణాదులతో వచ్చిరి.

శ్రీకృష్ణుడు పాండవులకు దాసీజనమును, రత్నములను, వస్త్రములను విడివిడిగా అందరికిని కానుకలుగా నిచ్చెను. తరువాత మాత్స్య-పార్థవంశముల యొక్క వైవాహిక సంబంధ కార్యకలాపములు శాస్త్రోక్తముగా జరుగ జొచ్చెను. విరాట రాజ భవనమునందు నగారాలు - గోముఖములు-డంబరములు మొదలైన వాద్యములు వైభవోపేతముగా మ్రోగదొడగెను. అనేక భక్ష్యభోజ్యాదులు విపులముగా నందరికిని పెట్టిరి. గాయకులు - కథకులు - నటులు -స్తోత్ర పాఠకులు మొదలగువారు పాండవులను స్తుతించుచుండిరి.

విరాటరాజు అంతఃపుర స్త్రీలు సుధేష్ణాదేవిని అనుసరించి సర్వాభరణ భూషితలై వచ్చిరి. ద్రౌపది తన రూప-కీర్తి-సంపత్తులతో విరాజిల్లుచు ఆ స్త్రీల నందరిని మించియుండెను. వారందరు రాజపుత్రియైన ఉత్తరను పరివేష్టించి ముందిడుకొని వచ్చిరి. ఆమె సర్వాభరణ భూషితయై ఇంద్రుని పుత్రికవలె భాసిల్లుచుండెను.

అప్పుడు అర్జునుడు సుభద్రాపుత్రుడైన తన కుమారునకుగాను అతిరూప సౌందర్యవతియైన ఉత్తరను ప్రతిగ్రహించెను. అచ్చట ఇంద్ర సమానరూపముతోనున్న యుధిష్ఠిరమహారాజు గూడ ఉత్తరను తన కోడలుగా అంగీకరించెను.

ఈవిధముగా అర్జునుడు ఉత్తరను ప్రతిగ్రహించి, భగవంతుడైన శ్రీకృష్ణుని ముందిడుకొని అభిమన్యునకు ఉత్తరకు వివాహము జరిపించెను.

వివాహకాలమునందు విరాటరాజు అగ్నియందు వైవాహికహోమాదులు చేయించి బ్రాహ్మణులను పూజించి, వసునను ఏడువేల గుఱ్ఱములను, రెండు నూర్ల మహాగజములను, అనేక ధనరత్నాదులను కానుకలుగా ఇచ్చెను. తన రాజ్యమును-సైన్యమును-ధనాగారమును, తననుగూడ సమర్పించెను.

వివాహకార్యము ముగిసిన తరువాత యుధిష్ఠిర మహారాజు, శ్రీకృష్ణుడు తెచ్చిన ధనమును, వేలకొలది గోవులను, రత్నములను, వివిధ వస్త్రములను, భూషణములను, ముఖ్య వాహనములను, శయనములను, రుచికరములైన వివిధాహారపానీయములను బ్రాహ్మణులకు సమర్పించెను.

జనమేజయ మహారాజా! ఆ సమయమునందు, హర్షము చేత బలసిన వేలు - లక్షల జనముచేత నిండియున్న విరాట నగరము మూర్తిమంతమైన మహోత్సవమా యన్నట్లు శోభిల్లుచుండెను.

విరాటపర్వము సంపూర్ణము : ఫలశ్రుతి

పాండవుల పుణ్యచరిత్రను వినిన పుణ్యాత్ములకు మనోవ్యాధి - శరీర వ్యాధులుండవు. పాండవులు దుర్గతిని తరించిన కథను పఠించిన మనుష్యులు గొప్ప సంకటముల నుండి విముక్తులగుట కడు సులభమగును. అట్టివారికి, సుభిక్షము, క్షేమము, ఆరోగ్యము, పుణ్యము వృద్ధిచెందగలవు. వారికి అన్ని పాపములు నశించి సర్వ సంపదలు కలుగ గలవు.

అర్జునుని అసహాయ శూరత్వమును స్మరించినవాడు ఏకాకిగానే సర్వ శత్రువులను జయించగలడు, మహామారి మొదలైన ఈతి బాధలు నశించి, వారికి ఎప్పుడు గూడ ప్రియజనవియోగము కలుగకుండును. ఇట్లు విరాట పర్వమును వినిన వారు మంచి ఫలమును పొందగలరు.

విరాటపర్వము సమాప్తము

తప్పొప్పుల పట్టిక

పుట.	పేరా	పం	తప్పు	ఒప్పు
1.	కం॥	2	మాంద్ర వచన	మాంధ్ర వచన
3.	8	1	విరాజ రాజు	విరాటరాజు
4.	2	2	గుప్తముఃగా	గుప్తముగా
10.	3	2	సామర్థమును	సామర్థ్యమును
13.	5	1	విగ్రహానుగ్రహ	నిగ్రహానుగ్రహ
14.	3	2	అందుకనగా	ఎందుకనగా
23.	12	2	వెడలగొట్టెను	వెడలగొట్టెదను
23.	13	2	శతంలి	నందలి
33.	10	1	విరాజరాజ	విరాటరాజు
43.	2	4	విడిచెను	విడిచెదను
46.	4	2	నదేష్ణతో	సుదేష్ణతో
46.	4	2	నిట్లననెను	నిట్లనెను
48.	6	2	చెప్పెను	చెప్పెదను
49.	11	1	నుకేశ్!	సుకేశీ!
51.	6	4	యుండవనెను	యుండవలెను
51.	6	5	ఆకునుగూడి	ఆకునుగూడ
52.	2	2	ధర్మరతులై	ధర్మ నిరతులై
53.	1	4	పొందెను	పొందెదరు
61.	5	2	లోపలచే	లోపలనే
62.	3	1	ద్రౌపదియొక్క	ద్రౌపది
62.	4	3	కారరణము	కారణము
64.	1	3	సంహించును?	సహించును?
65	5	3	మహాజు	మహారాజు
66.	1	3	దర్గతికి	దుర్గతికి

పుట.	పేరా	పం	తప్పు	ఒప్పు
84.	1	2	సైంరంధ్రీ!	సైరంధ్రీ!
85.	11	1	సైంరంధ్రీ!	సైరంధ్రీ!
94.	4	1	ధర్మపుత్రుడన్న	ధర్మపుత్రుడున్న
95.	3	2	కుశలులైన	కుశలులైన
96.	2	1	దానినీతి	దాననీతి
102.	2	2	పోదరులు	సోదరులు
102.	6	1	తమ్మునిలో	తమ్మునితో
111.	3	2	రథముమ	రథమును
118.	5	3	అర్జునుకు	అర్జునునకు
140.	9	3	చల్లార్చెరను	చల్లార్చెదను
143.	4	2	పాండవులో	పాండవులలో
165.	4	1	శక్తుతో	శక్తులతో
166.	5	3	చిl	చిత్ర
168.	3	1	గఱ్ఱములను	గుఱ్ఱములను
196.	6	1	బహన్నల	బృహన్నల